

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 66

మంగళవారం 28-5-2024

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



మోదీని ఈడీ అడిగినా..

తాను దేవుడు పంపిన మనిషినని అంటారని రాహుల్ ఎద్దేవా చేశారు

-6లో



వాళ్లకు ఉద్యోగాలు రావు

'ఉగ్ర' సంబంధీకులకు, రాళ్లు రువ్వేవాళ్లకు ఉద్యోగాలు రావన్న అమిత్ షా

-6లో

న్యూస్‌రీల్

రాచరికపు ఆనవాళ్లు లేకుండా రాష్ట్ర చిహ్నం



రాచరికపు ఆనవాళ్లు లేకుండా రాష్ట్ర అధికారిక చిహ్నం రూపొందించాలని సీఎం రేవంత్ సూచించారు. అందులో రాష్ట్ర ప్రజల సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించాలని స్పష్టం చేశారు. సోమవారం ఆయన చిత్రకారుడు రుద్ర రాజేశంతో అధికారిక చిహ్నం రూపకల్పనపై చర్చించారు.

- వివరాలు 2లో▶

ఘనంగా 'తెలంగాణ దశాబ్ది' ముగింపు ఉత్సవాలు



రాష్ట్రం ఆవిర్భవించి పదేళ్లు పూర్తయిన సందర్భంగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో 'తెలంగాణ దశాబ్ది ముగింపు వేడుకలు' ఘనంగా నిర్వహించాలని బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయించారు.

- వివరాలు 2లో▶

జూన్ తొలి వారంలో 'అడ్వాన్స్‌డ్' ర్యాంకులు



ఐఐటీల్లో బీటెక్, బీఆర్క్‌లో ప్రవేశానికి సంబంధించి నిర్వహించిన జేఈఈ అడ్వాన్స్‌డ్ ర్యాంకులు జూన్ 4న వెలువడే అవకాశం ఉంది. జూన్ 2న ప్రొవిజనల్ ఆన్సర్ 'కీ' విడుదల చేస్తారు.

- వివరాలు 3లో▶

మృతులు 2 వేలపైనే..

పపువా న్యూ గినియాలో కొండచరియలు విరిగి పడిన ఘటనలో మట్టిదిబ్బల కింద రెండు వేలమందికి పైగానే సమాధి అయి ఉంటారని అక్కడి ప్రభుత్వం లెక్కగట్టింది.

- వివరాలు 6లో▶

బ్లాక్‌లిస్టులో మిల్లులు

సకాలంలో సీఎంఆర్ అప్పగించని మిల్లర్లను డిఫాల్టర్లుగా చేసే యోచన



- రాష్ట్ర ప్రభుత్వ సూత్రప్రాయ నిర్ణయం.. సీఎంఆర్ కోసం ధాన్యం ఇచ్చేటప్పుడే సెక్యూరిటీ డిపాజిట్ తీసుకునే యోచన
- 2022-23 రబీకి చెందిన 35 ఎల్ఎంటీల ధాన్యం వేలంపై రగడ
- కాంట్రాక్టు సంస్థలకు ధాన్యం ఇవ్వకుండా నాన్చుతున్న మిల్లర్లు
- రూ.1,000 కోట్ల అవినీతి జరిగిందంటున్న బీఆర్ఎస్
- వేలం ప్రక్రియపై సీబీఐ విచారణకు బీజేపీ డిమాండ్
- నేడో రేపో సర్కారు కీలక నిర్ణయం!

సాక్షి, హైదరాబాద్

సెక్యూరిటీ డిపాజిట్ కానీ, బ్యాంక్ గ్యారంటీ కానీ లేకుండానే వేల కోట్ల రూపాయల విలువ చేసే ధాన్యాన్ని మిల్లర్లకు అప్పగించే విధానానికి స్వస్తి పలకాలని ప్రభుత్వం భావిస్తోంది. ధాన్యం ఇచ్చేటప్పుడే మిల్లర్ల నుంచి సెక్యూరిటీ డిపాజిట్ తీసుకోవాలని, సకాలంలో సీఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) అప్పగించక పోవడంతో పాటు ఇష్టారాజ్యంగా వ్యవహరించే మిల్లర్లను బ్లాక్ లిస్టులో పెట్టాలని సూత్రప్రాయంగా నిర్ణయించింది. తాజాగా చర్చనీయాంశమైన 2022-23 రబీ సీజన్‌లోని 35 లక్షల మెట్రిక్ టన్నుల (ఎల్ఎంటీల) ధాన్యాన్ని సీఎంఆర్ చేయని, తదనంతర పరిణామాల నేపథ్యంలో కాంట్రాక్టు సంస్థలకు ధాన్యం అప్పగించని మిల్లులపై కొరడా ఝుళిపించనుంది.

మిల్లర్ల విషయంలో ఉదాసీనత

గత కొన్నేళ్లుగా రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మిల్లర్ల విషయంలో అవలంభించిన ఉదాసీన వైఖరి ఇప్పుడు సర్కార్‌కు ఇబ్బందికరంగా మారింది. మిల్లర్లు సీఎంఆర్ ఇవ్వకుండా తమ వద్దే ఉంచుకున్న 2022-23 రబీ (యాసంగి) సీజన్‌కు సంబంధించిన 35 ఎల్ఎంటీల ధాన్యం రికవరీ బాధ్యతలను.. ప్రభుత్వం టెండర్ల ద్వారా నాలుగు సంస్థలకు అప్పగించిన సంగతి తెలిసిందే. అయితే 3 నెలలు గడిచినా 35 ఎల్ఎంటీల్లో 2 ఎల్ఎంటీల ధాన్యాన్ని కూడా రికవరీ చేయలేదు. దీంతో విపక్షాలు ఈ ధాన్యం రికవరీ టెండర్లపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే 2022-23 యాసంగి సీజన్‌లో మిల్లుల్లో నిల్వ చేసినట్లుగా చెపుతున్న ధాన్యాన్ని 4 కాంట్రాక్టు సంస్థలకు అప్పగించకపోతే.. వాటిని డిఫాల్ట్ మిల్లులుగా పేర్కొంటూ బ్లాక్ లిస్టులో పెట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ విషయంలో కఠినంగా

మిగతా 14వ పేజీలో ▶

సీఎంఆర్ పక్కదారి!

సూర్యాపేట జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఆయన సోదరుడు అరెస్టు

14లో

బీఆర్ఎస్ నేతలపైనా నిఘా!



ఎమ్మెల్సీలు, మాజీ మంత్రులను వదలని ప్రభాకర్‌రావు	'ఎమ్మెల్యేలకు ఎర' ఆపరేషన్‌లో టాస్క్ ఫోర్స్ కీలకపాత్ర
ఓ కీలక వ్యక్తి కోసం కేరళకు చార్టర్డ్ ఫ్లైట్‌లో వెళ్లిన పోలీసులు	తమ నేరాంగీకార వాంగ్మూలాల్లో నిందితుల వెల్లడి

సాక్షి, హైదరాబాద్: సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబీ) కేంద్రంగా సాగిన ఈ నిఘా కేవలం ప్రతిపక్ష నేతలకే పరిమితం కాలేదని, అధికార బీఆర్ఎస్‌కు చెందిన అసమ్మతి నేతలపైనా సాగినట్లు తెలిసింది. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు మాజీ చీఫ్ టి.ప్రభాకర్‌రావు, హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ మాజీ ఓఎస్డీ పి.రాధాకిషన్‌రావు నేతృత్వంలో అనేక అక్రమాలు సాగాయని నేరాంగీకార వాంగ్మూలాల్లో పోలీసులు పేర్కొన్నారు. మొయినాబాద్ ఫామ్‌హౌస్ ఆపరేషన్ కోసం అవసరమైన నిఘా పరికరాలను ప్రత్యేకంగా ఢిల్లీ నుంచి కొనుగోలు చేయగా... కేరళకు చెందిన ఓ కీలక వ్యక్తిని పట్టుకోవడానికి పోలీసులు ఏకంగా చార్టర్డ్ ఫ్లైట్‌లో అక్కడకు వెళ్లినట్లు బయటపడింది. పంజగుట్ట పోలీసులు గతంలో అరెస్టు చేసిన మాజీ ఓఎస్డీ పి.రాధాకిషన్‌రావు, డీఎస్పీ నాయిని భుజంగరావులకు సంబంధించిన నేరాంగీకార వాంగ్మూలాల్లో ఈ కీలకాంశాలను పొందుపరిచిన దర్యాప్తు

మిగతా 2వ పేజీలో ▶

ట్యాపింగ్ దేశ భద్రత అంశం

బీఆర్ఎస్ నేత ప్రవీణ్ కుమార్

ట్యాపింగ్ కేసును సీబీఐకి అప్పగించాలి:

బండి సంజయ్

- వివరాలు 2లో



వారాంతంలో కేరళకు..

- ఐదు రోజుల్లో కేరళను తాకనున్న రుతుపవనాలు
- ఆ తర్వాత ఆరు రోజులకు తెలంగాణలోకి ప్రవేశించే అవకాశం
- మధ్య బంగాళాఖాతంలో రుతుపవనాలు చురుగ్గా కదులుతున్నాయన్న వాతావరణ శాఖ
- రాష్ట్రంలోని పలు చోట్ల మండుతున్న ఎండలు.. భారీగా ఉష్ణోగ్రతలు నమోదు

సాక్షి, హైదరాబాద్: నైరుతి రుతుపవనాలు మధ్య బంగాళాఖాతంలో చురుకుగా కదులుతున్నాయి. రానున్న 5 రోజుల్లో రుతుపవనాలు బంగాళాఖాతంలో పూర్తిగా విస్తరించి కేరళను తాకేందుకు అనుకూల పరిస్థితులు ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. వారాంతంలోగా కేరళలోకి ప్రవేశించిన తర్వాత ఆరు రోజుల్లో తెలంగాణలోకి రుతుపవనాలు వచ్చే అవకాశం ఉందని అంచనా వేసింది. రుతుపవనాల కదలికల ఆధారంగా రాష్ట్రంలోకి ప్రవేశించే సమయం ఆధారపడి ఉంటుందని పేర్కొంది. దేశంలో ఈసారి సాధారణం కంటే అధిక వర్షపాతం నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని భారత వాతావరణ శాఖ డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ్

మిగతా 3వ పేజీలో ▶

ఇంజనీరింగ్ కౌన్సెలింగ్ జాప్యం?

- వచ్చే నెల 27 నుంచి కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్న ఉన్నత విద్యామండలి
- కానీ ఇప్పటివరకు కాలేజీలకు లభించని ఏఐసీటీఈ అనుమతి
- కేలండర్ ప్రకారం జూన్ 10కల్లా ఈ ప్రక్రియ పూర్తి కావాలి
- అయితే అన్ని ప్రొఫెషనల్ కోర్సులను ఏఐసీటీఈ పరిధిలో చేరుస్తున్న వైనం
- దరఖాస్తు విధానం సాఫ్ట్‌వేర్ తయారీకి సమయం పట్టవచ్చంటున్న అధికార వర్గాలు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ఇంజనీరింగ్ కౌన్సెలింగ్ ఈ ఏడాది ఇంకా ఆలస్యమయ్యే అవకాశం కన్పిస్తోంది. వచ్చే నెల 27 నుంచి కౌన్సెలింగ్ నిర్వహిస్తామని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ప్రకటించింది. అయితే ఇప్పటివరకు ఇంజనీరింగ్ కాలేజీలకు అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ) నుంచి ఎలాంటి గుర్తింపు రాలేదు. అసలు ఇందుకు సంబంధించిన ప్రక్రియ కూడా ఇంకా మొదలు కాలేదని అధికార వర్గాలు చెబుతున్నాయి. ఈ కారణంగానే కౌన్సెలింగ్ ఆలస్యమయ్యే అవకాశం ఉందని అంటున్నాయి. వాస్తవానికి రాష్ట్రంలో సంబంధిత యూనివర్సిటీలు కాలేజీలకు

మిగతా 10వ పేజీలో ▶



సిద్దిపేట జిల్లా చేర్యాలలో రిక్షాలో వచ్చి ఓటేసిన దివ్యాంగురాలు రాజేశ్వరి

ఎమ్మెల్సీ పోలింగ్ 72.37%

- ప్రశాంతంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక
- సాయంత్రం 6 గంటల వరకు కొనసాగిన పోలింగ్
- ములుగు జిల్లాలో అత్యధికంగా 74.54 శాతం.. ఖమ్మం జిల్లాలో అత్యల్పంగా 65.54 శాతం
- జూన్ 5న కౌంటింగ్
- 3 రోజులపాటు కొనసాగే అవకాశం

సాక్షి ప్రతినిధి, నల్లగొండ/సాక్షి ప్రతినిధి, ఖమ్మం: వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ప్రశాంతంగా ముగిసింది. అక్కడక్కడ చిన్న ఘటనలు మినహా పోలింగ్ సజావుగా జరిగింది. సోమవారం ఉదయం 8 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 6 వరకు సాగింది. పోలింగ్ సాయంత్రం 4 గంటలకు ముగియాల్సి ఉన్నా ఓటర్లు బారులు తీరారు. ఆ సమయంలోగా పోలింగ్ కేంద్రాల్లోకి వచ్చిన అందరికీ అధికారులు ఓటు వేసే అవకాశం కల్పించారు. దీంతో సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ సాగింది. 72.37 శాతం పోలింగ్ నమోదైనట్లు అర్ధరాత్రి సమయంలో అధికారులు ప్రకటించారు. ఈ ఎన్నికల కౌంటింగ్

మిగతా 5వ పేజీలో ▶

ఇదండీ సంగతి



కాస్త మీరు బరువైన డైలాగులు మాట్లాడటం ఆపండి సార్!

తీరొక్క కళారూపాలు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర అవతరణ ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి తెలిపారు. జూన్ 2న ఉదయం గన్‌పార్క్‌లోని అమర వీరుల స్తూపం వద్ద తెలంగాణ రాష్ట్ర సాధన అమరులకు సీఎం రేవంత్‌రెడ్డి నివాళులు అర్పించి సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించే కార్యక్రమంలో పాల్గొంటారని చెప్పారు. రాష్ట్ర అవతరణ దినోత్సవ ఏర్పాట్లపై డీజీపీ రవిగుప్తాతో కలసి సోమవారం ఆమె సచివాలయంలో వివిధ శాఖల కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. పరేడ్ గ్రౌండ్స్‌లో ఉదయం ఏర్పాటు చేసే కార్యక్రమంలో ముఖ్యమంత్రి రాష్ట్ర గీతాన్ని ఆవిష్కరించి ప్రజలకు సందేశం ఇస్తారని శాంతికుమారి వివరించారు. రాత్రి 7 గంటల నుంచి 9 గంటల వరకు ట్యాంక్ బండ్‌పై రాష్ట్రంలోని అన్ని కళారూపాలతో పెద్ద ఎత్తున కార్నివాల్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ పొందుతున్న 5,000 మంది పోలీస్ అధికారులు బ్యాండ్‌తో ఈ ప్రదర్శనలో పాల్గొంటారన్నారు. ట్యాంక్ బండ్‌పై దాదాపు 80 స్టాళ్లను ఏర్పాటు చేసి హస్తకళలు, చేనేత, స్వయం సహాయక బృందాలు తయారు చేసిన వస్తువులతో పాటు నగరంలోని పేరొందిన హోటళ్ల ద్వారా ఫుడ్ స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నామని సీఎస్ వివరించారు. ఈ కార్యక్రమానికి

మిగతా 5వ పేజీలో ▶



గన్‌పార్క్‌లో అమరులకు సీఎం నివాళి

- ఆపై పరేడ్ గ్రౌండ్స్‌లో రాష్ట్ర గేయం ఆవిష్కరణ, సందేశం
- రాత్రికి ట్యాంక్‌బండ్‌పై కార్నివాల్, పోలీసు బ్యాండ్, బాణసంచా, లేజర్ షో, హస్తకళలు, ఫుడ్ స్టాల్స్
- జూన్ 2న తెలంగాణ రాష్ట్ర అవతరణ ఉత్సవాల ఏర్పాట్లపై సమీక్షలో సీఎస్

వెయిటింగ్ హాళ్లు.. కెఫెటేరియాలు



సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్‌ల ఆధునీకరణ

- ఇటీవల అధికారులతో సీఎం రేవంత్‌రెడ్డి భేటీ
- మోడల్ కార్యాలయాలుగా తీర్చిదిద్దాలని ఆదేశం.. ఎక్కువ ఆదాయం వస్తున్న జిల్లాల్లో ఆఫీసులకు కార్పొరేట్ హంగులు
- వెయిటింగ్ హాల్, తాగు నీరు, కెఫెటేరియాల ఏర్పాటుకు నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని రిజిస్ట్రేషన్ కార్యాలయాలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దాలని ప్రభుత్వం భావిస్తోంది. భూములు, ఆస్తుల క్రయ విక్రయ లావాదేవీల కోసం రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు వచ్చే ప్రజలకు అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చూడాలని నిర్ణయించింది. ముఖ్యంగా రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు వచ్చే ప్రజలు చెట్ల కింద పడిగాపులు కాసే పరిస్థితి ఉండకూడదనేది రాష్ట్ర ప్రభుత్వ యోచనగా ఉంది. ఈ నేపథ్యంలోనే సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల రిజిస్ట్రేషన్ల శాఖ అధికారులతో సమావేశమయ్యారు. రాష్ట్రంలోని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను మోడల్ కార్యాలయాలుగా తీర్చిదిద్దాలని, ఇందుకు తగిన ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. ఇప్పటికే సొంత భవనాలున్న కార్యాలయాలను ఆధునీకరించాలని, భవన నిర్మాణం కోసం స్థలం సేకరించిన చోట్ల సొంత కార్యాలయాల నిర్మాణాన్ని ప్రారంభించాలని, స్థలం సేకరించని ప్రాంతాల్లో ప్రజలకు సౌకర్యంగా ఉండే చోట్ల స్థలాలను సేకరించాలని సూచించారు.

38 చోట్లే సొంత భవనాలు: రాష్ట్రంలో మొత్తం 144 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలున్నాయి. 38 చోట్ల సొంత భవనాలుండగా, మిగిలిన వాటిని అద్దె భవనాల్లోనే నడిపిస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో

మిగతా 5వ పేజీలో ▶

ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ముగింపు ఉత్సవాలు

మూడు రోజులపాటు నిర్వహించాలని బీఆర్‌ఎస్ శ్రేణులకు కేసీఆర్ ఆదేశం



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించి పదేళ్లు పూర్తయిన సందర్భంగా బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో 'తెలంగాణ దశాబ్ది ముగింపు వేడుకలు'ఘనంగా నిర్వహించాలని బీఆర్‌ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయించారు. ఇందులో భాగంగా జూన్ 1 నుంచి మూడు రోజులపాటు బీఆర్‌ఎస్ అధ్వర్యంలో ఘనంగా వేడుకలు జరపాలని ఆదేశించారు. 14 ఏళ్ల పోరాడి తెలంగాణను సాధించి, స్వరాష్ట్రంలో తొలి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి దశాబ్దకాలంపాటు తెలంగాణను దేశానికే ఆదర్శంగా నిలిపిన ఘనత బీఆర్‌ఎస్ పార్టీ, ప్రభుత్వానిదేనని కేసీఆర్ పునరుద్ఘాటించారు. ఈ చారిత్రక సందర్భంలో దశాబ్ది ముగింపు వేడుకలను ఘనంగా నిర్వహించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పార్టీ సూచనలను అనుసరించి గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి దాకా వేడుకల్లో పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కేసీఆర్ పార్టీ కార్యకర్తలను, నేతలను కోరారు.

ముగింపు ఉత్సవాలు ఇలా: జూన్ 1న సాయంత్రం 7 గంటలకు గన్‌పార్క్ అమరవీరుల స్తూపం నుంచి ట్యాంక్‌బండ్ వద్ద ఉన్న అమర జ్యోతి వరకు క్యాండిల్ ర్యాలీ నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర సాధనలో ప్రాణాలఅర్పించిన అమరులకు పుష్పాంజలి ఘటించి నివాళి అర్పిస్తారు. జూన్ 2 తెలంగాణ ఆవిర్భావ రోజున హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో కేసీఆర్ అధ్యక్షతన సభ నిర్వహిస్తారు. ఇదే రోజు హైదరాబాద్‌లోని పలు దవాఖానాల్లో, అనాథ శరణాలయాల్లో పార్టీ ఆధ్వర్యంలో పండ్లు, మిఠాయిలు పంపిణీ చేస్తారు. జూన్ 3న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లోని పార్టీ కార్యాలయాల్లో ముగింపు వేడుకలు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను, జాతీయ జెండాను ఎగురవేస్తారు. జిల్లాల్లోని దవాఖానాల్లో, అనాథ శరణాలయాల్లో స్వీట్లు, పండ్లు పంపిణీ చేస్తారు.

మేం అధికారంలోకి వస్తే రైతు రుణమాఫీ

పంజాబ్ ఎన్నికల ప్రచారంలో డిప్యూటీ సీఎం భట్టి



సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల తర్వాత ఇండియా కూటమి అధికారంలోకి రాగానే దేశంలోని రైతులందరికీ రుణమాఫీ చేస్తామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క హామీ ఇచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత అగ్నివీర్ పథకాన్ని కూడా రద్దు చేస్తామని చెప్పారు. పంజాబ్‌లోని ఫరీద్‌కోట్ లోక్‌సభ నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం ఆయన కోటక్‌పుర అసెంబ్లీ పరిధిలో పర్యటించారు. ఈ సందర్భంగా జరిగిన పలు సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ, ఇండియా కూటమి అధికారంలోకి రాగానే రైతుల కోసం కమిషన్ ఏర్పాటు చేస్తామని, రైతు రుణమాఫీ అవసరమైనప్పుడు ఈ కమిషన్ సిఫారసు చేస్తుందని, ఆ సిఫారసులను తాము అమలు చేస్తామని చెప్పారు. భారత సైనికులను కార్మికులుగా మార్చి ఆ వర్గంలో పేద, సంపన్న వర్గాలను సృష్టించిన ఘనత మోదీకే దక్కుతుందని విమర్శించారు. దేశంలో పెరిగిపోయిన ద్రవ్యోల్బణం, అవినీతిలకు తగిన మూల్యాన్ని మోదీ చెల్లించుకుంటారని ఆయన అన్నారు. ఇండియా కూటమికి వస్తున్న ఆదరణ చూసి మోదీ తీవ్ర ఆందోళన చెందుతున్నారని, అందుకే విపక్షాలపై దిగజారుడు ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు. మోదీ తన ప్రధాని స్థాయిని దిగజార్చేలా మాట్లాడుతున్నారని, ఆయన ఓటమికి ఇదే నిదర్శనమని భట్టి వ్యాఖ్యానించారు.

దేశానికి మీరేం చేశారో చెప్పుకునే దమ్ముందా?

మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి



సాక్షి, హైదరాబాద్: దేశంలో కాంగ్రెస్ పార్టీ చేసిన అభివృద్ధి మినహా మిగిలిన పార్టీలు ఈ దేశానికి ఏం చేశాయో చెప్పుకునే దమ్ముందా అని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే టి. జగ్గారెడ్డి సవాల్ విసిరారు. స్వాతంత్య్రం వచ్చిన తర్వాత 60ఏళ్ల పాటు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఏమీ చేయకుండానే బీజేపీ, బీఆర్‌ఎస్ వచ్చి ఈ అభివృద్ధినంతా చేశాయా అని ప్రశ్నించారు. సోమవారం గాంధీభవన్‌లో టీపీసీసీ నేతలు మెట్టు సాయికుమార్, చరణ్‌కౌశిక్‌యాదవ్, గజ్జి భాస్కర్, భవానీరెడ్డితో కలిసి జగ్గారెడ్డి మీడియాతో మాట్లాడారు. దేశానికి కాంగ్రెస్ ఏం చేసిందని ప్రశ్నిస్తున్న బీజేపీ, బీఆర్‌ఎస్ నేతలు కాంగ్రెస్ పార్టీ ఈ ప్రాజెక్టులు కట్టలేదని చెప్పగలరా అని నిలదీశారు. నెహ్రూ దూరదృష్టితో ప్రాజెక్టుల నిర్మాణం, విద్యుదుత్పత్తికి ప్రాధాన్యతనిచ్చారని వివరించారు. నెహ్రూ కట్టిన ప్రాజెక్టుల ద్వారా వచ్చిన నీళ్లను మోదీ తాగలేదా? కాంగ్రెస్ హయాంలో కట్టిన మంజీరా, సింగూరు ప్రాజెక్టుల నీటిని కిషన్ రెడ్డి, కేసీఆర్‌లు తాగలేదని చెప్పగలరా అని ప్రశ్నించారు. విశాఖ ఉక్కుతెచ్చింది కాంగ్రెస్ అయితే, అమ్మకానికి పెట్టింది మోదీనని జగ్గారెడ్డి ఎద్దేవా చేశారు.


కాంగ్రెస్‌లోనే ఆ స్వేచ్ఛ: విలేకరుల సమావేశంలో భాగంగా అడిగిన ఓ ప్రశ్నకు జగ్గారెడ్డి బదులిస్తూ పీసీసీ చీఫ్ ఎవరవుతారన్న దానిపై మీడియాలో చర్చ జరగడం తప్పేమీ కాదన్నారు. పీసీసీ అధ్యక్ష పదవి కావాలని అధిష్టానాన్ని అడిగే స్వేచ్ఛ ఒక్క కాంగ్రెస్ పార్టీలోనే ఉంటుందని చెప్పారు. బీజేపీలో పదవులు అడిగితే ఉన్న పదవులు పోతాయని, ఇక బీఆర్‌ఎస్‌లో అసలు పదవులు అడిగే పరిస్థితే ఉండదన్నారు.

కాశీలో తెలంగాణ బీజేపీ నేతల ప్రచారం

పాల్గొన్న కె.లక్ష్మణ్, ఈటల, బీబీ పాటిల్

సాక్షి, న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ పోటీ చేస్తున్న వారణాసి లోక్‌సభ స్థానంలో తెలంగాణ బీజేపీ నేతలు ప్రచారం ఉధృతం చేశారు. సోమవారం బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ ఎంపీ కె.లక్ష్మణ్, మల్కాజ్‌గిరి ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్, జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్ తదితరులు ఎన్నికల ప్రచారం చేశారు. మండుటెండల్లో సైతం నేతలు ఇంటింటి ప్రచారంతో పాటు ర్యాలీలు, హాల్ మీటింగ్స్ నిర్వహించారు. గత పదేళ్లలో మోదీ చేసిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు, సాధించిన విజయాలను ఓటర్లకు వివరించారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన మోదీ అభిమానులు, బీజేపీ కార్యకర్తలు వందల సంఖ్యలో కాశీకి స్వచ్ఛందంగా వచ్చి ఆయన విజయం కోసం పనిచేస్తున్నారని లక్ష్మణ్ తెలిపారు. వారణాసిలో ప్రధాని మోదీ హ్యాట్రిక్ విజయం ఖాయమన్నారు. మోదీ దేశాన్ని గెలిపించేందుకు కష్టపడితే తాము మోదీని గెలిపించేందుకు పనిచేస్తున్నామని ఈటల రాజేందర్ అన్నారు. కాశీ విశ్వేశ్వరుడి ఆశీర్వాదం, ప్రజల మద్దతుతో ఈసారి కూడా మోదీ విజయం సాధిస్తారని ఆయన అన్నారు. అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులే మోదీ విజయానికి వారధిలా నిలుస్తాయని బీబీ పాటిల్ తెలిపారు.

పదేళ్లలో హిందూ సమాజానికి బీజేపీ చేసింది శూన్యం: ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: అధికారంలో ఉన్న పదేళ్లలో బీజేపీ ప్రభుత్వం హిందువులకు చేసిందేమీ లేదని కాంగ్రెస్ ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. హిందువులకు ఏమీ చేయకపోగా, ఈసారి అధికారంలోకి వస్తే ముస్లింల రిజర్వేషన్లను తీసేయాలని చూస్తోందని ఆరోపించారు. సోమవారం గాంధీభవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆర్థిక వెనుకబాటు తనం అనే కారణంతో ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు తీసుకొచ్చిన మోదీ సర్కారు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల రిజర్వేషన్లను తొలగించాలని చూస్తోందన్నారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లలో కూడా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రిజర్వేషన్లు కల్పించాలని జీవన్‌రెడ్డి డిమాండ్ చేశారు. రాజకీయాల కోసం మతవిద్వేషాలను రెచ్చగొట్టాలనుకుంటున్న బీజేపీకి ఈ ఎన్నికల్లో దేశ ప్రజలు తగిన బుద్ధి చెపుతారని వ్యాఖ్యానించారు.

జూపల్లి ప్రకటన అబద్ధం



సాక్షి, హైదరాబాద్: కొత్త మద్యం బ్రాండ్లు తెలంగాణకు రావని మంత్రి జూపల్లి కృష్ణారావు చేసిన ప్రకటన అబద్ధమని తేలిపోయిందని బీఆర్‌ఎస్ నేత మన్నె క్రిశాంక్ అన్నారు. ఆయన తెలంగాణ భవన్‌లో సోమవారం విలేకరులతో మాట్లాడుతూ సోం డిస్టిలరీస్ సంస్థ ద్వారా కొత్త బీర్లు తెలంగాణకు వస్తున్నాయని పేర్కొన్నారు. సోం డిస్టిలరీలో కాంగ్రెస్ జాతీయ నేత దిగ్విజయ్ సింగ్ అవినీతికి పాల్పడినట్టు కేసు నడిచిందని పేర్కొన్నారు. ఈ సంస్థ 2019లో కాంగ్రెస్ పార్టీకి రూ.1.31 కోట్లు, 2013–14లో రూ.25 లక్షల విరాళం ఇచ్చిందని తెలిపారు. కేసీఆర్ హయాంలో తెలంగాణలో అక్రమ మద్యానికి అడ్డుకట్ట వేశారని, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే తలుపులు తెరిచారని ఆరోపించారు. మధ్యప్రదేశ్‌లో సోం డిస్టిలరీస్ సంస్థను సీజ్ చేశారని, అనేకసార్లు దాడులు కూడా జరిగాయని వివరించారు. ఆ సంస్థ వల్ల మధ్యప్రదేశ్‌లో 65 మంది చనిపోయారని పేర్కొన్నారు. సోం డిస్టిలరీస్ సంస్థ తెలంగాణకు వస్తున్న విషయం జూపల్లికి తెలుసా? ఆ సంస్థ తెలంగాణలో బీర్లు అమ్మడానికి సీఎం రేవంత్ రెడ్డి డీల్ చేసి అనుమతి ఇచ్చారా? అని ప్రశ్నించారు.

రాచరికపు ఆనవాళ్లు లేకుండా రాష్ట్ర చిహ్నం

- చిత్రకారుడు రుద్ర రాజేశంకు సీఎం సూచన
- రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించాలని స్పష్టీకరణ
- జూన్ 2న ఆవిష్కరణకు అవకాశాలు అంతంత మాత్రమే
- రాష్ట్ర గేయం 'జయ జయహే తెలంగాణ'రెడీ

సాక్షి, హైదరాబాద్: రాచరికపు ఆనవాళ్లు లేకుండా రాష్ట్ర అధికారిక చిహ్నం రూపొందించాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. రాష్ట్ర ప్రజల సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా కొత్త చిహ్నం ఉండాలని స్పష్టం చేశారు. సోమవారం సచివాలయంలో చిత్రకారుడు రుద్ర రాజేశంతో సీఎం సమావేశమయ్యారు. రాష్ట్ర అధికారిక చిహ్నం రూపకల్పనపై చర్చించారు. రాజేశం రూపొందించిన పలు నమూనాలను పరిశీలించారు. తుది నమూనాపై పలు సూచనలు చేశారు. గత బీఆర్‌ఎస్ సర్కారు ప్రభుత్వం రూపొందించిన రాష్ట్ర అధికార చిహ్నంలో చార్మినార్‌తో పాటు కాకతీయ కళాతోరణం గుర్తులు ఉండగా, వాటిని రాచరిక ఆనవాళ్లుగా పరిగణించి, కొత్త అధికారిక చిహ్నాన్ని రూపొందించాలని కాంగ్రెస్ ప్రభుత్వ తొలి కేబినెట్ సమావేశంలోనే నిర్ణయం తీసుకున్నారు. కాగా జూన్ 2న తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల సందర్భంగా కొత్త అధికారిక చిహ్నంతో పాటు రాష్ట్ర గేయం 'జయ జయహే తెలంగాణ'ను ఆవిష్కరించాలని ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకున్నారు. అయితే కొత్త అధికారిక చిహ్నం రూపకల్పన కసరత్తు ఇంకా కొలిక్కి రాకపోవడంతో జూన్ 2న జరిగే రాష్ట్ర అవతరణ వేడుకల్లో దీనిని ఆవిష్కరించే అవకాశాలు అంతగా లేనట్టేనని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

రాష్ట్ర గేయం ఆవిష్కరణకు ఏర్పాట్లు

'జయ జయహే తెలంగాణ'గీతాన్ని తెలంగాణ రాష్ట్ర గేయంగా ఎంపిక చేసిన ప్రభుత్వం, జూన్ 2న నిర్వహించే బహిరంగ సభలో కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీ చేతుల మీదుగా దానిని ఆవిష్కరించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. అందెశ్రీ రాసిన ఈ గేయాన్ని ఎలాంటి మార్పులు లేకుండా రాష్ట్ర గేయంగా ముఖ్యమంత్రి ఎంపిక చేశారు. అయితే 13 నిమిషాల నిడివి కలిగిన ఈ గేయాన్ని అంతర్జాతీయ అతిథులు పాల్గొనే కార్యక్రమాల్లో పాడడానికి వీలుగా సంక్షిప్తీకరించి మరో వెర్షన్‌ను సైతం రూపొందించాలని సీఎం గతంలో అందెశ్రీకి సూచించారు.



రుద్ర రాజేశంతో చర్చిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

నేడు సోనియాకు ఆహ్వానం

జూన్ 2న జరిగే తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొనాల్సిందిగా సోనియాను ముఖ్యమంత్రి కోరనున్నారు. మంగళవారం ఢిల్లీలో ఈ మేరకు ఆమెకు ఆహ్వానం పలకనున్నారు. సోమవారం కేరళ వెళ్లిన సీఎం అటు నుంచి ఢిల్లీకి వెళ్లారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన సోనియాగాంధీని జూన్ 2న జరిగే వేడుకలకు ఆహ్వానించి, ఆమె చేతుల మీదుగా తెలంగాణ ఉద్యమకారులను సన్మానించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే.

బీఆర్‌ఎస్ నేతలపైనా నిఘా!

▶ మొదటి పేజీ తరువాయి

అధికారులు.. వీటిని న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లారు.

రోహిత్‌రెడ్డి ఫామ్‌హౌస్‌లో ఆపరేషన్

దుబ్బాక, హుజూరాబాద్ ఉప ఎన్నికల్లో బీజేపీ గెలవడంతో ఆ పార్టీకి బ్రేక్ వేయాలని నాటి సీఎం కేసీఆర్ నిర్ణయించుకున్నారు. 2022 అక్టోబర్ చివరి వారంలో నాటి ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి ద్వారా ఓ కీలక విషయం కేసీఆర్‌కు తెలిసింది. బీఆర్‌ఎస్‌ను వీడి తమ పార్టీలో చేరేలా బీజేపీకి చెందిన కొందరు వ్యక్తులు ఎర వేస్తున్నారంటూ రోహిత్‌రెడ్డి నాటి సీఎంకు చెప్పారు. అప్పటికే మునుగోడు ఎన్నికలు సమీపిస్తుండటంతో బీజేపీని ఇరుకున పెట్టాలని నిర్ణయించుకున్న కేసీఆర్ ఈ విషయాన్ని ప్రభాకర్‌రావు, రాధాకిషన్‌రావులకు అప్పగించడంతోపాటు వారికి సహకరించాలని రోహిత్‌రెడ్డిని ఆదేశించారు. డీఎస్పీ ప్రణీత్‌రావు ద్వారా కొందరు ప్రైవేట్ వ్యక్తుల ఫోన్లపై నిఘా పెట్టడం ద్వారా కీలక విషయాలు రాబట్టారు. ఈ ఆడియో క్లిప్స్‌ను కేసీఆర్‌కు అందించారు. వీటి ఆధారంగా మొయినాబాద్ సమీపంలోని అజీజ్ నగర్‌లో ఉన్న రోహిత్‌రెడ్డి ఫామ్‌హౌస్‌లో ప్రత్యేక ఆపరేషన్‌కు ప్లాన్ చేశారు. ఫలానా రోజున అక్కడికి రావాలని రోహిత్‌రెడ్డి ద్వారా నందుతోపాటు ఇద్దరు స్వామీజీలకు సందేశం పంపారు. అప్పట్లో హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్‌లో పనిచేస్తున్న ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి, ఎస్సై శ్రీకాంత్‌లను రాధాకిషన్‌రావు ఢిల్లీకి పంపి ప్రత్యేక స్పై కెమెరాలు ఖరీదు చేయించారు. వీటిని శ్రీకాంత్‌తోపాటు మరో ఇద్దరు ఎస్సైలు మల్లికార్జున్, అశోక్‌రెడ్డి ఫామ్‌హౌస్‌లో బిగించారు. రోహిత్‌రెడ్డితో పాటు వేర్వేరు సామాజిక వర్గాలకు చెందిన మరో ముగ్గురు ఎమ్మెల్యేలను స్వయంగా కేసీఆర్ రంగంలోకి దింపారు. క్షేత్రస్థాయిలో సైబరాబాద్ ఎస్ఓటీ పోలీసులు ఈ ఆపరేషన్ నిర్వహించారు. ఆపై ఏర్పాటైన సిట్ ద్వారా ఆర్‌ఎస్‌ఎస్ కీలక నేత బీఎల్ సంతోష్‌ను అరెస్టు చేయించాలని తద్వారా బీజేపీని దారిలోకి తెచ్చుకుని తన కుమార్తె, ఎమ్మెల్సీ కవితపై ఉన్న ఈడీ కేసు నీరుగారేలా చేయాలని భావించారు. కొందరు సైబరాబాద్ పోలీసుల అసమర్థత కారణంగా కేరళలోని మాతా అమృతానందమయి ఆశ్రమానికి చెందిన ఒక ముఖ్యమైన వ్యక్తి తప్పించుకున్నాడు. దీంతో ఆయన్ను పట్టుకోవడానికి ఎస్పీ రెమా రాజేశ్వరి, ఇన్‌స్పెక్టర్ బి.గట్టుమల్లుతో కూడిన బృందాన్ని ఏకంగా చార్టర్డ్ ఫ్లైట్‌లో అక్కడకు పంపించారు. ఈ ప్రయత్నమూ సఫలీకృతం కాకపోవడంతోపాటు ఆయా నిందితులను అరెస్టు చేయొద్దని, కేసును సీబీఐకి అప్పగించాలని న్యాయస్థానం నుంచి ఆదేశాలు రావడంతో అంతా అసంతృప్తి చెందారు. తాను అనుకున్నది జరగకపోవడంపై కేసీఆర్ తీవ్ర ఆగ్రహం, అసహనం వ్యక్తం చేశారు.

బీఆర్‌ఎస్‌కు ఇబ్బందికరంగా ఉన్న పరిణామాలను గుర్తించి...

ప్రభాకర్‌రావు, రాధాకిషన్‌రావు మధ్య తరచూ వివిధ నియోజకవర్గాల్లోని రాజకీయ పరిస్థితులపై చర్చలు జరిగేవి. బీఆర్‌ఎస్‌తోపాటు దాని నాయకులకు ఇబ్బందికరంగా ఉన్న పరిణామాలను వీళ్లు గుర్తించే వాళ్లు. ఈ సమాచారాన్ని ప్రణీత్‌కు పంపి ఆయా వ్యక్తులపై నిఘా పెట్టమని ఆదేశించే వాళ్లు. ఇలా ఎస్ఐబీ నిఘా ఉంచిన వారిలో బీఆర్‌ఎస్‌కు చెందిన వాళ్లూ ఉండటం గమనార్హం. నాటి కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యేతో విభేదించిన అప్పటి ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, అప్పట్లో కడియం శ్రీహరితో విభేదాలు ఉన్న మాజీ మంత్రి టి.రాజయ్య, తాండూరు ఎమ్మెల్యేపై అసంతృప్తిగా ఉన్న పట్నం మహేందర్ రెడ్డి దంపతులతోపాటు మాజీ ఐపీఎస్ అధికారి, నాటి బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్, తీగల కృష్ణారెడ్డి, తీన్మార్ మల్లన్న, టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి కుటుంబ సభ్యులు, రెండు మీడియా సంస్థల అధినేతలు, కాంగ్రెస్ సీనియర్ నేత జానారెడ్డి కుమారుడు రఘువీర్, గద్వాలకు చెందిన సరిత తిరుపతయ్య, కోరుట్ల వాసి జువ్వాడి నర్సింగరావు, అచ్చంపేటకు చెందిన వంశీకృష్ణ, మానకొండూరుకు చెందిన కవ్వంపల్లి సత్యనారాయణ, నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్, ఈటల రాజేందర్, బండి సంజయ్‌ల ఫోన్లు ట్యాప్ చేశారు. వీరితోపాటు వివిధ నిర్మాణ సంస్థలు, రియల్ ఎస్టేట్ కంపెనీలకు చెందిన యజమానులు, వ్యాపారవేత్తల ఫోన్ల పైనా అక్రమ నిఘా ఉంచారు.

ఫోన్ కాల్స్‌కు దూరంగా ఉన్న వారిపై..

ఎస్ఐబీ నిఘా ఉంటుందన్న భయంతో అప్పట్లో అనేక మంది రాజకీయ నాయకులు, న్యాయాధికారులు, ప్రభుత్వ అధికారులు ఫోన్ కాల్స్‌కు దూరంగా ఉన్నారు. వీళ్లు ఎక్కువగా సిగ్నల్, స్నాప్‌చాట్ తదితర సోషల్ మీడియాను వినియోగిస్తూ ఎన్‌క్రిప్టెడ్ విధానంలో మాట్లాడటం ప్రారంభించారు. దీన్ని గుర్తించిన ప్రభాకర్‌రావు, ప్రణీత్‌రావు.. వారు ఎవరితో మాట్లాడారో గుర్తించడానికి వారి ఐపీడీఆర్‌లు (ఇంటర్నెట్ ప్రొటోకాల్ డేటా రికార్డ్స్) సేకరించి, విశ్లేషించారు. గత ఏడాది అసెంబ్లీ ఎన్నికలకు ముందు అక్టోబర్–నవంబర్‌లో ట్యాపింగ్ మరింత పెరిగింది. నాటి మంత్రి టి.హరీశ్‌రావు సిఫార్సుతో ఐన్యూస్ సంస్థ అధినేత శ్రావణ్ కుమార్ ప్రభాకర్‌రావుతో సన్నిహితంగా మెలిగారు. అలా కాంగ్రెస్, బీజేపీ నాయకులు, వారి మద్దతుదారుల వివరాలు సేకరించి అందించే వారు. ప్రత్యర్థి నాయకులను లక్ష్యంగా చేసుకుని వారి నగదును స్వాధీనం చేసుకోవడానికి, టార్గెట్ చేసిన వ్యక్తులను ట్రోల్ చేయడానికి శ్రావణ్ పూర్తి సహాయ సహకారాలు అందించారు. తాను 2020లో పదవీ విరమణ చేసిన తర్వాత రెండుసార్లు టాస్క్‌ఫోర్స్ ఓఎస్డీగా పెద్దాయన (కేసీఆర్) అవకాశం ఇచ్చారని, ఈ విశ్వాసంతో కొన్ని కేసులకు అంశాలకు సంబంధించిన పూర్తి వివరాలు బయటపెట్టానని రాధాకిషన్‌రావు వాంగ్మూలంలో పేర్కొన్నారు.

ట్యాపింగ్ కేసును సీబీఐకి అప్పగించాలి

- కేసీఆర్‌ను అరెస్ట్‌చేసి ప్రాసిక్యూట్ చేయాలి
- ఎమ్మెల్యేగా అనర్హత వేటు వేయాలి
- బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్



సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ హయాంలో ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడి ప్రజల ప్రాథమిక హక్కులను కాలరాసిన మాజీ సీఎం కేసీఆర్‌పై వెంటనే ఎమ్మెల్యేగా అనర్హత వేటు వేసి, మళ్లీ ఎన్నికల్లో పాల్గొనకుండా నిషేధం విధించాలని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ డిమాండ్ చేశారు. 'ఈ విషయంలో వెంటనే కేసీఆర్‌ను అరెస్ట్ చేసి ప్రాసిక్యూట్ చేయాలి. సీఎం రేవంత్ రెడ్డికి ప్రజాస్వామ్యంపై ఏమాత్రం నమ్మకం ఉన్నా దీనిని సీరియస్‌గా తీసుకుని తక్షణమే సీబీఐ విచారణ కోరుతూ లేఖ రాయాలి. అలాగే ఎమ్మెల్యే పదవికి కేసీఆర్‌ను అనర్హుడిగా ప్రకటించే అంశంపైనా స్పీకర్ తగిన చర్యలు తీసుకోవాలని బీజేపీ పక్షాన కోరుతున్నాం'అని... హైదరాబాద్‌లో విడుదల చేసిన ఓ ప్రకటనలో సంజయ్ పేర్కొన్నారు.

కేసీఆర్‌ను కాపాడటంలో మతలబు ఏమిటి?

ఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్‌ను రేవంత్ రెడ్డి, వడ్ల స్కాంలో అదే కేసీఆర్‌ను పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి కాపాడటం వెనుక మతలబు ఏమిటని బండి సంజయ్ ప్రశ్నించారు. 'ఫోన్ ట్యాపింగ్‌తో ప్రతిపక్షాలపై కేసీఆర్ సైబర్ దాడి.. ఎమర్జెన్సీకంటే దారుణమైన వ్యవహారం. రాధాకిషన్ రావు కన్ఫెషన్ స్టేట్‌మెంట్‌ను పరిశీలిస్తే ప్రతిపక్షాలపై ముఖ్యంగా బీజేపీపై దాడి కోసమే ఫోన్ ట్యాపింగ్‌ను ఉపయోగించుకున్నట్లు అర్థమవుతోంది''అని ఆరోపించారు. లిక్కర్ కేసులో అడ్డంగా దొరికిన బిడ్డను కాపాడుకునేందుకే కేసీఆర్ గతంలో ఎమ్మెల్యేల కొనుగోలు అంశాన్ని సృష్టించినట్లు రాధాకిషన్ రావు స్టేట్‌మెంట్‌తో తేలిపోయిందని బండి విశ్లేషించారు.

కేటీఆర్ అండ్ కో పైనా అనర్హత వేటు వేయాలి

'ప్రజా సమస్యలపై పోరాడుతున్న బీజేపీసహా ప్రతిపక్ష పార్టీల నేతలను భయపెట్టేందుకు ఫోన్ ట్యాపింగ్ చేయడం ముమ్మాటికీ రాజ్యాంగ ద్రోహమే. ఇలాంటివారు ఎమ్మెల్యేగానే కాదు.. భవిష్యత్తులో రాజ్యాంగబద్ధంగా ఏ పదవి చేపట్టడానికి కూడా అర్హులు కాదు.. అందువల్ల కేసీఆర్‌తోపాటు వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సహా ట్యాపింగ్‌తో సంబంధమున్న బీఆర్‌ఎస్ నేతలపై అనర్హత వేటు వేయాలి'' అని బండి డిమాండ్ చేశారు. ఇందులో భాగం పంచుకున్నందున అవసరమైతే బీఆర్‌ఎస్ పార్టీ గుర్తింపును సైతం రద్దు చేసే అంశంపై ఆలోచించాలని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ఫోన్ ట్యాపింగ్ దేశ భద్రత అంశం

బీఆర్‌ఎస్ నేత ప్రవీణ్ కుమార్



సాక్షి, హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ అనేది దేశ భద్రతకు సంబంధించిన అంశమని, దీన్ని ఇతర స్వార్థ ప్రయోజనాల కోసం వాడినవారెవరైనా చట్ట ప్రకారం శిక్షార్హులవుతారని బీఆర్‌ఎస్ నేత, మాజీ ఐపీఎస్ అధికారి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ అభిప్రాయపడ్డారు. సోమవారం ఆయన డీజీపీ కార్యాలయం వద్ద విలేకరులతో మాట్లాడారు. ఈ అంశంపై పోలీస్ దర్యాప్తు కొనసాగుతున్నందున ఎలాంటి బహిరంగ ప్రకటన చేయనని విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. కాగా, ఇటీవల వనపర్తి జిల్లాలో జరిగిన బీఆర్‌ఎస్ నేత శ్రీధర్ రెడ్డి హత్యపై సమగ్ర విచారణ జరిపించాలని కోరుతూ ప్రవీణ్‌కుమార్ బృందం సోమవారం డీజీపీ రవిగుప్తాకు విజ్ఞప్తి చేసింది. హత్య జరిగి నాలుగు రోజులవుతున్నా, ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఫిర్యాదు చేసింది. దీనికి సంబంధించి మంత్రి జూపల్లి కృష్ణారావుపై ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని, ఇప్పటి వరకు ఈ కేసులో నిందితులెవరినీ అరెస్ట్ చేయలేదని డీజీపీ దృష్టికి తెచ్చారు. శ్రీధర్ రెడ్డి హత్యపై ప్రత్యేక దర్యాప్తు సంస్థతో విచారణ జరిపించాలని డీజీపీని కోరామని ప్రవీణ్‌కుమార్ తెలిపారు. వారం రోజుల్లో తగిన చర్యలు తీసుకోకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

ఉత్తమ్ తెలివిగా తప్పించుకున్నారు

- పౌరసరఫరాల శాఖలో అవినీతిపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి
- ఈ అవినీతి, అక్రమాలపై కేంద్రానికి లేఖ రాస్తా... మా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడి అనుమతితోనే సీఎంను కలవడానికి వెళ్లా
- పైరవీలతో బీజేఎల్పీ పదవి తెచ్చుకోలేదు
- బీజేఎల్పీనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: పౌరసరఫరాల శాఖలో జరిగిన అవినీతిపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని లేదా ఈ వ్యవహారాన్ని సీబీఐకి అప్పగించాలని బీజేఎల్పీనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆ శాఖలో చోటుచేసుకున్న అవినీతి, అక్రమాలపై కేంద్ర ప్రభుత్వానికి పూర్తి ఆధారాలతో లేఖ రాస్తామని వెల్లడించారు. సోమవారం ఆయన బీజేపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ, తాను చేసిన ఆరోపణలపై మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆలస్యంగా స్పందించినా.. ప్రజల పక్షాన తాను అడిగిన 19 ప్రశ్నల్లో ఒక్కదానికే మాత్రమే సమాధానం చెప్పి తెలివిగా తప్పించుకున్నారన్నారు. మిగతా వాటికి సమాధానం ఏదని నిలదీశారు. సన్న బియ్యం కొనుగోలు విషయంలో ప్రభుత్వం దగ్గర ఉన్న నిల్వలనే మిల్లింగ్ చేయిస్తామని, అందుకు ముందుగా ఇచ్చిన టెండర్‌ను రద్దు చేస్తామని ఇప్పుడు చెబుతున్నారని అన్నారు. ఈ విషయాన్నే తాను ప్రశ్నించానని, ప్రభుత్వం దగ్గర ఉన్న వడ్లనే మిల్లింగ్ చేస్తే.. క్వింటాలుకు రూ.3,500లకే వస్తాయి కదా, మరి వేలంలో క్వింటాలుకు రూ. 5,700లకు కొనడం ఎందుకో చెప్పాలన్నారు. గతంలో ఎన్నడూ క్వింటాలుకు రూ.4,000కి మించి టెండర్ ఇవ్వలేదని, ఇప్పుడు ఇంత మొత్తం ఇవ్వడం వెనక మతలబు ఏమిటని ప్రశ్నించారు. గతంలో తప్పులు చేసిన మిల్లర్లను ఎంత మందిని డిఫాల్టర్లుగా గుర్తించారో ముందు ఆ జాబితా బయటపెట్టాలని డిమాండ్ చేశారు. తప్పు చేసిన మిల్లర్లపై చట్టపరంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని.. దానిని తాము కాదనడం లేదని, అయితే ఆ తప్పులను సాకుగా చూపి, మరో మార్గంలో వసూళ్లకు పాల్పడటాన్ని తాము ప్రశ్నించామన్నారు. తడిసిన ధాన్యం గింజ లేకుండా కొనుగోలు చేశామని చెబుతున్నా వాస్తవ పరిస్థితి అలా లేదన్నారు. 'అసలు మంత్రి కనీసం కొనుగోలు కేంద్రాలకు వెళితే కదా.. ఆయనకు రైతుల కష్టాలు తెలిసేది. హైదరాబాద్‌లో కూర్చొని అంతా బాగుంది.. అని జబ్బలు చరుచుకుంటే సరిపోదు'అని వ్యాఖ్యానించారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి క్షేత్రస్థాయిలో కల్లాల్లో పర్యటించి రైతులు సమస్యలు తెలుసుకున్నారని గుర్తుచేశారు. తమ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడి అనుమతితోనే తాము రైతుల సమస్యలపై సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తే దానిని వక్రీకరించి మాట్లాడడం మంత్రి ఉత్తమ్‌కే చెల్లిందన్నారు. అది సీఎంను అవమానించడమే అవుతుందన్నారు. కాగా, తానేమీ పైరవీలతో బీజేఎల్పీ పదవి తెచ్చుకోలేదని, పార్టీనాయకులు, ఎమ్మెల్యేలు కలిసి తనను ఎన్నుకున్నారని స్పష్టంచేశారు. గతంలో టీపీసీసీ చీఫ్ పదవిని ఉత్తమ్ ఎలా తెచ్చుకున్నారో తనకు బాగా తెలుసునన్నారు. మంత్రి ప్రెస్‌మీట్లు పెట్టి చేతులు దులుపుకుంటే, తప్పులు ఒప్పులుగా మారవన్నారు. వాస్తవాలు బయటకు రావాలంటే నిపుణుల కమిటీ వేసి నిగ్గు తేల్చాలని డిమాండ్ చేశారు.



ఆర్థిక సహాయం అందజేస్తున్న మాజీ మంత్రి కేటీఆర్. చిత్రంలో ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ

అకాల వర్షాల మృతులకు రూ. 10 లక్షల పరిహారం ఇవ్వాలి

- ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన కేటీఆర్

హఫీజ్‌పేట్: రాష్ట్రంలో అకాల వర్షాలకు మృతిచెందిన కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 10 లక్షల చొప్పున నష్టపరిహారం అందించాలని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. తారక రామారావు డిమాండ్ చేశారు. సోమవారం హైదరాబాద్ హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని సాయినగర్, యూత్‌కాలనీలలో ఈదురుగాలుల బీభత్సానికి ఇంటి పైకప్పుపై బండరాళ్లు పడి మృతిచెందిన రషీద్ (55), బాలుడు సమద్ (5) కుటుంబాలను పరామర్శించారు. ఓల్డ్ హఫీజ్‌పేట్‌లోని మసీదులో రషీద్, సమద్ మృతదేహాల వద్ద నివాళులర్పించారు. అనంతరం కూలిన గోడ, ఇంటి పైకప్పును పరిశీలించారు. మృతుల కుటుంబాలకు పార్టీ తరఫున రూ. లక్ష చొప్పున అందజేశారు. అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ అకాల వర్షాలు, గాలి దుమారానికి రాష్ట్రవ్యాప్తంగా ఒక్కరోజే 14 మంది మృతి చెందారన్నారు. మృతుల కుటుంబాలను ఆర్థికంగా ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే సిద్ధంగా ఉన్న డబుల్ బెడ్రూం ఇళ్లను పేదలకు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

ప్రధాని మోదీ 'ముజ్రా' వ్యాఖ్యలు ఆక్షేపణీయం

ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



సాక్షి, హైదరాబాద్: ముస్లిం ఓటు బ్యాంకు కోసం ఇండియా కూటమి ముజ్రా డ్యాన్స్ చేస్తోందంటూ ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలు ఆక్షేపణీయమని ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. దేశ ప్రధానిగా 130 కోట్ల మంది ప్రజలకు ప్రాతినిధ్యం వహించాల్సిన వ్యక్తి తాను ఒక మతానికి వ్యతిరేకమని చెప్పడం దురదృష్టకరమని, ఇలాంటి వ్యాఖ్యలను గతంలో ఏ ప్రధాని చేయలేదని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశ విభజన సమయంలో కాంగ్రెస్ పార్టీ చూపిన ఔదార్యం కారణంగానే రెండు మతాల మధ్య రాజుకున్న అగ్గి ఆరిపోయి ప్రజలంతా కలిసి ఉంటున్నారని, ఆ రోజుల్లో మోదీ ప్రధాని అయి ఉంటే ఆ మతవిద్వేషాలు ఇప్పటికీ రగులుతుండేవని శ్రీధర్‌బాబు అభిప్రాయపడ్డారు. దేశంలో పుట్టి పెరిగిన వారంతా భారతీయులేనని, వారి పట్ల వివక్ష చూపడం దుర్మార్గమన్నారు. బీజేపీ ఎప్పటికీ దేశ పౌరులందరికీ ప్రాతినిధ్యం వహించలేదని తెలిపారు. లౌకిక భావనలు ఈ నేలలో, నీటిలో, గాలిలో ఉందని, దాన్ని బీజేపీ వేరు చేయలేదని ఆ ప్రకటనలో శ్రీధర్‌బాబు స్పష్టంచేశారు.

టెస్కాబ్ చైర్మన్‌పై అవిశ్వాసం

- డైరెక్టర్ల నోటీసులు.. 10న అవిశ్వాసం
- ఆలోపే చైర్మన్ రవీందర్‌రావు రాజీనామా?

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ స్టేట్ కో ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ (టెస్కాబ్) చైర్మన్ కొండూరి రవీందర్‌రావుపై బోర్డు డైరెక్టర్లు అవిశ్వాసం ప్రకటించారు. ఈ మేరకు నోటీసులు ఇచ్చారు. దీంతో సమావేశం నిర్వహించేందుకు టెస్కాబ్ నిర్ణయించింది. వచ్చే నెల 10వ తేదీన అవిశ్వాస తీర్మానానికి ఏర్పాటు చేసింది. గతంలో బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన కొండూరి రవీందర్‌రావు టెస్కాబ్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. ఆయన పదవీకాలం ఈ ఏడాది లోపు పూర్తికానుంది. అయితే ఇప్పుడు రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో ఆ పార్టీకి అనుకూలంగా మారిన డైరెక్టర్లు రవీందర్‌రావును చైర్మన్ పదవి నుంచి తొలగించాలని నిర్ణయించారు. బోర్డులో మొత్తం 9 మంది డైరెక్టర్లు ఉండగా ఏడుగురు ఆయనకు వ్యతిరేకంగా ఉన్నారు. వీరు కాంగ్రెస్ పార్టీలో చేరారు. అయితే చైర్మన్ పదవిలో ఉండాలంటే కాంగ్రెస్‌లోకి రావాలంటూ రవీందర్‌రావుపై కొందరు నేతలు ఒత్తిడి తెచ్చినట్టు తెలిసింది. కానీ రవీందర్‌రావు కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు అంగీకరించకపోవడంతో ఆయనపై అవిశ్వాస అస్త్రాన్ని ప్రయోగించినట్లు తెలిసింది. అయితే అవిశ్వాసం ప్రవేశపెట్టేలోపే రవీందర్‌రావు రాజీనామా చేసే యోచనలో ఉన్నట్లు తెలిసింది.

కేటీఆర్, ఏలేటి బహిరంగ చర్చకు రావాలి

టీపీసీసీ నేత సామా రామ్మోహన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: పౌరసరఫరాల శాఖలో అవినీతి అంటూ ఆరోపణలు చేస్తున్న వారు బహిరంగ చర్చకు రావాలని టీపీసీసీ మీడియా కో ఆర్డినేషన్ కమిటీ చైర్మన్ సామా రామ్మోహన్‌రెడ్డి సవాల్ చేశారు. సోమవారం ఆయన గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ, ధాన్యం కొనుగోళ్లపై ఆరోపణలు చేస్తున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డిలు అమరవీరుల స్తూపం వద్దకు రావాలని డిమాండ్ చేశారు. వారి దగ్గర ఆధారాలు ఉంటే బయట పెట్టాలని, లేదంటే తప్పును ఒప్పుకొని ముక్కు నేలకు రాయాలని కోరారు. సివిల్ సప్లయిస్ శాఖలో అవినీతి జరిగిందంటూ బీఆర్‌ఎస్, బీజేపీ పార్టీలు ఒకటే ఆరోపణలు చేస్తున్నాయని, రూ.1,100 కోట్ల కుంభకోణమని బీజేపీ అంటే, రూ. 600 కోట్లు అని బీఆర్‌ఎస్ పొంతన లేకుండా మాట్లాడుతోందని ఆయన ధ్వజమెత్తారు. బీఆర్‌ఎస్ ఏ రోజు కూడా సన్న బియ్యం ఇవ్వాలని అనుకోలేదని, అదే కాంగ్రెస్ ప్రభుత్వం మధ్యాహ్నం భోజనంతో పాటు అన్ని కళాశాలల్లో సన్న బియ్యం అందించేందుకు కృషి చేస్తోందన్నారు. ఒక్క సన్న బియ్యపు గింజ కాంగ్రెస్ కొన్నట్లు నిరూపిస్తే దేనికైనా సిద్ధమని రామ్మోహన్‌రెడ్డి అన్నారు.

కేటీఆర్ ఆరోపణలకు సమాధానాలేవి?

పౌరసరఫరాల సంస్థ మాజీ చైర్మన్ రవీందర్ సింగ్

సాక్షి, హైదరాబాద్: పౌరసరఫరాల శాఖ టెండర్లలో జరిగిన అవినీతిపై కేటీఆర్ ఆధారాలతో సహ చేసిన ఆరోపణలపై ఏ ఒక్కదానికీ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమాధానం చెప్పలేదని పౌరసరఫరాల సంస్థ మాజీ చైర్మన్ రవీందర్ సింగ్ విమర్శించారు. తెలంగాణ భవన్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లకు టెండర్లు దక్కించుకున్నవారు.. రూ.200 కోట్ల మేర కూడా ధాన్యం కొనలేదని ఉత్తమ్ చెప్పడంలో నిజాయితీ లేదన్నారు. సన్న బియ్యం గింజ కూడా తీసుకోలేదంటున్నప్పుడు టెండర్లు ఎలా పిలిచారని ప్రశ్నించారు. రూ.57కు సన్న బియ్యం కొనాలని ప్రభుత్వమే టెండర్లలో ధర నిర్ణయించి, అవినీతిని బహిర్గతం చేస్తే భుజాలు తడుముకుంటున్నారని విమర్శించారు. ప్రభుత్వమే ఆ ధర నిర్ణయిస్తే బహిరంగ మార్కెట్‌లో బియ్యం ధరలు ఆకాశాన్నంటుతాయనే విజ్ఞత లేదన్నారు. ధాన్యం ధర రూ.2007 అని టెండర్లలో నిర్ణయించి, ఏజెన్సీలు రూ.2230 వసూలు చేస్తున్నాయని ఆరోపించారు.

జూన్ మొదటి వారంలో జేఈఈ అడ్వాన్స్‌డ్ ర్యాంకులు

సాక్షి, హైదరాబాద్: దేశంలోని ప్రతిష్టాత్మక ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో బీటెక్, బీఆర్క్‌లో ప్రవేశానికి సంబంధించి నిర్వహించిన ఉమ్మడి ప్రవేశ పరీక్ష (జేఈఈ అడ్వాన్స్‌డ్) ర్యాంకులు జూన్ 4న వెలువడే అవకాశం ఉంది. పరీక్షలు ఈనెల 26న దేశవ్యాప్తంగా జరిగాయి. జేఈఈ మెయిన్స్‌లో అర్హత సాధించిన 2.5 లక్షల మందిని ఈ పరీక్షకు ఎంపిక చేశారు. వీరిలో 2 లక్షల మంది వరకు అడ్వాన్స్‌డ్ రాశారు. ఇందుకు సంబంధించిన రెస్పాన్స్ షీట్ ఈనెల 31 వరకు వెలువడుతుందని అధికార వర్గాలు వెల్లడించాయి. జూన్ 2న ప్రొవిజినల్ ఆన్సర్ 'కీ' విడుదల చేస్తారు. 3వ తేదీ సాయంత్రానికి అభ్యంతరాలు స్వీకరిస్తారు. 4వ తేదీ లేదా 5న ర్యాంకులు ప్రకటిస్తారు. అడ్వాన్స్‌డ్ ర్యాంకుల తర్వాత జోసా కౌన్సెలింగ్ ప్రక్రియ మొదలవుతుంది.

బాసర ట్రిపుల్ ఐటీ నోటిఫికేషన్ నేడు

సాక్షి, హైదరాబాద్: బాసరలోని రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయంలో ఆరేళ్ల సమీకృత బీటెక్, డిగ్రీ కోర్సుల్లో ప్రవేశానికి సంబంధించిన నోటిఫికేషన్ మంగళవారం విడుదల కానుంది. జూన్ 1 నుంచి అడ్మిషన్లు చేపట్టాలని నిర్ణయించినట్లు యూనివర్సిటీ తెలిపింది. ఆన్‌లైన్‌లో దరఖాస్తులకు www.rgukt.ac.in అనే వెబ్‌సైట్‌కు లాగిన్ అవ్వాలని సూచించింది.

జూన్ 3 నుంచి టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు

సాక్షి, హైదరాబాద్: టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు జూన్ 3 నుంచి 13వ తేదీ వరకు జరగనున్నాయి. ఇందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేసినట్లు పాఠశాల విద్య పరీక్షల విభాగం సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు ఉంటాయని వెల్లడించింది. పరీక్షకు 51,237 మంది దరఖాస్తు చేసుకున్నారని పేర్కొంది. అభ్యర్థులు www.bse.telangana.gov.in అనే వెబ్‌సైట్‌కు లాగిన్ అయి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించింది.

వారాంతంలో కేరళకు..

▶ మొదటి పేజీ తరువాయి

మహాపాత్ర సోమవారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ వెల్లడించారు.

చాలా చోట్ల సాధారణం.. కొన్నిచోట్ల అత్యధికం..

ప్రస్తుతం రాష్ట్రానికి పశ్చిమ, వాయవ్య దిశల నుంచి బలమైన గాలులు వీస్తున్నట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. దీనివల్ల రానున్న రెండ్రోజులు గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదవుతాయన్నారు. రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో సోమవారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవగా కొన్నిచోట్ల సాధారణం కంటే 3 డిగ్రీల సెల్సియస్ అధికంగా నమోదయ్యాయి. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో అత్యధికంగా 45.7 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. ఆ తర్వాత కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా జంబూగలో 45.4 డిగ్రీలు, మంచిర్యాల జిల్లా హాజీపూర్‌లో 44.9, జగిత్యాల జిల్లా తిర్యాణిలో 44.9, ఆసిఫాబాద్ జిల్లా వెల్గటూరులో 44.8, జగిత్యాల జిల్లా జైనలో 44.7, కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడిలో 44.7 డిగ్రీల సెల్సియస్ చొప్పున గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. సోమవారం రాష్ట్రంలోని ప్రధాన నగరాల్లో నమోదైన ఉష్ణోగ్రతలను పరిశీలిస్తే ఆదిలాబాద్‌లో అత్యధికంగా 43.8 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది.

సోమవారం ప్రధాన కేంద్రాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు (డిగ్రీల సెల్సియస్‌లలో)

కేంద్రం	గరిష్టం
ఆదిలాబాద్	43.8
రామగుండం	42.4
భద్రాచలం	40.6
నిజామాబాద్	40.4
హనుమకొండ	40.0
ఖమ్మం	40.0
మెదక్	40.0
నల్లగొండ	39.0
హైదరాబాద్	37.8
మహబూబ్‌నగర్	36.0

రేవ్ పార్టీ కేసు.. విచారణకు నటి హేమ గైర్హాజరు

బనశంకరి: ఇటీవల బెంగళూరులోని ఓ ఫాంహౌస్‌లో జరిగిన రేవ్ పార్టీ కేసులో సోమవారం పోలీసుల విచారణకు హాజరుకావాల్సిన తెలుగు నటి హేమ గైర్హాజరయ్యారు. నగర సెంట్రల్ క్రైం బ్రాంచ్ పోలీసుల ముందు హాజరు కావడానికి ఒకవారం గడువు ఇవ్వాలని ఆమె కోరారు. ఈ నెల 18న జరిగిన రేవ్ పార్టీలో సుమారు 150 మంది పాల్గొనగా, అందులో 86 మంది డ్రగ్స్ సేవించినట్లు వైద్య పరీక్షల్లో నిర్ధారణ కావడంతో సీసీబీ పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు. తొలుత నటి హేమతో పాటు 8 మందికి నోటీసులు జారీచేసి సోమవారం విచారణకు హాజరుకావాలని ఆదేశించారు. కానీ అనారోగ్యం, ఇతర కారణాలతో ఒకవారం పాటు గడువు కావాలని హేమ విజ్ఞప్తి చేశారు. మిగిలిన 7 మంది దర్యాప్తుకు హాజరయ్యే అవకాశముంది.



> రాక్షసులతో పోరాడేవాడు ఆ క్రమంలో రాక్షసుడిలా మారకుండా జాగ్రత్తపడాలి. అగాధంలోకి మనం చాలాసేపు చూస్తూ ఉంటే అగాధం మనలోకి చూస్తున్నట్లుగా అనిపిస్తుంది.
> – ఫ్రెడెరిక్ నీషే

సాక్షి
మంగళవారం, 28 మే 2024

ఈసీ నోరుమెదపదేం?!

కోట్లాదిమంది పౌరులు నచ్చినవారిని, సమర్థులనుకున్నవారిని తమ ప్రతినిధులుగా ఎంపిక చేసుకునే అసాధారణ ప్రక్రియ ఎన్నికలు. ఆ ప్రక్రియను ఎంత పారదర్శకంగా...ఎంత వివాదరహితంగా...ఎంత తటస్థంగా నిర్వహిస్తే అంతగా ప్రజాస్వామ్యం వర్ధిల్లుతుంది. కానీ ఆంధ్రప్రదేశ్‌లో ఈసారి ఆదినుంచీ ఇందుకు విరుద్ధమైన పోకడలు చోటుచేసుకున్నాయి. ఎన్నికల షెడ్యూల్ వెలువడింది మొదలు చిత్ర విచిత్ర ధోరణులు కనబడ్డాయి. పోలింగ్ రోజైన ఈనెల 13న, ఆమర్నాడు రాష్ట్రంలో జరిగిన ఉదంతాలు వీటికి పరాకాష్ఠ. వివిధ జిల్లాల్లో చెదురుమదురుగా చోటుచేసుకున్న ఘటనలు ఒక ఎత్తయితే నర్సరావుపేట పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో జరిగిన ఉదంతాల పరంపర మరో ఎత్తు. టీడీపీ రౌడీ మూకలు పోలింగ్ కేంద్రాల్లోకి జొరబడి వైఎస్సార్ కాంగ్రెస్ ఏజెంట్లపై దౌర్జన్యం సాగించి వెళ్లగొట్టడం, వోటేయడానికి క్యూలో నించున్న బలహీనవర్గాలవారినీ, మహిళలనూ కొట్టి వెనక్కిపంపడం వంటి ఉదంతాలపై ఫిర్యాదు చేసినా అరణ్యరోదనే అయింది. అసాంఘిక శక్తులు చొరబడి పోలింగ్ ప్రక్రియను దెబ్బతీయకుండా చూడటానికీ, అవసరమైనప్పుడల్లా కిందిస్థాయి అధికారులకు తగిన ఆదేశాలివ్వడానికీ, సమస్యాత్మక ప్రాంతాలకు బలగాలు తరలించటానికీ వీలుంటుందని ఏర్పాటుచేసిన వెబ్‌కాస్టింగ్‌ను ఎన్నికల సంఘం ఉన్నతాధికారులు గుడ్లప్పగించి చూస్తూ ఉండిపోయారు. దాని నియంత్రణ టీడీపీ చేతుల్లోకి పోయింది. ఆ తర్వాత రెండురోజులూ పచ్చమూకలు తెగబడి రోడ్లపై స్వైరవిహారం చేశాయి. వైఎస్సార్ కాంగ్రెస్‌కు వోటేశారనుకున్నవారి ఇళ్లను లక్ష్యంగా చేసుకుని విధ్వంసం సృష్టించాయి. ఈ మూకలకు భయపడి వందలమంది ఇళ్లూ వాకిళ్లూ వదిలి వేరేచోట తలదాచుకోవాల్సివచ్చింది. ఇదంతా చానెళ్లలో ప్రసారం అవుతున్నా రాష్ట్రంలో ఎన్నికల నిర్వహణకు బాధ్యతవహించాల్సిన అధికారులకుగానీ, శాంతిభద్రతలు పర్యవేక్షించాల్సిన పోలీసు అధికారులకుగానీ చీమకుట్టినట్టయినా లేదు. ఎన్నికలకు రెండురోజుల ముందు త్రికూటమి సౌజన్యంతో విధుల్లో చేరిన ఉన్నతాధికారులు ఈ విధ్వంసకాండ సాగుతున్న సమయంలో మౌనదీక్షలో మునిగిపోయారు. పరువు బజార్నపడిందనుకున్నదో ఏమో కేంద్ర ఎన్నికల సంఘం జోక్యం చేసుకుని నివేదిక తెప్పించుకుని ముగ్గురు ఎస్పీలనూ, ఒక కలెక్టర్‌నూ బదిలీచేసింది. మూడు జిల్లాల్లో 12 మంది పోలీస్ అధికారులను సస్పెండ్ చేసింది. సిట్ ఏర్పాటుచేసి దర్యాప్తు చేయించింది. ఇంత జరిగినా కారంపూడి సీఐగా ఉంటూ టీడీపీ విధ్వంసకాండకు కొమ్ముకాసిన నారాయణస్వామికి మాత్రం ఏం కాలేదు. ఐజీ త్రిపాఠి సరేసరి. వీరు కొత్త కొత్త కేసులు బనాయిస్తూ స్వామిభక్తిని చాటుకుంటున్నారు.

త్రికూటమి ఆడించినట్టల్లా ఆడటానికి ఎన్నికల సంఘం రెడీ అయిపోయిందని ఉన్నతాధికారుల ఏకపక్ష బదిలీలు మొదలైనప్పుడే అందరికీ అర్థమైపోయింది. ఎవరిని ఎక్కడ నియమించాలో ఆదేశిస్తూ కూటమి ఇచ్చిన ఆదేశాలకు 'జీ హుజూర్' అంటూ కొత్త అధికారులను దించింది. సమస్యాత్మక ప్రాంతాల్లో ఉద్దేశపూర్వకంగా కొందరు అధికారులను నియమించటంతో మొదలైన కుట్రపై లోతుగా దర్యాప్తు చేస్తే తప్ప ఎన్నికల రోజునా, ఆ తర్వాతా కొనసాగిన హింస, విధ్వంసకాండ వెనక ఏయే శక్తులున్నాయో వెల్లడి కాదు. మన దేశంలో దశాబ్దాలుగా కొనసాగుతున్న పోలింగ్ ప్రక్రియను చూసి ముచ్చటపడి అనేక దేశాలు దాన్ని అనుసరించటం మొదలెట్టాయి. ఎప్పటికప్పుడు అభివృద్ధి అవుతున్న కొత్త సాంకేతికతలతో ఎన్నికల ప్రక్రియ మరింత మెరుగ్గా, సాఫీగా సాగేందుకు ఎన్నికల సంఘం చర్యలు తీసుకుంటున్నది. మరి రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనాకు ఏమైంది? ఈ ఉదంతాల సమయంలో ఎందుకాయన మౌనంగా ఉండిపోయారు? కేంద్ర ఎన్నికల సంఘం జోక్యం చేసుకునేవరకూ తన వంతుగా చేసిందేమిటి? ఎన్నికల రోజున మాచర్ల వైఎస్సార్ కాంగ్రెస్ అభ్యర్థి పిన్నెల్లి రామకృష్ణారెడ్డి 8 గ్రామాల్లో టీడీపీ రిగ్గింగ్ చేస్తున్న వైనం గురించి వరసగా రెండు లేఖలు రాసినా, అలాంటిచోట్ల రీపోలింగ్ నిర్వహించాలని డిమాండు చేసినా మీనా ఎందుకు జవాబీయలేదు? ఈవీఎం పగలగొట్టినట్టు టీడీపీ ఒక వీడియో విడుదల చేసేవరకూ ఆ ఉదంతం తెలియనట్టే ఎందుకున్నారు? 23 గంటల నిడివికిపైగా ఉన్న ఆ వీడియోలో ముందూ వెనకా ఏం జరిగిందో అసలు ఎన్నికల సంఘం చూసిందా? చూస్తే ఎందుకు మౌనం వహించింది? అన్నిటికన్నా చిత్రమేమంటే ఆరోపణలు ఎదుర్కొంటున్న పిన్నెల్లి అదే రోజు రీ పోలింగ్ కోసం డిమాండ్ చేయగా నాలుగైదు రోజుల తర్వాత ఆ వీడియో బయటపెట్టిన టీడీపీ ఇంతవరకూ రీపోలింగ్ కోరనేలేదు. వెబ్‌కాస్టింగ్ మొత్తం టీడీపీ ముఠా నియంత్రణలో ఉందన్న ఆరోపణలపై ఎన్నికల సంఘం నోరు మెదపటం లేదు.

ఇంత బరితెగింపుతో దేశంలో ఎక్కడా ఎప్పుడూ ఎన్నికలు జరగలేదు. తన బాధ్యతేమిటో, కర్తవ్యేమిటో మరిచి తోకపట్టుకుని పోయే చందంగా నిస్సిగ్గుగా వ్యవహరిస్తున్న ఎన్నికల సంఘం ఇప్పటికైనా మౌనం వీడాలి. నర్సరావుపేట పరిధిలోనే కాదు... ఇతర నియోజకవర్గాల్లోనూ ఈవీఎంలు ధ్వంసం చేసిన ఉదంతాలు వెల్లడయ్యాయి. మంత్రి అంబటి రాంబాబు కొన్నిచోట్ల రీపోలింగ్ కోరారు. వీటన్నిటికీ జవాబు రావాలి. సంజాయిషీ ఇవ్వాల్సిన స్థానంలోవున్నవారు మూగనోము పడితే అనుమానాలు మరింత బలపడతాయి. కౌంటింగ్ ప్రక్రియ సక్రమంగా సాగుతుందా అన్న సందేహాలు తలెత్తుతాయి. కేంద్ర ఎన్నికల సంఘం జోక్యం చేసుకుని ఈ తలకిందుల వ్యవస్థను నిటారుగా నిలబెట్టాలి. ప్రజాస్వామ్యంపై ప్రజలకుండే విశ్వసనీయతను కాపాడాలి.

మహోన్నత వ్యక్తిత్వం... మేరునగ ధీరత్వం!

అభిప్రాయం



డాక్టర్ నందమూరి లక్ష్మీపార్వతి

'న నిశ్చితాత్ విరమంతి ధీరాః' అని భర్తృహరి చెప్పినట్లు... తలపెట్టిన కార్యాన్ని సాధించే వరకు ధీరులు తమ ప్రయత్నాలను ఎన్ని ఇబ్బందులెదురైనా నిలబడి సాధిస్తారు. వెనక్కు తగ్గరు. అందుకు ఉదాహరణ ఎన్టీఆర్. ఆశయం లేని అడుగులు బురద గుంటలో ప్రయాణం లాంటివనీ, గమ్యం చేరవనీ నమ్మి ఆచరించిన వ్యక్తుల్లో ఎన్టీఆర్ అగ్రస్థానంలో నిలుస్తారు. గొప్ప మనసున్న తండ్రి ఆయన. భార్యను ప్రేమించి గౌరవించే మహోన్నత సంస్కారం ఆయనది. పేద ప్రజల్ని కన్న బిడ్డల్లాగా పరిపాలించారు. అవినీతి రహితమైన సమాజాన్ని ఏర్పరచటానికి చిత్తశుద్ధితో పాటుపడ్డారు. అందుకే – మరణించిన తరువాత కూడా ఆ మహోన్నత వ్యక్తి నేటికీ జీవించే ఉన్నారు.

తెలుగు రాష్ట్రంలో కృష్ణా జిల్లా నిమ్మకూరు గ్రామంలో 1923 మే 28న జన్మించిన మహానేత ఎన్టీఆర్ గారికి నేటికి 101 సంవత్సరాలు. అయినా ఇప్పటికీ ఆయన దివ్య తేజస్సు తగ్గలేదు. మరణించి 28 సంవత్సరాలు అయినా ఎన్టీఆర్ పేరు అభిమానుల గుండెల్లో మారు మ్రోగుతూనే వుంది. ఆ రూపం అలరిస్తూనే ఉంది. ఆయన సినిమాలు, రాజకీయ జీవితంలో మాదిరిగానే ఆయన వ్యక్తిత్వంలోనూ అనేకానేక విశేషాంశాలు ఇమిడి ఉన్నాయి.

ఎన్టీఆర్ గారిలో మొదటి నుండి కూడా ఇచ్చిన మాటకు కట్టుబడటం, అనుకున్నది సాధించేవరకు వెనుకడుగు వేయకపోవటం అనేవి ప్రత్యేక గుణాలు. ఇవే ఆయనను సినీ, రాజకీయ రంగాల్లో విజయపథం వైపు నడిపించాయి.

'న నిశ్చితాత్ విరమంతి ధీరాః' అని భర్తృహరి చెప్పినట్లు... తలపెట్టిన కార్యాన్ని సాధించే వరకు ధీరులు తమ ప్రయత్నాలను ఎన్ని ఇబ్బందులెదురైనా నిలబడి సాధిస్తారు. వెనక్కు తగ్గరు. ఆ లక్షణం ఎన్టీఆర్ తర్వాత మళ్లీ ఇప్పుడు జగన్ మోహన్ రెడ్డిలో చూశాను. ముక్కుసూటిగా పోయే ఇలాంటి నాయకులకు శత్రువులు కూడా ఎక్కువే అనడటానికి వీరిద్దరూ ఎదుర్కొన్న సంఘటనలే సాక్ష్యం.



నేడు ఎన్టీఆర్ 101వ జయంతి

ఎన్టీఆర్ జయంతి సందర్భంగా – ఆయన భార్యగా అత్యంత సన్నిహితంగా మెలిగిన వ్యక్తిని కనుక ఆయన వ్యక్తిత్వాన్ని తెలియచేసే ప్రధానమైన రెండు మూడు సంఘటనలు వివరిస్తాను. ఒక్క మా పెళ్లి విషయంలోనే తీసుకుంటే పెళ్లికి ముందు– తర్వాత ఎన్టీఆర్ ఎన్నో రకాల సమస్యల్ని ఎదుర్కొన్నారు.

తిరుపతిలో జరిగిన 'మేజర్ చంద్రకాంత్' సినిమా వేడుకల్లో ఎన్టీఆర్ మా వివాహ ప్రకటన చేయగానే చంద్రబాబు ఆ ప్రకటన ప్రజల్లోకి వెళ్లకూడదని మైకులాపించి, లైట్లు ఆర్పించారు. అయినా ఆయన మరుసటి రోజు ఇంట్లోనే మీడియా సమావేశం ఏర్పాటు చేసి మా పెళ్లిని ప్రకటించి మరీ వివాహం చేసుకున్నారు.

అక్కడ నుండి నన్ను ప్రజల్లోకి తీసుకెళ్లకుండా చేయటానికి చంద్రబాబు, కుటుంబ సభ్యులు కలిసి ఎన్నో పన్నాగాలు పన్నారు. ఎన్టీఆర్ ధైర్యంగా నన్ను అందరి ముందుకు తీసుకెళ్లి నా స్థానం ఏమిటో సగర్వంగా ప్రకటించారు. ప్రతి అవమానంలో అండగా నిలబడి మాకు కీడు చేస్తున్న వారందరినీ ఎదిరించారు. చీకటి రాజకీయాలకు అలవాటు పడ్డ చంద్రబాబు లాంటి వ్యక్తికి ఆయనొక సవాలుగా నిలబడ్డారు. పెద్ద వయస్సులో ఒంటరితనంతో బాధపడుతున్న ఎంతోమందికి మా వివాహం ఒక మార్గం చూపించింది. దాని మీద కొన్ని ఆర్గనైజేషన్స్ ఏర్పడటం కూడా ఒక విశేషమే!

మరో సంఘటన – 1994 ఎన్నికల ప్రచారంలో నన్ను ఇంట్లో ఉంచమని అనేకమంది ద్వారా చెప్పించారు. ఎస్.వి రమణ లాంటి అన్యాయవాదుల్ని ఇంటికి పంపి ఈ పెళ్లి చెల్లదని కూడా వాదించేటట్లు చేశారు. ఎన్టీఆర్ దేనికీ చలించలేదు. తన ఆలోచన మార్చుకోలేదు. నన్ను తీసుకునే ఎన్నికల ప్రచారానికి వెళ్లారు. స్వయంగా 216 స్థానాలు, మిత్ర పక్షాలకు మరో 34 స్థానాలు సంపాదించి రాజకీయ రంగంలో ఒక రికార్డు సాధించారు. మళ్లీ ఆ స్థాయి రికార్డును ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి తిరగరాశారు.

ఎన్టీఆర్ ముఖ్యమంత్రి పదవిని తమ అధికార దాహంతో లాగేయాలని కుట్రలు పన్నిన రామోజీ, చంద్రబాబు అందుకు నన్నే కారకురాలిగా చూపించారు. ఒక రాజ్యాంగేతర శక్తిగా నా ప్రాతను చిత్రీకరించి, నన్ను విడిచి పెడితేనే తిరిగి పదవి ఇస్తామని ప్రలోభపెట్టారు. ఇక్కడే ఎన్టీఆర్ గొప్ప వ్యక్తిత్వం మేరు పర్వతం లాగా కనిపిస్తుంది. ముఖ్యమంత్రి పదవిని వదులుకోవటానికి సిద్ధపడ్డారు కానీ భార్యను మాత్రం వదులుకోలేదు. పైగా వారికో సవాల్ విసిరారు. ''నా పార్టీ, నేను సాధించుకున్న పదవి నాకు తిరిగి ఇవ్వటమేమిటి? ధర్మబద్ధంగా వివాహం చేసుకున్న స్త్రీని బయటకు పంపించటం ఏమిటి? మీ భార్యల్ని అలా వదిలేస్తారా? నా భార్య తప్పు చేసిందని నిరూపించండి. బహిరంగంగా ఆమెను శిక్షిస్తాను'' అన్నారు. ఈ మాటలు ఆయన ఆత్మవిశ్వాసాన్ని, తనపై నమ్మకాన్ని నిలబెట్టాయి. ఎప్పటికప్పుడు వారి నిందల నుండి నన్ను గుండెల్లో పొదువుకొని కాపాడుకున్నారు ఆయన.

ఒక సందర్భంలో ఎన్టీఆర్ విలేకర్లతో మాట్లాడుతూ– ''రాజ్యం కోసం ఆ రాముడు తన భార్యను అడవులకు పంపేశాడు. కానీ ఈ రాముడు తన భార్య గౌరవం కోసం అధికారాన్నే వదులుకున్నాడు'' అన్నారు. ఇలాంటి నిశ్చితాభిప్రాయాలు ఎంతమంది మగవాళ్లలో ఉంటాయి?! చాలా తక్కువ మంది మాత్రమే కనిపిస్తారు.

ఎన్టీఆర్ గారి సదభిప్రాయాలను, ఆశయాలను అర్థం చేసుకోకపోగా అపార్థం చేసుకుని కుటుంబ సభ్యులు ఎంతో బాధించారు– వేధించారు– అవమానాల పాలు చేశారు. అయినా చివరి క్షణం వరకు ఆయన తన కుటుంబాన్ని ప్రేమిస్తూనే ఉన్నారు. ప్రతిరోజూ వాళ్ల ఇంటికి స్వీట్లూ, ఫ్రూట్లూ పంపిస్తూనే వచ్చారు. వాళ్లు అప్పుడప్పుడూ వచ్చి డబ్బు పట్టుకుని పోతూ ఉండేవారు. మళ్లీ బయట మాత్రం వాళ్లంతా చంద్రబాబుతో చేతులు కలపడం! ఏది ఏమయినా గొప్ప మనసున్న తండ్రి ఎన్టీఆర్. భార్యను ప్రేమించి గౌరవించే మహోన్నత సంస్కారం ఆయనది. పేద ప్రజల్ని కన్న బిడ్డల్లాగా పాలించినవారు. అవినీతి రహితమైన సమాజాన్ని ఏర్పరచటానికి ప్రయత్నించి భంగపడ్డ ధీరుడు.

ఎన్ని రకాలుగా చంద్రబాబు, రామోజీలు కుట్రలు పన్ని అవమానించినా, పదవి లాగేసినా తల వంచకుండా తన చివరి క్షణం వరకు ఆయన తన పోరాటాన్ని కొనసాగించారే తప్ప ఎక్కడా కాంప్రమైజ్ కాలేదు. ''స్థిరత్వం, ధీరత్వం, ఉచితజ్ఞతా, ప్రియ వక్తృత్వం– చత్వారో సహజాగుణాః అభ్యాసే న లభ్యంతే'' అని పెద్దలు చెప్పినట్లు ఈ లక్షణాలు ఆయన పుట్టుకతోనే వచ్చాయి. చివరి వరకు ఆ గుణాలు నిలబెట్టుకున్న ధీర గంభీరుడు ఎన్టీఆర్.

నిబద్ధత లేని జీవితం ముళ్ల చెట్టు లాంటిది. ఎవరికీ ఉపయోగం ఉండదు. ఆశయం లేని అడుగులు బురద గుంటలో ప్రయాణం లాంటివి. గమ్యం చేరవు. ఇది నమ్మి ఆచరించిన వ్యక్తుల్లో ఎన్టీఆర్ అగ్రస్థానంలో నిలుస్తారు. అందుకే మరణించి కూడా నేటికీ మన మధ్య జీవించే ఉన్నారు.

వ్యాసకర్త ఎన్టీఆర్ సతీమణి

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ఉద్యోగ సంతృప్తి



7 నెలలు, ఇండియాకు 4 పర్యటనలు, 60కి పైగా ఇంటర్వ్యూలు! నరేంద్ర మోదీకి అత్యంత సన్నిహితులైన వ్యక్తులతో మాట్లాడాను. ఆయన దర్జీ, ఆయన వ్యక్తిగత కార్యదర్శి, ఆయన తరఫు వ్యాఖ్యాతలు, ఆర్థిక సలహా దారులు, ఇంకా చాలామందితో సంభాషించాను. ఈ 'లవ్ ఆఫ్ లేబర్' మరికొద్ది రోజుల్లో ధ్వనించబోతోంది. (తన 8 భాగాల పాడ్‌కాస్ట్ సిరీస్ 'ది మోదీ రాజ్' గురించి).

– అవంతికా చిల్కోటి, పాడ్‌కాస్ట్ హోస్ట్

సాకు మాత్రమే



పోలైన ఓట్ల కచ్చితమైన సంఖ్యను వెల్లడించే అధికారం తమకు చట్ట ప్రకారం లేదని ఎన్నికల సంఘం చెబుతోంది. అయితే ఇప్పటికే 5 రాష్ట్రాల్లోని ఎన్నికల సంఘం కార్యాలయాలు కచ్చితమైన సంఖ్యను వెల్లడించాయి. అంటే ఓటింగ్ శాతాన్ని బహిర్గతం చేయకుండా ఈసీని ఆపుతున్నది చట్టం కాదన్నమాట!

– ఆయుష్ తివారీ, రిపోర్టర్

అంత డబ్బు వస్తేనా..!



లక్ష కోట్లు ఒక్కసారిగా వచ్చిపడుతుంటే ఎలా ఖర్చు చేయాలి? వ్యక్తుల లాగే ప్రభుత్వం కూడా! మొదట : అవసరాలకు ఖర్చుపెట్టడం. రెండు : అప్పులు తీర్చడం. మూడు : పెట్టుబడి పెట్టడం. ఇదీ వరస. ఆర్బీఐ నుండి తనకు వస్తున్న లక్ష కోట్ల రూపాయలను ప్రభుత్వం ఇలానే చేయబోతోంది. నేనైతే మొదట నా అప్పులన్నీ తీర్చేసుకుంటాను. – మోనికా హలన్, మనీ అడ్వైజర్

స్వయంకృతాపరాధం



మెక్సికో గత రెండు వారాలుగా తన చరిత్ర లోనే అత్యంత దారుణమైన వేడి గాలులతో ఉక్కిరిబిక్కిరి అవుతోంది. ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో 45 డిగ్రీల నుంచి పెరుగుతున్నాయి. వచ్చే వారం రోజుల్లో ఈ వేడి విజృంభించవచ్చు. భూతాప పర్యవసానాలు మొదలైనట్లేనా?!

– కాలిమ్ మెకార్తీ, వాతావరణ నిపుణుడు, క్యాలిఫోర్నియా

'నీటి' మేడలు!



ద్వారకా ఎక్స్‌ప్రెస్‌వే లోని కొన్ని సెక్టార్‌లు చిత్తడి నేలలు. అయితే డెవలపర్‌లు అక్కడ ఎత్తైన అపార్ట్‌మెంట్‌లు నిర్మించారు. సెక్టార్–107లోని ప్రాజెక్టు అయితే నీటిలో నిలబడి ఉంది. ఫిబ్రవరి 22న చింటెల్స్ ప్యారడిసో ప్రాజెక్టులో రెండు చోట్ల నేల కుంగిపోయిన ప్రాంతం ఇదే! – ఉదిత్ భండారి, సోషల్ కామెంటేటర్

ఇన్ బాక్స్

పేరుకే నిషేధం

ఆరోగ్యానికి హానికరంగా మారిన గుట్కా తయారీ, క్రయ విక్రయాల నిషేధాన్ని మరో ఏడాది పాటు పొడిగిస్తూ తెలంగాణ ప్రభుత్వం ఫుడ్ సేఫ్టీ విభాగం ఉత్తర్వులు జారీ చేసింది. 2025 మే 24 వరకు ఈ నిబంధనలు అమల్లో ఉంటాయని పేర్కొంది. అయితే తెలంగాణతోపాటు మరికొన్ని రాష్ట్రాలు గుట్కా విక్రయాలను నిషేధించినప్పటికీ... ఇప్పటికీ క్రయవిక్రయాలు జరుగుతూనే ఉన్నాయి.

'ఆహార భద్రత, ప్రమాణాల చట్టం–2011' ప్రకారం పొగాకు ఉత్పత్తులపై 2012 నుంచి పలు రాష్ట్రాలు వాటిని నిషేధించడం మొదలుపెట్టాయి. ఉమ్మడి రాష్ట్రంలో ఏపీ ప్రభుత్వం 2013 జనవరి 9న గుట్కా ఉత్పత్తులను నిషేధించింది. ఏటా నిషేధం కొనసాగించేలా గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. అయితే గుట్కాను మాత్రమే నిషేధించడంతో పొగాకుతో తయారయ్యే పాన్‌మసాలా ఉత్పత్తులు మార్కెట్‌లో బాగా పెరిగాయి. దీంతో 2014 జనవరి 9న సమగ్రంగా ఆదేశాలు ఇచ్చింది ప్రభుత్వం. నికోటిన్, పొగాకు ఆనవాళ్లు ఉండే నోటి ద్వారా తీసుకునే అన్ని ఉత్పత్తులపైనా నిషేధం విధించింది. ప్రస్తుత తెలంగాణలోనూ ఇవే ఆదేశాలు అమలవుతున్నాయి.

గుట్కా, పాన్ మసాలాలపై నిషేధాన్ని సవాల్ చేస్తూ తెలంగాణ హైకోర్టులో 160 పిటిషన్లు దాఖలు కాగా, 2021 నవంబర్‌లో వీటన్నింటిని న్యాయస్థానం కొట్టివేసింది. ఆ తర్వాత వ్యాపారులు సుప్రీం కోర్టును ఆశ్రయించి నిషేధంపై స్టే తెచ్చుకున్నారు. గుట్కా క్రయవిక్రయాలు జరిపే వారిపై పోలీసులు కేసులు పెట్టడాన్ని తెలంగాణ హైకోర్టులోనూ సవాల్ చేశారు. దీంతో సరుకులు సీజ్ చేయొద్దనీ, గుట్కా ఉత్పత్తుల తయారీ, సరఫరా, విక్రయదారులపై కేసులు పెట్టవద్దనీ హైకోర్టు పోలీసులకు సూచించింది. తమిళనాడు, ఢిల్లీ, ఆంధ్రప్రదేశ్‌ల్లోనూ దాదాపు ఇదే పరిస్థితి.

– ఫిరోజ్ ఖాన్, జర్నలిస్ట్

రిఫరీ తొండి అయినా... సగటు ఓటరే విజేత!

విశ్లేషణ



పి. విజయబాబు

దేశంలో ప్రతిష్ఠాత్మక మూల స్తంభాలలో ఒకటైన ఎన్నికల కమిషన్ తన స్ఫూర్తిని కోల్పోతోందా? 'ఫ్రీ అండ్ ఫెయిర్ ఎలక్షన్స్' (స్వేచ్ఛగా, పారదర్శకంగా) ఎన్నికలు నిర్వహించటం భారత ఎన్నికల సంఘం కర్తవ్యం. ఇది ప్రజాస్వామ్య స్ఫూర్తికి అత్యంత అవశ్యం. కానీ ఆ కర్తవ్యం గాడి తప్పితే? ఆ స్ఫూర్తి మసకబారితే? ఫలితం ఏమవుతుంది?

ప్రస్తుత ఎన్నికల కమిషన్ పోకడలు చూస్తే చాలా ఆందోళనకరంగా ఉన్నాయని విమర్శకులు అంటున్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ (ఈడీ), సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) సంస్థల లాగే ఎన్నికల కమిషన్ కూడా అధికార పార్టీ చేతిలో కీలుబొమ్మగా మారిందని వినవస్తున్న విమర్శలకు అనేక సంఘటనలు ఊతమిస్తున్నాయి. ఎన్నికలు జరుగుతున్న వేళ విపక్షాల నుంచి కుప్పల కొద్దీ సాక్ష్యాధారాలతో సహా ఫిర్యాదులు అందుతున్నా ఈసీ నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించటం ఆశ్చర్యం కలిగిస్తోంది. అప్పుడప్పుడు ఈసీ పేపర్ టైగర్‌లా గాండ్రించడమే తప్ప కఠిన చర్యలకు ఉపక్రమిస్తున్న దాఖలాలు కనిపించడం లేదు. ఇందుకు తాజాగా ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికల సమయంలో పలుచోట్ల జరిగిన అల్లర్లను ఉదాహరణగా చెప్పవచ్చు. ఆశ్చర్యం ఏమిటంటే, అల్లర్లు జరిగిన అన్ని ప్రాంతాల్లోనూ కమిషన్ శుద్ధపూసలంటూ ప్రత్యేకంగా నియమించిన పోలీసు అధికారులు ఉన్న ప్రాంతాలే కావడం గమనార్హం!

కూటమి, అందులో భాగస్వామురాలైన బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి ఇచ్చిన అధికార్ల చిట్టాను కించిత్తు వెరపు లేకుండా ఈసీ స్వీకరించి తదనుగుణంగా వ్యవహరించడం ప్రజాస్వామ్య వాదులను దిగ్భ్రాంతికి గురిచేస్తోంది.

రౌడీ మూకలు రెచ్చిపోతుంటే పోలీసులే నిర్లిప్తంగా వ్యవహరించటం, సాక్షాత్తూ పోలీసులే ఎమ్మెల్యే ఇంటిలోకి చొరబడి సీసీ కెమెరాలు పగలగొట్టడం, అటు పోలీసు వ్యవస్థ ప్రతిష్ఠను, ఇటు ఈసీ వ్యవస్థను దిగజార్చిందని చెప్పాలి. ఈసీ నిష్పాక్షికంగా వ్యవహరించకపోవడం, పాక్షిక దృష్టితో కొంతమంది కేసుల్లో పది రోజులు దాటిన తర్వాత క్రొంగొత్త సెక్షన్లను పొందుపరచడం గమనార్హం. ఎవరి ఆదేశాల మేరకు ఈసీ ఈ పనిచేస్తుందో చెప్పాలని సామాజికవేత్తలు డిమాండ్ చేస్తున్నారు. గతంలో టీఎన్ శేషన్ ఎన్నికల సంస్కరణలకు తెర తీసి తన నిక్కచ్చితత్వంతో చరిత్రలో మిగిలిపోయారు. 1977 పోస్ట్ ఎమర్జెన్సీ ఎన్నికల్లో ఈసీ వ్యవహరించిన తీరుకి యావత్ భారతదేశం జేజేలు పలికింది. వాజ్‌పేయి అనంతరం సరిగ్గా 25 ఏళ్ల తర్వాత 2014లో బీజేపీ మోదీ నేతృత్వంలో అధికారాన్ని కైవసం చేసుకున్నాక ఈసీ ప్రతిష్ఠ క్రమంగా మసకబారుతూ వచ్చిందని పరిశీలకులు అంటున్నారు.

గతంలో బ్యాలెట్ బాక్సులు ఉపయోగంలో ఉన్నప్పుడు కొన్ని సున్నిత ప్రాంతాల్లో పోలింగ్ బూత్‌ల స్వాధీనం, బ్యాలెట్ బాక్సుల్లో ఇంకు పోయడం, బాక్సులు ఎత్తుకెళ్ళిపోవడం వంటి సంఘటనలు జరిగేవి. అయితే ఈవీఎంలు వచ్చిన తరువాత ఈ అక్రమాలకు తెరపడ్డాయని చెబుతున్నా... ఎన్నికలు సజావుగా నిర్వహించవలసిన ఎన్నికల కమిషన్, సిబ్బంది, అందులో ప్రధానంగా పోలీసు వ్యవస్థ పక్షపాతంగా వ్యవహరిస్తే ఇక ఎన్నికలు సజావుగా ఎలా జరుగుతాయన్న ప్రశ్నలు ఇప్పుడు ప్రజాస్వామ్యవాదులను కలవరపెడుతున్నాయి. ఏకంగా బహిరంగంగా పోలీసులు, బాబు కూటమి కలసి తెగబడి అల్లర్లు ఆందోళనలు సృష్టిస్తే ఈసీ నిష్పాక్షికంగా వ్యవహరించకపోవడం దారుణం. ఢిల్లీకి వెళ్లి ఈసీకి ఫిర్యాదు చేస్తే తప్ప కనీస మాత్రం స్పందన లేదంటే వీళ్ళ చిత్తశుద్ధి ఎలాంటిదో గమనించవచ్చు.



ఇండియన్ పీనల్ కోడ్ (ఐపీసీ) సెక్షన్ 171 ప్రకారం ఓటర్లను ప్రలోభ పెట్టడం, భయపెట్టడం శిక్షార్హం. ప్రజా ప్రాతినిధ్య చట్టం 1950లోని సెక్షన్ 123 ప్రకారం భయపెట్టినా, ఓటర్లను ప్రలోభపెట్టినా కూడా శిక్షార్హమే! అయినా జాతీయస్థాయిలో అధికార పార్టీ అండ చూసుకొని అనేక చోట్ల ఈ శక్తులు పేట్రేగిపోతున్నాయి. అరాచకాలను గమనించిన భారత అత్యున్నత న్యాయస్థానం శాసన సభ, పార్లమెంటు సభ్యులపై నమోదయ్యే కేసులను సత్వరం విచారించి శిక్షించడానికి ప్రత్యేక కోర్టులు ఉండాలని ఆదేశించింది. ఫలితంగా తెలంగాణలో ఏర్పాటైన ప్రత్యేక కోర్టుకి 395 కేసులు బదిలీ అయ్యాయి. ఆశ్చర్యం ఏమిటంటే... ఇందులో కేవలం 14 కేసులకు మాత్రమే నామమాత్రపు శిక్ష పడింది. మిగతా వాటికి సాక్ష్యాధారాలు సరిగా లేవని కొట్టివేయడమైనది. అదీ పవర్ పాలిటిక్స్ అంటే! ఎన్నికల కమిషన్ ప్రకటనలు అయితే చాలా ఆర్భాటంగా ఉంటాయి. ఈసారి గతంలోలా కాదు చాలా కఠినంగా వ్యవహరిస్తాం... నిష్పాక్షికంగా వ్యవహరిస్తాం అంటూ ప్రకటనలు అయితే ఇస్తారు. అంతేనా? ఏకంగా ప్రజలను కూడా అంటే ఓటర్లను కూడా నిఘా వ్యవస్థలో భాగస్వాములను చేస్తాం అంటూ ఘనంగా 'సీ విజిల్ యాప్' రూపొందించారు. దీని ప్రకారం, ఎక్కడైనా అక్రమాలు జరుగుతున్నట్టు ఓటర్ ఫిర్యాదు చేస్తే ఫ్లయింగ్ స్క్వాడ్ 100 నిమిషాల్లో ఆ నియోజకవర్గ పరిధిలోని అధికారులకు సూచనలు ఇచ్చి తగు చర్యలు తీసుకుంటుంది. ఇది వినడానికి అయితే అద్భుతంగా ఉంది కానీ వాస్తవంలో జరిగిందేమిటి? అనేక చోట్ల ఎస్సీ, ఎస్టీ మహిళలు ఓట్ వేయడానికి వెళితే వాళ్ళని బెదిరించి, పరిగెత్తించడం పోలీసుల సమక్షంలో గూండాలు వ్యవహరించిన తీరు వీడియోల్లో రికార్డ్ అయింది. ఫిర్యాదులు చేసి రోజులు గడుస్తున్నా చర్యలు శూన్యం.

వాస్తవానికి ప్రజా ప్రాతినిధ్య చట్ట ప్రకారం పక్షపాతంగా వ్యవహరించే పోలీసులకు విధుల్లో కొనసాగే హక్కు లేదని, ఓటర్లను భయపెట్టే నేతలపై అనర్హత వేటు వేయాలన్న 'లా కమిషన్' సిఫార్సులు అమలు చేయాలి. కానీ కనుచూపు మేరలో అలాంటిదేమీ కనిపించడం లేదు. సుప్రీం కోర్టు త్రిసభ్య కమిటీ సూచించిన విధంగా మచ్చ లేనివారిని ఎన్నికల కమిషనర్లుగా నియమించాలి. కానీ ఇవన్నీ జరిగేదెప్పుడు? సగటు ఓటరుకు రక్షణ ఎప్పుడు? అయితే ఒకటి మాత్రం నిజం. భారత ప్రజాస్వామ్యంలో ఎన్నికల రణక్షేత్రంలో వీరులు సగటు ఓటరులే! వారి తీర్పుకు తిరుగులేదు. వారి పైన ఆంక్షలు తాత్కాలిక చంద్ర గ్రహణాల వంటివి. అంతిమంగా పున్నమి వెలుగులు జగన్మోహనంగా విస్తరించక మానవు.

రాజ్యాంగ న్యాయశాస్త్ర పట్టభద్రుడు

యశస్సే ప్రధానం!

'లోకం తనను గురించి ఏమనుకుంటున్నదో?' అనే ఆలోచనతో నిత్యం కలవరపడుతూ, లోకం దృష్టిలో మచ్చలేని మనిషిగా జీవితం గడపాలనుకునే వ్యక్తికి సుఖం ఉండదు. చేయని తప్పుకు నిందను భరించడం అంత సులువైన పని కాదు. నిప్పులా అంతరంగాన్ని అది అనుక్షణం దహించి వేస్తూ బాధకు గురిచేస్తూనే ఉంటుంది. పిల్లలమర్రి పినవీరన కవి తాను రచించిన 'జైమిని భారతము' కావ్యంలో అపవాదును పిడుగుపాటుతో సమానమైనదిగా పోల్చి చెప్పాడు. పిడుగుపాటు వంటి లోకాపవాద బాధ హృదయాన్ని తాకి గాయపరిచినపుడు, శ్రీరాముడంతటి అవతారపురుషుడు సైతం ఆ బాధకు తట్టుకోలేక విలవిల లాడాడు. 'పాపపంకిలమైన ఈ లోకంలో మళ్ళీ ఎక్కడ పుట్టవలసి వస్తుందో అన్న భయంతో ఒక యోగపురుషుడు మమకారాన్ని వదిలి ఒక్కడుగానే జీవితాన్ని గడపడానికి నిశ్చయించుకున్నట్లుగా, పిడుగుపాటు వంటిదైన లోకాపవాద భయం హృదయాన్ని ముక్కలు చేయగా, సాధ్వియైన సీతను దూరం చేసుకోవడానికి శ్రీరాముడు నిశ్చయించుకున్నాడు!'అని చెప్పాడు.

జ్యోతిర్మయం

మనిషిగా పుట్టి, గిట్టిన దానికి నిదర్శనంగా నిలిచి ఉండే యశస్సు, ఆ వ్యక్తి జీవితంలోని ఉన్నతమైన విలువలతో కూడిన సన్నివేశాలను, కరదీపికలు కాగలిగిన సందర్భాలను భావితరాలకు వెలిగించి చూపుతూ ఉంటుంది.

క. కావున యశోవిహీనులు
జీవన్మృతులగుటకేమి చెప్పగనిందల్
రావచ్చినచో దనువులె
పోవిడుతురు తొంటి భూమిభుజులట్లగుటన్.

'కనుక యశస్సే ప్రధానమైనది! యశస్సు లేని వారు జీవించి ఉండి కూడా మరణించినవారితో సమానమే! ఆ కారణం చేత, అపనింద పాలవడం అనే పరిస్థితి ఎదురైతే ప్రాణం పణంగా పెట్టి అయినా సరే దాని నుండి బయటపడడానికి భూమినేలిన పూర్వ ప్రభువులు ప్రయత్నించారు!' అని జైమిని భారతము, షష్ఠాశ్వాసం, 'శ్రీరామచరిత్రం' లోని పై పద్యంలో శ్రీరాముడి మాటలు, మనుషులు యశోకాములై జీవించడంలోని గొప్పదనాన్నీ, ఆవశ్యకతనూ తెలియజెప్పాయి.

– భట్టు వెంకటరావు

గ్రహం అనుగ్రహం శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, వైశాఖ మాసం, **తిథి:** బ.పంచమి ప.3.09 వరకు, తదుపరి షష్ఠి, **నక్షత్రం:** ఉత్తరాషాఢ ఉ.9.43 వరకు, తదుపరి శ్రవణం, **వర్జ్యం:** ప.1.32 నుండి 3.04 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.05 నుండి 8.56 వరకు, తదుపరి, రా.10.49 నుండి 11.34 వరకు, **అమృతఘడియలు:** రా.10.44 నుండి 12.16 వరకు; **రాహుకాలం :** ప.3.00, నుండి 4.30 వరకు, **యమగండం :** ఉ.9.00 నుండి 10.30 వరకు, **సూర్యోదయం :** 5.29, **సూర్యాస్తమయం :** 6.25.


క్లుప్తంగా...

టీఎస్‌పీబీ ఇక టీజీఎస్‌పీబీ

సాక్షి, హైదరాబాద్‌: రాష్ట్ర ప్రణాళికా మండలి పేరును తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా మండలిగా మారుస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ప్రస్తుతమున్న టీఎస్‌పీబీని ఇకపై టీజీఎస్‌పీబీగా మారుస్తూ ప్రణాళిక శాఖ కార్యదర్శి అహ్మద్‌ నదీమ్‌ సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. ప్రణాళికా మండలి వైస్‌ చైర్మన్‌ చేసిన సిఫారసు మేరకు ఈ సంస్థ పేరును టీజీఎస్‌పీబీగా మార్చినట్లు ఆయన ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

రిజర్వేషన్ల పెంపు గడువు జూన్‌ 10

- ఎమ్మార్పీఎస్‌ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ



పంజగుట్ట (హైదరాబాద్‌): జూన్‌ 10వ తేదీలోపు రిజర్వేషన్ల అంశంపై నిర్ణయం తీసుకోకపోతే బీసీ, ఎస్సీ, ఎస్టీల ఐక్య ఉద్యమం రేవంత్‌కు రాజకీయ ఉరితాడుగా మారుతుందని ఎమ్మార్పీఎస్‌ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ హెచ్చరించారు. ఆయన సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు పెంచే అవకాశం ఉన్నా రేవంత్‌ రెడ్డి ప్రభుత్వం పెంచడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌ అధికారంలోకి రాకముందు చేవెళ్ల ఎస్సీ, ఎస్టీ సభలో కాంగ్రెస్‌ జాతీయ అధ్యక్షుడు ఖర్గే సమక్షంలో ఎస్సీలకు 18, ఎస్టీలకు 12 శాతం రిజర్వేషన్లు పెంచుతామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అధికారంలోకి రాగానే కులగణన చేపట్టి, తద్వారా బీసీ రిజర్వేషన్లు పెంచుతామని కామారెడ్డి ఓబీసీ డిక్లరేషన్‌ సభలో హామీ ఇచ్చారని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల జనాభాకు తగ్గట్టుగా రిజర్వేషన్లు ఇవ్వకపోయినా.. రాష్ట్రంలో 10 శాతం ఈడబ్ల్యూఎస్‌ రిజర్వేషన్లను ఎలా అమలు చేస్తారని ప్రశ్నించారు.

నీటిపారుదల సీనియర్‌ కన్సల్టెంట్‌ రంగారెడ్డి మృతి

- సంతాపం తెలిపిన సీఎం రేవంత్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్‌: ఉమ్మడి మహబూబ్‌నగర్‌ జిల్లా సాగునీటి ప్రాజెక్టుల సీనియర్‌ కన్సల్టెంట్, నీటిపారుదల శాఖ రిటైర్డ్‌ ఎస్‌ఈ ఎస్‌.రంగారెడ్డి సోమవారం నగరంలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. గతంలో ఆయన మాజీ సీఎం కేసీఆర్‌కు ఓఎస్డీగా సేవలందించారు. ప్రధానంగా పాలమూరు– రంగారెడ్డి ప్రాజెక్టు నిర్మాణ పనుల్లో కీలకపాత్ర పోషించారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ ప్రభుత్వం ఉమ్మడి మహబూబ్‌నగర్‌ జిల్లాకు చెందిన కల్వకుర్తి, నెట్టెంపాడు, రాజీవ్‌ బీమా, ఇతర పెండింగ్‌ ప్రాజెక్టులను సత్వరంగా పూర్తి చేయాలని నిర్ణయం తీసుకుంది. ఇందుకు రంగారెడ్డి సేవలను వినియోగించుకోవడానికి ఆయన్ను సీనియర్‌ కన్సల్టెంట్‌గా నియమిస్తూ ఈనెల 14న ఉత్తర్వులు జారీచేసింది. ఆయన బాధ్యతలు స్వీకరించాల్సి ఉంది. ఈ లోపే ఆయన కాలు విరగడంతో నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందారు. మంగళవారం జూబ్లీహిల్స్‌ మహాప్రస్థానంలో అంత్యక్రియలు జరగనున్నాయని కుటుంబ సభ్యులు వెల్లడించారు. ఆయనకు భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలున్నారు. కాగా, రంగారెడ్డి మృతి పట్ల సీఎం రేవంత్‌రెడ్డి సంతాపం తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించాలని భగవంతుడ్ని ప్రార్థించారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

- వైర్లు తెగిన విషయాన్ని చెప్పినా పట్టించుకోని ట్రాన్స్‌కో సిబ్బంది



లతీఫ్‌ మృతదేహం

రుద్రూర్‌: విద్యుత్‌ శాఖ ఉద్యోగుల నిర్లక్ష్యానికి ఓ నిండు ప్రాణం బలైంది. నిజామాబాద్‌ జిల్లా రుద్రూర్‌ మండలంలోని రాయకూర్‌ క్యాంపు శివారులో ఈ ఘటన జరిగింది. ఆదివారం సాయంత్రం బలమైన గాలులతో కూడిన వర్షం పడటంతో రాయకూర్‌ క్యాంపు శివారులో చెట్టు కూలి విద్యుత్‌ స్తంభంపై పడింది. దీంతో వైర్లు తెగి పొలంలో పడ్డాయి. ఈ విషయాన్ని పొలం యజమాని విద్యుత్‌ శాఖ సిబ్బంది దృష్టికి తీసుకువెళ్లినా మరమ్మతులు చేపట్టలేదు. సోమవారం లతీఫ్‌ (29) అనే ఉపాధి కూలి, కాలువ పూడికతీత పనులకు వెళ్లి తిరిగి వస్తుండగా పొలంలో పడి ఉన్న విద్యుత్‌ వైరు తగిలి షాక్‌కు గురై అక్కడికక్కడే మరణించాడు. ట్రాన్స్‌కో సిబ్బంది మరమ్మతులు చేపట్టకపోవడంతో పాటు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోనే ఈ ప్రమాదం జరిగిందని మృతుడి బంధువులు ఆరోపిస్తున్నారు. ఉదయం పనులకు వెళ్లే సమయంలో విద్యుత్‌ సరఫరా లేదని, వైర్లు బిగించకుండానే విద్యుత్‌ ఎందుకు సరఫరా చేశారని ప్రశ్నిస్తున్నారు. కాగా, బాధిత కుటుంబానికి పరిహారం అందేలా చూస్తామని ట్రాన్స్‌కో ఏడీ రవికుమార్‌ హామీ ఇచ్చారు. రుద్రూర్‌ సీఐ జయేశ్‌రెడ్డి, ఎస్సై అప్పారావు సంఘటనాస్థలాన్ని పరిశీలించారు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

ఎమ్మెల్సీ పోలింగ్‌ 72.37%



ఓటు వేస్తున్న రిటర్నింగ్‌ అధికారి, నల్లగొండ కలెక్టర్‌ హరిచందన



నల్లగొండ పట్టణంలో ఓటు వేయడానికి బారులుతీరిన ఓటర్లు

▶ మొదటి పేజీ తరువాయి

జూన్‌ 5న జరగనుంది. ఈ ఉప ఎన్నికల బరిలో 52 మంది అభ్యర్థులు ఉండటంతో బ్యాలెట్‌ పేపర్‌కూడా భారీగానే ఉంది. దీంతో కౌంటింగ్‌ ప్రక్రియ మూడు రోజులపాటు కొనసాగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

గతంలో కంటే తగ్గిన పోలింగ్‌

మూడు ఉమ్మడి జిల్లాల పరిధిలోని 12 కొత్త జిల్లాల్లో గతంలో జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో నమోదైన పోలింగ్‌ శాతం కంటే ఈసారి పోలింగ్‌ శాతం తగ్గిపోయింది. 2021 ఎన్నికల్లో 5,05,565 మంది ఓటర్లుగా నమోదు చేసుకోగా అందులో 3,85,996 మంది (76.35 శాతం) ఓటువేశారు. ఈసారి 4,63,839 మంది మాత్రమే ఓటు నమోదు చేసుకున్నారు. ఈసారి పోలింగ్‌ 72.37 శాతం నమోదైంది. నల్లగొండ సమీపంలోని దుప్పపల్లి వేర్‌ హౌజింగ్‌ గోదాముల్లో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌ రూమ్‌ల్లో బ్యాలెట్‌ బాక్సులను భద్రపరుస్తున్నారు. మూడు ఉమ్మడి జిల్లాల పరిధిలో 605 పోలింగ్‌ కేంద్రాల్లోని బ్యాలెట్‌ బాక్సులన్నింటినీ నల్లగొండకు తరలించే ప్రక్రియ సోమవారం అర్ధరాత్రి తరువాత కూడా కొనసాగింది. స్ట్రాంగ్‌ రూమ్‌ల వద్ద మూడంచెల భద్రత ఏర్పాటు చేశారు.

నార్కట్‌పల్లిలో స్వతంత్ర అభ్యర్థి ధర్నా

పోలింగ్‌ సందర్భంగా నార్కట్‌పల్లిలో కాంగ్రెస్‌ కార్యకర్తలకు భోజన ఏర్పాట్లు చేసుకున్నామని చెబుతున్న దోకూరి ఫంక్షన్‌ హాల్‌ వద్దకు స్వతంత్ర అభ్యర్థి పాలకూరి అశోక్‌గౌడ్‌ తన అనుచరులతో అక్కడికి వెళ్లారు. కాంగ్రెస్‌ కార్యకర్తలు డబ్బులు పంచుతున్నారని ఆరోపించారు. ఈ సందర్భంగా అశోక్‌ అనుచరులు వీడియో తీస్తుండగా తోపులాట జరిగింది. దీంతో తనపై కాంగ్రెస్‌ కార్యకర్తలు దాడిచేశారని నార్కట్‌పల్లి పోలీస్‌ స్టేషన్‌ ముందు ధర్నాకు దిగారు. కాగా, నకిరేకల్‌లోని జడ్పీ హైస్కూల్‌లో పోలింగ్‌ కేంద్రంలో ఓ వికలాంగురాలు తనకు ఓటు వేసేందుకు వీల్‌ చైర్‌ అందుబాటులో పెట్టలేదని నిరసన తెలిపారు.

ప్రశాంతంగా పోలింగ్‌ : రిటర్నింగ్‌ అధికారి దాసరి హరిచందన

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక పోలింగ్‌ ప్రశాంతంగా జరిగిందని రిటర్నింగ్‌ అధికారి, నల్లగొండ జిల్లా కలెక్టర్‌ దాసరి హరిచందన తెలిపారు. ఉదయం కొంత మందకొడిగా ప్రారంభమైనప్పటికీ ఆ తర్వాత ఓటర్లు పెద్ద ఎత్తున పోలింగ్‌ కేంద్రాలకు తరలివచ్చి ఓటేశారన్నారు. ప్రత్యేకించి మహిళలు అధిక సంఖ్యలో ఓటు హక్కును వినియోగించుకున్నారని పేర్కొన్నారు. సాయంత్రం 4 గంటల వరకు అత్యధికంగా ములుగు జిల్లాలో 74.54 శాతం, అత్యల్పంగా ఖమ్మం జిల్లాలో 65.54 శాతం పోలింగ్‌ నమోదైందని చెప్పారు.

సాయంత్రం 4 గంటల వరకు నమోదైన పోలింగ్‌

జిల్లా	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	పోలింగ్‌ శాతం
సిద్దిపేట	4679	3267	69.82
జనగామ	23419	16767	71.60
హనుమకొండ	43729	31141	71.21
వరంగల్‌	43812	31036	70.84
మహబూబాబాద్‌	34933	24285	69.52
ములుగు	10299	7677	74.54
జయశంకర్‌భూపాలపల్లి	12535	8669	69.16
భద్రాద్రి కొత్తగూడెం	40106	27294	68.05
ఖమ్మం	83879	54973	65.54
యాదాద్రి భువనగిరి	34080	22988	67.45
సూర్యాపేట	51497	36367	70.62
నల్లగొండ	80871	53981	66.75
మొత్తం	463839	318445	68.65

మతతత్వ శక్తులు మళ్లీ గెలిస్తే దేశానికే ముప్పు

కేరళలో జరిగిన ఐయూఎంఎల్‌ పుస్తకావిష్కరణలో సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్‌: లోక్‌సభ ఎన్నికల్లో గెలవడానికి మతతత్వ శక్తులు అత్యంత నీచమైన చర్యలకు దిగజారాయని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ఆరోపించారు. ఈసారి ఆ శక్తులు గెలిస్తే దేశానికి, రాజ్యాంగానికి రిజర్వేషన్లకు తీవ్ర ముప్పు తప్పదని ఆందోళన వ్యక్తం చేశారు. కేరళ ప్రజలను ఆదర్శంగా తీసుకొని దేశ ప్రజలంతా మతతత్వ శక్తులను ఓడించాలని పిలుపునిచ్చారు. కేరళలోని కోజికోడ్‌లో ఇండియన్‌ యూనియన్‌ ముస్లిం లీగ్‌ (ఐయూఎంఎల్‌) కేరళ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి సీఎం రేవంత్‌ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఐయూఎంఎల్‌ కేరళ శాఖ అధ్యక్షుడు సయ్యద్‌ సాదిక్‌ అలీ షిహాబ్‌ తంగల్‌ రాసిన స్నేహ సదస్‌ పుస్తకాన్ని ఆవిష్కరించి ప్రసంగించారు.



కేరళలోని కోజికోడ్‌లో జరిగిన కార్యక్రమంలో స్నేహ సదన్‌ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సీఎం రేవంత్‌ తదితరులు

దక్షిణాదిలో ఎన్డీయే కూటమికి 20 సీట్లు కూడా రావు..

రాజ్యాంగాన్ని మార్చడానికి, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల రిజర్వేషన్లను రద్దు చేయడానికే 400 ఎంపీ సీట్లు కావాలని బీజేపీ నేతలు అంటున్నారని రేవంత్‌ మండిపడ్డారు. దక్షిణాదిలో 120 సీట్లు ఉండగా కాంగ్రెస్‌ ఆధ్వర్యంలోని ఇండియా కూటమికే 100కిపైగా సీట్లు వస్తాయని ధీమా వ్యక్తం చేశారు. కేరళలో 20కి 20 ఎంపీ సీట్లను ఇండియా కూటమే గెలుచుకుంటుందని జోస్యం చెప్పారు. తమిళనాడులోనూ ఎన్డీయేకు ఒక్క సీటూ రాదన్నారు. మొత్తంగా దక్షిణాదిలో ఎన్డీయేకు 20 సీట్లు కూడా రావని రేవంత్‌ చెప్పారు. అలాగే గత ఎన్నికల్లో బీజేపీకి గుజరాత్‌లో 26కి 26, హరియాణాలో 10కి 10, ఢిల్లీలో 7కి 7, రాజస్తాన్‌లో 25కి 25 ఎంపీ సీట్లు గెలుచుకున్న బీజేపీకి ఈసారి సగానికి సగం సీట్లు తగ్గుతాయని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో పరిస్థితి ఇలా ఉన్నప్పుడు బీజేపీకి 400 సీట్లు ఎలా వస్తాయని రేవంత్‌ ప్రశ్నించారు. 'బీజేపీకి ఎక్కువ సీట్లు కావాలంటే ఇక పాకిస్తాన్‌కు వెళ్లి పోటీ చేయాల్సిందే' అని రేవంత్‌ ఎద్దేవా చేశారు. దేశ ప్రజలు మోదీకి రెండుసార్లు అవకాశం ఇస్తే ఆయన ప్రజల్ని మోసం చేశారని ఆరోపించారు. తన మోసాన్ని ప్రజలు గ్రహించారనే ఉద్దేశంతోనే మోదీ ఏదేదో మాట్లాడుతున్నారని విమర్శించారు. ప్రజలంతా ఈసారి మోదీని ఓడించడం ఖాయమన్నారు.

వానాకాలం దిగుబడుల ధరలపై అంచనాలు రెడీ

- 22 ఏళ్ల నెలవారీ ధరల నమూనాతో అంచనాలు రూపొందించిన వ్యవసాయ వర్సిటీ నిపుణులు

సాక్షి, హైదరాబాద్‌: వానాకాలం సీజన్‌ పంట దిగుబడులు వచ్చే నాటికి ధరలు ఎలా ఉండొచ్చనే అంశంపై ప్రొఫెసర్‌ జయశంకర్‌ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం వ్యవసాయ మార్కెటింగ్‌ ఇంటెలిజెన్స్‌ కేంద్రం అంచనాలు తయారు చేసింది. గత 22 ఏళ్లుగా రాష్ట్రంలోని ప్రధాన మార్కెట్లలో నెలవారీగా ఉన్న 21 రకాల పంట దిగుబడుల ధరలను నమూనాగా తీసుకొని వాటి ఆధారంగా తాజా ధరల అంచనాలను సిద్ధం చేసింది. ఈ విషయాన్ని వర్సిటీ అధికారులు చెబుతున్నారు. వాటి ఆధారంగా ఏయే పంటలు వేస్తే ఏ మేరకు దిగుబడులు వస్తాయో, వాటి ఆదాయంపై రైతులకు అవగాహన పెరుగుతుందనే ఉద్దేశంతో ఈ మేరకు కసరత్తు చేసినట్లు వివరిస్తున్నారు. పంట రకం, నాణ్యత, అంతర్జాతీయ ధరలు, ఎగుమతులు, దిగుమతులు పరిమితుల మూలంగా ధరల్లో మార్పులు ఉండవచ్చనే అభిప్రాయాన్ని వారు వ్యక్తం చేశారు. మరిన్ని వివరాలకు 9948780355, 9154828514 ఫోన్‌ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ప్రధాన పంటల ధరల అంచనాలు..

పంట	ధర (క్వింటాల్‌కు రూ. లలో)
వరి (సాధారణం)	2,203–2,350
వరి (గ్రేడ్‌–ఏ)	2,290–2,680
మొక్కజొన్న	2,150–2,350
జొన్న	2,200–2,500
సజ్జ	1,990–2,270
రాగి	2,710–3,120
పెసర	7,200–7,500
కంది	9,500–9,800
మినుములు	7,090–7,580
వేరుశనగ	6,500–6,800
సోయా చిక్కుడు	4,700–5,000
పొద్దుతిరుగుడు	3,800–4,000
ఆముదం	5,300–5,600
పత్తి	6,600–7,200
మిరప	14,500–16,500
పసుపు	10,500–11,000

వెయిటింగ్‌ హాళ్లు.. కెఫెటేరియాలు

▶ మొదటి పేజీ తరువాయి

అందుబాటులో ఉన్న భవనాలను బట్టి సౌకర్యాల కల్పనతో సంబంధం లేకుండా ఇరుకు గదుల్లో, వెలుతురు కూడా సరిగా రాని ప్రదేశాల్లో ఈ కార్యాలయాలు నడుస్తున్నాయి. ఈ నేపథ్యంలో గతంలోనే సొంత భవనాల నిర్మాణానికి ప్రతిపాదనలు వచ్చినప్పటికీ ఆచరణ సాధ్యం కాలేదు. అతి కష్టం మీద ఆదిలాబాద్‌ జిల్లాలోని బోథ్, మేడ్చల్‌ జిల్లా షామీర్‌పేట సబ్‌ రిజిస్ట్రార్‌ కార్యాలయాలు పూర్తికాగా, ఎన్నికల కోడ్‌ కారణంగా వాటి ప్రారంభం కూడా నిలిచిపోయింది. ఇక మిగిలిన 104 కార్యాలయాలు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. అయితే రాష్ట్ర వ్యాప్తంగా 52 చోట్ల సొంత భవనాల నిర్మాణానికి స్థల సేకరణ పూర్తయిందని, ఇటీవలి సమావేశం సందర్భంగా అధికారులు సీఎంకు వివరించారు. దీంతో ఆయా ప్రదేశాల్లో వెంటనే మోడల్‌ రిజిస్ట్రేషన్‌ కార్యాలయాల నిర్మాణాలను ప్రారంభించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. మిగతా 52 రిజిస్ట్రేషన్‌ కార్యాలయాలకు కూడా సరైన స్థలాలను అన్వేషించాలని ఆదేశించారు.

ఆదాయార్జన కేంద్రాలపై ప్రత్యేక దృష్టి

రిజిస్ట్రేషన్‌ కార్యాలయాల ఆధునీకరణ ప్రక్రియలో భాగంగా రంగారెడ్డి, మేడ్చల్, హైదరాబాద్, సంగారెడ్డి జిల్లాల్లోని కార్యాలయాలకు ప్రాధాన్యమివ్వాలని ముఖ్యమంత్రి రేవంత్‌ సూచించారు. ఎక్కువగా ఆదాయం వచ్చే కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంటుందని, రిజిస్ట్రేషన్‌ ప్రక్రియ ముగిసేంతవరకు ఆహ్లాదకర వాతావరణంలో ఆతిథ్యమిచ్చే విధంగా కార్పొరేట్‌ లుక్‌తో ఈ కార్యాలయాలను నిర్మించాలని చెప్పారు. వెయింటింగ్‌ హాల్‌తో పాటు తాగునీటి సౌకర్యాన్ని కల్పించాలని, కెఫెటేరియా లాంటి సదుపాయాలను కూడా ఏర్పాటు చేయాలని, ఆయా ప్రాంతాలను బట్టి అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించే విధంగా భవనాలను డిజైన్‌ చేయాలని ఆదేశించారు. ఆదాయాన్ని ఎక్కువగా తెచ్చిపెడుతున్న ఈ కార్యాలయాల్లో సిబ్బంది కొరతపై కూడా సీఎం దృష్టి సారించారు. ఆదాయంతో పాటు పని తక్కువగా ఉన్న కార్యాలయాల నుంచి పని ఎక్కువ ఉన్న చోట్లకు సిబ్బందిని సర్దుబాటు చేయాలని, వెంటనే ఈ ప్రక్రియను ప్రారంభించాలని ఆదేశించారు.

అమెరికాలో యాదాద్రి జిల్లా వాసి మృతి

- కారు ఢీకొట్టడంతో దుర్మరణం
- ఫ్లోరిడా రాష్ట్రంలో ఘటన



సౌమ్య

యాదగిరిగుట్ట: అమెరికాలోని ఫ్లోరిడా రాష్ట్రంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరి పల్లికి చెందిన గుంటిపల్లి సౌమ్య (24) మృతి చెందారు. కుటుంబ సభ్యులు, బంధువులు తెలిపిన వివరాల మేరకు.. యాదగిరిపల్లికి చెందిన గుంటిపల్లి కోటేశ్వర్, బాలమణి దంపతులకు కుమార్తె సౌమ్య, ఓ కుమారుడు సంతానం. కోటేశ్వర్‌ దంపతులు ఇంటి వద్దనే కిరాణా దుకాణం నడిపిస్తూ పిల్లల్ని చదివిస్తున్నారు. పిల్లలను ఉన్నత చదువులు చదివించాలనే ఉద్దేశంతో సౌమ్యను రెండేళ్ల క్రితం ఎంఎస్‌ చదివించేందుకు అమెరికాకు పంపించారు. అక్కడ ఫ్లోరిడా రాష్ట్రంలోని అట్లాంటిక్‌ యూనివర్సిటీ నుంచి సౌమ్య మూడు నెలల క్రితమే ఎంఎస్‌ పూర్తి చేసింది. ప్రస్తుతం అక్కడే తెలుగు రాష్ట్రాలకు చెందిన స్నేహితులతో కలిసి ఉంటోంది. కాగా, భారత కాలమానం ప్రకారం ఆదివారం అర్ధరాత్రి సౌమ్య తాను ఉంటున్న గది నుంచి 100 మీటర్ల దూరంలో గల మార్ట్‌కు వెళ్తుండగా అదే సమయంలో వెనుక నుంచి ఓ కారు వచ్చి ఆమెను ఢీకొట్టింది. దీంతో సౌమ్య తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందింది. ప్రస్తుతం సౌమ్య మృతదేహం ఫ్లోరిడాలోని ఆస్పత్రిలో ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు. కాగా, ఆదివారం రాత్రే సౌమ్య తమకు ఫోన్‌ చేసి మాట్లాడిందని ఆమె తండ్రి కోటేశ్వర్‌ కన్నీటి పర్యంతమవుతూ చెప్పారు. ప్రభుత్వం వెంటనే అమెరికాలోని రాయబార కార్యాలయంతో మాట్లాడి తమ కుమార్తె మృతదేహాన్ని స్వదేశానికి తీసుకొచ్చేలా చూడాలని ఆయన కోరుతున్నారు.

కాంబోడియాలో తెలుగు యువకుడికి చిత్రహింసలు

- సోషల్‌ మీడియాలో వైరల్‌
- చివరకు క్షేమంగానే ఉన్నాడని తెలిపిన పోలీసులు



ప్రకాశ్‌ ఇంటి వద్ద విచారంలో ఉన్న కుటుంబసభ్యులు

బయ్యారం: బతుకుదెరువు నిమిత్తం కాంబోడియా దేశానికి వెళ్లిన తెలుగు యువకుడిని అక్కడి వారు చిత్రహింసలకు గురిచేస్తున్నారని సోమవారం సోషల్‌ మీడియాలో వైరల్‌ కావడం స్థానికంగా చర్చనీయాంశమైంది. మహబూబాబాద్‌ జిల్లా బయ్యారం మండలం గంధంపల్లికి చెందిన మున్సిఫ్‌ ప్రకాశ్‌ విదేశాలకు వెళ్లి ఆర్థికంగా స్థిరపడాలని భావించాడు. హైదరాబాద్‌కు చెందిన ఓ ప్రైవేట్‌ ఏజెన్సీ ద్వారా మూడు నెలలక్రితం ఆస్ట్రేలియా వెళ్లేందుకు ప్రయత్నించగా, ఏజెన్సీ నిర్వాహకులు ప్రకాశ్‌ను ఆస్ట్రేలియా అని చెప్పి కాంబోడియాకు పంపించారు. రెండు నెలలు సవ్యంగానే గడిచినప్పటికీ ఆ తరువాత నెలరోజులుగా అక్కడ తనకు మత్తు ఇంజెక్షన్లు ఇస్తూ మానసికంగా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ప్రకాశ్‌ తన సోదరుడికి వాట్సాప్‌ కాల్‌లో చెప్పాడు. తిరిగి మూడు రోజుల క్రితం తనను పోలీసులు అరెస్ట్‌ చేశారని.. స్వదేశానికి తీసుకువెళ్లాలని ఫోన్‌ చేసి చెప్పాడు. అప్పటి నుంచి ప్రకాశ్‌ ఫోన్‌ పనిచేయక పోవటంతో కుటుంబసభ్యులు ఆందోళన చెందుతున్నారు. కాగా, ప్రకాశ్‌ చిత్రహింసల కు గురవుతున్నట్టు సోషల్‌ మీడియాలో వైరల్‌ అవుతున్న విషయంపై జిల్లా పోలీసు అధికారులు ఆరా తీశారు. ఎస్పీ సుధీర్‌ రాంనాథ్‌ కైకన్, డీఎస్పీ తిరుపతిరావు ఆదేశాల మేరకు గార్ల–బయ్యారం సీఐ రవికుమార్‌ కాంబోడియాలో ఉన్న ప్రకాశ్‌ ఆచూకీ కోసం ఆ దేశంలోని ఎంబసీ అధికారులతో ఫోన్‌లో మాట్లాడగా, ప్రకాశ్‌ క్షేమంగా తమ అదీనంలో ఉన్నారని చెప్పి అతడితో మాట్లాడించారు. త్వరలో భారత్‌కు తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటామని సీఐ విలేకరులకు తెలిపారు.

తీరొక్క కళారూపాలు

▶ మొదటి పేజీ తరువాయి

హాజరయ్యే పిల్లల కోసం పలు క్రీడలతో గేమింగ్‌ జోన్‌ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ట్యాంక్‌ బండ్‌పై పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యే అవకాశమున్నందున వారికి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులను శాంతికుమా రి ఆదేశించారు. ట్యాంక్‌ బండ్‌పై సాంస్కృతిక ప్రదర్శనల అనంతరం ఆకర్షణీయమైన బాణసంచా ప్రదర్శనతోపాటు లేజర్‌ షో ఏర్పాటు చేశామని వివరించారు. అలాగే అన్ని ప్రభుత్వ కార్యాలయాలను విద్యుత్‌ దీపాలతో అలంకరించాలన్నారు.

పరేడ్‌ గ్రౌండ్స్‌ సందర్శన: సికింద్రాబాద్‌ పరేడ్‌ గ్రౌండ్స్‌లో చేపడుతున్న రాష్ట్ర అవతరణ దినోత్సవ ఏర్పాట్లను సీఎస్‌ శాంతికుమారి, డీజీపీ రవిగుప్తా సోమవారం పరిశీలించారు. వీఐపీల బందోబస్తు, ట్రాఫిక్‌ క్రమబద్ధీకరణ వంటి అంశాలపై అధికారులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ముఖ్య కార్యదర్శులు శైలజా రామయ్యర్, శ్రీనివాస రాజు, జీఏడీ కార్యదర్శి రఘునందన్‌ రావు, అదనపు డీజీలు సంజయ్‌ కుమార్, సమాచార శాఖ స్పెషల్‌ కమిషనర్‌ హనుమంతరావు పాల్గొన్నారు.

నాన్నా.. లే నాన్నా

ఆటో బోల్తా ఘటనలో తండ్రి మృతితో కుమారుడి రోదన



తండ్రి సుమన్‌ మృతదేహం వద్ద రోదిస్తున్న వరుణ్‌

ఇల్లెందు రూరల్‌: సోదరి కుమారుడి ఆరోగ్యం బాగుపడాలని దైవదర్శనానికి వెళ్లి వస్తుండగా జరిగిన ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందగా అతని కుమారుడు రోదించిన తీరు అందరినీ కంటతడి పెట్టించింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు మండలం భద్రుతండాకు చెందిన మోహన్‌–సునీత దంపతుల కుమారుడు నిఖిల్‌ ఆరోగ్య పరిస్థితి బాగా లేకపోవడంతో సునీత కుటుంబంతో పాటు ఆమె సోదరుడు సుమన్‌ కుటుంబీకులు సోమవారం మహబూబాబాద్‌ జిల్లా వీరభద్రస్వామి ఆలయానికి వెళ్లి ఆటోలో తిరిగి వస్తున్నారు. ఈక్రమంలో నిఖిల్‌ మారాం చేస్తుండడంతో డ్రైవర్‌ పక్కనే కూర్చున్న సుమన్‌.. మేనల్లుడిని తన పక్కన కూర్చోపెట్టుకుని నచ్చచెబుతున్నాడు. ఇంతలోనే నిఖిల్‌ ఒక్కసారిగా నేరుగా ఆటో బ్రేక్‌పై కాలు బలంగా మోపడంతో ఆటో అదుపు తప్పి బోల్తా పడగా.. అది సుమన్‌పై పడడంతో ఆయన తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఇల్లెందు మండలం 21ఫిట్‌ ఏరియా బొల్లినగర్‌లో జరిగిన ఈ ప్రమాద ఘటనలో మరో నలుగురు గాయపడగా, ఒక్కసారిగా జరిగిన ఈ పరిణామంతో సుమన్‌ కుమారుడు వరుణ్‌ తన తండ్రి మృతదేహంపై పడి 'నానా.. ఒక్కసారి లే నాన్నా...' అంటూ రోదించిన అందరినీ కంట తడి పెట్టించింది.

492 కేజీల గంజాయి పట్టివేత

- సినీ ఫక్కీలో తరలిస్తుండగా పట్టుకున్న కొత్తగూడెం పోలీసులు
- గంజాయి విలువ రూ.1.23 కోట్లుగా అంచనా



పట్టుబడిన గంజాయి, నిందితులతో కొత్తగూడెం త్రీటౌన్‌ పోలీసులు

కొత్తగూడెంఅర్బన్‌: సినీ ఫక్కీలో గంజాయి తరలిస్తుండగా కొత్తగూడెం త్రీటౌన్‌ పోలీసులు పట్టుకున్నారు. ఓ డీసీఎం వ్యాన్‌లో గంజాయి తరలిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్‌ పోలీసులతో పాటు కొత్తగూడెం త్రీటౌన్‌ ఎస్సై పురుషోత్తం సిబ్బందితో కలిసి సోమవారం మధ్యాహ్నం ఓల్డ్‌ డిపోరోడ్‌లో తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో అనుమానిత డీసీఎం రాగానే ఆపి తనిఖీ చేయగా.. కేబిన్‌ వెనుక భాగానికి సమాంతరంగా మరో అర తయారుచేసి అందులో గంజాయి ప్యాకెట్లు అమర్చి తరలిస్తున్నట్లు గుర్తించారు. ప్యాకెట్లను బయటకు తీసి పరిశీలించగా 492 కేజీలు ఉందని, గంజాయి విలువ రూ.1.23 కోట్లు ఉంటుందని సీఐ శివప్రసాద్‌ వివరించారు. మహారాష్ట్రకు చెందిన శుభమ్‌ శరత్‌బండారి, అంజద్‌ అబ్దుల్‌ షేక్‌ సీలేరు సమీపంలో గల పెద్దగొండి గ్రామానికి చెందిన రాజు అనే వ్యక్తి నుంచి గంజాయి కొనుగోలు చేసి షోలాపూర్‌కు చెందిన యోగేశ్‌ అనే వ్యక్తికి విక్రయించేందుకు తీసుకెళ్తుండగా పట్టుబడ్డారని తెలిపారు. పట్టుకున్న నిందితులను రిమాండ్‌కు తరలించామని, వారితో పాటు రాజు, యోగేశ్‌పై కేసు నమోదు చేశామని చెప్పారు. కాగా, గంజాయిని పట్టుకున్న టాస్క్‌ఫోర్స్‌ సిబ్బందిని, పోలీసులను ఎస్పీ రోహిత్‌రాజ్‌ అభినందించారు.

అమ్మమ్మను కాపాడబోయి మనవడూ మృతి

- దుస్తులు ఆరేసే దండేనికి విద్యుత్‌ సరఫరా..



విద్యుత్‌ షాక్‌తో మృతిచెందిన రామలక్ష్మి, సాయిచరణ్‌

మొగుళ్లపల్లి: విద్యుద్ఘాతంతో మనుమడు, అమ్మమ్మ మృతి చెందిన విషాద ఘ టన జయశంకర్‌ భూపాల పల్లి జిల్లా పిడిసిల్ల గ్రామంలో చోటుచేసుకుంది. పోలీ సుల కథనం ప్రకారం.. చిట్యాల మండలం వెంకట్రావుపల్లి(సీ) గ్రామాని కి చెందిన ముడతనపల్లి రామలక్ష్మి(60) భర్త ఇటీవల మరణించగా పిడిసిల్ల లోని తన పెద్ద బిడ్డ ఇంటికి సోమవారం వచ్చింది. ఇనుప వైరుతో కట్టిన దండెంపై ఆరేసిన దుస్తులను రామలక్ష్మి తీస్తుండగా విద్యుదాఘాతానికి గురైంది. అది చూసి మనవడు దుంప సాయిచరణ్‌(15) అమ్మమను కాపాడడానికి దండెం వైరును తొలగించే ప్రయత్నం చేయగా అతడికికూడా విద్యుత్‌ షాక్‌ తగిలింది. ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. దుస్తులు ఆరేసే దండెం.. కరెంటు స్తంభం నుంచి వచ్చే విద్యుత్‌ వైరుకు సపోర్టుగా ఉండే ఇనుప వైరు ఒకే దగ్గర ఉండటంతో కరెంటు సరఫరా అయి ప్రమాదం చోటుచేసుకుంది. మృతుడి తండ్రి దుంప సుధాకర్‌ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అశోక్‌ తెలిపాడు.

ఫైనల్ పంచ్ ఎవరిదో!

బిహార్లో 8 స్థానాలకు జూన్ 1న పోలింగ్

బిహార్‌లో లోక్‌సభ ఎన్నికలు తుది అంకానికి చేరుకున్నాయి. 40 సీట్లకు గాను ఆరు విడతల్లో 32 చోట్ల ఎన్నికలు ముగిశాయి. చివరిదైన ఏడో దశలో 8 లోక్‌సభ స్థానాల్లో పోలింగ్‌కు రంగం సిద్ధమైంది. వీటిలో బీజేపీ 5 సిట్టింగ్ స్థానాలు. 2 జేడీ(యూ), 1 రాష్ట్రీయ లోక్ మోర్చా చేతిలో ఉన్నాయి. ఎన్డీఏకు ఈసారి రెబల్స్‌తో పాటు ఇండియా కూటమి నుంచి గట్టి సవాల్ ఎదురవుతోంది. ఈ నేపథ్యంలో కీలక స్థానాలపై ఫోకస్...

\- సాక్షి, నేషనల్ డెస్క్



నలంద... జేడీయూ కంచుకోట

అలనాటి విఖ్యాత నలంద విశ్వవిద్యాలయ చరిత్రకు సాక్ష్యంగా నిలిచే నియోజకవర్గం. సారవంతమైన గంగా పరీవాహక ప్రాంతంలో ఉంటుంది. ఇది జేడీయూ కంచుకోట. బీజేపీ ఇక్కడ ఖాతాయే తెరవలేదు. గత ఎన్నికల్లో కౌసలేంద్ర కుమార్ జేడీ(యూ) నుంచి హ్యాట్రిక్ విజయం నమోదు చేశారు. ఈసారీ ఆయనే బరిలో ఉన్నారు. ఇండియా కూటమి తరఫున సీపీఐ (ఎంఎల్) నుంచి సందీప్ సౌరవ్ పోటీ చేస్తున్నారు. కమ్యూనిస్టులు గతంలో ఇక్కడ మూడుసార్లు గెలిచారు.

ఆరా... రైట్ వర్సెస్ లెఫ్ట్

మొదట్లో దీని పేరు షాబాద్. 1977లో ఆరాగా మారింది. ఆర్కే సింగ్ 2014లో తొలిసారి ఇక్కడ కాషాయ జెండా ఎగరేశారు. 2019లోనూ నెగ్గిన ఆయన ఈసారి హ్యాట్రిక్ కోసం ఉవ్విళ్లూరుతున్నారు. ఇండియా కూటమి తరఫున సీపీఎం (ఎంఎల్) అభ్యర్థి సుధామా ప్రసాద్ బరిలో ఉన్నారు. గత ఎన్నికల్లో సీపీఐ (ఎంఎల్)కు ఇక్కడ 4 లక్షల పైగా ఓట్లొచ్చాయి! రైట్, లెఫ్ట్ పార్టీల వార్ ఇక్కడ ఉత్కంఠ రేపుతోంది.

పట్నా సాహిబ్... రవిశంకర్‌కు సవాల్

సిక్కుల మత గురువు గురు గోవింద్‌సింగ్ జన్మస్థలం. 2008లో ఏర్పాటైంది. 2009, 2014ల్లో బాలీవుడ్ షాట్‌గన్ శత్రుఘ్న సిన్హా బీజేపీ తరఫున గెలిచారు. 2019లో ఎన్నికల ముందు శత్రుఘ్న బీజేపీకి గుడ్‌బై చెప్పి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో దిగారు. దాంతో 20 ఏళ్లుగా రాజ్యసభకు ప్రాతినిధ్య వహిస్తున్న సీనియర్ నేత రవిశంకర్ ప్రసాద్‌ను బీజేపీ బరిలో దించింది. శత్రుఘ్నను ఆయన 2.8 లక్షల పైగా ఓట్ల మెజారిటీతో ఓడించారు. ఈసారి కూడా బీజేపీ నుంచి ఆయనే బరిలో ఉన్నారు. ఇండియా కూటమి నుంచి కాంగ్రెస్ తరఫున లోక్‌సభ మాజీ స్పీకర్ మీరాకుమార్ తనయుడు అన్షుల్ అవిజిత్ పోటీ చేస్తున్నారు. కాంగ్రెస్, ఆర్జేడీలకు మంచి ఓటు బ్యాంకు ఉండటంతో బీజేపీ గట్టి పోటీ ఎదుర్కొంటోంది.

కరాకట్.. బీజేపీకి పవన్ గండం

ఇక్కడ కుష్వాహా (కోయెరి) సామాజికవర్గానిదే ఆధిపత్యం. గత మూడు ఎన్నికల్లోనూ ఆ వర్గం నేతలే గెలుస్తున్నారు. కుష్వాహాలు, రాజ్‌పుత్‌లు, యాదవులు ఇక్కడ రెండేసి లక్షల చొప్పున ఉంటారు. గతేడాది బీజేపీలో చేరిన భోజ్‌పురి స్టార్ పవన్ సింగ్ ఇప్పుడు పార్టీకి కొరకరాని కొయ్యగా మారారు. ఇక్కడ టికెట్ ఆశించి భంగపడి ఇండిపెండెంట్‌గా బరిలో దిగారు. ఇండియా కూటమి తరఫున సీపీఐ (ఎంఎల్) నుంచి రాజారాం సింగ్ కుష్వాహా బరిలో ఉన్నారు. ఎన్డీయే నుంచి రాష్ట్రీయ లోక్ మోర్చా వ్యవస్థాపకుడు ఉపేంద్ర కుష్వాహా పోటీ చేస్తున్నారు. పవన్ సింగ్ నామినేషన్‌కు జనం భారీగా వచ్చారు. త్రిముఖ పోటీలో ఎన్డీఏ ఎదురీదుతోంది.

పాటలీపుత్ర... లాలుకు ప్రతిష్టాత్మకం

గత రెండు ఎన్నికల్లోనూ ఆర్జేడీ వ్యవస్థాపకుడు లాలూ ప్రసాద్ యాదవ్ కుమార్తె మీసా భారతిని బీజేపీ నేత రామ్ కృపాల్ యాదవ్ ఓడించారు. 2009లో లాలు కూడా ఇక్కడ ఓటమి చవిచూశారు. లాలుకు ఒకప్పటి నమ్మినబంటు రాం కృపాల్ బీజేపీ అభ్యర్థిగా ఉన్నారు. బీజేపీ తరఫున రెండుసార్లు వరుసగా గెలిచిన ఆయన 2004లో ఇక్కడ ఆర్జేడీ అభ్యర్థిగా బీజేపీని ఓడించడం విశేషం. ఆర్జేడీ నుంచి మీసా భారతి మళ్లీ పోటీ చేస్తున్నారు. కుమార్తెను ఎలాగైనా లోక్‌సభకు పంపాలని కలలుగంటున్న లాలుకు ఈ ఎన్నిక ప్రతిష్టాత్మకంగా మారింది. కాంగ్రెస్ దన్ను ఆర్జేడీకి కలిసొచ్చే అంశం.

జహానాబాద్... జేడీయూ వర్సెస్ ఆర్జేడీ

'రెడ్ కారిడార్'లో అత్యంత సున్నితమైన నక్సల్స్ ప్రభావిత నియోజకవర్గం. కమ్యూనిస్టులకు కంచుకోట. 1998 నుంచీ ఆర్జేడీ, జేడీయూ మధ్య చేతులు మారుతోంది. 2014లో రాష్ట్రీయ లోక్ సమతా పార్టీ నెగ్గింది. 2019లో జేడీ(యూ) నేత చందేశ్వర్ ప్రసాద్ కేవలం 1,751 ఓట్ల తేడాతో ఆర్జేడీ అభ్యర్థి సురేంద్ర ప్రసాద్ యాదవ్‌ను ఓడించారు. ఈసారి కూడా వారిద్దరే బరిలో ఉన్నారు.

మోదీని ఈడీ అడిగినా దేవుడు పంపాడని చెప్తారేమో



ర్యాలీ వేదిక కుంగడంతో కింద పడబోయి బ్యాలెన్స్ చేసుకుంటున్న రాహుల్

రాహుల్ గాంధీ ఎద్దేవా

బక్తియార్‌పూర్/పాలీగంజ్/జగదీశ్‌పూర్(బిహార్): తాను సామాన్య వ్యక్తినికాదని, దేవుడు పంపించాడని ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ వ్యంగ్యాస్త్రాలు విసిరారు. సోమవారం బిహార్‌లో బక్తియార్‌పూర్, పాలీగంజ్, జగదీశ్‌పూర్‌ల్లో ఆయన ప్రచార ర్యాలీల్లో మాట్లాడారు. ''ఎన్నికల ఫలితాలొచ్చాక బీజేపీ హయాంలో జరిగిన అవినీతిపై మోదీని ఈడీ ప్రశ్నించొచ్చు. అప్పుడాయన 'నాకేమీ తెలీదు. దేవుడు పంపిస్తే వచ్చా. ఆయన చెప్పినట్లే చేశా'' అని చెబుతారేమో'' అంటూ ఎద్దేవా చేశారు. బిలియనీర్లకు సేవ చేయడానికే దేవుడు ఆయన్ను పంపాడా అంటూ మండిపడ్డారు. పాలీగంజ్‌లో రాహుల్, ఆర్జేడీ చీఫ్ లాలు ప్రసాద్ యాదవ్ కుమార్తె, పాటలీపుత్ర అభ్యర్థి మీసా భారతి సహా డజనుకు పైగా నేతలు కార్యకర్తలకు అభివాదం చేస్తుండగా వేదిక ఒక్కసారిగా కుంగింది. దాంతో రాహుల్ కాస్త పక్కకు నడవగా అక్కడా కుంగింది. వారంతా కింద పడబోయి తమాయించుకున్నారు.

మోదీవి కూలదోసే కుట్రలు: ప్రియాంక

సిమ్లా: హిమాచల్‌ప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూలదోసేందుకు మోదీ ప్రయత్నిస్తున్నారని ప్రియాంకా గాంధీ వద్రా ఆరోపించారు. కాంగ్రా సమీపంలోని చంబాలో ఆమె కాంగ్రెస్ ఎన్నికల ప్రచార సభలో ప్రసంగించారు.

'ఉగ్ర' సంబంధీకులకు ఉద్యోగాలు రావు

రాళ్లు రువ్వినా అంతే: అమిత్ షా

న్యూఢిల్లీ: కశ్మీర్‌పై కమ్ముకున్న 'ఉగ్ర' మబ్బులను చెల్లాచెదురు చేస్తున్నామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రకటించారు. ''కశ్మీర్‌లో ఎవరైనా ఉగ్రవాద సంస్థల్లో చేరితే వారి కుటుంబసభ్యులు ఎన్నటికీ ప్రభుత్వోద్యోగాన్ని పొందలేరు. రాళ్లు రువ్వే ఘటనల్లో పాల్గొనే వ్యక్తుల కుటుంబాలకూ ఇదే వర్తిస్తుంది. అయితే అలాంటి వారి గురించి స్వచ్ఛందంగా ప్రభుత్వానికి వెల్లడించే కుటుంబానికి మినహాయింపు దక్కుతుంది. ఉగ్రవాదుల మృతదేహాన్ని వారి కుటుంబానికి అప్పగిస్తే అంతిమయాత్రకు అనవసర ప్రాధాన్యం లభిస్తోంది. అందుకే ఆ ట్రెండ్‌కు ఫుల్‌స్టాప్ పెట్టాం. కేవలం కుటుంబసభ్యులు, ఆప్తుల సమక్షంలో అంత్యక్రియలు జరుగుతాయి. ఉగ్రవాదులను భద్రతా బలగాలు చుట్టుముట్టినప్పుడు లొంగిపోవడానికి చాన్సిస్తాం. తల్లిదండ్రులు, భార్య, పిల్లలతో చెప్పిస్తాం. వింటే సరేసరి. లేదంటే ప్రాణాలు పోవడం ఖాయం. కేరళలో పురుడుపోసుకున్న పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియావంటి ముస్లిం అతివాద సంస్థలను నిషేధించి వేర్పాటువాద సిద్ధాంతాల వ్యాప్తిని అడ్డుకుంటున్నాం'' అని చెప్పారు.

కోర్టులో ఎంపీ కన్నీరు

విచారణ సందర్భంగా స్వాతి కంటతడి ● బిభవ్‌కు దక్కని బెయిల్

న్యూఢిల్లీ: కొద్ది రోజులుగా తనకు విపరీతంగా బెదిరింపులు వస్తున్నాయని ఆప్ రాజ్యసభ సభ్యురాలు స్వాతీ మలివాల్ వాపోయారు. ఆమెపై దాడి కేసులో ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ పీఏ బిభవ్ కుమార్ బెయిల్ పిటిషన్‌పై సోమవారం తీస్ హజారీ కోర్టులో విచారణ జరిగింది. ఈ ఉదంతంలో ఎంపీ కావాలనే సమస్యలు సృష్టించారని బిభవ్ న్యాయవాది వాదించారు. సీఎం నివాసంలో సీసీ కెమెరాలు లేనిచోట తనపై దాడి జరిగిందని ఆమె చెప్పడంలో దురుద్దేశం దాగుందన్నారు. దాంతో ఎంపీ కన్నీటి పర్యంతమయ్యారు. ఆప్ ట్రోల్ ఆర్మీ తనను తీవ్రంగా వేధిస్తోందని కోర్టుకు తెలిపారు. బిభవ్‌కు బెయిలిస్తే తనకు, తన కుటుంబానికి ప్రమాదమని వాదించారు. ఈ ఉదంతంలో నిబంధనలను ఉల్లంఘించింది బిభవ్ కుమారేనని ఢిల్లీ పోలీసుల తరఫు న్యాయవాది కూడా కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. కేజ్రీవాల్ నివాసంలో బిభవ్ ఈనెల 13న తనపై దాడి చేసి విచక్షణారహితంగా కొట్టాడని స్వాతి పోలీసులకు ఫిర్యాదు చేయడం తెలిసిందే. ఈ కేసులో బిభవ్ అరెస్టయ్యారు. ఫోన్‌ను ఫార్మాట్ చేసి, సీసీటీవీ ఫుటేజిని తొలగించిన బిభవ్ అమాయకుడు కాదని స్వాతి తరఫు లాయర్ వాదించారు. అనంతరం బిభవ్‌కు బెయిల్‌ను నిరాకరిస్తున్నట్టు అడిషనల్ సెషన్స్ జడ్జి సుశీల్ అనూజ్ త్యాగి పేర్కొన్నారు.



కోర్టు నుంచి బయటికొస్తున్న స్వాతి

ఎలక్షన్ బీట్

మేకిన్ ఇండియా ఏమైంది: ఖర్గే

సాక్షి, న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ధ్వజమెత్తారు. సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళసూత్రం, మటన్, చేపలు, మొఘల్, ముజ్రా వంటి అంశాలపై మాట్లాడే ప్రధాని మోదీ.. ఫెయిలైన మేక్ ఇన్ ఇండియా గురించి, దేశ ఆర్థిక వ్యవస్థ గురించి ఎందుకు మాట్లాడట్లేదని ఖర్గే ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వ వైఫల్యంలోనే మోదీ సమాధానం ఉందని సోమవారం 'ఎక్స్'వేదికగా విమర్శనాస్త్రాలు సంధించారు. ''మోదీ హయాంలో మేకిన్ ఇండియా విఫలమైంది. ఎగుమతులు పతనావస్థకు చేరుకున్నాయి. ఉత్పాదకత దారుణంగా పడిపోయింది. వాణిజ్య లోటు రూ.23.83 లక్షల కోట్లకు ఎగబాకింది'' అని మండిపడ్డారు.

మేనిఫెస్టోలో ఆర్థికపరమైన హామీలు ఇవ్వడం అవినీతికి పాల్పడ్డట్టు కాదు: సుప్రీం

న్యూఢిల్లీ: ఎన్నికల మేనిఫెస్టోలో ఆర్థిక లబ్ధి చేకూర్చే హామీలు ఇవ్వడం.. అవినీతి విధానాల కిందకు రాదని సుప్రీంకోర్టు సోమవారం తేల్చిచెప్పింది. కర్నాటకలో కాంగ్రెస్ ప్రకటించిన మేనిఫెస్టోలో ఐదు హామీలు ఇచ్చారని, ఇవి ఓటర్లకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆర్థిక లబ్ధి చేకూర్చేలా ఉన్నాయని, ఇలా చేయడం అవినీతికి పాల్పడటం కిందకు వస్తుందని.. చామరాజపేట నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే బి.జె.జమీర్ అహ్మద్ ఖాన్‌ను అనర్హుడిగా ప్రకటించాలని ఇదే నియోజకవర్గానికి చెందిన శశాంక శ్రీధర సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనికి విచారించిన జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ కె.వి.విశ్వనాథన్‌ల ధర్మాసనం సోమవారం శశాంక పిటిషన్‌ను తోసిపుచ్చింది. 'రాజకీయ పార్టీ తమ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు ప్రజలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆర్థిక లబ్ధి చేకూరుస్తున్నాయి కాబట్టి ఎన్నికల నియామళి కింద ఇది ఉల్లంఘనేనని, సదరు రాజకీయ పార్టీ అభ్యర్థి కూడా అవినీతికరమైన మార్గాలను అనుసరించినట్లు పరిగణించాలని పిటిషనర్ కోరారు.. ఆయన వాదన ఒకింత వాస్తవదూరంగా ఉంది కాబట్టి ఆమోదించలేం' అని ధర్మాసనం పేర్కొంది. వాస్తవాలను, పరిస్థితులను పరిగణనలోకి తీసుకొని చూస్తే పిటిషనర్ లేవనెత్తిన ప్రశ్నల లోతుల్లోకి వెళ్లాల్సిన అవసరం లేదని భావిస్తున్నామని, అందుకే పిటిషన్‌ను కొట్టేస్తున్నామని తెలిపింది. గతంలో శశాంక పిటిషన్‌ను విచారించిన కర్నాటక హైకోర్టు.. అధికారంలోకి వస్తే తాము తేబోయే పథకాలు, అనుసరించే విధానాలను ప్రకటించడం ప్రజాప్రాతినిధ్య చట్టం సెక్షన్ 123 ప్రకారం అవినీతి విధానం కాదని తేల్చి చెప్పింది. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఐదు గ్యారంటీలను సంక్షేమ పథకాలుగా చూడాలని, వాటి అమలు సాధ్యమా? కాదా? అనేది వేరే విషయమని పేర్కొంది.

పంజాబ్ ఆప్ ప్రభుత్వాన్ని పడగొడతారట

అమిత్ షా బెదిరించారు: అరవింద్ కేజ్రీవాల్

చండీగఢ్: దేశం నియంతృత్వ పాలనలో ఉందని ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ అన్నారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత పంజాబ్‌లోని భగవంత్ మాన్ (ఆప్) ప్రభుత్వాన్ని పడగొడతామని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా బెదిరించారని ఆరోపించారు. సోమవారం అమృత్‌సర్‌లో ఆయన వ్యాపారులతో భేటీ అయ్యారు. ''అమిత్ షా తొలుత పంజాబీలను తిట్టారు. జూన్ 4 తర్వాత పంజాబ్ సర్కార్‌ను కూలదోస్తామని బెదిరించారు. మాన్ సీఎంగా ఉండరన్నారు'' అని ఆరోపించారు. పంజాబీలను బెదిరిస్తే రాష్ట్రంలో అడుగుపెట్టలేరని హెచ్చరించారు.

బెయిల్ వారం పొడిగించండి

న్యూఢిల్లీ: అనారోగ్య కారణాలరీత్యా తన బెయిల్‌ను వారం రోజులు పొడిగించాలని కేజ్రీవాల్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలుచేశారు. ''పెట్-సీటీ స్కాన్, వైద్య పరీక్షలు చేయించుకోవాల్సి ఉంది. కనుక జూన్ 2న కాకుండా జూన్ 9న లొంగిపోతాను'' అని కోరారు.

దక్షిణాఫ్రికా దక్కేదెవరికో?

రేపే పార్లమెంటు ఎన్నికలు

- వరుసగా ఏడో విజయంపై ఏఎన్‌సీ కన్ను
- ఈసారి మెజారిటీ కష్టమంటున్న సర్వేలు
- మాజీ అధ్యక్షుడు జుమా పార్టీ గట్టి పోటీ

సియాంకొబా. దక్షిణాఫ్రికాలో అధికార ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ ఊరూవాడా హోరెత్తించిన ఎన్నికల నినాదం. అంటే 'మాదే ఘనవిజయం' అని జులు భాషలో అర్థం. కానీ ఘనవిజయం దేవుడెరుగు, ఏఎన్‌సీ ఈసారి సాధారణ మెజారిటీ సాధించడం కూడా కష్టమేనని ఒపీనియన్ పోల్స్ అంటున్నాయి. వర్ణవివక్ష అంతమై తెల్లవారి పాలన ముగిశాక 1994లో ప్రజాస్వామిక పద్ధతిలో జరిగిన తొలి ఎన్నికల్లో గెలిచింది మొదలు 30 ఏళ్లుగా ఏఎన్‌సీయే అధికారంలో కొనసాగుతోంది. ఈ ఎన్నికల్లో దానికి తొలిసారి గట్టి పోటీ ఎదురవుతోంది...

దక్షిణాఫ్రికాలో ఎన్నికలకు వేళైంది. 400 మందితో కూడిన నేషనల్ అసెంబ్లీతో పాటు 9 ప్రావిన్షియల్ అసెంబ్లీలకు కూడా బుధవారం ఎన్నికలు జరగనున్నాయి. వరుసగా ఏడో విజయం కోసం ఏఎన్‌సీ సర్వశక్తులూ ఒడ్డుతోంది. కానీ పెచ్చరిల్లుతున్న అవినీతి, నిరుద్యోగం, కరెంటు కోతలు, నీటి కొరత, మౌలిక సదుపాయాల లేమి వంటివి పార్టీకి బాగా ప్రతికూలంగా మారాయి. వీటిపై ప్రజాగ్రహం ప్రచారం పొడవునా స్పష్టంగా కన్పించింది. శనివారం అధ్యక్షుడు సిరిల్ రామఫోసా అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న నిర్వహించిన చివరి ప్రచార సభ కూడా అనుకున్నంతగా విజయవంతం కాలేదు. సభకు వేదికైన చారిత్రక సొవెటో టౌన్‌షిప్‌లోని 90వేల మంది సామర్థ్యమున్న ఫుట్‌బాల్ స్టేడియం పూర్తిగా నిండక పోవడం ప్రజల్లో నెలకొన్న తీవ్ర అసంతృప్తికి అద్దం పడుతోందని పరిశీలకులు చెబుతున్నారు. 71 ఏళ్ల రామఫోసాపై పెద్ద ఎత్తున అవినీతి ఆరోపణలున్నాయి. విచ్చలవిడిగా మనీ లాండరింగ్‌కు పాల్పడినట్లు విపక్షాలు ఆరోపించాయి. ఆయనను అభిశంసించాలని పార్లమెంట్ నియమించిన న్యాయ నిపుణుల కమిటీ కూడా సూచించింది. అయితే పార్లమెంట్‌లో ఉన్న మెజారిటీ సాయంతో ఆ ప్రక్రియను ఏఎన్‌సీ అడ్డుకుంది. రామఫోసాపై జరిగిన పోలీసు దర్యాప్తు వివరాలు బయటకు రాలేదు. వీటన్నింటి నేపథ్యంలో ఈసారి ఏఎన్‌సీ తన చరిత్రలో తొలిసారిగా 50 శాతం కంటే తక్కువ ఓట్లకు పరిమితమయ్యేలా కన్పిస్తోంది. అదే జరిగితే అతి పెద్ద పార్టీగా నిలిచినా ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన మెజారిటీ దక్కదు. ఏఎన్‌సీ ఈసారి ఇతర పార్టీల మద్దతుపై ఆధారపడి సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు చేయాల్సి వస్తుందని సర్వేలూ పేర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో అందరి దృష్టీ ఆదివారం వెల్లడయ్యే ఫలితాలపైనే నెలకొంది. - సాక్షి, నేషనల్ డెస్క్



జాకబ్ జుమా పంచ్...

మాజీ అధ్యక్షుడు జాకబ్ జుమా గతేడాది రామఫోసాతో విభేదించి సొంత పార్టీ పెట్టుకోవడం ఏఎన్‌సీకి పెద్ద దెబ్బ! 82 ఏళ్ల జుమా ఈ ఎన్నికల్లో హోరాహోరీ పోరాడుతున్నారు. ఆయన పార్టీ ఉంకొంతో వెసీజ్వె (ఎంకే) 13 శాతం దాకా ఓట్లు రాబట్టవచ్చని సర్వేల్లో వెల్లడయ్యింది. అధికారంలోకి రాకపోయినా ఏఎన్‌సీ అవకాశాలను బాగా దెబ్బ తీయడం ఖాయమని పరిశీలకులు కూడా చెబుతున్నారు. ముఖ్యంగా జుమా సొంత ప్రావిన్స్ క్వాజులూ నాటాల్‌లో ఏఎన్‌సీ ఆధిపత్యానికి ఎంకే పూర్తిగా గండికొట్టనుందని అంటున్నారు. క్వాజులూ ప్రావిన్స్‌లోని ఎంకే నేతల్లో తెలుగు మూలాలున్న విశ్వెన్ గోపాల్‌రెడ్డి ప్రముఖ స్థానంలో ఉండటం విశేషం.

ఎన్నికల నేపథ్యంలో దక్షిణాఫ్రికావ్యాప్తంగా పెరుగుతున్న రాజకీయ హత్యలు కలకలం సృష్టిస్తున్నాయి. 2023 జనవరి నుంచి 40 మందికి పైగా విపక్ష నేతలు, నిజాయతీపరులైన అధికారులు, హక్కుల కార్యకర్తలు హత్యకు గురయ్యారు. ఇది అధ్యక్షుడు రామఫోసా పనేనంటూ విపక్షాలు మండిపడుతున్నాయి. ప్రచారంలో దీన్ని ప్రధానాంశంగా కూడా మార్చుకున్నాయి. వీటిపై ప్రజల్లో కూడా తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి.

ప్రధాన సమస్యలివీ...

- తీవ్ర కరెంటు కోతలు
- పెచ్చరిల్లిన అవినీతి
- పేదరికం (50 శాతం దాటింది)
- 32 శాతం దాటిన నిరుద్యోగం (ప్రపంచంలోనే అత్యధికం)
- తీవ్ర నీటి కొరత
- మౌలిక సదుపాయాల లేమి
- మితిమీరిన నేరాలు, హింసాకాండ
- రాజకీయ హత్యలు

బరిలో 51 విపక్షాలు

దక్షిణాఫ్రికాలో ప్రధాన ప్రతిపక్షం డెమొక్రటిక్ అలయెన్స్ (డీఏ). ఈ కూటమికి 22 నుంచి 27 శాతం ఓట్లు రావచ్చని ఏప్రిల్లో ప్రజాభిప్రాయ సేకరణలో వెల్లడైంది. అయితే పలువురు నేతలు డీఏను వీడి సొంత పార్టీలు పెట్టుకున్నారు. ఇది విపక్ష కూటమికి ప్రతికూలంగా మారింది. ఈసారి 51 ప్రతిపక్షాలు పోటీలో ఉండటంతో ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలి ఏఎన్‌సీకి కలిసొచ్చేలా కన్పిస్తోంది.

గత ఆరు ఎన్నికల్లో ఏఎన్‌సీ ఓట్ల శాతం



దక్షిణాఫ్రికా పార్లమెంటులో రెండు సభలుంటాయి. 90 మంది సభ్యులతో కూడిన నేషనల్ కౌన్సిల్, 400 మంది సభ్యులుండే నేషనల్ అసెంబ్లీ. ప్రతి ఐదేళ్లకోసారి జరిగే ఎన్నికల్లో దీని సభ్యులను ప్రత్యక్షంగా ఎన్నుకుంటారు. మెజారిటీ సాధించే పార్టీ సారథి అధ్యక్షుడవుతారు. దేశ జనాభా 6.2 కోట్లు కాగా ఓటర్లు 2.8 కోట్ల మంది. జనాభాలో 80 శాతానికి పైగా నల్లజాతీయులే. ఈ ఎన్నికల్లో తొలిసారిగా స్వతంత్రులకు కూడా పోటీ చేసే అవకాశం కల్పించారు.

నేషనల్ అసెంబ్లీలో బలాబలాలు

(మొత్తం స్థానాలు 400)

ఏఎన్‌సీ	230
డెమొక్రటిక్ అలయన్స్	84
ఎకనమిక్ ఫ్రీడం ఫైటర్స్	44
ఇతరులు	42

ముస్లిం ఓట్లపై వల...

జనాభాలో ముస్లింలు 2 శాతం కంటే తక్కువే ఉంటారు గానీ వారి ప్రతి ఓటూ విలువైనదే. అందుకే ముస్లింల ఓట్లపై పార్టీలు వల విసురుతున్నాయి. పాలస్తీనా ఉద్యమానికి పోటీలు పడి మరీ మద్దతు ప్రకటిస్తున్నాయి. గాజాలో దాడులు ఆపాలంటూ ఇజ్రాయెల్‌ను డిమాండ్ చేస్తున్నాయి.

రఫాపై దాడుల్లో 45 మంది మృతి

టెల్‌అవీవ్: గాజా ప్రాంత నగరం రఫాపై ఆదివారం రాత్రి ఇజ్రాయెల్ బలగాలు జరిపిన దాడుల్లో 45 మంది పాలస్తీనియన్లు ప్రాణాలు కోల్పోయారు. వీరిలో సగం మంది మహిళలు, చిన్నారులు, వృద్ధులేనని గాజా ఆరోగ్య శాఖ తెలిపింది. తమ దాడుల్లో హమాస్ స్థావరం ధ్వంసం కాగా ఇద్దరు సీనియర్ మిలిటెంట్లు హతమయ్యారని ఇజ్రాయెల్ సైన్యం పేర్కొంది. ఈ ఘటనను పొరపాటున జరిగిన విషాదంగా ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు అభివర్ణించారు. రాత్రి వేళ జరిగిన ఈ ఘటనపై దర్యాప్తు చేయిస్తామని పార్లమెంట్‌లో ప్రకటించారు.

31న సిట్ ముందుకు: ప్రజ్వల్

బనశంకరి: మహిళలపై లైంగిక దాడి, నగ్న వీడియోల లీకేజీ ఆరోపణలు ఎదుర్కొంటున్న హాసన్ జేడీ(ఎస్) ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ ఎట్టకేలకు స్పందించారు. ఈ వ్యవహారం బయటపడగానే ఏప్రిల్ 27వ ఆయన విదేశాలకు వెళ్లడం తెలిసిందే. సోమవారం ఆయన వీడియో విడుదల చేశారు. ''ముందుగా నిర్ణయించుకున్న విధంగానే విదేశాలకు వచ్చా. నాపై ఆరోపణలను కాంగ్రెస్ ప్రచారానికి వాడుకోవడంతో మనస్తాపంతో ఎవరికీ అందుబాటులోకి రాలేదు. ఈ నెల 31వ తేదీన సిట్ ముందు హాజరై పూర్తి సహకారం అందిస్తా'' అని చెప్పుకొచ్చారు. ప్రజ్వల్ ముందు జర్మనీ, తర్వాత ఇంగ్లండ్‌కు వెళ్లినట్లు తెలిసింది.

పపువా న్యూ గినియా విషాదం.. మృతుల సంఖ్య 2 వేలపైనే..

మెల్‌బోర్న్: దక్షిణ పసిఫిక్ ద్వీప దేశం పపువా న్యూ గినియా శుక్రవారం కొండచరియలు విరిగి పడిన ఘటనలో మృతుల సంఖ్య పెరుగుతోంది. ఎంగా ప్రావిన్స్‌లోని యంబాలి గ్రామంలో చోటుచేసుకున్న ఘటనలో 670 మంది వరకు చనిపోయి ఉంటారని మొదట ఐరాస విభాగం అంచనా వేసింది. అయితే, మట్టిదిబ్బల కింద రెండు వేలమందికి పైగానే గ్రామస్తులు సజీవ సమాధి అయి ఉంటారని పపువా న్యూ గినియా ప్రభుత్వం లెక్కగట్టింది. ఈ మేరకు ఐరాసకు సమాచారం పంపింది. ఈ విషాద సమయంలో తమను ఆదుకోవాలంటూ అంతర్జాతీయ సమాజానికి విజ్ఞప్తి చేసింది. అయితే, ఐరాస వలసల విభాగం మాత్రం నేలమట్టమైన 150 నివాసాలను పరిగణనలోకి తీసుకునే మృతుల సంఖ్య 670గా నిర్ణయించామని, ప్రభుత్వ గణాంకాలపై మాట్లాడబోమని తెలిపింది. మృతుల సంఖ్యను 2 వేలుగా ఏ ప్రాతిపదికన నిర్ణయించారని ప్రధాని జేమ్స్ మరాపేను మీడియా ప్రశ్నించగా ఆయన బదులివ్వలేదు. కాగా, దేశంలో దశాబ్దాలుగా జనగణన జరగలేదు.



శిథిలాలను తొలగిస్తున్న గ్రామస్తులు

సైన్యం కాపలా మధ్య..

గ్రామంలోని 200 మీటర్ల ప్రాంతంలో ఉన్న నివాసాలను 6 నుంచి 8 మీటర్ల మేర భారీ రాళ్లు, చెట్లు, మట్టి భూస్థాపితం చేశాయి. స్థానికులే తమ వ్యవసాయ పరికరాలైన పార, గొడ్డలి వంటి వాటితో వాటిని తొలగిస్తున్నారు. ఇప్పటి వరకు ఆరు మృతదేహాలను మాత్రమే వెలికి తీయగలిగారు. స్థానిక కాంట్రాక్టర్ పంపించిన బుల్డోజర్‌తో ఆదివారం నుంచి పని చేయిస్తున్నారు.

అమెరికాలో టోర్నడోల బీభత్సం

28 మంది మృతి

హూస్టన్: అమెరికాలో పలు ఓవైపు ఎండలు మండుతుంటే మరోవైపు టోర్నడోలు ప్రతాపం చూపుతున్నాయి. గాలుల తీవ్రతకు ఇళ్లు కూలడం, చెట్లు పడిపోవడం వంటి ఘటనల్లో 28 మందికి పైగా చనిపోయారు. వేలాదిగా ఇళ్లు నేల మట్టమయ్యాయి. టెక్సాస్, ఒక్లహోమా, అర్కన్సాస్ సహా 16 రాష్ట్రాల్లో 6 లక్షలకు పైగా ఇళ్లకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మరోవైపు టెక్సాస్, ఆస్టిన్, డాలస్, న్యూ మెక్సికో, ఒక్లహోమా, అరిజోనా, కొలరాడో రాష్ట్రాల్లో ఉష్ణోగ్రతలు భారీగా నమోదవుతున్నాయి. ఇలినాయీ, మిస్సోరీ, కెంటకీ, టెన్నెస్సీల్లో తీవ్రమైన గాలి తుఫాన్లు వీస్తాయని చెబుతున్నారు.

రక్తం నమూనాలనే మార్చేశారు!

'పుణె ప్రమాదం' ఘటనలో డాక్టర్ల నిర్వాకం

పుణె: పుణెలో ఈ నెల 19న మద్యం మత్తులో కారు నడిపి ఇద్దరు మృతికి కారణమైన టీనేజర్(17) తాలూకు రక్తం శాంపిళ్లను కూడా అతని కుటుంబీకులు మార్చేసినట్టు వెలుగులోకి వచ్చింది. ససూన్ ప్రభుత్వ ఆస్పత్రి అధికారులను, వైద్య సిబ్బంది సాయంతో వాళ్లు ఈ నిర్వాకానికి పాల్పడ్డారు. రక్తం నమూనాను మార్చేసి ఆల్కహాల్ జాడలు లేవంటూ తప్పుడు నివేదిక సంపాదించారు. పోలీసులు నిందితుడి తాలూకు మరో శాంపిల్‌ను వేరే ల్యాబ్‌కు పంపి, రెండింటి డీఎన్ఏ ఫలితాలను సరిపోల్చడంతో మరోసారి ఈ ఉదంతం వెలుగులోకి వచ్చింది. ఆస్పత్రి ప్రధాన వైద్యాధికారి డాక్టర్ శ్రీహరి హల్నోర్, ఫోరెన్సిక్ విభాగం అధిపతి డాక్టర్ అజయ్ తవాడే, ఉద్యోగి అతుల్ ఘట్‌కాంబ్లేను అదుపులోకి తీసుకున్నారు. వీరికి కోర్టు ఈ నెల 30వ తేదీ వరకు రిమాండ్ విధించింది. తవాడేకు నిందితుడి తండ్రి విశాల్ పలుమార్లు ఫోన్ చేసినట్లు ఆధారాలున్నాయని పోలీస్ కమిషనర్ అమితేశ్ కుమార్ తెలిపారు. ప్రమాదానికి కారణమైన పోర్షె కారును సాంకేతికంగా పరిశీలించేందుకు సంబంధిత కంపెనీ నిపుణులను కూడా రప్పించామన్నారు. నిందితున్ని తప్పించేందుకు ప్రయత్నించిన అభియోగాల్లో అతని తండ్రి, తాత సురేంద్ర ఇప్పటికే పోలీసుల అదుపులో ఉన్న విషయం తెలిసిందే. నిందితుడు కారు నడుపుతూ ఇంటి నుంచి బయలుదేరింది మొదలు, ఎక్కడెక్కడికి అతడు వెళ్లిందీ తెలిపే సీసీ ఫుటేజీ తదితర ఆధారాలు పక్కాగా ఉన్నాయని సీపీ అన్నారు.

సాక్షి
కరీంనగర్
మంగళవారం । 28 । మే । 2024



ఎంసీహెచ్‌లో నిలువెల్లా నిర్లక్ష్యం

కరీంనగర్‌లోని మాతా శిశు ఆరోగ్య కేంద్రానికి నిర్లక్ష్యం ఆవహించింది. ఉద్యోగుల తప్పుతో ఓ రోగి రక్త నమూనానే మారిపోయింది. - 8లో▸



క్వింటాల్ పత్తి రూ.7,450

జమ్మికుంట(హుజూరాబాద్): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం క్వింటాల్ పత్తి గరిష్ట ధర రూ.7,450 పలికింది. క్రయవిక్రయాలను కార్యదర్శి రెడ్డినాయక్ పర్యవేక్షించారు.

గరిష్ఠం/కనిష్ఠం
42.0/35.0

వాతావరణం

వాతావరణం ఎండగా ఉంటుంది. ఉక్కపోతగా ఉంటుంది. తీవ్ర వడగాలులు వీస్తాయి. రాత్రి వేళ వేడిగాలులు వీచే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఓట్ల లెక్కింపులో తప్పులు జరగొద్దు

- స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద భద్రతను పర్యవేక్షించాలి
- వీసీలో చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీవ్‌కుమార్



వీసీలో కలెక్టర్ పమేలా సత్పతి, అధికారులు

కరీంనగర్ అర్బన్: వచ్చే నెల 4వ తేదీన నిర్వహించే ఓట్ల లెక్కింపులో ఎలాంటి తప్పులు జరగొద్దని, ఇందుకోసం పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీవ్‌కుమార్ ఆదేశించారు. సోమవారం ఢిల్లీలోని తన కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, ఇతర అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఓట్ల లెక్కింపు పూర్తయ్యేవరకు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఉదయం, సాయంత్రం ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద భద్రతను కలెక్టర్లు, సీపీలు పర్యవేక్షించాలని పేర్కొన్నారు. ఈవీఎంలు సరిగా ఉన్నాయా లేదా సరిచూసుకోవాలని తెలిపారు. ఏజెంట్ల సమక్షంలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ పారదర్శకంగా చేపట్టాలని, కౌంటింగ్ హాలు వద్ద పటిష్ట భద్రతను ఏర్పాటు చేయాలని సూచించారు. డీఆర్వో పవన్‌కుమార్, జెడ్పీ సీఈవో శ్రీనివాస్, పరిశ్రమల శాఖ జీఎం నవీన్‌కుమార్, మైనింగ్ శాఖ ఏడీ రామాచారి, డీపీవో రవీందర్, డీఆర్డీవో శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సకాలంలో యూనిఫామ్స్ అందించాలి

- మెప్మా పీడీ స్వరూపారాణి



కేంద్రాన్ని పరిశీలిస్తున్న మెప్మాపీడీ, కమిషనర్లు

జమ్మికుంట: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు యూనిఫామ్స్ సకాలంలో అందించాలని మెప్మా పీడీ స్వరూపారాణి అన్నారు. మున్సిపల్ పరిధిలోని విద్యార్థులకు అందించే యూనిఫామ్స్ కుట్టు కేంద్రాలను సోమవారం సందర్శించారు. ప్రభుత్వ సూచనలు పాటించాలని, యూనిఫామ్స్ నాణ్యతగా ఉండాలని, పనులు వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో జమ్మికుంట కమిషనర్ ఎండీ అయాజ్, డీఎంసీ శ్రీవాణి, ఏడీఎంసీ మల్లీశ్వరి, అధికారులు, సీఎల్ఆర్పీలు జ్యోతి, మంజుల, ఆర్పీలు, కుట్టు మిషన్ నిర్వాహకురాలు అబేదబాను పలువురు పాల్గొన్నారు.


28, 29న సర్టిఫికెట్ వెరిఫికేషన్

కరీంనగర్‌సిటీ: శాతవాహన యూనివర్సిటీ పరిధిలోని ప్రైవేట్, ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో అడ్మిషన్‌లో భాగంగా అంగవైకల్యం, ఎన్‌సీసీ, స్పోర్ట్స్ అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను ఈనెల 28, 29 తేదీల్లో నిర్వహించనున్నట్లు దోస్త్ కో ఆర్డినేటర్ ప్రొఫెసర్ సూరపల్లి సుజాత ప్రకటనలో తెలిపారు. యూనివర్సిటీ దోస్త్ హెల్ప్‌లైన్ సెంటర్, అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్‌లో వెరిఫికేషన్ నిర్వహించడం జరుగుతుందని, మిగతా వివరాలకు యూనివర్సిటీ హెల్ప్‌లైన్ సెంటర్‌ను సంప్రదించాలని కోరారు.


సంజయ్(బీజేపీ ఎంపీ)


డి.అర్వింద్(బీజేపీ ఎంపీ)


ఈటల రాజేందర్


ఆది శ్రీనివాస్


అడ్లూరి లక్ష్మణ్‌కుమార్


మేడిపల్లి సత్యం


కవ్వంపల్లి సత్యనారాయణ


జువ్వాడి నర్సింగరావు

- ఈటల రాజేందర్, జువ్వాడి నర్సింగరావు, కవ్వంపల్లి పై నిఘా
- తన ఫోన్ ట్యాప్ చేశారని ఇటీవల బండి ఆరోపణలు
- త్వరలో ఉమ్మడి జిల్లాకు చెందిన మరిన్ని పేర్లు
- మాజీ డీసీపీ వాంగ్మూలంతో వేడెక్కిన రాజకీయాలు


వదలని ట్యాపింగ్ కలకలం

రాధాకిషన్‌రావు వాంగ్మూలంలో కరీంనగర్ నేతలు

ఎవరా షాడో ఆఫీసర్..?!



ఫోన్ ట్యాపింగ్‌పై ఈ ఏడాది మార్చి 16న 'సాక్షి'లో ప్రచురితమైన కథనం



Mr. Prabhakar Rao used to discuss with me about political developments in different constituencies and gather information about persons posing threat to BRS party and its leaders and pass on the same to Mr. Praneeth Kumar who used to monitor them continuously to develop profiles useful for controlling them help BRS. In this way I came to know that they had put surveillance over Mr. Shambipur Raju of BRS who had difference with Qutbullapur BRS MLA; Mr. T. Rajaiah, BRS leader who had differences with Kadiyam Srihari; Patnam Mahender Reddy and his wife of BRS party as they were unhappy with Tandur MLA; RS Praveen Kumar Rtd IPS; Teegala Krishna Reddy; Teenmar Mallanna; most of the family members of Revanth Reddy, TPCC President; media persons NTV Narendra Chowdary and ABN Radhakrishna; many opposition party candidates like Raghuveer s/o Jana Reddy of Nagarjunasagar; Saritha Thirupathaiah of Godwal; Juvvadi Narsinga Rao of Korutla; Vamshi Krishna of Achampet; Kavvampalli Satyanarayana of Manakondur; staff of Nizamabad MP D.Arovind; Etela Rajender and Bandi Sanjay; many businessmen of different construction and real estate companies; etc., to track their movements and also to know their networks and associates.

మాజీ డీసీపీ రాధాకిషన్‌రావు పోలీసుల ఎదుట వెల్లడించిన ఉమ్మడి జిల్లాకు చెందిన రాజకీయ నాయకుల పేర్లు, వివరాలు

సాక్షిప్రతినిధి,కరీంనగర్:

బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన ఫోన్ ట్యాపింగ్ అంశానికి కరీంనగర్‌కు విడదీయరాని అనుబంధం ఉందన్న విషయం మరోసారి తేటతెల్లమైంది. ఈ కేసులో ఇప్పటికే అరెస్టయిన మాజీ డీసీపీ రాధాకిషన్‌రావు పోలీసులకు తాజాగా ఇచ్చిన వాంగ్మూలంలో మరోసారి ఉమ్మడి జిల్లా నేతలు, వారిఫోన్ల ట్యాపింగ్ విషయాలు వెల్లడయ్యాయి. దీంతో తమఫోన్లు ట్యాప్ అయ్యాయంటూ కొంతకాలంగా పలు వేదికలపై ఉమ్మడి జిల్లా నేతలు చేస్తున్న ఆరోపణలకు బలం చేకూరినట్లయ్యింది. తమకు పైనుంచి వచ్చిన ఆదేశాల ప్రకారం.. ఉమ్మడి జిల్లాలోని పలువురు ప్రతిపక్ష నేతల ఫోన్లను ట్యాప్ చేశామంటూ రాధాకిషన్‌రావు పోలీసులకు ఇచ్చిన స్టేట్‌మెంట్ ఇప్పుడు ఉమ్మడి జిల్లా రాజకీయాలను వేడెక్కించింది. ఇంతకాలానికి తమ ఆరోపణలకు ఆధారాలు లభించాయంటూ నేతలు పోటాపోటీగా బీఆర్‌ఎస్ తీరును ఎండగట్టేందుకు సిద్ధమవుతున్నారు. అయితే, ఉమ్మడి జిల్లాకు చెందిన మరికొందరి పేర్లు బయటికి వస్తాయని, రాజకీయ వేడి మరింత పెరుగుతుందని ప్రచారం జరుగుతోంది.

సిరిసిల్ల కేంద్రంగా..

అప్పటి డీజీపీ మహేందర్‌రెడ్డి సహా ప్రతిపక్ష నేతల ఫోన్లు ట్యాప్ అవుతున్నాయంటూ ప్రస్తుత సీఎం, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి 2021లో హుజూరాబాద్ ఉప ఎన్నికల సమయంలో కరీంనగర్‌లోని మైత్రీ హోటల్లో జరిగిన సమావేశంలో తొలిసారి ఆరోపించారు. ప్రభాకర్‌రావు, వేణుగోపాల్‌రావు, దుగ్యాల ప్రణీత్‌రావు సహా 30 మంది అధికారులు ఫోన్ ట్యాపింగ్ చేస్తున్నారని రేవంత్ ఆ సమయంలోనే వెల్లడించారు. చిత్రంగా అదే ప్రణీత్‌రావు సిరిసిల్లలో డీఎస్పీగా ఈ ఏడాది మార్చిలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం నాలుగురోజులకే.. మార్చి 12వ తేదీన అతన్ని ఫోన్ ట్యాపింగ్ కేసులో హైదరాబాద్ పోలీసులు అరెస్టు చేసి రాజధానికి తరలించిన విషయం తెలిసిందే. ప్రణీత్‌రావు ఫోన్ నుంచి రీట్రెవ్ చేసిన సమాచారం ప్రకారం.. సీఎం రేవంత్‌రెడ్డికి సన్నిహితుడిగా పేరొందిన కాంగ్రెస్ నేత సత్తు మల్లేశ్ ఫోన్ నంబర్లు వెలుగుచూడడం కలకలం రేపింది. సత్తు మల్లేశ్‌తోపాటు, కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, ఆది శ్రీనివాస్, ధర్మపురి లక్ష్మణ్ తదితరుల ఫోన్లు ట్యాప్ అయ్యాయన్న ప్రచారం జరిగినా.. అధికారులు ధ్రువీకరించలేదు. ఈ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారమంతా ఫోన్‌ట్యాపింగ్ కోసం ఏర్పాటు చేసిన సిరిసిల్ల కేంద్రంగా ఏర్పాటు చేసిన వార్‌రూం నుంచే జరిగిందని సమాచారం.

ఇబ్బంది పెడుతున్నారని..

బీఆర్‌ఎస్ పార్టీకి వ్యతిరేకంగా వ్యవహరించే వారి ఫోన్లు ట్యాప్ చేయాలని తమకు ఆదేశాలు వచ్చేవని రాధాకిషన్‌రావు పోలీసులకు తెలిపినట్లు సమాచారం. అందులో ఉమ్మడి జిల్లాకు చెందిన మాజీమంత్రి ఈటల రాజేందర్, ఎంపీ బండి సంజయ్, మరో ఎంపీ ధర్మపురి అర్వింద్, కోరుట్ల నుంచి ఎమ్మెల్యేగా కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీచేసిన జువ్వాడి నర్సింగరావు, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ తదితరుల ఫోన్లు ట్యాప్ చేసినట్లు మాజీ డీసీపీ ఇచ్చిన వాంగ్మూలం కలకలం రేపుతోంది. హుజూరాబాద్ ఉపఎన్నిక సమయంలో ఈటల రాజేందర్ ఫోన్లపై నిఘా పెట్టినట్లు సమాచారం. అప్పట్లో బీఆర్‌ఎస్‌తో విభేదించి బీజేపీ నుంచి పోటీకి నిల్చున్న సమయంలో ఆయన ఫోన్ ట్యాప్ అయినట్లు ప్రచారం జరిగింది. అందుకే, ఈటల కీలకమైన విషయాలను ఫోన్‌లో కాకుండా నేరుగానే చర్చించేవారు. ఇక జీవో నం.317 దీక్ష సమయంలో, పదో తరగతి ప్రశ్నాపత్రాల లీకేజీ సమయంలో, బీఆర్‌ఎస్ వ్యతిరేకంగా పలుదఫాలు దీక్షలు, పాదయాత్రలు చేసిన సమయంలో తన ఫోన్లు ట్యాప్ చేశారంటూ ఇటీవల ఎంపీ బండి సంజయ్ ఆరోపించారు. తాజాగా రాధాకిషన్ వాంగ్మూలం ఈ ఆరోపణలకు బలం చేకూర్చిందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

కరీంనగర్‌తో లింకులు..

ఫోన్ ట్యాపింగ్ కేసుకు కరీంనగర్‌తో విడదీయరాని బంధం ఉంది. ఈ వ్యవహారంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న అప్పటి ఎస్ఐబీ చీఫ్ ప్రభాకర్‌రావు వియ్యమందుకుంది. కరీంనగర్‌లోనే కావడం గమనార్హం. తన వియ్యంకుడితోనే కేసు నుంచి బయటపడేందుకు ప్రభాకర్‌రావు అమెరికా నుంచి చక్రం తిప్పుతున్నాడని ఇటీవల సంజయ్ ఆరోపించిన విషయం తెలిసిందే. ఇక మాజీ డీసీపీ రాధాకిషన్‌రావు తల్లి అనారోగ్యంతో ఇటీవల కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందారు. ఆ సమయంలో కోర్టు అనుమతితో తల్లి వద్దకు రాధాకిషన్‌రావు కోర్టు అనుమతితో వచ్చిన సంగతి తెలిసిందే. అసెంబ్లీ ఎన్నికలకు ముందు రాధాకిషన్‌రావు కరీంనగర్‌లోని ప్రముఖ హోటల్లో బసచేశారని, ఆ సమయంలోనే తన ఫోన్ ట్యాప్ చేశారని బండి సంజయ్ కూడా ఆరోపించడం గమనార్హం. ఇక డీఎస్పీ ప్రణీత్‌రావు సిరిసిల్లలో చార్జి తీసుకున్న నాలుగు రోజులకే అరెస్టయిన సంగతి తెలిసిందే. ఫోన్ ట్యాప్ అయిన ప్రతిపక్ష నాయకులకే కాదు, ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులకు కూడా కరీంనగర్‌తో ప్రత్యక్ష పరోక్ష సంబంధాలు ఉండటం విశేషం.



మైనర్ల డ్రైవింగ్!

రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలను తప్పని సరిగా పాటించాలని పోలీస్ శాఖ విస్తృత ప్రచారం జనం చెవికెక్కడం లేదు. హెల్మెట్ లేకుండా ప్రయాణం, ట్రిపుల్ రైడింగ్, మైనర్ డ్రైవింగ్ చట్టరీత్యా నేరం అయినప్పటికీ ఎక్కడా మార్పు కనిపించటం లేదు. పిల్లలకు వాహనాలు ఇవ్వొద్దని తల్లిదండ్రులను హెచ్చరిస్తున్నా వినడం లేదు. కఠినమైన చర్యలు తీసుకుంటే తప్ప ప్రజల్లో సామాజిక బాధ్యత పెరగదని జనం అభిప్రాయపడుతున్నారు.సోమవారం కరీంనగర్‌లో వివిధ ప్రాంతాల్లో నిబంధనలు ఉల్లంఘించి మైనర్లు ద్విచక్రవాహనాలు నడిపిస్తూ 'సాక్షి' కంటపడగా క్లిక్ మనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్



పక్కాగా ఓట్ల లెక్కింపు ప్రక్రియ

- కలెక్టర్ పమేలా సత్పతి



మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి, చిత్రంలో అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, ఆర్డీవో మహేశ్వర్

కరీంనగర్ అర్బన్: పార్లమెంట్ ఎన్నికల ఓట్ల లెక్కింపు జూన్ 4న ఉన్నందున జాగ్రత్తగా నిర్వహించాలని కలెక్టర్ పమేలా సత్పతి సిబ్బందిని ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన కౌంటింగ్ సూపర్‌వైజర్లు, అసిస్టెంట్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల ప్రక్రియలో కౌంటింగ్ చాలా కీలకమైందని పేర్కొన్నారు. తప్పిదాలు జరగకుండా పకడ్బందీగా వ్యవహరించాలని, లేకుంటే ఇబ్బందులు ఎదురవుతాయని సూచించారు. అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని, ఏదైనా సమస్య వస్తే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. సిబ్బంది ఉదయం 7 గంటల వరకే కౌంటింగ్ హాల్‌కు చేరుకొని, టేబుళ్ల వారీగా ఈవీఎంలను సరిచూసుకోవాలన్నారు. ఏజెంట్లతో సిబ్బంది మర్యాదగా వ్యవహరించాలని సూచించారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తయ్యే వరకు కౌంటింగ్ హాల్ నుంచి ఎవరూ బయటకు వెళ్లరాదని పేర్కొన్నారు. సెల్‌ఫోన్లకు అనుమతి లేదని, నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదనపు కలెక్టర్ ప్రఫుల్‌దేశాయ్ ఆర్డీవో మహేశ్వర్, తహసీల్దార్లు పాల్గొన్నారు.

ఈవీఎం గోదాము పరిశీలన

ఈవీఎం గోదామును కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ సోమవారం పరిశీలించారు. కౌంటింగ్ పూర్తయిన తర్వాత ఈవీఎంలను భద్రపరిచేందుకు గోదాంలో గదులను పర్యవేక్షించారు. ఈవీఎంల నోడల్ ఆఫీసర్ కిరణ్ ప్రకాష్, కలెక్టరేట్ ఏవో సుధాకర్, సూపరింటెండెంట్ శ్రీవాణి తదితరులు ఉన్నారు.

కలెక్టర్‌ను కలిసిన జడ్జీలు

ఉమ్మడి జిల్లాలోని పలువురు జడ్జీలు సోమవారం కలెక్టర్ పమేలా సత్పతిని మర్యాదపూర్వకంగా కలిశారు. 9 మంది జడ్జీలు విధుల్లో భాగంగా శిక్షణ తీసుకుంటున్నారు. కలెక్టర్‌ను కలిసి పలు అంశాలపై చర్చించారు.

ఔట్‌సోర్సింగ్ హవా

- బల్దియాలో అక్రమాలకు వారే మెయిన్‌డోర్
- 29 మంది కంప్యూటర్ ఆపరేటర్లు
- అన్ని విభాగాల్లోనూ వాళ్లే 'కీ'లకం

కరీంనగర్ కార్పొరేషన్: 'కుక్క తోకను ఆడించడం సాధారణం.. తోక కుక్కను ఆడించడం అసాధారణం'. నగరపాలకసంస్థలో కొద్ది సంవత్సరాలుగా జరుగుతున్న తంతు ఇదే. ఉన్నతాధికారులు, అధికారులు, ఉద్యోగులు ఎంతమంది ఉన్నా.. ఔట్‌సోర్సింగ్ పద్ధతిన నియమితులైన కంప్యూటర్ ఆపరేటర్స్‌దే ఇక్కడ హవా. బల్దియాకు సంబంధించి అన్ని విభాగాల్లోనూ తిష్ట వేసిన ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఆయా డిపార్ట్‌మెంట్‌లను పూర్తిగా చేతుల్లోకి తీసుకున్నారు. కొంతమంది పెద్దల అండదండలు పుష్కలంగా ఉండడంతోనే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఆడింది ఆటగా మారింది. కాగా అక్రమార్జనకు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులే మెయిన్‌డోర్ కావడంతో పెద్దలు సదరు ఉద్యోగులకే 'పెత్తనం' అప్పగించడం ఇక్కడ బహిరంగ రహస్యం.

29 మంది ఆపరేటర్లు

నగరపాలకసంస్థలో ఔట్‌సోర్సింగ్ పద్ధతిన 29 మంది కంప్యూటర్ ఆపరేటర్లు పనిచేస్తున్నారు. ఇందులో బర్త్ అండ్ డెత్ సెక్షన్‌లో ఇద్దరు, అకౌంట్ సెక్షన్‌లో ఇద్దరు, ఇంజినీరింగ్‌లో ముగ్గురు, టాక్స్ సెక్షన్‌లో ఇద్దరు, స్మార్ట్‌సిటీలో ఒకరు, టౌన్‌ప్లానింగ్‌లో ఒకరు, ఎస్టాబ్లిష్‌మెంట్‌లో ఒకరు, శానిటేషన్‌లో ఇద్దరు, పెన్షన్‌లో ఒకరు, రెవెన్యూలో ముగ్గురు, సీఎస్సీలో ఇద్దరు, కాల్‌సెంటర్‌లో ఒకరు, మెప్మాలో ఒకరు, సీసీలు, ఇతరత్రా ఏడుగురు కంప్యూటర్ ఆపరేటర్‌లుగా విధుల్లో ఉన్నారు. 29 మంది ఆపరేటర్లు ఉన్నట్లు రికార్డుల్లో ఉన్నా, ఇందులో కొంతమంది భౌతికంగా కనిపించరు. వారెక్కడున్నారో, ఏం పనిచేస్తున్నారో ఎవరికీ తెలియదు. కానీ ప్రతినెలా ఠంఛన్‌గా జీతాలు మాత్రం వెళుతుంటాయి. ఇంకొంతమంది కంప్యూటర్ ఆపరేటర్లు నగరపాలకసంస్థను దాటి, నేతల ఇళ్లలో సేవలందిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఇలాంటి 'కంప్యూటర్ ఆపరేటర్ల'ను పట్టించుకున్న నాథుడే లేరు.

అక్రమాలకు మెయిన్ డోర్

నగరపాలకసంస్థలో ఎక్కడ అవినీతి అక్రమాలు చోటుచేసుకున్నా, ఎలాంటి కుంభకోణం వెలుగుచూసినా, అందులో తప్పకుండా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల ప్రమేయం ఉంటోంది. రెగ్యులర్ ఉద్యోగులపై ఆరోపణలు వస్తే సస్పెన్షన్‌లు, ఇంక్రిమెంట్లు కోత, ఒక్కోసారి రిమూవల్ సర్వీసు శిక్షలు పడే అవకాశం ఉంటుంది. కానీ, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు మాత్రం ఇలాంటి సమస్యలేవీ ఉండవు. ఒకవేళ వారిని తొలగించినా, రెండుమూడు నెలల్లోనే వారికి అండగా ఉండే పెద్దలు తిరిగి తీసుకువస్తుంటారు. ఈ కారణంగానే అక్రమాలకు ఎక్కువగా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులనే ముందు పెడుతుండడం ఏళ్లుగా సాగుతోంది. అక్రమాలకు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులే కారణమవుతుండడంతో, ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నగరపాలకసంస్థ రెవెన్యూ విభాగంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను కీలక బాధ్యతల నుంచి తప్పించింది. దీంతో ఇతర అన్ని విభాగాల్లో తిష్ట వేసిన ఔట్‌సోర్సింగ్ కంప్యూటర్ ఆపరేటర్ల వ్యవహారం తెరపైకి వచ్చింది. ప్రస్తుతం బల్దియాలోని అన్ని వ్యవహారాలు ఆన్‌లైన్‌లో సాగుతుండగా, ఈ కంప్యూటర్ ఆపరేటర్లకు సహజంగానే ప్రాధాన్యత అధికంగా ఏర్పడింది. దీనిని ఆసరగా తీసుకొని కొంతమంది కంప్యూటర్ ఆపరేటర్లు అక్రమాలకు తెరలేపారనే విమర్శలున్నాయి. అన్ని వ్యవహారాల్లోనూ వీరే 'కీ'లకం కావడంతో అధికారులు సైతం వీరిపై ఆధారపడాల్సి వస్తోంది. ఫలితంగా కొంతమంది ఆపరేటర్లు అడ్డదారి తొక్కుతున్నారనే ప్రచారం ఉంది. రెవెన్యూ విభాగం తరహాలోనే రాష్ట్ర ప్రభుత్వం మొత్తంగా మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులపై నిర్ణయం తీసుకుంటే బాగుండేదని అధికారులు అభిప్రాయపడుతున్నారు. కాగా జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్‌లు ప్రత్యేక దృష్టి సారిస్తే తప్ప నగరపాలకసంస్థలో కీలకంగా మారిన కంప్యూటర్ ఆపరేటర్ల అక్రమాలకు చెక్ పడే అవకాశం కనిపించడం లేదు.



ఛ్ఛే.. వీళ్ల తనిఖీలింతే!

- కల్తీరాయుళ్లపై దృష్టి పెట్టని ఫుడ్ సేఫ్టీ అధికారులు
- అందుబాటులో లేని మొబైల్ టెస్టింగ్ ల్యాబ్
- ఇలాగైతే కల్తీ మాఫియాకు అడ్డుకట్ట పడేదెలా?
- ఈ నంబర్‌కు ఫిర్యాదు చేయొచ్చు

91001 05795

కరీంనగర్ అర్బన్: ఆహార తనిఖీ ప్రత్యేక బృందం పనితీరుపై అనేక అనుమానాలు, విమర్శలు తలెత్తుతున్నాయి. ఇందుకు నిదర్శనమే జిల్లా కేంద్రంలో సోమవారం మొక్కుబడి తనిఖీలు చేసి చేతులు దులుపుకుందనే ఆరోపణలు వచ్చాయి. ఆదివారం నిర్వహించిన తనిఖీల వివరాల వెల్లడిలో గోప్యత పాటించిన అధికారులు.. 'సాక్షి'లో సోమవారం ప్రచురితమైన కథనంతో దిగొచ్చారు. నగరంలోని శ్వేత, ప్రతిమ, శ్రీవిందు భోజనం హోటళ్లలో గడువు ముగిసిన ఆహార పదార్థాలు గుర్తించినట్లు వెల్లడించారు. అంతేకాదు.. సోమవారం కృతుంగ రెస్టారెంట్, మైత్రి రెసిడెన్సీ, హోటల్ పీకాక్ ప్రైడ్‌లో తనిఖీలు చేశామని అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ అమృతశ్రీ తెలిపారు. కృతుంగ రెస్టారెంట్‌లో గడువు ముగిసిన పప్పీ సీడ్స్, మూంగ్‌దాల్, జీర, మసాల పౌడర్లు, నూడిల్స్, మిర్చీలు, పెసలు గుర్తించగా.. మైత్రీ రెసిడెన్సీ, హోటల్ పీకాక్ ప్రైడ్‌లో అనుమానిత ఆహార పదార్థాల నమూనాలు సేకరించి నాచారంలోని పరిశోధన కేంద్రానికి పంపించారు. ఫోన్లలో అధికారులను సంప్రదిస్తే తప్ప మీడియాకు సమాచారం వెల్లడించలేదు. ఇదేమిటని ప్రశ్నిస్తే.. మీడియాకు దూరంగా ఉండాలని కమిషనరేట్ నుంచి ఆదేశాలున్నాయని అధికారులు చెప్పుకొచ్చారు.

మొబైల్ టెస్టింగ్ ల్యాబ్ వాహనమేది?

ఆయిల్ ట్రేడర్లు, బేకరీలు, హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, పండ్ల దుకాణాలు, కేఫ్‌లు, కూల్‌డ్రింక్ షాపులు, చిరుతిళ్ల తయారీ కేంద్రాలు, ఇతర నిత్యావసరాల కల్తీకి ముకుతాడు వేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక తనిఖీలకు శ్రీకారం చుట్టింది. ప్రత్యేక బృందం మొబైల్ టెస్టింగ్ ల్యాబ్ వాహనంతో అక్కడికక్కడే పరీక్షలు నిర్వహించి కేసులు నమోదు చేయాల్సి ఉంది. కానీ, ఆ వాహనం జాడే లేదు. పలు దుకాణాల్లో తనిఖీలు చేసినట్లు చేసి శాంపిళ్లను సేకరించి పరీక్షల నిమిత్తం హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. 15 రోజుల అనంతరం ఫలితాలు వస్తే.. అప్పుడు కేసులు నమోదు చేయనున్నారు.

కల్తీరాయుళ్ల వైపు కన్నెత్తి చూడలేదు

ఒకరిద్దరి కనుసన్నల్లో తనిఖీలు సాగినట్లు తెలుస్తోంది. ప్రకాశంగంజ్‌లోని పలువురు వ్యాపారులు, బొమ్మకల్, తీగలగుట్టపల్లి, అల్గునూరు, కోతిరాంపూర్, పద్మనగర్, విద్యానగర్, రేకుర్తి తదితర ప్రాంతాల్లో కల్తీ వ్యాపారం విచ్చలవిడిగా సాగుతోంది. గతంలో ఆశోక్‌నగర్ ప్రాంతంలో పశువుల ఎముకల నూనెను వంట నూనెల్లో కలిపి విక్రయించిన ఘటన వెలుగు చూసింది. పామాయిల్, పత్తినూనె, కొత్తగా సూపరోలిన్ కలుపుతూ నూనెలు కల్తీ చేసి విక్రయిస్తున్నారు. సన్‌ఫ్లయిర్ ఆయిల్‌కు కొరత ఏర్పడటంతో పెద్దఎత్తున సూపరోలిన్ ఆయిల్ కలుపుతున్నారు. వినియోగదారులు ఎక్కువగా సన్‌ఫ్లవర్‌పై ఆసక్తి చూపుతుండటంతో తక్కువ ధరకు లభించే సూపరోలిన్‌ను సన్‌ఫ్లవర్ పేరుతో విక్రయిస్తూ లీటరుపై రూ.50– రూ.60వరకు లాభం పొందుతున్నారు.

సూపరోలిన్ ఆయిల్ అంటే..

పామాయిల్ బ్లెండింగ్ చేసి పామోలిన్ తయారు చేస్తారు. దీన్ని మరింత రిఫైన్ చేస్తే సూపరోలిన్ ఆయిల్ వస్తుంది. ఇది చూడ్డానికి వాటర్ లాగే ఉంటుంది. సన్‌ఫ్లవర్ ఆయిల్ కంటే తక్కువ ధరకే లభిస్తుంది. పైగా అందులో కలిపినా ఎలాంటి తేడా కనిపించదు. దీంతో సన్‌ఫ్లవర్ నూనెలో సూపరోలిన్ కలుపుతున్నారు.

విస్తరిస్తున్న కల్తీ మాఫియా

పెరిగిన ధరలతో వినియోగదారులు కుదేలవుతున్నారు. ఇదిచాలదన్నట్లు ఏది కల్తీ, ఏది నాణ్యమైనదో గుర్తించలేని పరిస్థితి నెలకొంది. నగర శివారు ప్రాంతాల్లోని గోడౌన్లను కేంద్రాలుగా చేసుకుని కల్తీ చేస్తున్నారు. పామాయిల్, తవుడు నూనెలను కలుపుతూ వేరుశనగ, పొద్దుతిరుగుడు నూనెల పేరిట మార్కెట్ చేస్తున్నారు. నియంత్రించాల్సిన అధికార యంత్రాంగాన్ని పటిష్టం చేయకపోవడంతో మాఫియా ఆగడాలకు అడ్డుకట్ట పడడంలేదు. నగర జనాభా 3లక్షలకు పైమాటే. జిల్లా జనాభా 10లక్షలు కాగా ఆహార తనిఖీ విభాగంలో జూనియర్ అసిస్టెంట్ మినహా అన్ని పోస్టులు ఖాళీగా ఉన్నాయి.



మైత్రి హోటల్‌లో తనిఖీ చేస్తున్న అధికారులు

తనిఖీలే లేవు..

ఆహార తనిఖీ విభాగం ప్రతీనెల తనిఖీ చేయాల్సి ఉంది. ఫిర్యాదు చేసినా ఆహార తనిఖీ అధికారులు పట్టించుకోకుంటే.. రాష్ట్రస్థాయిలోని 91001 05795 మొబైల్‌నంబర్‌కు కాల్‌చేసి సమాచారం ఇవ్వొచ్చు.

క్లుప్తంగా

వడదెబ్బతో వృద్ధుడి మృతి

ధర్మారం(ధర్మపురి): కొత్తూరు గ్రామానికి చెందిన బట్టు నర్సయ్య(70) సోమవారం వడదెబ్బతో మరణించాడని గ్రామస్తులు తెలిపారు. నర్సయ్య కుమారుడు బట్టు తిరుపతి కొన్నేళ్లక్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. అయితే, ఇటీవల తన కూతురుకు పెళ్లిచేసి అత్తగారింటికి పంపించాడు. దీంతో ఇంట్లో భార్యతోపాటు ఉంటున్న నర్సయ్య.. తరచూ కాలినడకనే ధర్మారం వస్తూపోతుంటాడని గ్రామస్తులు తెలిపారు. ఈ క్రమంలోనే ధర్మారం వచ్చిన నర్సయ్య మధ్యాహ్నం సమయంలో తహసీల్దార్ కార్యాలయం వంతెన ఆవలి ఒర్రె వద్ద పడిపోయాడు. గమనించిన స్థానికులు ఎస్సై సత్యనారాయణకు సమాచారం అందించారు. ఆయన సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించగా అప్పటికే మరణించాడు. నర్సయ్య కుటుంబసభ్యులకు సమాచారం అందించినట్లు ఎస్సై తెలిపారు.

ఆత్మహత్యకు యత్నించిన యువకుడి మృతి

ధర్మారం(ధర్మపురి): కానంపెల్లి గ్రామానికి చెందిన ఆరే మహేశ్(21) చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందినట్లు ఎస్సై సత్యనారాయణ సోమవారం తెలిపారు. కడుపునొప్పి భరించలేక మహేశ్ ఈ నెల 25న తన ఇంట్లో పురుగులమందు తాగాడు. గుర్తించిన కుటుంబసభ్యులు వెంటనే హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆరోగ్య పరిస్థితి విషమించి మరణించినట్లు మృతుడి తండ్రి సత్తయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య


శంకర్ మృతదేహం

ముస్తాబాద్(సిరిసిల్ల): ముస్తాబాద్ మండలం చిప్పలపల్లికి చెందిన దినసరి కూలీ సాదల శంకర్ (45) సోమవారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై శేఖర్ రెడ్డి తెలిపిన వివరాలు. చిప్పలపల్లి గ్రామంలోని కేసీఆర్‌కాలనీలో ఉండే శంకర్ మద్యానికి బానిసయ్యాడు. కొంతకాలంగా తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నాడు. ఈక్రమంలో సోమవారం శంకర్ ఉరివేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. ఇంటి పెద్ద దిక్కును కోల్పోవడంతో భార్య, కుమారులు, కూతురుల రోదనలు మిన్నంటాయి. మృతుడి సోదరుడు లింగం ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నారు. శంకర్ అంత్యక్రియలకు గ్రామస్తులు చందాలు వేసుకున్నారు. మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ సర్పంచ్ గాడిచెర్ల దేవయ్య కోరారు.

భూ ఆక్రమణదారుడిపై సస్పెక్ట్ షీట్

కరీంనగర్‌క్రైం: కరీంనగర్ జిల్లా గంగాధర మండలం లక్ష్మీదేవిపల్లికి చెందిన గుర్రం రాజిరెడ్డిపై సస్పెక్ట్ షీట్ తెరిచారు. రాజిరెడ్డి అక్రమంగా భూ ఆక్రమణలకు పాల్పడి పలు కేసుల్లో నిందితుడిగా ఉండి, వివిధ నేరాల్లో చురుకుగా ఉంటున్నాడని శాంతి భద్రతల దృష్ట్యా అతడిపై చట్టపరంగా సస్పెక్ట్ షీట్ తెరిచే అవసరముందని కొత్తపల్లి ఎస్సై సాంబమూర్తి అభ్యర్థన మేరకు కరీంనగర్ రూరల్ సీఐ ప్రదీప్ కుమార్ సిఫారసు చేయగా కరీంనగర్ రూరల్ ఏసీపీ వెంకటరమణ సోమవారం రాజిరెడ్డిపై సస్పెక్ట్ షీట్ తెరిచారు.

ఎంసీహెచ్‌లో నిలువెల్లా నిర్లక్ష్యం

- ఓ–పాజిటివ్ బ్లడ్ గ్రూప్‌కు బీ–నెగెటివ్‌గా నిర్ధారణ
- అనుమానంతో ప్రైవేటు ల్యాబ్‌ను ఆశ్రయించిన బాధితులు
- కుటుంబసభ్యుల అప్రమత్తతతో పేషెంట్‌కు తప్పిన ప్రాణాపాయం



ఎంసీహెచ్ ల్యాబ్‌లో తప్పుగా ఇచ్చిన బీ–నెగెటివ్ రిపోర్టు



బీ–నెగెటివ్ తప్పు అని తేలాక ఇచ్చిన ఓ–పాజిటివ్ రిపోర్టు

కరీంనగర్‌టౌన్: జిల్లా కేంద్రంలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో నిలువెల్లా నిర్లక్ష్యం ఆవహించింది. ల్యాబ్‌లో మద్యం సీసాల కలకలం ఘటన మరిచిపోకముందే.. ల్యాబ్ సిబ్బంది నిర్లక్ష్యంతో ఏకంగా బ్లడ్ గ్రూప్ రిపోర్టు తప్పుగా ఇచ్చి ఓ మహిళ ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టిలా వ్యవహరించిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. పేషెంట్ బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం విలాసాగర్ గ్రామానికి చెందిన సుంకపాక మౌనిక అనే మహిళ తీవ్ర రక్తస్రావంతో ఈనెల 25న నగరంలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో చేరింది. రక్తం తక్కువగా ఉంది ఎక్కించాలని వైద్యులు సూచించారు. వెంటనే రక్తం గ్రూప్ నిర్ధారణ కోసం మాతా శిశు కేంద్రంలోని ల్యాబ్‌లో శాంపిల్ ఇవ్వగా.. పరీక్షించి బీ–నెగటివ్ అని నిర్ధారించారు. పేషెంట్ బంధువులు రక్తం కోసం ప్రయత్నించినా బీ–నెగెటివ్ అరుదైన గ్రూప్ కావడంతో ఎవరూ అందుబాటులోకి రాలేదు. అయితే బీ–నెగెటివ్ గ్రూప్ పేషెంట్ కుటుంబసభ్యులలో ఎవరికీ లేకపోవడంతో రక్త పరీక్షపై అనుమానం వచ్చి ప్రయివేటు ల్యాబ్‌లో పరీక్ష నిర్వహించారు. అక్కడ ఓ–పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. రిపోర్టులు చూసిన కుటుంబసభ్యులు నిర్ఘాంతపోయారు.

ల్యాబ్ సిబ్బంది దురుసు ప్రవర్తన

తప్పుడు రిపోర్టుపై ఆగ్రహించిన పేషెంట్ కుటుంబ సభ్యులు మాతా శిశు హాస్పిటల్ ల్యాబ్ సిబ్బందిని నిలదీశారు. దీంతో అప్రమత్తమయిన ల్యాబ్ సిబ్బంది తప్పుడు రిపోర్ట్‌ను మార్చి సరిచేసి ఇచ్చారు. ప్రైవేటు ఆసుపత్రిలో పరీక్ష చేయించకుండా రక్తం ఎక్కిస్తే పేషెంట్ పరిస్థితి ఏంటని ఆ సమయంలో ల్యాబ్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందిని ప్రశ్నించగా పేషెంట్ కుటుంబసభ్యులపై దురుసుగా ప్రవర్తించినట్లు ఆరోపిస్తున్నారు. పై అధికారులకు ఫిర్యాదు చేసుకొండంటూ నిర్లక్ష్యపు సమాధానం చెప్పినట్లు తెలిపారు.

పేషెంట్‌కు తప్పిన ప్రాణాపాయం

బీ–నెగెటివ్ రక్తం లభించకపోవడంతో పేషెంట్‌కు ప్రాణాపాయం తప్పిందని బంధువులు తెలిపారు. బీ–నెగెటివ్ రక్తదాతలు వచ్చి ఉంటే పరిస్థితి ఎలా ఉండేదో ఊహించుకుంటేనే భయమేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ల్యాబ్ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా తమ పేషెంట్‌కి రక్తం ఎక్కిస్తే అన్యాయంగా ప్రాణాలు పోయేవని కుటుంబసభ్యులు వాపోయారు. తమకు అనుమానం వచ్చి అప్రమత్తమై ప్రయివేటు ల్యాబ్‌లో రక్త పరీక్షలు చేయించడం వల్లే తమ పేషెంట్‌ను కాపాడుకున్నామన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో నాణ్యమైన సేవలు ఉచితంగా అందుతాయనే నమ్మకంతో పేద రోగులు చికిత్స కోసం వస్తుంటే, సిబ్బంది నిర్లక్ష్యంతో వారి ప్రాణాల మీదకు తెసున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

> **ల్యాబ్ టెక్నీషియన్‌కు మెమో జారీ**
>
> విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించి ఓ–పాజిటివ్ బ్లడ్ గ్రూప్‌నకు బదులుగా బీ–నెగెటివ్ అని మహిళా పేషెంట్‌కు తప్పుడు రిపోర్టు ఇచ్చిన ల్యాబ్ టెక్నీషియన్ ఉమకు మెమో జారీ చేశాం. 24 గంటల్లోపు వివరణ ఇవ్వవల్సిందిగా ఆదేశించాం. లేని పక్షంలో నిబంధనల ప్రకారం చర్యలు చేపడతాం.
>
> – డాక్టర్ వీరారెడ్డి, ఆస్పత్రి సూపరింటెండెంట్

తప్పుడు కేసు నుంచి తప్పించండి

- రాష్ట్ర డీజీపీకి నీలోజిపల్లి వాసి ఫిర్యాదు

బోయినపల్లి(చొప్పదండి): కరీంనగర్‌లో నివసించే తనపై పోలీసులు తప్పుడు కేసు నమోదు చేశారంటూ మండలంలోని నీలోజిపల్లికి చెందిన కూస శ్రీనివాస్ సోమవారం రాష్ట్ర డీజీపీకి ఫిర్యాదు చేశాడు. వివరాలు శ్రీనివాస్ కథనం ప్రకారం. తమ బంధువు వెంకటేశ్‌కు గ్రామంలోని ఒకరితో ఈనెల 24న గొడవ జరిగిందని.. కరీంనగర్‌లో ఉంటున్న తనకు ఆ గొడవతో ఎలాంటి సంబంధం లేదన్నారు. అయినా స్థానిక పోలీసులు తనను పోలీస్‌స్టేషన్‌కు రావాలని చెప్పి రోజు సాయంత్రం వరకు స్టేషన్‌లో ఉంచుతున్నారని తెలిపారు. కేసులో నా పాత్ర ఉందని చెబుతూ సంబంధం లేని కేసులో జైలుకు పంపాలని చూస్తున్నారని పేర్కొన్నారు. గతంలోనూ కరీంనగర్‌లో ఉండగా, ఓ కేసు పెట్టారన్నారు. ఆ సమయంలో రెండేళ్లు కోర్టుల చుట్టూ తిరిగానని తెలిపారు. ఆ కేసును ఆరు నెలల క్రితం కోర్టు కొట్టివేసిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. సరైన విచారణ చేపట్టి తనకు సంబంధం లేని కేసు నుంచి తప్పించాలని డీజీపీకి ఇచ్చిన ఫిర్యాదులో కూస శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు.

పీస్ అంబాసిడర్‌గా రష్మీఠాకూర్


రష్మీ ఠాకూర్

జ్యోతినగర్(రామగుండం): పీస్ అంబాసిడర్‌గా రష్మీ ఠాకూర్‌ను నియమిస్తూ వరల్డ్ పీస్ హార్మనీ సంస్థ చైర్మన్ హాజీ షకీల్ సైఫీ నిర్ణయించారు. ఈమేరకు సోమవారం నియామక ఉత్తర్వులు విడుదల చేశారు. ఎన్టీపీసీ రామగుండం ప్రాంతానికి చెందిన రష్మీ ఠాకూర్ జాతీయ, అంతర్జాతీయ స్థాయి అందాల పోటీల్లో అనేక అవార్డులు సొంతం చేసుకున్నారు. ఈ క్రమంలో ప్రపంచశాంతి, సామరస్యానికి గుర్తుగా పీస్ అంబాసిడర్‌గా ఆమెను నియమించారు. లక్ష్యాన్ని దృష్టిలో ఉంచుకుని హృదయపూర్వక ప్రయత్నాలను అందించడంతోపాటు అదే స్ఫూర్తితో పని చేస్తారని, భారతదేశంలోనే కాకుండా ప్రపంచంలో కూడా శాంతి, సామరస్యాలు నెలకొల్పడానికి, సోదరభావం, జాతీయ సమగ్రత పెంపొందించడానికి సాధ్యమయ్యే పనులు చేయాలని ఢిల్లీ ప్రధాన కార్యాలయం నుంచి నియామక ఉత్తర్వులు వెలువడ్డాయి. ఆమెను పలువురు అభినందించారు.

పచ్చిరొట్ట కోసం పాస్‌బుక్కుల క్యూ


క్యూలైన్లో ఆధార్‌కార్డులు, పాస్‌బుక్‌లు

జగిత్యాల/మల్యాల: జీలుగ, జనుము విత్తనాల కోసం జగిత్యాల జిల్లా మల్యాల మండల కేంద్రంతోపాటు నూకపల్లి గ్రామంలోని పాక్స్ కార్యాలయంలో రైతులు క్యూ కట్టారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండలో నిల్చున్నారు. మధ్యాహ్నం వేళ ఎండవేడిమికి తాళలేక క్యూలో పాసుపుస్తకాల జిరాక్సులు పెట్టి పడిగాపులుగాశారు. రసాయన ఎరువులకు బదులుగా రైతులు అధికంగా జీలుగ, జనుము విత్తనాలకు మొగ్గుచూపడంతో అవి సరిపడా అందడం లేదు. రైతులు ఆందోళన చెందవద్దని రైతుల అవసరం మేరకు విత్తనాలు అందుబాటులో ఉంచుతామని అధికారులు పేర్కొన్నారు.

దారి లేదన్నందుకు బండరాయితో దాడి

- ఆశిరెడ్డిపల్లెలో సంఘటన


దాడిలో గాయపడ్డ బొజ్జ తిరుపతి

చందుర్తి(వేములవాడ): దారి లేదని అడ్డుకున్నందుకు బండరాయితో దాడి చేసిన సంఘటన మండలంలోని ఆశిరెడ్డిపల్లె గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల, పోలీసుల వివరాలు.. బొజ్జ తిరుపతి భూమిలో నుంచి దారి తీసుకోవాలని సిర్రం శ్రీనివాస్, తండ్రి హనుమంతు మూడేళ్లుగా తిరుపతితో గొడవపడుతున్నారు. నా భూమిలో నుంచి దారి లేదని తిరుపతి వారించిన పట్టించుకోకుండా శ్రీనివాస్, హనుమంతు బ్లేడ్ ట్రాక్టర్‌తో దారి తీసేందుకు యత్నించగా అడ్డుకున్న తిరుపతిని శ్రీనివాస్ బండరాయితో కొట్టడంతో తలకు తీవ్ర గాయమైంది. వెంటనే తిరుపతిని వేములవాడ సివిల్ అసుపత్రికి తరలించి వైద్యం చేయించారు. క్షతగాత్రుడు ఫిర్యాదు మేరకు దాడి చేసినవారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

కారును ఢీకొట్టిన లారీ

- ముగ్గురికి గాయాలు


ధ్వంసమైన కారు

శంకరపట్నం: మండలంలోని కొత్తగట్టు గ్రామ శివారులో సోమవారం జరిగిన రోడ్డుప్రమాదంలో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు..కొత్తపల్లికి చెందిన కూర భాస్కర్‌రెడ్డి పెద్ద కూతురుకు హుజూరాబాద్ మండలం సింగాపూర్ కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో సీటు వచ్చింది. ఇద్దరు కూతుళ్లతో కలిసి కారులో సింగాపూర్ వెళ్లి కాలేజీలో ప్రవేశం పొంది తిరిగి వస్తుండగా కొత్తగట్టు సమీపంలో వీరు ప్రయాణిస్తున్న కారును లారీ వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో కారు రోడ్డుపై అడ్డం తిరిగింది. డ్రైవింగ్ చేస్తున్న భాస్కర్‌తో పాటు ఇద్దరు కూతుళ్లకు స్వల్ప గాయాలు కాగా చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

రేషన్ బియ్యం పట్టివేత


పట్టుబడిన రేషన్ బియ్యం

మంథని: మున్సిపాలిటీ పరిధిలోని గంగాపురి, లైన్‌గడ్డ ప్రాంతాల్లో అక్రమంగా నిల్వ ఉంచిన, రవాణా చేస్తున్న రేషన్ బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్ ఎస్సై ఆధ్వర్యంలో దాడులు చేసి పట్టుకున్నారు. స్థానిక లైన్‌గడ్డ ఏరియాలో ఓ ఇంట్లో నుంచి ట్రాలీ ద్వారా అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్నారనే సమాచారం మేరకు తనిఖీ చేయగా 40 క్వింటాళ్ల బియ్యం పట్టుబడినట్లు పోలీసులు తెలిపారు. అలాగే గంగాపురి శివారులో ఓ గుడిసెలో రేషన్ బియ్యం నిల్వ ఉంచినట్లు అందిన సమాచారం మేరకు తనిఖీ చేయగా 20 క్వింటాళ్ల బియ్యం లభ్యమైనట్లు పేర్కొన్నారు. రెండుచోట్ల గుర్తించిన బియ్యం, ట్రాలీని స్థానిక పోలీస్‌లకు అప్పగించారు.

రాజన్న సేవలో ములుగు అడిషనల్ కలెక్టర్


ములుగు అడిషనల్ కలెక్టర్ శ్రీజకు ప్రసాదాలు అందిస్తున్న ఆలయ అర్చకులు

వేములవాడ: రాజన్నను ములుగు అడిషనల్ కలెక్టర్ పి.శ్రీజ సోమవారం కుటుంబ సభ్యులతో కలసి దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం అవకాశం కల్పించారు. నాగిరెడ్డి మండపంలో శేషవస్త్రం, లడ్డూ ప్రసాదం అందజేశారు.

టిప్పర్, జేసీబీ సీజ్


పోలీస్‌స్టేషన్‌కు తరలించిన టిప్పర్, జేసీబీ

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం అనుపురం, కొడుముంజ పాత గ్రామంలోని మిడ్‌మానేరు ప్రాజెక్ట్ స్థలాల్లో అనుమతులు లేకుండా అక్రమంగా మట్టి తరలిస్తున్న టిప్పర్‌ను, జేసీబీని వేములవాడరూరల్ ఎస్సై మారుతి సోమవారం పట్టుకుని రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనుమతులు లేకుండా మట్టి తరలిస్తున్నందున టిప్పర్, జేసీబీని సీజ్ చేసినట్లు తెలిపారు.

పోలీస్ విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తి రిమాండ్

రుద్రంగి(వేములవాడ): పోలీస్ విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు రుద్రంగి ఎస్సై సిరిసిల్ల అశోక్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాలు. రుద్రంగి మండల కేంద్రంలో బహిరంగంగా మద్యం సేవిస్తున్న జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం ఆత్మకూర్‌కు చెందిన గుగులోతు లక్ష్మణ్‌ను ఇలా బయట తాగొద్దని బ్లూకోర్ట్ కానిస్టేబుల్ సూర్యప్రకాశ్ హెచ్చరించారు. ఫొటోలు తీస్తుండగా కానిస్టేబుల్ విధులకు ఆటంకం కలిగిస్తూ దుర్భాషలాడాడు. అంతేకాకుండా బెదిరింపులకు పాల్పడడంతో గుగులోతు లక్ష్మణ్‌పై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

వీణవంక: మండలంలోని చల్లూరు, పోతిరెడ్డిపల్లి గ్రామాల్లోని మానేరు వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై తోట తిరుపతి తెలిపారు. ఇసుకను ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారనే సమాచారం మేరకు పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశామని, అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

తాటిచెట్టు పైనుంచి పడి గీతకార్మికుడికి గాయాలు

వీణవంక(హుజూరాబాద్): మండలంలోని బేతిగల్ గ్రామానికి చెందిన గీత కార్మికుడు మడ్డి జగ్గయ్య(55) తాటిచెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు మోకు జారి కిందపడ్డాడు. గ్రామ శివారులోని తాటివనంలో తాటిచెట్టు ఎక్కుతుండగా ప్రమాదం జరిగిందని తీవ్ర గాయాలు కావడంతో జమ్మికుంటలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించామని గ్రామస్తులు తెలిపారు. గౌడ్ సంఘం నాయకులు ఆసుపత్రికి వెళ్లి జగ్గయ్యను పరామర్శించారు.

ఒలింపియాడ్‌లో ‘మానేరు’ విద్యార్థుల ప్రతిభ


ర్యాంకులు సాధించిన విద్యార్థులతో మానేరు విద్యాసంస్థల అధినేత అనంతరెడ్డి

సప్తగిరికాలనీ(కరీంనగర్): సెమ్స్ ఒలింపియాడ్ ఫౌండేషన్ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఇటీవల దేశవ్యాప్తంగా నిర్వహించిన నేషనల్ సెమ్స్ ఒలింపియాడ్ 2024లో కరీంనగర్‌లోని మానేరు విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు ఆ విద్యాసంస్థల అధినేత కదారి అనంతరెడ్డి తెలిపారు. సీబీఎస్ఈ పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి ఎ.ఆత్రేయ ఆల్ ఇండియా 1వ ర్యాంక్, 10వ తరగతి విద్యార్థిని కాజల్ స్టేట్ ఫస్ట్ ర్యాంక్, సాయి మానేరు పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని లాస్య ప్రియ స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించారని అన్నారు. అదేవిధంగా వహీదున్నీస్సా ఆల్ ఇండియా 2వ ర్యాంక్ సాధించగా దీక్షిత్, పరీక్షిత్ సారధిలు స్టేట్ 2వ ర్యాంక్, అక్షయ, అరవింద్ రెడ్డి, సాత్విక్ రెడ్డి, సంజన్ తేజ్‌లు స్టేట్ 3వ ర్యాంక్‌లు, అమృత, మన్విత, హర్షవర్ధన్, శ్రీజయలు స్టేట్ 4వ ర్యాంక్, అక్షయ స్టేట్ 5వ ర్యాంక్, ప్రణవి విశ్వనాథ్ స్టేట్ 6వ ర్యాంక్, అయిరా జరీన్, దేవేష్‌లు స్టేట్ 7వ ర్యాంక్ సాధించినట్లు తెలిపారు. ఆల్ ఇండియా, స్టేట్ లెవల్ ర్యాంక్‌లు సాధించిన విద్యార్థులను సోమవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో సన్మానించారు. మూడేళ్లుగా జాతీయస్థాయిలో నిర్వహిస్తున్న సెమ్స్ ఒలింపియాడ్ మానేరు విద్యార్థులు జాతీయ, రాష్ట్రస్థాయిలో ర్యాంకులను కైవసం చేసుకోవడం గర్వంగా ఉందన్నారు. విద్యార్థులను మానేరు విద్యాసంస్థల డైరెక్టర్లు కదారి సునీతరెడ్డి, కదారి కృష్ణారెడ్డి, కదారి శ్వేతారెడ్డిలతో పాటు ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

గుట్కా స్థావరాలపై పోలీసుల దాడులు


తనిఖీ చేస్తున్న పోలీసులు

మంథని: ప్రజారోగ్యం దృష్ట్యా గుట్కా, పాన్ మసాలాలపై ప్రభుత్వం నిషేధం విధించడంతో వాటి స్థావరాలపై పోలీసులు దాడులకు దిగారు. సోమవారం పట్టణంలోని కూరగాయల మార్కెట్‌లో స్థానిక ఎస్సైలు వెంకటకృష్ణ, రాజీవర్మ తమ పోలీస్ సిబ్బందితో దాడులు చేశారు. గుట్కా, పాన్ మసాలాలతోపాటు ఇతర నిషేధిత వస్తుసామగ్రి స్వాధీనం చేసుకున్నారు. దాడిలో లభ్యమైన నిషేధిత గుట్కా, పాన్ మసాలాలను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వాటి విలువ సుమారు రూ.2లక్షలకు పైగానే ఉంటుందని పోలీసులు తెలిపారు. వ్యాపారిని అదుపులోకి తీసుకొని విచారించారు. డివిజన్‌లో పెద్దఎత్తున గుట్కా, పాన్ మసాలాల నిల్వలు ఉన్నట్లు సమాచారం.

క్రీడలతో ఆత్మవిశ్వాసం


విజేతలకు ట్రోఫీలు అందజేస్తున్న విజయమణారావు, ప్రతినిధులు

- పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు
- వాలీబాల్ టోర్నీ విజేతలకు ట్రోఫీల అందజేత

జూలపల్లి(పెద్దపల్లి): క్రీడలు యువతలో ఆత్మవిశ్వాసం పెంపొందిస్తాయని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు. క్రీడాకారులు ఓటమిని విజయానికి తొలిమెట్టుగా భావించాలన్నారు. భవిష్యత్‌లో ఉన్నత లక్ష్యాలు సాధించడానికి కృషి చేయాలని సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ క్రీడా మైదానంలో సోమవారం దివంగత దారబొయిన లింగయ్య యాదవ్ స్మారకార్థం మాజీ సర్పంచ్, సర్పంచుల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు దారబొయిన నర్సింహ యాదవ్, తన తమ్ముడైన ఎస్ఆర్ఐ మధుకర్ యాదవ్‌తో కలిసి ఉమ్మడి జిల్లాస్థాయి ఇన్విటేషన్ వాలీబాల్ పోటీలు నిర్వహించారు. విజేతగా నిలిచిన ఎస్ఆర్ఆర్ కరీంనగర్ జట్టుకు జ్ఞాపిక, రూ.10వేల నగదు బహుమతి, రన్నరప్‌గా నిలిచిన జూలపల్లి జట్టుకు రూ.5వేల నగదు, జ్ఞాపిక, తృతీయ స్థానంలో నిలిచిన కమ్మర్‌ఖాన్‌పేట జట్టుకు జ్ఞాపిక, రూ.3వేల నగదును ఎమ్మెల్యే అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. గ్రామీణ యువతలోని క్రీడాప్రతిభను వెలికి తీసేందుకు టోర్నమెంట్ నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రమాదేవి, జెడ్పీటీసీ బొద్దుల లక్ష్మణ్, పీఏసీఎస్ చైర్మన్ వేణుగోపాలరావు, ఎంపీటీసీ దండె వెంకటేశం, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాల వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షులు సుధీర్‌రావు, ముత్యం రవీందర్, ప్రధాన కార్యదర్శి తమ్మడవేని రాజయ్య, క్రీడాకారులు కమలాకర్‌రెడ్డి, గంగాధర్, వెంకటేశ్, సాంబరెడ్డి పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

కరీంనగర్ క్రైం: మానసిక వేదనతో బాధపడుతున్న ఓ ప్రైవేటు ఉద్యోగి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని కోతిరాంపూర్‌కు చెందిన గడ్డి శ్రీనివాస్(35) ఓ ఫైనాన్స్‌లో పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కొంతకాలంగా మానసిక వేదనతో బాధపడుతున్నాడు. కుటుంబసభ్యులు పలు ఆసుపత్రిలో చూపించిన అతడికి నయం కాలేదు. ఆదివారం రాత్రి మద్యం సేవించి ఇంటికి వచ్చిన శ్రీనివాస్ గదిలోకి వెళ్లి తలుపు గడియ పెట్టుకున్నాడు. అనుమానం వచ్చి కుటుంబసభ్యులు గదిలోకి వెళ్లి చూడగా ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

భూకబ్జాకు యత్నం

- తప్పుడు వీఎల్టీ ద్వారా ఆక్రమించేందుకు ప్రయత్నం
- చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు బాధితుల ఫిర్యాదు

జగిత్యాల: అది జగిత్యాల జిల్లా కేంద్రానికి అత్యంత సమీపంలోని హస్నాబాద్‌లో గల విలువైన భూమి. జిల్లా కేంద్రానికి చెందిన కీర్తి విజయలక్ష్మి, పూటూరి గీతారాణి, గొల్లపల్లి సత్యనారాయణ కలిసి సర్వేనంబర్ 1599లో 12 గుంటల భూమిని సేల్ డీడీ నంబరు 4660/211 ద్వారా భాగ్యలక్ష్మి వద్ద కొనుగోలు చేశారు. ప్రస్తుతం ఆ భూమి వారి పరిధిలోనే ఉంది. కాగా, అట్టి భూమిని కొందరు కబ్జా చేసేందుకు ప్రయత్నించారు. జగిత్యాల మున్సిపాలిటీ రికార్డుల్లో 722 చదరపు గజాలకు ఇంటి నంబరుతో (4-4-325/1/ఎ) 13సీ/బీ 1350/1999 తప్పుడు రిజిస్టర్ డాక్యుమెంట్ నమోదు చేసి దీని ద్వారా అసెస్మెంట్ డాక్యుమెంట్ సృష్టించారు. అక్రమ వీఎల్టీ 2110105727 నంబరును ఖాజా అమిరొద్దీన్ పేరిట జారీ చేశారు. అక్రమ వీఎల్టీ నంబరు ఆధారంగా 4-4-325/1/ఎ నంబర్‌ను ఆసరాగా చేసుకుని తప్పుడు రిజిస్ట్రేషన్‌తో ఆక్రమించేందుకు ప్రయత్నం చేశారు. దీనికి మున్సిపల్ అధికారులు సహకరించినట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. దీంతో కీర్తి విజయలక్ష్మి, పూటూరి గీతారాణి, గొల్లపల్లి సత్యనారాయణ సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. తప్పుడు వీఎల్టీ నంబరుకు సహకరించిన మున్సిపల్ అధికా రులపై సమగ్ర విచారణ జరిపించాలని, అక్రమంగా తమ భూమిని ఆక్రమించేందుకు యత్నిస్తు న్న ఖాజా అమిరొద్దీన్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. 2012లో పనిచేసిన మున్సిపల్ కమిషనర్ సంతకాన్ని ఫోర్జరీ చేసి వీఎల్టీ నంబరు సృష్టించారని పేర్కొన్నారు. వెంటనే విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు. కాగా, కలెక్టర్ స్పందించి వెంటనే విచారణ చేసి వివరణ ఇవ్వాలని సదరు కమిషనర్‌ను ఆదేశించినట్లు తెలిసింది.

క్లుప్తంగా

ఉచిత వైద్యశిబిరం



వృద్ధులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

కరీంనగర్‌టౌన్: నగరంలోని శ్రీవీరబ్రహ్మేంద్ర అనాథ వృద్ధుల ఆశ్రమంలో సోమవారం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. వృద్ధులకు బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేశారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ సొసైటీ సెక్రెటరీ ఊట్కూరి రాధాకృష్ణారెడ్డి మాట్లాడుతూ తరచూ ప్రమాదాల బారిన పడి, తీవ్ర అనారోగ్య సమస్యలతో రోగాల బారిన పడి చికిత్స సమయంలో రక్తం అందక రోగులు మృత్యువు బారిన పడుతున్నారని అన్నారు. ఆరోగ్యవంతులు, యువత రక్తదానం చేయడానికి స్వచ్ఛందంగా ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ పెండ్యాల కేశవరెడ్డి, ట్రెజరర్ పోరెడ్డి శ్రీహరిరెడ్డి, మెడికల్ ఆఫీసర్ ఎంఎల్ఎన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ఆక్రమణపై చర్య తీసుకోవాలి

కరీంనగర్ కార్పొరేషన్: నగరంలోని 30వ డివిజన్‌లో రోడ్డు ఆక్రమణపై చర్య తీసుకోవాలని కార్పొరేటర్ నేతికుంట యాదయ్య కలెక్టర్‌ను కోరారు. ఈమేరకు సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందచేశారు. రోడ్డు ఆక్రమించి ఇంటి నిర్మాణం చేపట్టడం వల్ల అంబులెన్స్, ఫైరింజన్‌లు తిరిగే పరిస్థితి లేదన్నారు.

ఫోన్ ట్యాపింగ్‌పై సీఎంకు ఫిర్యాదు చేస్తాం

కరీంనగర్ కార్పొరేషన్: ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డికి ఫిర్యాదు చేస్తామని డీసీసీ అధ్యక్షుడు, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఫోన్ ట్యాపింగ్‌లో నిందితుడైన రాధాకిషన్ రావు వాంగ్మూలంలో తెలిపిన ప్రకారం తన ఫోన్ ట్యాపింగ్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. హరీశ్‌రావు ఆదేశాల మేరకే ఫోన్ ట్యాపింగ్ చేయడం జరిగిందని రాధాకిషన్‌రావు ఇచ్చిన వాంగ్మూలం ప్రకారం అప్పటి సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్, సంతోష్‌రావుతో పాటు బాధ్యులైన ప్రతిఒక్కరికీ నోటీసులు అందజేసి చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

'పూర్తిస్థాయి ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌ని నియమించాలి'

కరీంనగర్: జిల్లాకు పూర్తిస్థాయి ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌ను నియమించాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి బ్రాహ్మణపల్లి యుగంధర్ ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తిస్థాయి ఫుడ్ ఇన్‌స్పెక్టర్ లేక పక్క జిల్లా నుంచి అధికారులు వచ్చి తనిఖీలు చేయాల్సిన పరిస్థితి నెలకొనడం సిగ్గుచేటన్నారు. ఫుడ్ ఇన్‌స్పెక్టర్ లేకపోవడం వల్ల హోటళ్లు, రెస్టారెండ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ల నిర్వాహకులు విచ్చలవిడిగా ఇష్టానురీతిలో కుళ్లిపోయిన వస్తువులు వాడుతూ ప్రజల ఆరోగ్యాలను నాశనం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫిర్యాదులు చేస్తే కనీసం స్పందించే అధికారి లేకపోవడంతో విచ్చలవిడిగా ఆహార పదార్థాలు తయారు చేస్తూ ప్రజలను అనారోగ్య పాలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రజారోగ్యంపై దృష్టిసారించి నాణ్యత ప్రమాణాలు పాటించని వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

శ్రీవేంకటేశ్వరస్వామి రథోత్సవం



చిగురుమామిడి: మండలంలోని సుందరగిరిలో శ్రీవేంకటేశ్వరస్వామి రథోత్సవం ఘనంగా నిర్వహించారు. సోమవారం ఉదయం వేకువ జామున ఆలయ పూజారులు శేషం సత్యనారాయణచార్యులు, శ్రీనివాసాచార్యులు, సుధీర్‌చార్యులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పురవీధుల గుండా ఉత్సవ విగ్రహాలను రథంపై డప్పుచప్పుళ్ల మధ్య భక్తులు ఊరేగించారు. మండలంలోని దాదాపు అన్ని గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. రెండు రోజులుగా ఆలయం ముందు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. రథోత్సవానికి వచ్చిన భక్తులకు ఆలయ ధర్మకర్తల మండలి ఆధ్వర్యంలో తాగునీరు, చలువ పందిళ్లు, వైద్యసౌకర్యం కల్పించామని ఈఓ రాజ్‌కుమార్ తెలిపారు. చిగురుమామిడి ఎస్సై బి. రాజేశ్ బందోబస్తు చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ గందె సంపత్‌కుమార్, క్లర్క్ కవిత, సింగిల్‌విండో చైర్మన్ జంగ వెంకటరమణారెడ్డి, కాంగ్రెస్, బీజేపీ, సీపీఐ, బీఆర్ఎస్ నాయకులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు.

నైపుణ్యం పెంచేలా..

- బాలభవన్‌లో ఉచిత శిక్షణ తరగతులు
- పలు కళల్లో తర్ఫీదు పొందుతున్న చిన్నారులు

కరీంనగర్‌కల్చరల్: వేసవి సెలవుల్లో బాల, బాలికలు సమయాన్ని వృథా చేయకుండా తమలో ఉన్న కళా నైపుణ్యాలు పెంపొందించుకునేందుకు నగరంలోని అంబేడ్కర్ స్టేడియంలో గల బాలభవన్‌లో ఏప్రిల్ 25 నుంచి 45 రోజుల పాటు వేసవి శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నారు. ఈ శిక్షణ శిబిరంలో ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, టైలరింగ్, మెహందీ వంటి అంశాల్లో తర్ఫీదు పొందుతున్నారు. వీటితో పాటు పేపర్‌తో తోరణాలు, పూలు, పాట్ పేయింటింగ్, వాల్ డిజైనింగ్ ఎలా చేయాలో నేర్చుకుంటున్నారు. చిన్నారుల్లోని టాలెంట్‌ను గుర్తించి తగిన శిక్షణ ఇస్తే వారు ఆ కళల్లో అద్భుతమైన నైపుణ్యాలు ప్రదర్శిస్తారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ సందర్భంగా వివిధ కళల్లో శిక్షణ పొందుతున్న పలువురు చిన్నారులను 'సాక్షి' పలకరించగా తమ అభిప్రాయాలను వెల్లడించారు.



ఆర్ట్ అండ్ క్రాఫ్ట్‌లో శిక్షణ తీసుకుంటున్న చిన్నారులు



మెహందీ డిజైన్ వేస్తున్న చిన్నారి

టైలరింగ్ నేర్చుకుంటున్న



బాలభవన్‌లో నిర్వహిస్తున్న శిక్షణ శిబిరంలో టైలరింగ్ నేర్చుకుంటున్న. ఇంతకు ముందు ఇక్కడ టైలరింగ్‌లో శిక్షణ ఇస్తున్నట్లు తెలియదు. ఈఏడాది జాయిన్ అయ్యా. శిక్షణ బాగుంది. టైలరింగ్‌తో పాటు ఎంబ్రాయిడరీ, కుట్లు, అల్లికలుల్లో తర్ఫీదు పొందుతున్న.

– అరుణ, కరీంనగర్

ఆర్ట్ అండ్ క్రాఫ్ట్‌లో శిక్షణ



తొమ్మిదో తరగతి చదువుతున్న. మూడేళ్లు నుంచి బాలభవన్‌లో మ్యూజిక్, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్‌లో శిక్షణ తీసుకుంటున్న. పనికిరాని వస్తువులను ఉపయోగించి గ్లాస్ పెయింటింగ్, ఫ్యాబ్రిక్ పెయింటింగ్, ఎంబ్రాయిడరీ, పాట్ పెయింటింగ్, పేపర్ క్రాఫ్టింగ్ నేర్చుకున్న. ఎంతో చక్కగా అర్థమయ్యేలా చెప్పడం వల్ల మంచి విషయాలతో పాటు మంచి ప్రవర్తన అలవడుతుంది.

– లక్ష్మీశరణ్య, కరీంనగర్

మెహందీలో శిక్షణ తీసుకుంటున్న



మెహందీ నేర్చుకుంటున్న. రకాల డిజైన్‌లో శిక్షణ తీసుకుంటున్న. నేను కూడా స్వయంగా డిజైన్ వేస్తున్న. ఇక్కడ సమ్మర్ క్యాంపులో శిక్షణ తీసుకోవడం చాలా సంతోషంగా ఉంది.

– కె.వర్ష, కరీంనగర్

చక్కగా నేర్పుతున్నారు



టైలరింగ్, మెహందీ నేర్చుకుంటున్న. మెహందీలో మంచి డిజైన్‌లు ఎలా వేయాలో చాలా చక్కగా నేర్పుతున్నారు. ఇప్పటివరకు కొన్ని రకాల డిజైన్లు నేర్చుకున్న. ఇలాంటి సమ్మర్ క్యాంపు నిర్వహిస్తున్న ప్రభుత్వానికి ధన్యవాదాలు.

– వైష్ణవి, కరీంనగర్

శ్రద్ధతో నేర్చుకుంటున్న..



ఇక్కడ చాలా విషయాలు నేర్చుకున్న. ఉపాధ్యాయులు ఎంతో మంచి శిక్షణ ఇస్తున్నారు. వాల్ హ్యాంగింగ్ క్రాఫ్ట్, ఫ్లవర్ పాట్, సీనరీస్, పెన్ హల్డర్, మనీ బ్యాంక్ లాంటి ఎన్నో విషయాలను శ్రద్ధతో నేర్చుకుంటున్న.

– ఎండీ.రమీజ్

సంతోషంగా ఉంది



బాలభవన్‌లో టైలరింగ్, బ్యూటీషియన్, మెహందీ, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, ఎంబ్రాయిడరీ, వేస్ట్ మెటీరియల్‌తో అందమైన వస్తువులు తయారు చేయడంలో తర్ఫీదు ఇస్తున్న. పిల్లలు ఎంతో చక్కగా శ్రద్ధతో నేర్చుకుంటున్నారు. మంచి బొమ్మలు, వస్తువులు తయారు చేసి చూపిస్తున్న. పిల్లలు టీవీ, ఫోన్లకు అలవాటు కాకుండా ఇంట్లో కూడా నేను చెప్పినవి చేస్తున్నారని తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేయడం సంతోషంగా ఉంది.

–పెందోట సూర్యశ్రీ, శిక్షకురాలు

ఇసుక మాఫియాపై విచారణ జరపాలి



మాట్లాడుతున్న మానేరు పరిరక్షణ సమితి నాయకులు

విద్యానగర్(కరీంనగర్): మానేరు నదిలో విధ్వంసానికి పాల్పడి వేలాది మంది రైతుల జీవనోపాధి దెబ్బతీసిన ఇసుక మాఫియాపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని మానేరు పరిరక్షణ సమితి నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జాతీయ హరిత ట్రిబ్యునల్ పిటిషన్‌దారులు సంది సురేందర్‌రెడ్డి, చిటికేసి సతీశ్‌కుమార్‌లు మాట్లాడుతూ ఇసుక మాఫియాకు వ్యతిరేకంగా తాము చేసిన న్యాయపోరాటానికి విజయం లభించిందన్నారు. పర్యావరణ చట్టాలను ఖాతరు చేయకుండా బాధ్యతారహితంగా విధులు నిర్వహించిన నీటిపారుదల, మైనింగ్ శాఖలకు 50 కోట్ల జరిమానా విధించి అవినీతి అధికారులకు జాతీయ హరిత ట్రిబ్యునల్ హెచ్చరిక జారీ చేసిందన్నారు. జరిమానా మొత్తాన్ని ప్రభుత్వ ఖజానా నుంచి కాకుండా అక్రమాలకు పాల్పడిన ఉన్నతాధికారుల వ్యక్తిగత వేతనాల నుంచి గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డులకు చెల్లించాలన్న తీర్పును స్వాగతిస్తున్నట్లు వెల్లడించారు. ఈ వ్యవహారంలో తప్పుడు నివేదికలిచ్చిన కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి జిల్లాల సాండ్ కమిటీ చైర్మన్ల హోదాలో ఉన్న ఆయా జిల్లా కలెక్టర్లపై చర్యలు తీసుకోవాలని అన్నారు. ట్రిబ్యునల్ విధించిన జరిమానా మొత్తాన్ని బాధిత రైతాంగానికి పరిహారంగా అందించాలన్నారు. ఇసుక కాంట్రాక్టర్లపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, కేంద్ర దర్యాప్తు సంస్థలు దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో తెలంగాణ భూ పరిరక్షణ సమితి రాష్ట్ర కోఆర్డినేటర్ సుదర్శన్, మాజీ ఎంపీటీసీ ఆవుల ముత్తయ్య,, న్యాయవాది అజయ్ తదితరులు పాల్గొన్నారు.

పంచవర్ష ప్రణాళికల రూపకర్త నెహ్రూ



నెహ్రూ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

కరీంనగర్ కార్పొరేషన్: దేశ తొలి ప్రధానిగా జవహర్‌లాల్ నెహ్రూ పంచవర్ష ప్రణాళికలు రూపొందించి, దేశ ఆర్థిక పటిష్టానికి బాటలు వేశారని కాంగ్రెస్ నాయకులు అన్నారు. సోమవారం నెహ్రూ వర్ధంతి సందర్భంగా డీసీసీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో నెహ్రూ చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తిండి గింజలు లేక జనం అల్లాడుతున్న ఆ కాలంలో తన ముందు చూపుతో దేశంలో భారీ సాగునీటి పారుదల ప్రాజెక్టులు నిర్మించారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పురుమల్ల శ్రీనివాస్, కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, పద్మాకర్‌రెడ్డి, పులి ఆంజనేయులుగౌడ్, శ్రావణనాయక్, కొరివి అరుణ్ కుమార్, ఎలగందుల మల్లేశం, బొబ్బిలి విక్టర్, వంగల విద్యాసాగర్, కల్వల రామచందర్, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, కుర్ర పోచయ్య, రామిడి రాజిరెడ్డి, సలీముద్దీన్, కుంభాల రాజకుమార్, వన్నెం రజిత, పర్వత మల్లేశం, దీకొండ శేఖర్, జొన్నల రమేశ్, నెల్లి నరేశ్, మాదాసు శ్రీనివాస్, మామిడి సత్యనారాయణరెడ్డి, హాజీ, శ్రీరాముల రమేశ్, శిల్ప,రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికులను ఆదుకోవాలి



బాధితుడిని పరామర్శిస్తున్న శంకర్‌గౌడ్

కరీంనగర్‌రూరల్: ప్రమాదాల్లో గాయపడిన గీత కార్మికులను ఆదుకునేందుకు ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలని సర్దార్ సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ముత్యం శంకర్ గౌడ్ డిమాండ్ చేశారు. కరీంనగర్ మండలం ఇరుకుల్లకు చెందిన గీత కార్మికుడు బుర్ర తిరుపతిగౌడ్ ఆదివారం ప్రమాదవశాత్తు తాటిచెట్టు పైనుంచి కిందపడగా నగరంలోని ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తిరుపతిగౌడ్‌ను సోమవారం కలిసి ప్రమాద వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శంకర్‌గౌడ్ మాట్లాడుతూ వృత్తిని నమ్ముకుని ఉపాధి పొందుతున్న గీతకార్మికులు ప్రమాదాలకు గురైనప్పుడు ప్రభుత్వం ఆర్థిక సాయం అందజేయడం లేదన్నారు. మెడికల్ బోర్డు సర్టిఫికెట్ నిబంధనతో గీతకార్మికులకు అన్యాయం జరుగుతుందని, సివిల్ సర్జన్ సర్టిఫికెట్‌తో ఎక్స్‌గ్రేషియాను మంజూరు చేయాలన్నారు. గాయపడిన గీత కార్మికులకు చెల్లించాల్సిన ఆర్థిక సాయాన్ని రూ.10 వేల నుంచి రూ.50 వేలకు పెంచాలని, మరణిస్తే కుటుంబానికి చెల్లించే రూ.5లక్షలను రూ.10లక్షలకు పెంచాలని కోరారు. శాశ్వత వికలాంగులైతే రూ.5లక్షలను చెల్లించి గీత కార్మికులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

కేసీఆర్ కుటుంబాన్ని బహిష్కరించాలి

- కోరుట్ల ఎమ్మెల్యే రాజీనామా చేయాలి
- కాంగ్రెస్ నేత జువ్వాడి నర్సింగరావు



మాట్లాడుతున్న జువ్వాడి నర్సింగరావు

కరీంనగర్ కార్పొరేషన్: లక్షల కోట్ల రూపాయలు దోచుకుతిన్న, ఫోన్ ట్యాపింగ్‌తో అరాచకాలు సృష్టించిన కేసీఆర్ కుటుంబాన్ని తెలంగాణ సమాజం బహిష్కరించాలని కాంగ్రెస్ సీనియర్ నేత, కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు కోరారు. కేవలం ఫోన్ ట్యాపింగ్‌తో గెలిచిన కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అనుమానంతో కేటీఆర్, హరీశ్‌రావు కూడా ఒకరిపైఒకరు ఫోన్‌ట్యాపింగ్‌కు పాల్పడ్డారని ఆరోపించారు. సోమవారం కరీంనగర్‌లోని డీసీసీ కార్యాలయంలో మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో తన ఫోన్ ట్యాపింగ్ అయినట్లు తాజాగా రాధాకిషన్ రావు వాంగ్మూలంతో నిర్ధారణ అయిందన్నారు. ఆ ఎన్నికల్లో ప్రజల మద్దతు బలంగా ఉన్న తానే విజయం సాధించాలని, కానీ కేవలం ఫోన్ ట్యాపింగ్‌తో అన్ని విధాలుగా అడ్డంకులు సృష్టించి తన ఓటమికి కారణమయ్యారన్నారు. నైతికంగా తనదే విజయమని, ప్రజలు తనవెంటే ఉన్నారన్నారు. మోటారు సైకిల్ కూడా లేని హరీశ్‌రావు వేల కోట్ల రూపాయలకు ఎలా ఎదిగారని, దీనిపై తనతో చర్చకు రావాలని సవాల్ విసిరారు. బినామీల పేరిట హైదరాబాద్‌లో ఎకరాల కొద్ది భూమి ఉందని, కేసీఆర్ ఫామ్‌హౌస్ 20 ఎకరాల నుంచి 100 ఎకరాలకు పెరిగిందన్నారు. బినామీలు ఆస్తులను బదలాయించొద్దని, ఎవరైనా బెదిరిస్తే తాము అండగా ఉంటామన్నారు. ఫోన్ ట్యాపింగ్‌తో హీరోయిన్లు, భార్యాభర్తల సంభాషణలు కూడా విన్న నీచులు కేసీఆర్ కుటుంబ సభ్యులని ధ్వజమెత్తారు. ఫోన్ ట్యాపింగ్‌పై సీఎం, డీజీపీలను కలిసి ఫిర్యాదు చేస్తానని, కోర్టును ఆశ్రయిస్తానని తెలిపారు. కల్వకుంట్ల అంటేనే కమీషన్ అని, రాష్ట్రంలో కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు, కోరుట్లలో కల్వకుంట్ల విద్యాసాగర్ రావు దోచుకున్నారన్నారు. ఖాదీ భూములు అమ్ముకున్న చరిత్ర విద్యాసాగర్‌రావుదన్నారు. వెలమ సామాజిక వర్గంలో అందరినీ బెదిరించి బీఆర్ఎస్‌లో చేర్చుకున్నారని, కేవలం తాను, మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు మాత్రమే మిగిలామన్నారు. కేసీఆర్ కుటుంబ అరాచకాలను తెలంగాణ ప్రజలు, తమ వెలమ సామాజికవర్గం గమనించాలన్నారు. కేసీఆర్ బాత్‌రూమ్‌లో పడితే కాదని, బావమరుదుల గొడవ వల్లే గాయాలపాలయ్యాడని ఆరోపించారు. సమావేశంలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి పురుమల్ల శ్రీనివాస్, నగర అధ్యక్షుడు, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, ఆంజనేయులు, పద్మాకర్‌రెడ్డి, శ్రావణ్‌నాయక్, రాజిరెడ్డి, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలపై అప్రమత్తంగా ఉండాలి



చెర్లభూత్కూర్ సమావేశంలో పాల్గొన్న రైతులు

కరీంనగర్‌రూరల్: వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో సోమవారం కరీంనగర్ మండలం చెర్లభూత్కూర్, చామనపల్లి, నగునూరు, బొమ్మకల్ గ్రామాల్లో నకిలీ విత్తనాలపై రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. నకిలీ విత్తనాలపై రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏఈవోలు సూచించారు. ప్రభుత్వం గుర్తించిన దుకాణాల్లోనే విత్తనాలు కొనుగోలు చేయాలని, రశీదును భద్రపరుచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీడీవో సంజీవ రావు, కరీంనగర్ సింగిల్‌విండో చైర్మన్ పెండ్యాల శ్యాంసుందర్‌రెడ్డి, ఏఈవోలు ప్రణయ్, పైడితల్లి, స్వర్ణలత, పంచాయతీ కార్యదర్శులు మల్లయ్య, అబ్దుల్ వాజీద్, ఆత్మ బీటీఎం శ్రీలత, ఏటీఎం రమ్యతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

జీలుగ విత్తనాల పంపిణీలో నిర్లక్ష్యం



మాట్లాడుతున్న శ్రీనివాస్‌గౌడ్

కరీంనగర్‌రూరల్: రైతులకు అవసరమైన జీలుగ విత్తనాలు పంపిణీ చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. సోమవారం కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతు ప్రభుత్వంగా చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం కనీసం జీలుగ విత్తనాలు అందించకపోవడం సిగ్గుచేటన్నారు. రైతులు విత్తనాల కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. కరీంనగర్ మండలానికి అవసరమైన విత్తనాలు పంపిణీ చేయడంలో అధికారులు పూర్తిగా విఫలం చెందారని ఆరోపించారు. రైతులందరికీ వెంటనే విత్తనాలు అందించకుంటే బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన చేపడుతామని తెలిపారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకులు ఎం. సంతోష్‌కుమార్, రమణారెడ్డి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ అభిషేక పూజ



తిమ్మాపూర్: మండలంలోని నుస్తులాపూర్ మాజీ సర్పంచ్, కాంగ్రెస్ జిల్లా నాయకుడు తుమ్మనపల్లి శ్రీనివాసరావు ఇంట్లో సోమవారం హనుమాన్ అభిషేక పూజ నిర్వహించారు. కరీంనగర్‌లోని అల్కాపురికాలనీలో నిర్వహించిన కార్యక్రమానికి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు ముఖ్య అతిథిగా హాజరై పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. సుమారు 400 మంది హనుమాన్ దీక్షస్వాములు పూజలో పాల్గొని భక్తి పాటలతో కనువిందు చేశారు. అనంతరం ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు, అన్నదానం చేశారు. కార్యక్రమంలో మండలంలోని పలు పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు మాజీ ప్రజా ప్రతినిధులు హనుమాన్ స్వాములు తదితరులు పాల్గొన్నారు.

ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయాలి



ఏవో సుధాకర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కరీంనగర్: ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయాలని, ఫీజులను బహిర్గతం చేసి నోటీసుబోర్డుపై పెట్టాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గజ్జల శ్రీకాంత్, సహ కార్యదర్శి వినయ్, బీసీ విద్యార్థి సంఘం నాయకుడు అనిల్, ఎంఎస్ఎఫ్ నాయకుడు చెంచు నవీన్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి యుగంధర్ అన్నారు. సోమవారం కరీంనగర్ ఏవో సుధాకర్‌కు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తూ తల్లిదండ్రులను వేధిస్తున్న పరిస్థితి కనిపిస్తోందన్నారు. ట్యూషన్ ఫీజు మొత్తం ముందుగానే చెల్లించాలని తల్లిదండ్రులకు మెస్సేజ్ పెడుతూ ఇబ్బంది పడుతున్న పరిస్థితి జిల్లాలో నెలకొందన్నారు. అనుమతి లేకుండా అడ్మిషన్లు చేస్తున్న పాఠశాలలపై విద్యాశాఖ అధికారులు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. జిల్లాలో అనుమతి లేని పాఠశాలలు ఎన్ని ఉన్నాయో బహిర్గతం చేసి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

ప్రకృతి వనం చెట్లను కాపాడాలి

చొప్పదండి: పల్లె ప్రకృతి వనంలో భాగంగా పెంచిన చెట్లను కాపాడాలని ఎంపీపీ చిలుక రవీందర్ కోరారు. గ్రామ ప్రత్యేకాధికారి, తహసీల్దార్ నరేందర్‌తో కలిసి సోమవారం మండలంలోని రుక్మాపూర్ శివారులోని పల్లె ప్రకృతి వనం, నర్సరీ, క్రీడా ప్రాంగణం, బృహత్ ప్రకృతి వనాలను పరిశీలించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన రుతుస్రావ దినోత్సవంలో పాల్గొన్నారు. బాలికలు, యువతులు పోషకాహారంపై దృష్టి సారించాలని, నెలసరిలో ఇబ్బందులు ఉన్న వారు చొప్పదండిలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మెహతాబ్, అంజలి, లక్ష్మి, మంగ, కవిత, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో స్కావెంజర్లను నియమించాలి

కరీంనగర్: ప్రభుత్వ పాఠశాలల్లో స్కావెంజర్లను తక్షణమే నియమించాలని రిటైర్డ్ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు జాలి మహేందర్‌రెడ్డి ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. పాఠశాలల్లో మౌలిక వసతులకు పెద్దపీట వేస్తున్న ప్రభుత్వం పరిశుభ్రతకు స్కావెంజర్లు లేకపోవడంతో పాఠశాలల్లో పరిస్థితి అధ్వానంగా తయారైందని అన్నారు. పరిసరాల పరిశుభ్రత గ్రామపంచాయతీలకు అప్పగించడంతో పనులు సాగడం లేదని దీంతో మరుగుదొడ్లు, మూత్రశాలలు అధ్వానంగా తయారై అపరిశుభ్రత రాజ్యమేలుతుందని తెలిపారు. వెంటనే ప్రభుత్వం స్కావెంజర్లను నియమించాలని కోరారు.

జీలుగ నో స్టాక్

- డీసీఎంఎస్ చుట్టూ రైతుల ప్రదక్షిణలు



జీలుగ విత్తనాల పర్మిట్ల కోసం ఏఈవోల వద్దకు వచ్చిన రైతులు



డీసీఎంఎస్‌లో విత్తనాల కోసం ఎదురుచూస్తున్న రైతులు

కరీంనగర్‌రూరల్: జీలుగ విత్తనాల కోసం రైతుల పడరానీపాట్లు పడుతున్నారు. వానాకాలం సీజన్ ఆరంభానికి 45రోజుల ముందుగా అందుబాటులో ఉంచాల్సిన జీలుగ విత్తనాలు రాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ముందస్తుగా విత్తనాలను ఏర్పాటు చేయాల్సిన వ్యవసాయాధికారులు ఏమి చేయలేక చేతులెత్తేశారు. సోమవారం జీలుగ విత్తనాల కోసం కరీంనగర్ మండలానికి చెందిన పలువురు రైతులు వ్యవసాయ మార్కెట్‌లోని మండల వ్యవసాయాధికారి కార్యాలయానికి వచ్చారు. విత్తనాలను పొందడానికి అవసరమైన పర్మిట్లను ఏఈవోల ద్వారా తీసుకోవడానికి వచ్చిన రైతులకు డీసీఎంఎస్‌లో స్టాక్ లేదనే సమాచారంతో నిరాశకు గురయ్యారు. విత్తనాలను ఎందుకు అందుబాటులో ఉంచడం లేదంటూ అధికారులతో వాగ్వాదానికి దిగారు. స్టాక్ లేదని ఉన్న బస్తాలకు పర్మిట్లు ఇచ్చామని, మళ్లీ మంగళవారం స్టాక్ వస్తుందని రైతులకు సర్దిచెప్పారు. అయితే అంతకు ముందు పర్మిట్లు పొందిన కొంత మంది రైతులకు జీలుగ విత్తనాలు లభించాయి. మిగితా రైతులు విత్తనాల కోసం అధికారులను నిలదీశారు. అయితే కరీంనగర్ మండలానికి 342 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు అవసరమని, మొదటి విడతగా 120 క్వింటాళ్లు అవసరమని ఇండెంట్ పంపిస్తే 79 క్వింటాళ్లు వచ్చినట్లు ఏవో సత్యం తెలిపారు. సోమవారం కరీంనగర్ డీసీఎంఎస్‌కు 66 బస్తాలు, నగునూరుకు 66 బస్తాలు వస్తే రైతులకు పంపిణీ చేసినట్లు వివరించారు. మంగళవారం తీగలగుట్టపల్లిలోని డీసీఎంఎస్‌కు 40క్వింటాళ్ల విత్తనాలు వస్తున్నాయని, రైతులకు పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

ఎన్నికల ఎఫెక్ట్... టూ వీలర్లు, ఫ్రిజ్ సేల్స్ రయ్!

సార్వత్రిక ఎన్నికల కారణంగా ఆటోమొబైల్, గృహోపకరణాల మార్కెట్లో సందడి నెలకొంది. ముఖ్యంగా ఎంట్రీ లెవెల్ టూ వీలర్లు, గృహోపకరణాలకు ఒక్కసారిగా డిమాండ్ పుంజుకుంది. ఇదంతా ఎన్నికల చలవేనంటున్నాయి పరిశ్రమ వర్గాలు. నిజానికి వీటి కొనుగోళ్లు కొద్ది నెలలుగా తీవ్రంగా మందగించాయి. ఎన్నికల హడావుడి మొదలయ్యాక ఏప్రిల్, మే నెలల్లో వీటి అమ్మకాలు భారీగా పెరిగాయి. 125 సీసీ వరకు ఇంజిన్ సామర్థ్యం, రూ.లక్ష వరకు ధర ఉన్న చిన్న టూ వీలర్ల విక్ర

సింగిల్ డోర్ ఫ్రిజ్‌లు, చిన్న బైక్‌లకు డిమాండ్

యాల్లో 33 శాతం వృద్ధి నమోదైందని ఫెడరేషన్ ఆఫ్ ఆటోమొబైల్ డీలర్స్ అసోసియేషన్ (ఫాడా) ప్రెసిడెంట్ మనీశ్ రాజ్ సింఘానియా వెల్లడించారు. కరోనా విలయం తర్వాత ప్రీమియం టూ వీలర్లకు డిమాండ్ పుంజుకుంటున్నా ఎంట్రీ లెవెల్ విభాగంలో మాత్రం అమ్మకాలు నత్తనడకన వచ్చాయి. ''కానీ ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వాలిచ్చే ప్రోత్సాహకాలకు తోడు పార్టీలు సైతం భారీగా ఖర్చుకు తెరతీయడంతో అల్పాదాయ కుటుంబాల చేతిలో డబ్బులు ఆడుతున్నాయి. దాంతో చిన్న టూ వీలర్లు, ఫ్రిజ్‌ల వంటివాటిని భారీగా కొంటున్నారు' అని మార్కెట్ విశ్లేషకులు చెబుతున్నారు. మండుటెండల దెబ్బకు రిఫ్రిజిరేటర్లు, ఏసీలు, కూలర్ల కొనుగోళ్లు పెరిగాయి. ఎంట్రీ లెవెల్ సింగిల్ డోర్ ఫ్రిజ్‌లు శరవేగంగా అమ్ముడవుతున్నాయని గోద్రెజ్ అప్లయెన్సెస్ బిజినెస్ హెడ్ కమల్ నంది పేర్కొన్నారు. ''చాలాకాలంగా ఈ విభాగంలో అమ్మకాల వృద్ధి సింగిల్ డిజిట్‌కే పరిమితమైంది. ఇప్పుడు మాత్రం ప్రీమియం సెగ్మెంట్‌తో సమానంగా వీటి సేల్స్ నమోదవుతున్నాయి'' అని వివరించారు.

ఎన్నికల ఖర్చు రికార్డ్...

రాజకీయ విశ్లేషకుల అంచనా ప్రకారం 2024లో సార్వత్రిక ఎన్నికలు, పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో వ్యయం గత రికార్డులన్నింటినీ బద్దలు కొట్టనుంది. ఈ ఏడాది ఎన్నికల సీజన్‌లో పార్టీలు, అభ్యర్థుల ఖర్చు రూ.1.35 లక్షల కోట్లు దాటొచ్చని స్వచ్ఛంద సంస్థ సెంటర్ ఫర్ మీడియా స్టడీస్ (సీఎంఎస్)కు చెందిన ఎన్. భాస్కరరావు అంచనా వేశారు.

కింగ్ వర్సెస్ క్వీన్

- మండి లోక్‌సభ స్థానంలో ఆసక్తికర పోరు
- కంగనా, విక్రమాదిత్య సింగ్ హోరాహోరీ

హిమాచల్‌ప్రదేశ్‌లో రాజవంశీయుల కంచుకోట అయిన మండి లోక్‌సభ స్థానంలో 'కింగ్', 'క్వీన్' మధ్య ఆసక్తికర పోరు సాగుతోంది. క్వీన్ తదితర సినిమాలతో అలరించిన బాలీవుడ్ నటి కంగనా రనౌత్ బీజేపీ తరఫున ఎన్నికల అరంగేట్రం చేస్తున్నారు. రాంపూర్ బుషహర్ రాజ సంస్థాన వారసుడు విక్రమాదిత్యసింగ్ కాంగ్రెస్ అభ్యర్థిగా ఆమెతో తలపడుతున్నారు. దాంతో ఇక్కడ విజయం రెండు పార్టీలకు ప్రతిష్టాత్మకంగా మారింది...

- సాక్షి, నేషనల్ డెస్క్

తొలి నుంచీ రాజులే...

పార్టీలేవైనా మండిలో రాజకుటుంబీకుల హవాయే కొనసాగుతూ వస్తోంది. రెండు ఉప ఎన్నికలతో సహా 19సార్లు లోక్‌సభ ఎన్నికలు జరిగితే 13సార్లు రాజ కుటుంబీకులే గెలిచారు. కాంగ్రెస్‌కు ఇక్కడ బలమైన ఓటు బ్యాంకు ఉంది. పీసీసీ చీఫ్, సిట్టింగ్ ఎంపీ ప్రతిభా సింగ్ ఈసారి పోటీ చేయబోనని ప్రకటించారు. బీజేపీ నుంచి కంగనా బరిలో దిగడంతో తనయుడు విక్రమాదిత్య సింగ్‌ను బరిలో దించారు. ఆయన సిమ్లా (రూరల్) నుంచి రెండుసార్లు అసెంబ్లీకి ఎన్నికయ్యారు. రాష్ట్ర మంత్రిగా ఉన్నారు. ఆయన తండ్రి వీరభద్రసింగ్ ఏకంగా ఆరుసార్లు రాష్ట్ర సీఎంగా చేశారు. తల్లిదండ్రులిద్దరూ మండి లోక్‌సభ స్థానం నుంచి మూడేసిసార్లు నెగ్గారు. 2021 మండి ఉపఎన్నికలో తల్లి కోసం విక్రమాదిత్య విస్తృతంగా ప్రచారం చేశారు.



కంగనాకు ఆదరణ...

కంగనాకు ఊహించని వర్గాల నుంచి మద్దతు లభిస్తోంది. మాజీ సీఎం, బీజేపీ సీనియర్ నాయకుడు జైరాం ఠాకూర్ మద్దతుతో పాటు మండి లోక్‌సభ స్థానం పరిధిలోని అసెంబ్లీ సెగ్మెంట్లన్నీ బీజేపీ చేతిలోనే ఉండటం ఆమెకు కలిసొచ్చే అంశాలు. తొలుత ఆమె అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకించిన సీనియర్ నేత మహేశ్వర్ సింగ్ తర్వాత మనసు మార్చుకున్నారు. కార్గిల్ యుద్ధ వీరునిగా స్థానికంగా బాగా ఆదరణ ఉన్న బ్రిగేడియర్ (రిటైర్డ్) ఖుషాల్ ఠాకూర్, కేంద్ర మాజీ మంత్రి సుఖ్‌రామ్ మనవడు ఆశ్రయ్ శర్మ తదితరులు కంగనాకు మొదటినుంచి మద్దతిస్తున్నారు.

పరస్పర విమర్శలు...

పరస్పర విమర్శల్లో కంగనా, విక్రమాదిత్య ఇద్దరూ హద్దులు దాటిపోయారు. ఎన్నడూ లేనంతగా వ్యక్తిగత దాడులకు దిగుతున్నారు. నియోజకవర్గ అభివృద్ధిపై కంగనాకు ఎలాంటి విజన్ లేదని, ఆమె కేవలం పొలిటికల్ టూరిజం చేస్తున్నారని విక్రమాదిత్య ఎద్దేవా చేస్తుంటే, ఆయనను 'చోటా పప్పు' అంటూ కంగనా ఎగతాళి చేస్తున్నారు. రైతులపై కంగనా అనుచిత వ్యాఖ్యల నేపథ్యంలో సంయుక్త కిసాన్ మంచ్ విక్రమాదిత్యకు మద్దతిస్తోంది. హిమాచల్‌లో విపత్తు వేళ బాధితుల పట్ల కంగనా సానుభూతి చూపలేదని, మండిని కనీసం సందర్శించలేదని విమర్శలున్నాయి. ఒక్కసారి చాన్సిస్తే నియోజకవర్గ ప్రజల కోసం పనిచేస్తానని కంగనా అంటున్నారు. గిరిజన ప్రాంతాలకు కనెక్టివిటీ మెరుగుపరచడం, ఆగిన ప్రాజెక్టులను ప్రారంభించడంతో పాటు స్థానిక సంస్కృతీ సంప్రదాయాలకు పెద్దపీట వేస్తూ పర్యాటకాన్నీ ప్రోత్సహిస్తానని హామీ ఇస్తున్నారు. మండీని స్మార్ట్ సిటీగా మారుస్తానని విక్రమాదిత్య వాగ్దానం చేస్తున్నారు.

'మండి' ప్రస్థానం..

మండిని ఒకప్పుడు మండి మహాసు నియోజకవర్గంగా పిలిచేవారు. ఆరు జిల్లాల్లో విస్తరించిన ఈ నియోజకవర్గంలో 13,77,173 మంది ఓటర్లున్నారు. దీని పరిధిలో ఏకంగా 17 అసెంబ్లీ సెగ్మెంట్లుండటం విశేషం. వీరభద్రసింగ్ 1971లో తొలిసారి ఇక్కడి నుంచి గెలిచారు. 1977లో ఎమర్జెన్సీ వ్యతిరేక వెల్లువలో ఓటమి చవిచూసినా 1980లో మళ్లీ విజయం సాధించారు. 1989లో బీజేపీ, 1991, 1996ల్లో కాంగ్రెస్, 1998, 1999 ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించాయి. 2004లో ప్రతిభా సింగ్ తొలిసారి గెలిచారు. 2009లో మళ్లీ వీరభద్ర సింగ్ విజయం సాధించారు. ఆయన సీఎంగా కావడంతో 2013లో జరిగిన ఉప ఎన్నికలో ప్రతిభాసింగ్ నెగ్గారు. 2014, 2019ల్లో బీజేపీకి చెందిన రామ్ స్వరూప్ శర్మ గెలుపొందారు. 2021లో ఆయన మరణంతో జరిగిన ఉప ఎన్నికలో మళ్లీ ప్రతిభా సింగ్ గెలిచారు.



ఎవరిని ఎన్నుకుందాం?!

హిమాచల్‌లో తొలి ఓటర్ల డైలమా ● విద్య, ఉద్యోగావకాశాలు, భద్రతే ప్రాథమ్యాలు



400కు పైగా అని ఒక కూటమి. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందామని మరో కూటమి. హోరాహోరీగా సాగిన సార్వత్రిక ఎన్నికల పోరు తుది అంకానికి చేరుతోంది. జూన్ 1న చివరిదైన ఏడో విడతతో దేశవ్యాప్తంగా పోలింగ్ ప్రక్రియ ముగియనుంది. చివరి విడతలో పోలింగ్ జరుగుతున్న రాష్ట్రాల్లో హిమాచల్‌ప్రదేశ్ ఒకటి. అక్కడి తొలి ఓటర్లు పలు అంశాలపై చురుగ్గా స్పందిస్తున్నారు. నాణ్యమైన విద్య, ఉద్యోగావకాశాలు, మహిళా భద్రత తదితరాలకే తమ ప్రాధాన్యత అని చెబుతున్నారు. అయితే అధికార ఎన్డీఏ, విపక్ష ఇండియా కూటముల్లో ఎవరికి ఓటేయాలో తేల్చుకోలేని డైలమాలో ఉన్నామని ఈ యంగ్ ఓటర్స్‌లో పలువురు అంటున్నారు. నోటాకే తమ ఓటని పలువురు చెబుతుండటం విశేషం. రాష్ట్రంలో 4 లోక్‌సభ సీట్లతో పాటు ఉప ఎన్నికలు జరుగుతున్న 6 అసెంబ్లీ స్థానాలకు జూన్ 1న పోలింగ్ జరగనుంది.

ఉచితాలు అనుచితాలే...!

కొన్నేళ్లుగా పార్టీలన్నీ పోటాపోటీగా ప్రకటిస్తున్న పలు ఉచిత హామీలపై, అమలు చేస్తున్న ఉచిత పథకాలపై యువ ఓటర్లలో మిశ్రమ స్పందన వ్యక్తమవుతుండటం విశేషం. ప్రభుత్వాలు అమలు చేస్తున్న ఉచిత పథకాల భారమంతా అంతిమంగా పన్నులు చెల్లిస్తున్న మధ్యతరగతి ప్రజానీకంపైనే పడుతోందని వారంటున్నారు. అధికారంలోకి వచ్చే పార్టీ ఏదైనా హిమాచల్‌లో ఉచితాలను నిలిపివేయాలని పలువురు అభిప్రాయపడుతున్నారు. ''అభివృద్ధి పనులకు ఉపయోగించాల్సిన నిధులు ఉచితాల కారణంగా పక్కదారి పడుతున్నాయన్నది నిస్సందేహం'' అంటున్నారు సోలన్‌కు చెందిన రియా. ఆమె ఈ ఎన్నికల్లో తొలిసారి ఓటేస్తున్నారు. ఇక కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీపైనా యువత నుంచి మిశ్రమ స్పందన వ్యక్తమవుతోంది. పదేళ్ల బీజేపీ పాలనను కొందరు విమర్శిస్తుంటే మరికొందరు ప్రశంసిస్తున్నారు. ''బీజేపీ సారథ్యంలోని నియంతృత్వమా? విపక్ష ఇండియా కూటమి సంకీర్ణమా? కేంద్రంలో ఎవరికి మద్దతివ్వాలో తేల్చుకోలేకపోతున్నా. ఏమైనా రాజకీయాల్లో సానుకూల మార్పు మాత్రం కోరుకుంటున్నా'' అంటున్నాడు మరో ఓటరు నితీశ్. బీజేపీ సర్కారు అహంకారపూరితంగా వ్యవహరిస్తోందని, రాజ్యాంగ సంస్థలన్నింటినీ దుర్వినియోగం చేస్తోందని డిగ్రీ ఫస్టియర్ విద్యార్థి రోహిత్ విమర్శిస్తున్నారు. ''మోదీకి ఓటేయడమంటే నియంతృత్వాన్ని సమర్థించడమే. అయితే సంకీర్ణ ప్రభుత్వాలు కూడా దేశానికి మంచివి కావు. కనుక ఇండియా కూటమికి ఓటేయడం కూడా సరికాదు'' అంటున్నాడతను!

- సాక్షి, నేషనల్ డెస్క్

ఔత్సాహిక జర్నలిస్టు...

సంజౌలీ ప్రభుత్వ పీజీ కాలేజీలో జర్నలిజం చదువుతున్న అన్షుల్ ఠాకూర్ ఈసారి ఓటేయాలని ఉత్సాహంతో ఉన్నాడు. ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఉద్యోగాలు కల్పించి, మహిళలకు భద్రతను పెంచేవారికే తన ఓటని స్పష్టంగా చెబుతున్నాడు. పారిశ్రామికవేత్త కావాలన్నది తన కల అని మరో పీజీ విద్యార్థి పరీక్షిత్ అంటున్నాడు. ఆధునిక సాంకేతికతను, స్టార్టప్ సంస్కృతిని, యువతను ప్రోత్సహించే వారికే తన ఓటని చెబుతున్నాడు. ''ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా ఉమ్మడి పౌరస్మృతి, నూతన విద్యా విధానాలను సమర్థంగా అమలు చేయాలి. ఈశాన్య ప్రాంతాలతోపాటు లద్దాఖ్ వంటి ప్రదేశాలపై దృష్టి పెట్టాలి. భారత సంస్కృతిని పరిరక్షించాలి. తొలిసారి ఓటరుగా ఇది నా ఆకాంక్ష'' అని సంజౌలీ పీజీ కాలేజీకి చెందిన మరో విద్యార్థి వశిష్ట్ శర్మ చెప్పాడు. అభ్యర్థులెవరూ నా అంచనాలకు తగ్గట్టుగా లేరు. అందుకే నా తొలి ఓటు నోటాకే'' అని మండీకి చెందిన అదితి ఠాకూర్ చెప్పుకొచ్చింది.

రాష్ట్రీయం

'ప్రజాస్వామ్య లౌకిక నేత నెహ్రూ'

సాక్షి, హైదరాబాద్: దేశంలోనే కాక ప్రపంచంలోని అన్ని మతాల విశ్వాసాలను గౌరవించిన లౌకిక నేత మాజీ ప్రధాని జవహర్‌లాల్‌నెహ్రూ అని అలహాబాద్ సెంట్రల్ వర్సిటీ మాజీ ఉపకులపతి ప్రొఫెసర్ రాజన్ హర్షే అన్నారు. నెహ్రూ వర్ధంతి సందర్భంగా సోమవారం గాంధీభవన్‌లో టీపీసీసీ మేధావుల విభాగం ఆధ్వర్యంలో 'నెహ్రూ అండ్ ఇండియాస్ డెమొక్రసీ' అనే అంశంపై జరిగిన సదస్సులో ఆయన స్మారకోపన్యాసం చేశారు. నెహ్రూ ప్రజాస్వామ్యవాది అని, శాస్త్రీయ దృక్పథాన్ని విశ్వసించే సెక్యులర్ మనిషి అని కొనియాడారు. టీపీసీసీ మేధావుల విభాగం అధ్యక్షుడు అనంతుల శ్యాంమోహన్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ బి.మహేశ్‌కుమార్‌గౌడ్, కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ వి.హనుమంతరావు, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే ఈర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే టి.జగ్గారెడ్డి, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహ్మద్ అజారుద్దీన్, నేతలు గోపిశెట్టి నిరంజన్, కత్తివెంకటస్వామి, పుష్పలీల, వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

క్యాంపు కార్యాలయంలో సీఎం నివాళులు

మాజీ ప్రధాని నెహ్రూ వర్ధంతి సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి జూబ్లీహిల్స్‌లోని తన క్యాంపు కార్యాలయంలో నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి దేశాభివృద్ధి కోసం ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. గాంధీభవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్ నేతృత్వంలో పలువురు నేతలు నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కొత్త చట్టాలతో జవాబుదారీతనం

పోలీస్ దర్యాప్తు, కోర్టు విచారణకు కాలపరిమితి
- ఇప్పటి పరిస్థితికి తగినట్లు సాంకేతికత జోడింపు
- సమన్లు, విచారణకు సోషల్ మీడియా వినియోగం
- కొత్త క్రిమినల్ చట్టాలపై ప్రసంగించిన వక్తలు
- పీఐబీ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం



కార్యక్రమంలో మాట్లాడుతున్న నల్సార్ వర్సిటీ వీసీ శ్రీకృష్ణదేవరావు. చిత్రంలో సీడీటీఐ డైరెక్టర్ రాజశేఖర, రిటైర్డ్ ఐపీఎస్ అధికారి దామోదర్

సాక్షి, హైదరాబాద్: నేర, న్యాయ వ్యవస్థను మరింత సౌలభ్యం, జవాబుదారీతనం, విశ్వసనీయంగా తీర్చిదిద్దడంలో భాగంగా కొత్తగా 3 నేర విచారణ చట్టాలు.. భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), భారతీయ నాగరిక్ సురక్ష సంహిత (బీఎన్ఎస్ఎస్), భారతీయ సాక్ష్య అధినియం(బీఎస్ఏ) రూపొందించారని వక్తలు పేర్కొన్నారు. మొత్తం 600కుపైగా సవరణలు, మార్పులు-చేర్పులతో పారదర్శకత, సమన్లు, విచారణకు సాంకేతికత వినియోగం, ఈ-ఎఫ్ఐఆర్ (ఆన్‌లైన్‌లో ఫిర్యాదు), బాధితులు, సాక్షులకు రక్షణ, మహిళలు-బాలలకు మరింత రక్షణ, భాషా పునరుజ్జీవనం-భారతీయతకు పెద్దపీటలో భాగంగా 'భారతీయ' జోడింపు... ఇలా అనేక అంశాలపై వక్తలు ప్రసంగించారు. సోమవారం హైదరాబాద్ పీఐబీ (ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో) ఆధ్వర్యంలో వార్తాలాప్ పేరుతో కొత్త క్రిమినల్ చట్టాలపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఇందులో నల్సార్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ శ్రీకృష్ణదేవరావు, సీడీటీఐ డైరెక్టర్ రాజశేఖర, రిటైర్డ్ ఐపీఎస్ అధికారి దామోదర్ మాట్లాడుతూ.. చట్టాల్లో మార్పులపై వివరించారు. 'కొత్త చట్టాలపై అందరికీ అవగాహన అవసరం. ఇకపై నేరం ఎక్కడ జరిగినా తమ పరిధిలోకి రాదంటూ పోలీసులు అనడానికి వీల్లేదు. నేరం ఎక్కడ జరిగినా ఫిర్యాదు చేసిన పోలీస్ స్టేషన్‌లో జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేయాలి. కేసు దర్యాప్తుతోపాటు కోర్టు విచారణకు కూడా గడువు విధించారు. చట్టాలన్నీ పూర్తిగా మార్చి కొత్తవి తయారు చేయలేదు. గతంలో ఉన్న వాటినే ఇప్పటి పరిస్థితులకు తగినట్లు మార్పులు చేశారు' అని కృష్ణదేవరావు చెప్పారు.

న్యాయవ్యవస్థపై నమ్మకం

'సమన్లు, విచారణలు, చార్జిషీట్లు వేయడం లాంటి పలు అంశాలకు సాంకేతికతను జోడించారు. పోలీస్ దర్యాప్తు, కోర్టు విచారణ గడువులోగా ముగించాలి లేదా సహేతుక కారణాలు పేర్కొనాలి. కొత్త చట్టాల్లో పేర్కొన్న కమ్యూనిటీ సేవల శిక్షలు మనకు ఇంతకు పూర్వం పూర్తిగా తెలియవు. నేరస్తులకు శిక్ష వేయడం కంటే బాధితులకు న్యాయం అందించడంపైనే దృష్టి పెడతాయి. బాధితులు తమకు జరిగిన అన్యాయంపై సంఘటన స్థలం నుంచి స్మార్ట్‌ఫోన్ ద్వారా ఫిర్యాదు చేసి ఈ-ఎఫ్ఐఆర్ పొందవచ్చు. నేరస్తులను విచారించేందుకు జ్యుడీషియల్ కస్టడీ కాలపరిమితి పెంచనున్నారు. కొత్త చట్టాలతో బాధితులకు న్యాయవ్యవస్థపై మరింత నమ్మకం కలుగుతుంది' అని దామోదర్, రాజశేఖర వివరించారు. ఆర్థిక, సైబర్ నేరాలను వ్యవస్థీకృత నేరాలుగా వర్గీకరించారని, రాజద్రోహాన్ని దేశద్రోహంగా మార్చారని తెలిపారు. పీఐబీ అదనపు డైరెక్టర్ జనరల్ శ్రుతి పాటిల్ మాట్లాడుతూ.. బాధితుల హక్కులను పరిరక్షించడం, నేరాల విచారణను సమర్థవంతంగా నిర్వహించడానికి కొత్త క్రిమినల్ చట్టాలకు కేంద్రం మెరుగులు దిద్దినట్లు తెలిపారు. దేశ నేర న్యాయ వ్యవస్థను పూర్తిగా మార్చేందుకు ఇండియన్ పీనల్ కోడ్ (ఐపీసీ 1860), క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ (సీఆర్‌పీసీ) 1973, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ 1872లను కొత్త అంశాలతో రూపొందించి జూలై 1 నుంచి అమలు చేయనున్నట్లు చెప్పారు.

ఇంజనీరింగ్ కౌన్సెలింగ్ జాప్యం?

▶ మొదటి పేజీ తరువాయి

అనుబంధ గుర్తింపు ఇస్తాయి. అయితే దీనికన్నా ముందు ఏఐసీటీఈ అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. ఏఐసీటీఈ 2024-25 విద్యా సంవత్సరానికి క్యాలెండర్‌ను ప్రకటించింది. దీని ప్రకారం జూన్ 10వ తేదీకల్లా అన్ని కాలేజీలకు అనుమతినివ్వాలి. నిబంధనలకు అనుగుణంగా మౌలిక వసతులు, ఫ్యాకల్టీ ఏర్పాటు చేసుకునే కాలేజీలకే అనుమతి లభిస్తుంది. జూన్ 10కల్లా అనుమతి రాని కాలేజీలు.. సౌకర్యాలు కల్పించుకుని మరోసారి దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పిస్తారు. ఈ ప్రక్రియను జూన్ 30 నాటికి ముగించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని కాలేజీలు ఏఐసీటీఈ అనుమతి కోసం దరఖాస్తు చేసుకున్నాయి. కానీ ప్రస్తుత పరిస్థితిని బట్టి చూస్తే జూన్ 10 నాటికి అనుమతి లభించడం కష్టమనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

కొత్త కోర్సుల చేరిక వల్లే ఆలస్యం

జాతీయ స్థాయిలో విద్యా విధానంలో అనేక మార్పులు జరుగుతున్నాయి. అంతర్జాతీయ స్థాయిలో ఉన్నట్టు భారత్‌లోనూ క్రెడిట్ విధానం అందుబాటులోకి తేవాలని నిర్ణయించారు. టెన్త్ వరకూ కొన్ని క్రెడిట్స్, ఇంటర్ తర్వాత కొన్ని, డిప్లొమా కోర్సులకు, ఇంజనీరింగ్ కోర్సులకు ఇలా.. క్రెడిట్స్ విధానం తీసుకొస్తున్నారు. ఈ క్రమంలో అన్ని ప్రొఫెషనల్ కోర్సులను ఏఐసీటీఈ పరిధిలో చేరుస్తున్నారు. ఇప్పటివరకూ బీబీఏ, బీసీఏ, బీఎంఎస్ వంటి కోర్సులు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ పరిధిలో ఉండేవి. తాజాగా ఏఐసీటీఈ పరిధిలోకి తెస్తూ అన్ని కోర్సులకు కలిపి ఒకే దరఖాస్తు విధానం తీసుకొచ్చారు. అంటే బీబీఏ, బీసీఏ, బీఎంఎస్ కోర్సులతో పాటు ఇంజనీరింగ్ కోర్సులు కూడా ఇదే దరఖాస్తు విధానంలోకి వచ్చాయన్న మాట. ఈ మేరకు అవసరమైన సాఫ్ట్‌వేర్ రూపొందించడానికి కాస్త సమయం పట్టే అవకాశం కన్పిస్తోందని అధికార వర్గాలు అంటున్నాయి. ఈ నేపథ్యంలోనే కాలేజీలకు గుర్తింపు ఆలస్యమయ్యే వీలుందని చెబుతున్నాయి.

జోసా కౌన్సెలింగ్ నాటికి జరిగేనా?

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, కేంద్ర ఇంజనీరింగ్ కాలేజీల్లో ప్రవేశానికి వచ్చే నెలలో కౌన్సెలింగ్ మొదలవుతుంది. ఇప్పటికే జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష పూర్తయింది. త్వరలో జోసా (జాయింట్ సీట్ అలోకేషన్ అథారిటీ) కౌన్సెలింగ్ తేదీలనూ ప్రకటించే అవకాశం ఉంది. ఇది ఆరు దశలుగా ఉంటుంది. జోసా కౌన్సెలింగ్ చివరి తేదీని బట్టి రాష్ట్రంలో ఇంజనీరింగ్ కౌన్సెలింగ్ చివరి దశ చేపడతారు. విద్యార్థులు తొలి దశలో రాష్ట్ర కాలేజీల్లో చేరి, చివరి దశలో జాతీయ కాలేజీల్లోకి వెళ్తారు. ఇలా ఖాళీ అయిన సీట్లను చివరి దశలో భర్తీ చేస్తారు. కానీ కాలేజీలకు ఏఐసీటీఈ అనుమతి ఇప్పటికీ రాకపోవడంతో రాష్ట్ర ఇంజనీరింగ్ కౌన్సెలింగ్ ఎప్పుడు పూర్తవుతుందనే దానిపై స్పష్టత రావడం లేదని అధికార వర్గాలు అంటున్నాయి.

ఈలోగానే అనుమతి వస్తుందని ఆశిస్తున్నాం

రాష్ట్ర ఇంజనీరింగ్ కౌన్సెలింగ్ నిర్ణయించిన తేదీల్లోనే కొనసాగుతుంది. ఈలోగా ఏఐసీటీఈ అనుమతి వస్తుందని ఆశిస్తున్నాం. ఏఐసీటీఈ అకడమిక్ క్యాలెండర్‌ను కూడా ప్రకటించింది. బీబీఏ, బీసీఏ, బీఎంఎస్ కాలేజీలను ఏఐసీటీఈ పరిధిలోకి కొత్తగా తేవడం వల్ల కొంత ఆలస్యమవుతున్నట్టు తెలుస్తోంది.

- ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి
(ఉన్నత విద్య మండలి చైర్మన్)

దర్యాప్తు సంస్థల తీరు సరికాదు

ఢిల్లీ హైకోర్టులో ఎమ్మెల్సీ కవిత తరఫున వాదనలు

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పట్ల దర్యాప్తు సంస్థలు వ్యవహరించిన తీరు సరికాదని ఢిల్లీ హైకోర్టుకు ఆమె తరఫు న్యాయవాది వివరించారు. ఆమెను చట్టవిరుద్ధంగా అరెస్టు చేశారని అన్నారు. ఈడీ, సీబీఐ కేసుల్లో బెయిలు, తనను అరెస్టు చేసేందుకు సీబీఐకి ట్రయల్ కోర్టు అనుమతివ్వడాన్ని సవాల్ చేస్తూ కల్వకుంట్ల కవిత దాఖలు చేసిన వేర్వేరు పిటిషన్లను సోమవారం జస్టిస్ స్వర్ణకాంత శర్మ విచారించారు. కవిత తరఫున సీనియర్ న్యాయవాది విక్రమ్ చౌదరి వాదనలు వినిపిస్తూ.. విచారణకు సహకరించినా ఈడీ కవితను అరెస్టు చేసిందని, అప్రూవర్లుగా మారిన వారి స్టేట్‌మెంట్ల ఆధారంగా అరెస్టు చేశారని, సదరు నిందితులకు బెయిలు దక్కిందని తెలిపారు. తొలుత ఎఫ్ఐఆర్, ఛార్జిషీట్లలో పేరు లేని కవితను ఇప్పుడు నిందితురాలుగా పేర్కొంటున్నారని ఆరోపించారు. దర్యాప్తునకు సహకరించినా ఈడీ తీరు సరిగా లేదన్నారు. ట్రయల్ కోర్టు మధ్యంతర బెయిలు మంజూరు చేయలేదని, అన్ని అంశాలు పరిశీలించి బెయిల్ మంజూరు చేయాలని కోరారు. కవిత అరెస్టు విషయంలో సీబీఐ చట్టవిరుద్ధంగా వ్యవహరించిందని, ఆమె వాదన వినకుండానే ట్రయల్ కోర్టు అరెస్టుకు అనుమతి ఇచ్చిందని విక్రమ్ చౌదరి ఆరోపించారు. ఈ కేసులో 16 మంది నిందితులను అదుపులోకి తీసుకోగా కవిత ఒక్కరే మహిళని, అంతేకాకుండా అరెస్టు కూడా అన్యాయంగా చేశారని చౌదరి తెలిపారు. అనంతరం మంగళవారం దర్యాప్తు సంస్థల వాదనలు వింటానని న్యాయమూర్తి తెలిపారు. వారి వాదనల అనంతరం తీర్పు రిజర్వు చేయనున్నట్లు కూడా జస్టిస్ స్వర్ణకాంత శర్మ తెలిపారు. జూలైలో సెలవులకు ముందుగా తీర్పు వెలువరిస్తానని పేర్కొన్నారు.

సుప్రీంకోర్టులో....

మధ్యంతర బెయిల్ కోసం హైకోర్టుకు వెళ్లాలని ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత బినామీగా ఆరోపణలు ఎదుర్కొంటున్న అరుణ్ రామచంద్ర పిళ్లైకు సుప్రీంకోర్టు సూచించింది. ఢిల్లీ హైకోర్టు ఆదేశాలు సవాల్ చేస్తూ అరుణ్ పిళ్లై దాఖలు చేసిన పిటిషన్‌ను సోమవారం జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ సతీశ్‌చంద్ర శర్మలతో కూడిన ధర్మాసనం విచారించింది.

మాజీ మంత్రి యెర్నేని సీతాదేవి కన్నుమూత

హైదరాబాద్‌లో గుండెపోటుతో మృతి
- ముదినేపల్లి నుంచి ఎమ్మెల్యేగా రెండు పర్యాయాలు ఎన్నిక
- స్వగ్రామం కొండూరుకు పార్థివదేహం తరలింపు



యెర్నేని సీతాదేవి (ఫైల్)

కైకలూరు, హఫీజ్‌పేట్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి, విజయ డెయిరీ డైరెక్టర్ యెర్నేని సీతాదేవి (74) సోమవారం కన్నుమూశారు. హైదరాబాద్ మాదాపూర్ డివిజన్ పరిధి వసంతసిటీలోని తన నివాసంలో గుండెపోటుతో మృతిచెందారు. ఏలూరు జిల్లా కలిదిండి మండలం కొండూరు ఆమె స్వగ్రామం. ముదినేపల్లి నియోజకవర్గం నుంచి 1985లో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి కోనేరు రంగారావుపై విజయం సాధించారు. అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు ప్రాథమిక, ఉన్నత, సాంకేతిక విద్యాశాఖ మంత్రిగా ఆమెకు అవకాశం కల్పించారు. 1994లో మరోసారి ఎమ్మెల్యేగా గెలిచారు. సీతాదేవి టీటీడీ బోర్డు సభ్యురాలుగా పనిచేశారు. 2013లో బీజేపీలో చేరిన ఆమె బీజేపీలో మహిళా మోర్చా నేషనల్ ఎగ్జిక్యూటివ్ సభ్యురాలిగా బాధ్యతలు నిర్వర్తించారు. ప్రస్తుతం విజయ మిల్క్ డెయిరీ డైరెక్టర్‌గా సేవలు అందిస్తున్నారు. సీతాదేవి భర్త యెర్నేని నాగేంద్రనాథ్ (చిట్టిబాబు) రైతాంగ సమాఖ్య, కొల్లేరు పరిరక్షణ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేశారు. ఆయన గతేడాది అనారోగ్యంతో మరణించారు. వీరికి వెంకట నాగేశ్వరరావు (బబ్లు), హంసిని, మురారి సంతానం. సీతాదేవి పార్థివదేహాన్ని ఆమె సొంతూరు కొండూరుకు తీసుకొచ్చారు. పలువురు నేతలు ఆమె భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

ఎమ్మెల్యే అరికపూడి సంతాపం

యెర్నేని సీతాదేవి మృతి వార్త తెలియడంతో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ వసంతసిటీలోని ఆమె నివాసానికి వెళ్లి పార్థివదేహంపై పుష్పగుచ్ఛం ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

కమిషన్ నోటీసులకు బదులివ్వని అరవింద్‌కుమార్

సాక్షి, హైదరాబాద్: జస్టిస్ నరసింహారెడ్డి కమిషన్ జారీ చేసిన నోటీసులకు గడువులోగా బదులివ్వడంలో రాష్ట్ర విపత్తుల (రెవెన్యూ) శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్ విఫలమయ్యారు. ఆయన గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శిగా పనిచేశారు. గత ప్రభుత్వ హయాంలో ఛత్తీస్‌గఢ్ విద్యుత్ ఒప్పందంతో పాటు యాదాద్రి, భద్రాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రాల నిర్మాణంలో జరిగిన అవకతవకలపై న్యాయ విచారణకు జస్టిస్ నర్సింహారెడ్డి కమిషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఈ మూడు వ్యవహారాలకు సంబంధించి నిర్ణయాల్లో పాత్ర కలిగిన సుమారు 28 మంది మాజీ, ప్రస్తుత అధికారులకు జస్టిస్ నరసింహారెడ్డి కమిషన్ నోటీసులు జారీ చేయగా, నలుగురు మినహా అందరూ సమాధానం ఇచ్చారు. గడువులోగా సమాధానం ఇవ్వడంలో విఫలమైన వారిలో అరవింద్‌కుమార్ ఉన్నట్టు రాష్ట్ర ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. కాగా, ఛత్తీస్‌గఢ్ విద్యుత్ ఒప్పందంతో రాష్ట్రానికి తీవ్ర నష్టం జరగనుందని, ఆ ఒప్పందాన్ని ఆమోదించరాదని కోరుతూ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలికి ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి హోదాలో అరవింద్ కుమార్ అప్పట్లో లేఖ రాసిన విషయం తెలిసిందే.

కేఆర్ఎంబీ చైర్మన్‌గా అశోక్ గోయల్

సాక్షి, అమరావతి: కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) చైర్మన్‌గా అశోక్ ఎస్. గోయల్‌ను కేంద్ర జల్ శక్తి శాఖ నియమించింది. పోలవరం ప్రాజెక్ట్ అథారిటీ(పీపీఏ) సీఈవోగా పనిచేస్తోన్న శివ్‌నందన్‌కుమార్ రెండేళ్లుగా కృష్ణా బోర్డు చైర్మన్‌గా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆయన ఈ నెల 31న పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో కేఆర్ఎంబీ చైర్మన్‌గా అశోక్‌ను కేంద్రం నియమించింది. జూన్ 1న ఆయన బాధ్యతలు స్వీకరిస్తారు. పీపీఏ సీఈవోగా మరొకరిని నియమిస్తారా లేదా అశోక్‌కే అదనపు బాధ్యతలు అప్పగిస్తారా అనేది తేలాల్సి ఉంది.

* ఇంటర్నేషనల్ డే ఆఫ్ యాక్షన్ ఫర్ ఉమెన్ హెల్త్ డే!

**ఆరోగ్యంగా ఉండడం,
ఆరోగ్యంగా ఉండాలనుకోవడం కూడా ఒక హక్కే.
ఈ విషయాన్ని ప్రపంచంలోని
ప్రతి మహిళా గుర్తించాలని
ప్రపంచవ్యాప్తంగా ప్రతియేటా మే 28న
'ఇంటర్నేషనల్ డే ఆఫ్ యాక్షన్ ఫర్ ఉమెన్ హెల్త్'ను
జరుపుకుంటున్నారు.
ఈ సందర్భంగా మహిళ తన ఆరోగ్య సంరక్షణ కోసం
అవగాహన పెంచుకోవడంతో పాటు హక్కుగా
ఎలా భావించాలో తెలుసుకోవాలి.
మహిళల ఆరోగ్య సంరక్షణలో కొనసాగుతున్న
ఇబ్బందులు, అవకాశాలను హైలైట్ చేసే
ఒక ముఖ్యమైన వేడుకగా ఈ రోజును భావించాలి.**



ఆరోగ్యం ఆమె హక్కు!

మహిళల ఆరోగ్య సంరక్షణలో అసమానతలను తొలగించడానికి లాటిన్ అమెరికన్, కరీబియన్ ఉమెన్ హెల్త్ నెట్‌వర్క్ 1987లో గ్లోబల్ నెట్‌వర్క్ (డబ్ల్యూజీఎన్ఆర్ఆర్)ను ఏర్పాటు చేశారు. ఆరోగ్య సంరక్షణలో మహిళల తక్షణ అవసరాలను గుర్తించడానికి ఈ నెట్‌వర్క్ ఆవిర్భవించింది. మహిళల ఆరోగ్య సేవలు, హక్కులలో నిరంతరంగా వచ్చే అవాంతరాలను పరిష్కరించాలి. మరింత పటిష్ఠమైన ఆరోగ్య సంరక్షణ వ్యవస్థను సాధించాలనేది ఈ నెట్‌వర్క్ ఉద్దేశ్యం.

మొదటిది ప్రసూతి ఆరోగ్యం

మొదట పునరుత్పత్తి, ప్రసూతి సమయాలలో సురక్షితమైన ఆరోగ్య సేవలను పొందడంపై దృష్టి సారించడానికి ఈ రోజును కేటాయించారు. ప్రపంచంలో ముప్పై ఏళ్ల క్రితం ప్రసూతి మరణాలు అధికంగా ఉండటంతో తొలుత వాటిపైన దృష్టి సారించాల్సిన అవసరం ఏర్పడింది. ఆ తర్వాత స్త్రీల మానసిక ఆరోగ్యం, హెచ్ఐవి, గర్భనిరోధక సాధనాలు, నాన్-కమ్యూనికబుల్ వ్యాధులు, ఆర్థిక-సామాజిక కారకాల ప్రభావం... వంటి విస్తృత శ్రేణి అంశాలను చేర్చే దిశగా క్రమంగా విస్తరణ జరిగింది. ఒక విధంగా చెప్పాలంటే ఈ అవగాహన అంతర్జాతీయ స్థాయిలో మహిళల ఆరోగ్య ఉద్యమాన్ని మరింత బలోపేతం చేసింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ, ప్రపంచ బ్యాంకు వంటి అంతర్జాతీయ సంస్థలు ఆరోగ్య సేవలను మెరుగుపరచడానికి సెమినార్‌లు, శిక్షణ, పరిశోధన కార్యక్రమాలను స్పాన్సర్ చేశాయి. నిధుల పెట్టుబడిని ప్రోత్సహిస్తూ 'సురక్షిత మాతృత్వం' అనే థీమ్‌తో సమస్యను చేపట్టాయి. 1987 మే, 28 నుంచి ఈ రోజుకు ఓ ప్రాధాన్యాన్ని కల్పిస్తూ అనేక ప్రభుత్వాలు, వివిధ అంతర్జాతీయ సంస్థలు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న బహుళ పౌర సమాజ సంస్థలు మహిళల ఆరోగ్యం కోసం తమ చేయూతను అందిస్తున్నాయి.



అవగాహనే కీలకంగా!

ఎవరూ ఏ మాత్రం పట్టించుకోని, హాని కలిగించే వ్యాధులతో సహా ప్రపంచవ్యాప్తంగా మహిళలను ప్రభావితం చేసే క్లిష్టమైన ఆరోగ్య సమస్యలను ఈ రోజు చర్చకు తెస్తూ, వాటిని హైలైట్ చేస్తుంది. బహిరంగ సమావేశాల ఏర్పాటు ద్వారా ఈ సమస్యలను వెలుగులోకి తీసుకు వస్తూ, మహిళల ఆరోగ్య సంబంధిత విద్యలను ప్రోత్సహిస్తుంది. .

ఆరోగ్య హక్కుల కోసం న్యాయవాదిగా!

మహిళల ఆరోగ్య హక్కుల కోసం వాదించడానికి, ఆరోగ్య సంరక్షణలో జెండర్ సమానత్వాన్ని ప్రోత్సహించే విధానాల అమలుకు అవసరమైన కార్యక్రమాల ఆవశ్యకతను నొక్కి చెప్పడానికి ఇదొక వేదికగా ఉపయోగపడుతుంది. ప్రపంచంలోని వివిధ ప్రాంతాల నుంచి మహిళల ఆరోగ్య న్యాయవాదులు, సంస్థలు, కమ్యూనిటీలను ఒకచోట చేర్చి, వారిలో సంఘీభావాన్ని పెంపొందిస్తుంది. ఈ సమష్టి చర్య మహిళల ఆరోగ్య హక్కుల కోసం చేసే ఉద్యమాలను బలపరుస్తుంది.

మహిళా సాధికారత

మహిళల ఆరోగ్యంపై దృష్టి సారించడం ద్వారా ఆరోగ్యం, శ్రేయస్సుపై బాధ్యత వహించడానికి ఈ ప్రత్యేకమైన రోజు మహిళలకు ఓ శక్తినిస్తుంది. ఆరోగ్య సమాచారాన్ని వెతకడానికి, సేవలను పొందడానికి తామే నిర్ణయాత్మక శక్తిలా మారే కార్యక్రమాలలో పాల్గొనేలా మహిళలను ప్రోత్సహిస్తుంది.

మహిళల ఆరోగ్య కార్యక్రమాలకు ప్రభుత్వాలు మద్దతునివ్వాలి. స్థానిక, జాతీయ, అంతర్జాతీయ స్థాయులలో మహిళల ఆరోగ్యం, హక్కులను ప్రోత్సహించే కార్యక్రమాలలో పాల్గొనేలా చేయాలి. ఆరోగ్య నిపుణులు, విధాన రూపకర్తలు, కమ్యూనిటీ నాయకులతో సహా వివిధ సంస్థలు కూడా ఇందులో భాగం కావాలన్నది డబ్ల్యూజీఎన్ఆర్ఆర్ నెట్‌వర్క్ ప్రధాన లక్ష్యం.

స్ఫూర్తి

ఛాయాచిత్రం

● స్ట్రగుల్ టు సక్సెస్



ఛాయా కదమ్

హైస్కూల్, కాలేజీ రోజుల్లో నాటకాల్లో ఛాయా కదమ్ నటప్రతిభను మెచ్చుతూ 'నువ్వు సినిమాల్లోకి వెళితే ఇక తిరుగు లేదు' అన్నారు చాలామంది. కట్ చేస్తే... 'అసలు నీకు నటన వచ్చా' అని తిట్టాడు ఒక డైరెక్టర్. ఒక డైరెక్టర్ అయితే అసహనంతో కుర్చీని నేలకేసి కొట్టాడు. ఇలా ఎన్నో అవమానాలు ఎదుర్కొంది. అయితే ఏరోజూ వెనకడుగు వేయలేదు. కట్ చేస్తే... 'ఒక్క సీన్ అయినా ఫరవాలేదు' అనుకునే స్థాయి నుంచి అంతర్జాతీయ దృష్టిని ఆకర్షించిన 'ఆల్ వి ఇమేజిన్ యాజ్ లైట్'లో నటించే స్థాయికి చేరింది. ఈ చిత్రం కాన్స్ ఫిల్మ్‌ఫెస్టివల్‌లో 'గ్రాండ్ ప్రి' అవార్డ్ గెలుచుకొని చరిత్ర సృష్టించిన విషయం తెలిసిందే. ఈ చిత్రంలో 'పార్వతి' పాత్రలో నటనకు ప్రశంసలే కాదు అంతర్జాతీయ వేదికపై స్టాండింగ్ ఒవేషన్ స్వీకరించింది ఛాయా కదమ్.

ముంబై శివారులోని కలీనాలో మధ్యతరగతి కుటుంబంలో పుట్టింది ఛాయ. తండ్రి ఓ మిల్లులో కార్మికుడు. స్కూలు రోజుల్లో కబడ్డీ బాగా ఆడేది. స్టేట్, నేషనల్ లెవెల్లో కూడా ఆడింది. ఆటలతో పాటు నటించడం అంటే కూడా ఇష్టం. హైస్కూల్, కాలేజీలో ఎన్నో నాటకాల్లో నటించింది. ఇంటర్మీడియెట్ ఫెయిల్ కావడంతో 'ఫెయిల్యూర్' అనేది తొలిసారిగా పరిచయం అయింది. 'జయాపజయాలు జీవితంలో భాగం. ఫెయిల్యూర్ ఎదురైనా కుంగిపోనక్కర్లేదు. నిన్ను నువ్వు నిరూపించుకోవడానికి సెకండ్ ఛాన్స్ ఉంటుంది అనే విషయం ఎప్పుడూ మరచిపోవద్దు' అనే మాట ఛాయను ముందుకు నడిపించింది.

'టెక్స్‌టైల్ డిజైన్' గ్రాడ్యుయేషన్ చేసినప్పటికీ సినిమాల్లో నటించడానికి ఆసక్తి చూపింది. అయితే సినిమాల్లో అవకాశం రావడం నాటకాల్లో నటించినంత వీజీ కాదనే విషయాన్ని ఆమె త్వరగానే అర్థం చేసుకుంది. స్ట్రగుల్స్ తర్వాత... రాక రాక ఒక సినిమాలో అవకాశం వచ్చింది. అయితే ఆ సినిమా ఇప్పటికీ రిలీజ్ కాలేదు! 'సినిమాల్లో నటించాలనుకునేవారికి నటప్రతిభతో పాటు బోలెడు ఓపిక ఉండాలి' అనే మాటను మాత్రం ఎప్పుడూ మరచిపోలేదు ఛాయ.

తొలి రోజుల్లో 'వన్ సీన్' పాత్రల లోనూ నటించింది. ఆ ఒక్క సీన్ కోసం లొకేషన్‌లో గంటల తరబడి వేచి చూడాల్సి వచ్చేది. అయితే ఎప్పుడూ ఓపిక కోల్పోలేదు. 'ఒక్క సీన్ ఉంది. ఫలానా చోట షూటింగ్' అని చెప్పేవారు. పొద్దున్నే లేచి ఆ ప్రాంతం చేరడానికి ప్రాణం మీదికి వచ్చేది. తీరా అక్కడికి వెళ్లాక... 'ఈ రోజు షూటింగ్ క్యాన్సిల్' అనే మాటను కూడా ఎన్నో సార్లు విన్నది. కొన్ని సినిమాల్లో మంచి పాత్రలు వచ్చినప్పటికీ డైరెక్టర్‌ల అహం భరించలేని స్థాయిలో ఉండేది. దుఃఖం ఆగేది కాదు. దుఃఖంలోనే ఉంటే ఆ సాగరంలో 'నటన' కొట్టుకుపోతుంది. అందుకని ఎంత బాధ అనిపించినా అప్పటికప్పుడు ఆ బాధ నుంచి బయట పడి డైరెక్టర్‌కు నచ్చేంత వరకూ నటిస్తూనే ఉండేది. ఆమె ఓపిక, కష్టం వృథా పోలేదు. మరాఠీ, హిందీ సినిమాల్లో నటిగా మంచి పేరు తెచ్చుకుంది. కాన్స్ రూపంలో అంతర్జాతీయ వేదికపై ప్రపంచ దృష్టిని ఆకర్షించింది.

శ్రామిక వర్గ బలం

శ్రామిక వర్గ నేపథ్యం నుంచి వచ్చాను. నాన్న మిల్లు కార్మికుడు. అలా అని నేను ఎప్పుడూ ఎవరి నుంచి సానుభూతి ఆశించలేదు. అయితే నా నేపథ్యం నేను చేసిన అట్టడుగు. శ్రామిక వర్గ పాత్రలకు బలాన్ని ఇచ్చింది. నా పాత్రలకు అవసరమైన మెటీరియల్‌ను ఇచ్చింది.

– ఛాయా కదమ్

బ్యూటిప్



చుండ్రు తగ్గాలంటే...

తలస్నానం చేయడానికి రెండుగంటల ముందు గోరువెచ్చటి కొబ్బరినూనెలో కొద్దిగా నిమ్మరసం కలిపి, ఆ మిశ్రమాన్ని చేతి వేళ్ళతో సున్నితంగా తలకు పట్టించి మర్దన చేయాలి.



కొర్ర చేనులో రైతు కొమ్మూరి విజయకుమార్

కలుపు నిర్మూలన ఎలా?

ఈ ఏడు ముందస్తు వానలు కురుస్తున్నాయి. ప్రకృతి శుభ సూచనలు చేసింది. ప్రకృతిలో కానుగ చెట్లు ఇగురు పూత విరివిగాను, నేరేడు చెట్లు గుబురుగాను ఉన్నాయి. మే నెలలోనే తొలకరి వానలకు ప్రకృతి నాంది పలికింది. వానకు పొలంలో ఉన్న కలుపు విత్తనాలు మొలుస్తాయి. ఆరుద్ర కార్తె నుంచి పంటలు సాగు చేయటానికి అనుకూలంగా ఉండాలంటే భూమిని వారం, పది రోజుల వ్యవధిలో ఒకటికి రెండుసార్లు తేలికపాటి సేద్యం చేయాలి (దుక్కి దున్నాలి). ఇలా చేస్తే మట్టిలోని గడ్డి గింజలన్నీ మొలిచి ఆరుద్ర నాటికి 80 శాతం కలుపు మొక్కలు చనిపోతాయి. ఆ తర్వాత పంట వేసుకుంటే కలుపు సమస్య పెద్దగా వేధించదు.

అయితే, చాలా మంది రైతులు ఒకేసారి ఇరుసాలు సేద్యం (దుక్కి) చేస్తున్నారు. ఇది మంచి పద్ధతి కాదు. మొదటి దుక్కికి భూమి పైన ఉన్న గడ్డి విత్తనాలు మట్టి కిందకు వెళ్తాయి. వానలు పడిన వెంటనే కలుపు మొలుస్తుంది. అయినా, ఇంకా కలుపు విత్తనాలు కొన్ని మట్టిలో మిగిలే ఉంటాయి. మొదటి దుక్కి నుంచి రెండోసారి దుక్కి చేయటానికి కనీసం ఒక వారం, పది రోజుల సమయం ఇవ్వాలి. లేకపోతే మన పంటకు కలుపు ఎక్కువ వస్తుంది. పంట దిగుబడి తగ్గుతుంది. ఈ విధంగా కలుపు నివారణ కోసం రెండు సార్లు సేద్యం (రెండు దుక్కులు) చేయకపోతే కూలీల ఖర్చు ఎక్కువగా ఉంటుంది. చాలా మంది రైతులు కొర్ర చేనులో కూడా కలుపు మందులు పిచికారీ చేస్తున్నారు. దీని వల్ల దిగుబడి బాగా తగ్గుతుందని గుర్తించండి. చిరుధాన్యాలు సాగు చేసే రైతులు వారం, పది రోజుల వ్యవధిలో రెండు సార్లు తేలిక పాటి సేద్యం (దుక్కి) చేసి కలుపు నిర్మూలన చేసుకుంటే మంచి దిగుబడి వస్తుంది.

5 రకాలను అంతటా పండించాలి

చిరుధాన్యాల సాగు ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో అన్ని జిల్లాల్లో పెరుగుదల బాగానే ఉంటుందనిపిస్తోంది. ఈ మధ్యన చిరుధాన్యాల ధర విపరీతంగా పెరిగింది. ఉదాహరణకు.. బరిగె ధాన్యం టన్నుకు రూ. 65 వేలు పలుకుతోంది. బరిగె బియ్యం కిలో రూ. 90–100 పలుకుతోంది. కోస్తా ఆంధ్ర జిల్లాలో పెద్ద సామ విరివిగా సాగు చేస్తున్నారు. రాయలసీమ జిల్లాల్లో కొర్ర పంట మాత్రమే సాగు చేస్తున్నారు. కర్ణాటక జిల్లాల్లో అరిక కొంత మేర సామ, ఊద సాగు చేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో మాత్రమే అండుకొర్రలు సాగవుతున్నాయి. ఐదు రకాల సిరిధాన్యాల బియ్యం కావాలంటే అన్నీ ఒక చోటకు చేర్చాలంటే రవాణా ఖర్చు ఎక్కువ అవుతున్నది. ఈ రోజు మార్కెట్‌లో చిరుధాన్యాల బియ్యం ధరలు పేదలు తినేటట్టు లేవు. అందుకే కొర్ర, అరిక, సామ, ఊద, అండుకొర్ర ఈ ఐదు రకాల సిరిధాన్యాలను అన్ని ప్రాంతాల్లోనూ సాగులోకి తేవాలి.

అరెకరానికి ఉచితంగా విత్తనాలు

కొర్రలు, అండుకొర్రలు, అరికెలు, ఊదలు, సామల సాగును పెంపొందించే లక్ష్యంతో కొత్తగా సిరిధాన్యాలు సాగు చేయదలచిన కొందరు రైతులకు అరెకరానికి సరిపోయే (5 రకాలు ఒక్కో రకం అర కేజీ చొప్పున) 2.5 కిలోల విత్తనాలను ఉచితంగా ఇస్తాను. ట్రాన్స్‌పోర్ట్ ఖర్చులు వారే భరించాలి (గమనిక: సిరిధాన్యాల సేంద్రియ సాగుపై సందేహాల నివృత్తి కోసం, విత్తనాల కోసం ఏపీ వారు ఉ. 5-30 గం. నుంచి సా. 7.30 గం. వరకు.. తెలంగాణ వారు సా. 7 గం. నుంచి రాత్రి 8.30 వరకు ఫోన్ చేయొచ్చు). విజయకుమార్: 98496 48498

ఆరుద్రలో అరిక విత్తాలి

పెద్ద రైతులు ఒకసారి ఆలోచన చేయండి. చిరుధాన్యాలు సాగు చేస్తే రసాయన ఎరువులు, పురుగుమందుల ఖర్చులు తగ్గి భూసారం పెరుగుతుంది. అరిక పంట ఆరుద్ర కార్తెలో మిశ్రమ పంటగా సాగు చేసుకుంటే బాగుంటుంది. 6 సాళ్లు అరిక ఒక సాలు కంది.. 6 సాళ్లు అరిక, ఒక సాలు ఆముదాలు విత్తుకోవాలి. ఇందులో అలసందలు, అనుములు, నల్లపెసలు, గోగులు, సీతమ్మ జొన్న సాగు చేస్తే చాలా బాగుంటుంది.

ఊద పంట 110–120 రోజులు, అండుకొర్ర పంట 105–115 రోజులు, సామ పంట 110 రోజులు, కొర్ర పంట 75–80 రోజుల వరకు ఉంటుంది. వానలు బాగా పడుతున్నందు వలన అన్ని రకాలు సాగు చేయవచ్చు. నీటి ఆధారం కింద రెండు లేదా మూడు పంటలు సాగు చేయవచ్చు. చిరుధాన్యాల సాగులో తక్కువ పెట్టుబడితో మంచి దిగుబడి రావాలంటే.. రసాయనిక ఎరువులు వేయటం మానివేసి.. పశువుల ఎరువు, చెరువు మట్టి వేయటంతో పాటు గొర్రెలను మళ్లించటం (మంద కట్టటం), అలాగే ఏగిలి మార్చటం (పంట మార్పిడి) వంటి పనులు చేయాలి.

– కొమ్మూరి విజయకుమార్
సృష్టి సమ్మాన్ పురస్కార గ్రహీత, వేంపల్లె మం., టి.వెలమవారిపల్లి, వైఎస్సార్ కడప జిల్లా.

సాగుబడి

రోహిణి కార్తె : మే 26 నుంచి

- **అరుదైన సజ్జ కంకి బారెడు పొడవు పెరుగుతుంది.**
- **కరువును తట్టుకొని హెక్టారుకు 20-25 క్వింటాళ్ల దిగుబడినిస్తుంది.**
- **300 ఏళ్లుగా ఈ వంగడాన్ని ఓ రాజస్థానీ రైతు కుటుంబం సంరక్షిస్తోంది.**
- **నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ రైతును పురస్కారంతో గౌరవించింది.**

అతి పొడవైన సజ్జ!

సజ్జ కంకి పొడవు మహా అయితే మూర పొడవుంటుందని మనకు తెలుసు. అయితే, రాజస్థాన్‌కు చెందిన ఓ రైతు దగ్గర ఏకంగా కంకి బారెడు పొడవు పెరిగే సజ్జ రకం ఉందంటే ఆశ్చర్యం కలగక మానదు. ఈ అపురూపమైన పురాతన సజ్జ వంగడాన్ని ఆ రైతు కుటుంబం గత 300 ఏళ్లుగా సాగు చేస్తూ, పరిరక్షిస్తూ ఉంటటం మరో విశేషం. కరువును దీటుగా తట్టుకొని వర్షాధారంగా హెక్టారుకు 20–25 క్వింటాళ్ల దిగుబడిని ఇవ్వగలిగిన గొప్ప వారసత్వ సంపదైన ఈ వంగడం పేరు 'సుల్కానియా బజ్రా'. రాజస్థాన్‌లోని చురు జిల్లా సుల్కానియా గ్రామానికి చెందిన హనుమాన్‌రామ్ ఝురియా అనే 69 ఏళ్ల రైతు 45 ఏళ్లుగా దీన్ని కంటికి రెప్పలా కాపాడుతున్నారు. ప్రతి ఏటా సాగు చేస్తూ రైతులకు విత్తనాలు అందుస్తున్నారు. సంప్రదాయ విత్తనాన్ని సంరక్షిస్తున్న ఈ రైతు కృషిని ప్రశంసిస్తూ కేంద్ర ప్రభుత్వ సైన్ అండ్ టెక్నాలజీ మంత్రిత్వశాఖకు అనుబంధమైన స్వతంత్ర సంస్థ నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ (ఎన్ఐఎఫ్‌కు) ఔట్‌స్టాండింగ్ ట్రెడిషనల్ నాలెడ్జ్ పురస్కారాన్ని 2017లోనే ప్రదానం చేసింది. ఈ అద్భుత వంగడానికి సంబంధించిన ఇంకొన్ని వివరాలు.

- పొడవైన కంకులు, రుచికరమైన గింజలు, అధిక దిగుబడి నివ్వటం, కరువు పరిస్థితులను తట్టుకోవటం, ఎక్కువ పశుగ్రాసం ఇవ్వటం ఈ సుల్కానియా సజ్జ ప్రత్యేకతలు.
- హనుమాన్‌రాం కుటుంబం తాత ముత్తాతల కాలం నుంచే ఈ సజ్జలను పండిస్తున్నారు. బికనీర్ నుంచి వచ్చిన ఒక ఆధ్యాత్మిక గురువు 300 సంవత్సరాల క్రితం వీరి ముత్తాతకి ఈ విత్తనం ఇచ్చారట! అప్పటి నుంచి అదే రకాన్ని వీరి కుటుంబం పండిస్తున్నది.
- ప్రతి సంవత్సరం పంట వచ్చిన తర్వాత బాగున్న గింజలను ఏరి, ఎండిన వేపాకులతో కలిపి నిల్వచేస్తాడు. ఈ విధంగా 5 సంవత్సరాల వరకు ఈ విత్తనాన్ని నిల్వ చేసుకోవచ్చు అంటారు హనుమాన్‌రామ్ ఝురియా.
- 'సుల్కానియా' సజ్జ తొలకరి వర్షాలకు విత్తుకునే రకం. ఇది ఇసుకతో కూడిన నేలలు, నీటి ఎద్దడి ప్రాంతాల్లో సాగుకు అనువైన రకం.
- కరువు వాతావరణాన్ని తట్టుకుంటుంది. విత్తిన తర్వాత కొంత కాలం వర్షం లేకపోయినా బాగా మొలకెత్తి ఎదగగలగటం దీని మరో ప్రత్యేకత.
- సజ్జతో హెక్టారుకు 20 నుంచి 25 క్వింటాళ్ళ వరకు దిగుబడి సాధించవచ్చు. 20 నుంచి 30 అంగుళాల పొడవాటి కంకులు వుండటం ప్రత్యేకత.
- ప్రతి మొక్కకు అనేక పిలకలతో పాటు 6 నుంచి 10 కంకులు వస్తాయి. ప్రతి కంకిలో 90 శాతానికి పైగాబలమైన విత్తనాలే వుంటాయి. విత్తిన 90 రోజులకు పంట కోతకు వస్తుంది. అధిక మొత్తంలో గడ్డి లభిస్తుంది.
- వర్షాధారంగా ఈ రకంతో ఎక్కువ ఉత్పత్తి సాధించవచ్చని, చీడపీడలను తట్టుకునే శక్తి కలిగి వుందని అక్కడి కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్తలు, సెంటర్ ఇంటిగ్రేటెడ్ పెస్ట్ మేనేజ్మెంట్ సంస్థ శాస్త్రవేత్తలు అభిప్రాయ పడ్డారు.
- సుల్కానియా ప్రాంత రైతులతో పాటు, నిపుణులు ప్రశంసిస్తూ.. తాము కూడా 30 ఏళ్లుగా ఈ వంగడాన్ని సాగు చేస్తున్నామన్నారు.
- సికింద్రాబాద్‌లోని పల్లె సృజన స్వచ్ఛంద సంస్థ సుల్కానియా సజ్జ రకం విత్తనాలను తెప్పించి తెలుగు రాష్ట్రాల రైతులకు అందిస్తోంది. ఇతర వివరాలకు 'పల్లెసృజన' ప్రతినిధి వీరరాఘవరెడ్డిని 81257 99904, 79890 38186 ఈ నంబర్లలో సంప్రదించవచ్చు.



తన పొలంలోని పొడవైన సజ్జ కంకులతో రాజస్థాన్ రైతు హనుమాన్‌రామ్

విత్తనాలు కావాలా?

చిరుధాన్యాలను రోజువారీ ఆహారంలో ఎంతో కొంతైనా భాగం చేసుకోవాలని భారతీయ వైద్యపరిశోధనా మండలికి అనుబంధంగా ఉన్న జాతీయ పోషకాహార సంస్థ ఇటీవల విడుదల చేసిన ఆహార మార్గదర్శకాలలో భారతీయులకు స్పష్టమైన సూచన చేసింది. గత ఏడాది అంతర్జాతీయ చిరుధాన్యాల దినోత్సవం జరుపుకున్న నేపథ్యంలో ఇప్పటికే చిరుధాన్యాలను అన్నంగానో, అంబలిగానో స్నాక్స్‌గానో తీసుకునే వారి సంఖ్య నానాటికీ పెరుగుతోంది. చిరుధాన్యాలకు గిట్టుబాటు ధర లభిస్తుండటంతో తెలుగు రాష్ట్రాల్లో చిరుధాన్యాల సాగుపై రైతులు మక్కువ చూపుతున్న ఈ నేపథ్యంలో చిరుధాన్యాల విత్తనాల సమాచారం పొందుపరుస్తున్నాం..



హైదరాబాద్ రాజేంద్రనగర్‌లో... జొన్న, సజ్జ, కొర్ర, అండుకొర్ర, సామ, ఊద విత్తనాలు హైదరాబాద్ శివారు రాజేంద్రనగర్‌లోని భారతీయ చిరుధాన్యాల పరిశోధనా సంస్థ (ఐఐఎంఆర్)లో రైతులకు అందుబాటులో ఉన్నాయి. రకాన్ని బట్టి కిలో విత్తనాల ధర రూ. 100 నుంచి 200 వరకు ఉంటుంది. రైతులు స్వయంగా వెళ్లి ఐఐఎంఆర్ కార్యాలయంలో కొనుక్కోవాలి. వివరాలకు.. 040–24599305 నంబరులో సంప్రదించవచ్చు.

పాలెంలో... నాగర్‌కర్నూల్ జిల్లా పాలెంలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో అనేక ఇతర పంటల విత్తనాలతో పాటు చిరుధాన్యాల విత్తనాలు కూడా రైతులకు విక్రయిస్తున్నారు. పాలెం పచ్చజొన్న–1 (3 కేజీలు–రూ.450), తెలంగాణ తెల్ల జొన్న (3 కేజీలు–రూ.270), రాగి (3కేజీలు– రూ.150), సజ్జ (2 కేజీలు–రూ.200), కొర్ర (2 కేజీలు–రూ.130) విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. వివరాలకు మురళిని 94904 09163 నంబరులో సంప్రదించవచ్చు.

ఆంధ్రప్రదేశ్‌లో... నంద్యాలలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా కేంద్రంలో జొన్న, రాగి విత్తనాలు ఉన్నాయి. డాక్టర్ నర్సింహులును 79810 85507 నంబరులో సంప్రదించవచ్చు. అనంతపురంలోని వ్యవసాయ పరిశోధనా కేంద్రంలో సజ్జ విత్తనాలు ఉన్నాయి. డాక్టర్ మాధవీలతను 79819 29538 నంబరులో సంప్రదించవచ్చు. పెరుమాళ్లపల్లె వ్యవసాయ పరిశోధనా స్థానంలో రాగి విత్తనాలు ఉన్నాయి. ఎం. శ్రీవల్లిని 93987 95089 నంబరులో సంప్రదించవచ్చు. విజయనగరం వ్యవసాయ పరిశోధనా కేంద్రంలో రాగి విత్తనాలు ఉన్నాయి. డా. ఎన్. అనూరాధను 85002 04565 నంబరులో సంప్రదించవచ్చు. ఇదిలా ఉండగా, ఏపీ రాష్ట్ర వ్యవసాయ శాఖ ఈ ఖరీఫ్‌కు ఇతరత్రా పంట విత్తనాతో పాటు 721 క్వింటాళ్ల రాగి, 146 క్వింటాళ్ల కొర్ర, 6 క్వింటాళ్ల సామ, ఒక క్వింటా ఊద విత్తనాలను 26 జిల్లాల్లో రైతులకు సబ్సిడీపై పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తోంది.

బోరు చుట్టూ ఇంకుడుగుంత నిర్మించడం ఎలా?

ఈ ఏడాది అధిక వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ సూచనల నేపథ్యంలో వాన నీటి సంరక్షణకు ఉపక్రమిద్దాం. పొలాల్లో, గేటెడ్ కమ్యూనిటీల్లో, అపార్ట్‌మెంట్లు / ఇళ్ల దగ్గర ఉన్న బోర్ల చుట్టూతా ఇంకుడు గుంతలు తీయించుకుందాం. బోరు రీచార్జ్ గుంతను నిర్మించుకుంటే.. వర్షపు నీటిలో 40–50% వరకు భూమి లోపలికి ఇంకింపజేసుకోవచ్చని భూగర్భ జల నిపుణులు, సికింద్రాబాద్‌లోని వాటర్ అండ్ లైవ్‌లీహుడ్స్ ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ ఆర్.వి. రామమోహన్ (94401 94866) సూచిస్తున్నారు. మరింత సమాచారం కోసం, సంబంధిత వీడియో కోసం ఈ క్యూఆర్ కోడ్‌లను స్కాన్ చేయండి.



నాలుగో ర్యాంక్‌లో జ్యోతి సురేఖ

ఆర్చరీ ప్రపంచ ర్యాంకింగ్స్‌లో మహిళల కాంపౌండ్ వ్యక్తిగత విభాగంలో భారత స్టార్, ఆంధ్రప్రదేశ్ క్రీడాకారిణి వెన్నం జ్యోతి సురేఖ నాలుగో స్థానంలో నిలిచింది. గత ర్యాంకింగ్స్‌లో రెండో ర్యాంక్‌లో ఉన్న జ్యోతి సురేఖ కొరియాలో జరిగిన ప్రపంచకప్ స్టేజ్–2 టోర్నీలో క్వార్టర్ ఫైనల్లో ఓడిపోవడంతో ఆమె ర్యాంక్‌లో మార్పు వచ్చింది. భారత్‌కే చెందిన అదితి 10వ ర్యాంక్‌లో, పర్ణీత్ కౌర్ 12వ ర్యాంక్‌లో కొనసాగుతున్నారు. టీమ్ విభాగంలో సురేఖ, అదితి, పర్ణీత్ బృందం నంబర్‌వన్ ర్యాంక్‌ను నిలబెట్టుకుంది.



ఉజ్బెకిస్తాన్‌తో ఫుట్‌బాల్ మ్యాచ్‌లకు సౌమ్య

తెలంగాణ అమ్మాయి సౌమ్య గుగులోత్ భారత మహిళల ఫుట్‌బాల్ జట్టులో తన స్థానాన్ని నిలబెట్టుకుంది. తాష్కెంట్ నగరంలో ఉజ్బెకిస్తాన్ జట్టుతో మే 31, జూన్ 4వ తేదీల్లో జరిగే రెండు అంతర్జాతీయ ఫ్రెండ్లీ మ్యాచ్‌ల్లో పోటీపడే భారత జట్టులో ఆమె ఎంపికైంది. 30 మంది ప్రాబబుల్స్‌కు ఇటీవల రెండు వారాలపాటు హైదరాబాద్‌లోని శ్రీనిధి డెక్కన్ ఫుట్‌బాల్ క్లబ్ మైదానంలో శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ ఏడాది ఆరంభంలో జరిగిన టర్కిష్ కప్ టోర్నీలో రన్నరప్‌గా నిలిచిన భారత జట్టులోనూ సౌమ్య సభ్యురాలిగా ఉంది.

నాదల్‌కు షాక్

ఫ్రెంచ్ ఓపెన్ తొలి రౌండ్‌లోనే ఓడిపోయిన స్పెయిన్ దిగ్గజం

● జర్మనీ స్టార్ జ్వెరెవ్ సంచలనం


నాదల్

పారిస్: తరచూ గాయాలబారిన పడటం... పూర్తి స్థాయి ఫిట్‌నెస్ లేకపోవడం... వెరసి మట్టికోర్టులపై మకుటంలేని మహరాజుగా వెలుగొందిన స్పెయిన్ దిగ్గజం రాఫెల్ నాదల్‌కు ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో ఊహించని పరాజయం ఎదురైంది. 2005 నుంచి ఈ టోర్నీలో ఆడుతూ ఏకంగా 14 సార్లు విజేతగా నిలిచిన 37 ఏళ్ల నాదల్ మొదటి రౌండ్‌లోనే ఇంటిదారి పట్టడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. ప్రపంచ నాలుగో ర్యాంకర్, గత మూడేళ్లుగా ఫ్రెంచ్ ఓపెన్‌లో సెమీ ఫైనల్ చేరిన జర్మనీ స్టార్ అలెగ్జాండర్ జ్వెరెవ్ పక్కా ప్రణాళికతో ఆడి నాదల్ ఆట కట్టించాడు. 3 గంటల 5 నిమిషాలపాటు సోమవారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో జ్వెరెవ్ 6–3, 7–6 (7/5), 6–3తో నాదల్‌ను ఓడించి రెండో రౌండ్‌లోకి ప్రవేశించాడు. ఈ మ్యాచ్‌లో జ్వెరెవ్ ఎనిమిది ఏస్‌లు సంధించడంతోపాటు నాదల్ సర్వీస్‌ను ఆరుసార్లు బ్రేక్ చేశాడు. జ్వెరెవ్ సర్వీస్‌ను కేవలం రెండుసార్లు బ్రేక్ చేసిన నాదల్ 30 అనవసర తప్పిదాలు కూడా చేశాడు. గాయం కారణంగా గత ఏడాది ఈ టోర్నీకి దూరంగా ఉన్న నాదల్ తాజా ఓటమితో చివరిసారి ఫ్రెంచ్ ఓపెన్‌లో ఆడినట్లు భావించాలి.

3 ఫ్రెంచ్ ఓపెన్ చరిత్రలో నాదల్‌ను ఓడించిన మూడో ప్లేయర్‌గా జ్వెరెవ్ నిలిచాడు. గతంలో సోడెర్లింగ్ (స్వీడన్; 2009లో ప్రిక్వార్టర్స్‌లో) ఒకసారి... జొకోవిచ్ (సెర్బియా; 2015 క్వార్టర్ ఫైనల్లో, 2021 సెమీఫైనల్లో) రెండుసార్లు ఈ టోర్నీలో నాదల్‌ను ఓడించారు. 2016లో గాయం కారణంగా నాదల్ మూడో రౌండ్ నుంచి వైదొలిగాడు.

3 గ్రాండ్‌స్లామ్ టోర్నీలలో నాదల్ తొలి రౌండ్‌లో ఓడిపోవడం ఓవరాల్‌గా ఇది మూడోసారి మాత్రమే. ఇంతకుముందు నాదల్ 2016 ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో, 2013 వింబుల్డన్ టోర్నీలో తొలి రౌండ్‌లో ఓటమి పాలయ్యాడు.

సుమిత్ నగాల్ ఓటమి

ఫ్రెంచ్ ఓపెన్‌లో తొలిసారి ఆడుతున్న భారత నంబర్‌వన్ సుమిత్ నగాల్ పోరాటం మొదటి రౌండ్‌లోనే ముగిసింది. ప్రపంచ 18వ ర్యాంకర్ ఖచనోవ్ (రష్యా)తో జరిగిన మ్యాచ్‌లో సుమిత్ 2–6, 0–6, 6–7 (5/7)తో ఓడిపోయాడు. మరోవైపు ప్రపంచ రెండో ర్యాంకర్ యానిక్ సినెర్ (ఇటలీ) శుభారంభం చేశాడు. తొలి రౌండ్‌లో సినెర్ 6–3, 6–3, 6–4తో యుబ్యాంక్స్ (అమెరికా)పై గెలిచాడు.


జ్వెరెవ్


స్వియాటెక్

స్వియాటెక్ ముందంజ

మహిళల సింగిల్స్‌లో డిఫెండింగ్ చాంపియన్, ప్రపంచ నంబర్‌వన్ ఇగా స్వియాటెక్ (పోలాండ్) రెండో రౌండ్‌లోకి దూసుకెళ్లింది. తొలి రౌండ్‌లో స్వియాటెక్ 6–1, 6–2తో లియోలియా జీన్‌జీన్ (ఫ్రాన్స్)పై గెలిచింది. ఇతర తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో మూడో సీడ్ కోకో గాఫ్ (అమెరికా) 6–1, 6–1తో జూలియా అవ్‌దీవా (రష్యా)పై, ఎనిమిదో సీడ్ ఆన్స్ జబర్ (ట్యునీషియా) 6–3, 6–2తో సాచియా వికెరీ (అమెరికా)పై, ఐదో సీడ్ వొంద్రుసోవా (చెక్ రిపబ్లిక్) 6–1, 6–3తో మసరోవా (స్పెయిన్)పై విజయం సాధించారు.

హర్మన్‌ప్రీత్ హ్యాట్రిక్

అర్జెంటీనాపై భారత్ విజయం



ఆంట్‌వర్ప్ (బెల్జియం): అంతర్జాతీయ హాకీ సమాఖ్య పురుషుల ప్రొ లీగ్ టోర్నీలో భారత జట్టు ఏడో విజయం నమోదు చేసింది. యూరోపియన్ అంచెలో భాగంగా ఒలింపిక్ మాజీ చాంపియన్ అర్జెంటీనాతో జరిగిన మ్యాచ్‌లో భారత జట్టు 5–4 గోల్స్ తేడాతో గెలిచింది. భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ 'హ్యాట్రిక్' సాధించి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. టీమిండియా తరఫున హర్మన్‌ప్రీత్ (29వ, 50వ, 52వ ని.లో) మూడు గోల్స్ చేయగా... అరిజీత్ సింగ్ హుండల్ (7వ ని.లో, గుర్జంత్ సింగ్ (18వ ని.లో) ఒక్కో గోల్ సాధించారు. అర్జెంటీనా తరఫున ఫెడెరికో మోంజా (3వ ని.లో), నికోలస్ కీనన్ (24వ ని.లో), టడియో మరూసి (54వ ని.లో), లుకాస్ మార్టినెజ్ (57వ ని.లో) ఒక్కో గోల్ చేశారు. మొత్తం తొమ్మిది జట్లు పోటీ పడుతున్న ప్రొ లీగ్‌లో భారత జట్టు 12 మ్యాచ్‌లు పూర్తి చేసుకుంది. ఏడు మ్యాచ్‌ల్లో నెగ్గి, ఐదు మ్యాచ్‌ల్లో ఓడిపోయి 21 పాయింట్లతో రెండో స్థానంలో ఉంది. యూరోపియన్ అంచెలో భాగంగా లండన్‌లో జూన్ 1 నుంచి 9 వరకు లండన్‌లో జరిగే మ్యాచ్‌ల్లో భారత జట్టు జర్మనీ, బ్రిటన్‌లతో రెండు సార్లు చొప్పున తలపడుతుంది.

అంకుశిత బోణీ



బ్యాంకాక్: వరల్డ్ ఒలింపిక్ చివరి క్వాలిఫయింగ్ బాక్సింగ్ టోర్నీలో సోమవారం భారత బాక్సర్లకు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. మహిళల 60 కేజీల విభాగంలో అంకుశిత బోరో శుభారంభం చేయగా... పురుషుల 80 కేజీల విభాగంలో అభిమన్యు రెండో రౌండ్‌లో ఓడిపోయాడు. మోన్‌ఖోర్ (మంగోలియా)తో జరిగిన బౌట్‌లో అంకుశిత 4–1తో గెలుపొందింది. కెలిన్ కాసిడీ (ఐర్లాండ్)తో జరిగిన బౌట్‌లో అభిమన్యు 0–5తో ఓటమి పాలయ్యాడు. నేడు జరిగే రెండో రౌండ్ బౌట్‌లలో భారత బాక్సర్లు సచిన్ (57 కేజీలు), అభినాశ్ జమ్వాల్ (63.5 కేజీలు), నిశాంత్ (71 కేజీలు) పోటీపడతారు.

విండీస్ క్లీన్‌స్వీప్

కింగ్‌స్టౌన్: దక్షిణాఫ్రికాతో జరిగిన టి20 సిరీస్‌ను వెస్టిండీస్ 3–0తో క్లీన్‌స్వీప్ చేసింది. చివరిదైన మూడో టి20లో వెస్టిండీస్ ఎనిమిది వికెట్ల తేడాతో గెలిచింది. ముందుగా దక్షిణాఫ్రికా నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 163 పరుగులు చేసింది. డసెన్ (51; 1 ఫోర్, 5 సిక్స్‌లు) రాణించాడు. విండీస్ బౌలర్లలో మెకాయ్ (3/39), మోతీ (2/21) ఆకట్టుకున్నారు. అనంతరం 164 పరుగుల లక్ష్యాన్ని వెస్టిండీస్ కేవలం 13.5 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఓపెనర్లు జాన్సన్ చార్లెస్ (26 బంతుల్లో 69; 9 ఫోర్లు, 5 సిక్స్‌లు), బ్రాండన్ కింగ్ (28 బంతుల్లో 44; 2 ఫోర్లు, 4 సిక్స్‌లు) తొలి వికెట్‌కు 6.4 ఓవర్లలో 92 పరుగులు జోడించారు. వీరిద్దరు అవుటయ్యాక మేయర్స్ (23 బంతుల్లో 36 నాటౌట్; 4 సిక్స్‌లు), అథనాజ్ (6 నాటౌట్) విండీస్ విజయాన్ని ఖరారు చేశారు. మూడు మ్యాచ్‌ల టి20 సిరీస్‌ను వెస్టిండీస్ క్లీన్‌స్వీప్ చేయడం ఇది రెండోసారి. 2017లో అఫ్గానిస్తాన్‌పై విండీస్ తొలిసారి 3–0తో క్లీన్‌స్వీప్ చేసింది.


చార్లెస్

పిచ్ క్యురేటర్లకు, గ్రౌండ్స్‌మెన్‌కు బీసీసీఐ నజరానా

ఐపీఎల్ 10 వేదికలకు రూ. 25 లక్షల చొప్పున నగదు పురస్కారం


న్యూఢిల్లీ: పరుగు వీరులకు, వికెట్ల ధీరులకు క్యాప్‌లు (ఆరెంజ్, పర్పుల్), చెక్‌లు షరామామూలుగా అందజేసిన భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ఈసారి మరో అడుగు ముందుకు వేసింది. ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 17వ సీజన్‌లో అన్ని మ్యాచ్‌లు సజావుగా జరిగేందుకు రోజుల తరబడి పిచ్‌లు, వేదికల్ని సిద్ధం చేసిన క్యురేటర్లు, మైదానం సహాయక సిబ్బందికి భారీ నజరానాను ప్రకటించింది. వీరిని 'తెరవెనుక హీరో'లుగా అభివర్ణించిన బోర్డు కార్యదర్శి జై షా ఒక్కో వేదికలో భాగమైన క్యురేటర్–సిబ్బందికి కలిపి రూ. 25 లక్షలు నజరానా ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ఐపీఎల్ విజయవంతంగా నిర్వహించడంలో కృషి చేసిన వీరిని సోషల్ మీడియా వేదికగా జై షా అభినందించారు. 10 రెగ్యులర్ వేదికలు హైదరాబాద్, ముంబై, చెన్నై, కోల్‌కతా, ఢిల్లీ, బెంగళూరు, జైపూర్, ముల్లాన్‌పూర్, లక్నో, అహ్మదాబాద్‌లకు రూ. 25 లక్షల చొప్పున రివార్డు అందజేస్తారు. ఢిల్లీ క్యాపిటల్స్, రాజస్తాన్ రాయల్స్, పంజాబ్ కింగ్స్‌లకు రెండో హోం గ్రౌండ్‌లు అయిన విశాఖపట్నం, గువాహటి, ధర్మశాల వేదికల సిబ్బందికి రూ. 10 లక్షల చొప్పున నజరానా ప్రకటించారు. మొత్తం 13 వేదికల్లో ఉత్తమ వేదికగా ఎంపికైన హైదరాబాద్ ఉప్పల్ స్టేడియానికి రూ. 50 లక్షల చెక్‌ను ఐపీఎల్ పాలక మండలి సభ్యుడు చాముండేశ్వరనాథ్... హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) అధ్యక్షుడు అర్శనపల్లి జగన్ మోహన్ రావుకు అందజేశారు.



ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ సభ్యుడు చాముండేశ్వరనాథ్ నుంచి 'ఉత్తమ పిచ్, ఉత్తమ మైదానం' అవార్డు కింద రూ. 50 లక్షల చెక్ అందుకుంటున్న హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్ రావు

సినిమా

సర్‌ప్రైజ్ చూపించేద్దామా..!


● ప్రభాస్

ప్రభాస్ హీరోగా నటించిన సైన్స్ ఫిక్షన్ అండ్ ఫ్యూచరిస్టిక్ ఫిల్మ్ 'కల్కి 2898 ఏడీ'. అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, దీపికా పదుకొనె, దిశా పటానీ ఇతర పాత్రల్లో నటించారు. నాగ్ అశ్విన్ దర్శకత్వంలో అశ్వినీదత్ నిర్మించిన ఈ చిత్రం జూన్ 27న విడుదల కానుంది. ఈ చిత్రంలో భైరవ పాత్రలో ప్రభాస్ నటిస్తున్నారు. ఈ మూవీలో ఆయన వాడిన కారు పేరు బుజ్జి. ఈ బుజ్జికి కీర్తి సురేష్ వాయిస్ ఓవర్ ఇచ్చారు. కాగా ఈ సినిమాకు సంబంధించిన 'బుజ్జి అండ్ భైరవ' యానిమేషన్ ప్రిల్యూడ్ వీడియోను ఈ నెల 31న విడుదల చేయనున్నట్లు వెల్లడించి, టీజర్‌ను విడుదల చేశారు. ''ఓకే బుజ్జి.. వీళ్లకి సర్‌ప్రైజ్ చూపించేద్దామా?' (ప్రభాస్), 'ఓకే భైరవ..' (వాయిస్ ఓవర్‌తో బుజ్జి) వంటి డైలాగ్స్ ఈ టీజర్‌లో ఉన్నాయి. అమేజాన్ ప్రైమ్ ఓటీటీలో ఈ వీడియో స్ట్రీమింగ్ కానుంది. 'కల్కి 2898 ఏడీ' సినిమాలోని వివిధ పాత్రల పరిచయంతో ఈ వీడియో ఉంటుందని సమాచారం. ఈ సినిమాకు సంగీతం: సంతోష్ నారాయణన్.

సికందర్‌కు విలన్‌గా...


● సల్మాన్ ఖాన్


● సత్యరాజ్

సల్మాన్‌ఖాన్‌కు విలన్‌గా నటుడు సత్యరాజ్ నటించనున్నారా? అంటే అవుననే అంటున్నాయి బాలీవుడ్ వర్గాలు. సల్మాన్‌ఖాన్ హీరోగా ఏఆర్ మురుగదాస్ దర్శకత్వంలో 'సికందర్' అనే ఓ యాక్షన్ థ్రిల్లర్ తెరకెక్కనుంది. ఈ చిత్రంలో రష్మికా మందన్నా హీరోయిన్‌గా నటించనున్నారు. జూన్ నుంచి ఈ మూవీ రెగ్యులర్ షూటింగ్ జరిగేలా యూనిట్ సన్నాహాలు చేస్తోందని బాలీవుడ్ సమాచారం. ఈ సినిమాలో పవర్‌ఫుల్ విలన్ రోల్‌కు సత్యరాజ్‌ను తీసుకున్నారట మురుగదాస్. ఈ విషయంపై త్వరలోనే అధికారిక ప్రకటన రానుందని బాలీవుడ్ టాక్. సాజిద్ నడియాడ్‌వాలా నిర్మించనున్న 'సికందర్' వచ్చే ఏడాది రంజాన్‌కి విడుదల కానుంది.

రజనీకాంత్ స్నేహితుడిగా.. రజనీకాంత్ హీరోగా లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో సన్‌పిక్చర్స్ 'కూలీ' అనే సినిమా నిర్మించనుంది. ఈ మూవీలో రజనీకాంత్ స్నేహితుడి పాత్రలో సత్యరాజ్ నటించనున్నారని కోలీవుడ్ టాక్. 1986లో వచ్చిన 'మిస్టర్ భరత్' సినిమాలో రజనీకాంత్, సత్యరాజ్ స్క్రీన్ షేర్ చేసుకున్నారు. మళ్లీ 38 సంవత్సరాల తర్వాత 'కూలీ' సినిమా కోసం స్క్రీన్ షేర్ చేసుకుంటారా? వేచి చూడాలి.

అలాంటి పాత్రలంటే ఇష్టం

- ఐశ్వర్యా మీనన్



''భజే వాయు వేగం' సినిమాలో యాక్షన్, ఎమోషన్‌తో పాటు లవ్, రొమాన్స్ కూడా ఉంటాయి. ఇదొక రా కంటెంట్ మూవీ. ఇందులో ఇందు అనే ట్రెడిషనల్ క్యారెక్టర్‌లో కనిపిస్తా. నాకు ఇలాంటి పాత్రలు చేయడం ఇష్టం. ఎందుకంటే నిజ జీవితంలోనూ నేను సంప్రదాయకమైన దుస్తులు ధరించేందుకు ఇష్టపడతాను'' అని హీరోయిన్ ఐశ్వర్యా మీనన్ అన్నారు. కార్తికేయ గుమ్మకొండ హీరోగా ప్రశాంత్ రెడ్డి తెరకెక్కించిన చిత్రం 'భజే వాయు వేగం'. యూవీ క్రియేషన్స్ సమర్పణలో యూవీ కాన్సెప్ట్స్ బ్యానర్ నిర్మించిన ఈ మూవీ ఈ నెల 31న విడుదలవుతోంది. ఈ నేపథ్యంలో ఐశ్వర్యా మీనన్ మాట్లాడుతూ–''స్పై' సినిమాకి ముందే 'భజే వాయు వేగం' ఒప్పుకున్నాను. అయితే 'స్పై' ముందుగా వచ్చింది. అయినప్పటికీ నన్ను తెలుగుకి పరిచయం చేసింది దర్శకుడు ప్రశాంత్ రెడ్డి అనుకోవాలి. 'భజే వాయు వేగం'లో ఇందు అనే బ్యూటీషియన్ పాత్ర చేశాను. కార్తికేయతో నటించడం హ్యాపీగా ఉంది. యూవీ క్రియేషన్స్ లాంటి పేరున్న సంస్థలో సినిమా చేయడం గర్వంగా ఉంది. రథన్ చక్కని మ్యూజిక్ ఇచ్చాడు. నా ప్రతి సినిమా సూపర్ హిట్ కావాలని కోరుకుంటా. కానీ ఫలితం ప్రేక్షకుల చేతుల్లో ఉంటుంది. 'హైవే' సినిమాలో ఆలియా భట్‌గారిలా నటనకు ఆస్కారం ఉండే పాత్ర చేయాలని ఉంది. ప్రస్తుతం తెలుగులో ఒక సినిమా ఒప్పుకున్నా.. అలాగే మరో రెండు చర్చల్లో ఉన్నాయి. తమిళంలో కూడా ఓ సినిమా చేస్తున్నా'' అన్నారు.

జోడీ రిపీట్?


● శ్రీలీల


● రవితేజ

'ధమాకా!' (2022) సినిమాలో తొలిసారి జంటగా నటించి ఆడియన్స్‌ను మెప్పించారు రవితేజ, శ్రీలీల. తాజాగా ఈ జోడీ రిపీట్ కానున్నట్లుగా తెలిసింది. రవితేజ హీరోగా భాను భోగవరపు దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ సినిమా నిర్మించనున్నారు. ఇది రవితేజ కెరీర్‌లో 75వ చిత్రం కావడం విశేషం. ఇందులో లక్ష్మణ్ భేరి అనే పాత్రలో కనిపించనున్నారు రవితేజ. ఈ సినిమా చిత్రీకరణ జూన్ నెలాఖరులో ప్రారంభం కానుందని తెలిసింది. అయితే ఈ సినిమాలో రవితేజకు జోడీగా శ్రీలీల నటించనున్నారని ఫిల్మ్‌నగర్ సమాచారం. మరి.. ఈ 'ధమాకా!' జోడీ రిపీట్ అవుతుందా? వేచి చూడాలి. కాగా ఈ సినిమాను 2025 సంక్రాంతికి రిలీజ్ చేస్తామని ఇప్పటికే చిత్రయూనిట్ ప్రకటించిన విషయం తెలిసిందే.

షారుక్ బాద్‌షా.. నేను రాధిక

- నేహా శెట్టి



''మనం పోషించిన పాత్రల పేరుతో ప్రేక్షకులు మనల్ని పిలవడం ఏ నటులకైనా గొప్ప ప్రశంస. పోలిక అని కాదు కానీ.. షారుఖ్ ఖాన్‌గారిని బాద్‌షా అని పిలుస్తారు. 'డీజే టిల్లు' చిత్రంలో నేను పోషించిన రాధిక పాత్ర ప్రేక్షకుల హృదయాల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది. నా కెరీర్ ప్రారంభంలోనే రాధిక అని పేరు తెచ్చుకోవడం సంతోషంగా ఉంది.. దాన్ని గౌరవంగా భావిస్తున్నాను'' అని హీరోయిన్ నేహా శెట్టి అన్నారు. విశ్వక్ సేన్ హీరోగా కృష్ణ చైతన్య దర్శకత్వం వహించిన చిత్రం 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి'. నేహా శెట్టి, అంజలి కథానాయికలు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ సినిమా ఈ నెల 31న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా నేహా శెట్టి మాట్లాడుతూ–''గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' మూవీ ఒక కుటుంబ ప్రయాణంలా ఉంటుంది. రత్న, రత్నమాల, బుజ్జి పాత్రల చుట్టూ కథ తిరుగుతుంది. ఈ మూవీలో 90లలో ధనవంతుల కుటుంబానికి చెందిన పల్లెటూరి అమ్మాయి బుజ్జి పాత్ర చేశా. 90లలో సాగే ఈ క్యారెక్టర్ కోసం డైరెక్టర్‌గారు నటి శోభనగారిని రిఫరెన్స్‌గా చూపించారు. బుజ్జి పాత్ర నాకు ఎంతగానో పేరు తెచ్చి పెడుతుంది. అప్పట్లో వాన పాటలంటే శ్రీదేవిగారు గుర్తుకొచ్చే వారు. అంత గొప్ప నటిలాగా ఇప్పుడు నాకు ఎక్కువ వాన పాటల్లో కనిపించే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నాను. విశ్వక్ సేన్ ఈ సినిమా కోసం ఎంతో కష్టపడ్డాడు. అనుభవం గల నటిగా అంజలిగారి నుంచి ఎన్నో విషయాలు నేర్చుకున్నాను. కృష్ణ చైతన్యగారు ఈ మూవీని తెరకెక్కించిన విధానం అద్భుతం. సితార సంస్థలో సినిమా చేయడం సంతోషంగా ఉంది. బెల్లంకొండ సాయి శ్రీనివాస్‌కి జోడీగా ఓ సినిమా చేయబోతున్నా'' అన్నారు.

జూన్‌లో నమో

'మనమంతా', 'జెర్సీ', 'ఓ పిట్టకథ' వంటి సినిమాల్లో నటించిన విశ్వంత్ దుద్దంపూడి హీరోగా నటించిన చిత్రం 'నమో'. అనురూప్ కటారి, విస్మయ ఇతర లీడ్ రోల్స్‌లో నటించారు. కందూరు ఆదిత్యా రెడ్డి దర్శకత్వంలో ఎ.ప్రశాంత్ నిర్మించిన ఈ సినిమాను జూన్ 7న విడుదల చేయనున్నట్లు చిత్రయూనిట్ వెల్లడించింది. ''సర్వైవల్ కామెడీ జానర్ ఫిల్మ్ 'నమో'. తండ్రి కోసం అడవికి వెళ్లిన హీరో, అతని స్నేహితుడు అనుకోకుండా ఓ డెన్‌లో చిక్కుకుపోతారు. ఆ తర్వాత వారు ఎలా బయటపడ్డారు? అన్నదే ఈ సినిమా కథాంశం'' అన్నారు మేకర్స్. ఈ సినిమాకు సంగీతం: క్రాంతి ఆచార్య వడ్లూరి.


● విస్మయ, విశ్వంత్, అనురూప్

ప్రేక్షకుల్ని బాగా నవ్విస్తుంది

- నిర్మాత వంశీ కారుమంచి



''క్రైమ్, కామెడీ, యాక్షన్‌గా 'గం..గం..గణేశా' సినిమా రూపొందింది. మరీ ముఖ్యంగా ఇందులోని వినోదం ఆకట్టుకుంటుంది. మన స్నేహితుల్లో ఎవరో ఒకరు మనల్ని సమస్యల్లో ఇరికిస్తుంటారు. అలాంటి సందర్భాల్లో వచ్చే వినోదం ప్రేక్షకుల్ని బాగా నవ్విస్తుంది'' అని నిర్మాత వంశీ కారుమంచి అన్నారు. ఆనంద్ దేవరకొండ హీరోగా, ప్రగతి శ్రీవాస్తవ, కరిష్మా హీరోయిన్లుగా నటించిన చిత్రం 'గం..గం.. గణేశా'. ఉదయ్ శెట్టి దర్శకుడు. హైలైఫ్ ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై వంశీ కారుమంచి, కేదార్ సెలగంశెట్టి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 31న రిలీజ్ అవుతోంది. ఈ సందర్భంగా వంశీ కారుమంచి మాట్లాడుతూ–''నాది గుంటూరు. చిన్నప్పటి నుంచి సినిమాలంటే ఇష్టం. అమెరికాలో ఉద్యోగం, వ్యాపారం చేశా. కొన్ని సినిమాలు డిస్ట్రిబ్యూట్ చేశాను. ఇండియాలోనే స్థిరపడాలనుకున్నప్పుడు సినిమాలు నిర్మించాలనే ఆలోచన ఉండేది. ఉదయ్ కథ చెప్పగానే ఆనంద్‌కి సరిపోతుందనిపించింది. కొంత ఆకతాయిగా, జులాయిగా ఉండే పాత్ర తనది. గణేష్ విగ్రహం, డబ్బుతో ముడిపడిన యాక్షన్ కామెడీ సినిమా 'గం గం గణేశా'. ఇద్దరి హీరోయిన్ల పాత్రకి మంచి ప్రాధాన్యం ఉంది. సినిమా ఇండస్ట్రీ చూసేందుకు చిన్నదిగా కనిపించినా లక్షల మంది దీని మీద ఆధారపడి జీవిస్తున్నారు. ప్రస్తుతం రెండు కథలు ఫైనలైజ్ చేస్తున్నాం'' అన్నారు.

క్రైమ్ థ్రిల్లర్


● పాయల్

'ఆర్ఎక్స్ 100', 'మంగళవారం' వంటి చిత్రాలతో ప్రేక్షకుల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న హీరోయిన్ పాయల్ రాజ్‌పుత్ లీడ్ రోల్‌లో నటించిన తాజా చిత్రం 'రక్షణ'. రోషన్, మానస్ ఇతర కీలక పాత్రల్లో నటించారు. హరిప్రియ క్రియేషన్స్‌పై ప్రణదీప్ ఠాకోర్ స్వీయ దర్శకత్వంలో నిర్మించిన ఈ సినిమాని జూన్ 7న రిలీజ్ చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ సందర్భంగా ప్రణదీప్ ఠాకోర్ మాట్లాడుతూ–''ఇదొక క్రైమ్ ఇన్వెస్టిగేటివ్ మిస్టరీ డ్రామా. ఒక పోలీస్ ఆఫీసర్ జీవితంలో జరిగిన ఘటన స్ఫూర్తితో రాసిన కథతో ఈ సినిమా తీశా. పాయల్ రాజ్‌పుత్ ఇప్పటి వరకు చేసిన పాత్రలకు భిన్నంగా ఇందులో పవర్‌ఫుల్ ఇన్వెస్టిగేటివ్ పోలీస్ ఆఫీసర్‌గా నటించారు. క్రైమ్ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ మూవీని ఎక్కడా రాజీ పడకుండా ఉన్నత నిర్మాణ విలువలతో రూపొందించాను. 'రక్షణ' ప్రేక్షకులను మెప్పిస్తుంది'' అన్నారు.

డైరెక్టర్ సూర్యప్రకాశ్ కన్నుమూత



చెన్నై: డైరెక్టర్ సూర్యప్రకాశ్ (56) సోమవారం గుండెపోటుతో చెన్నైలో కన్నుమూశారు. రాజ్‌కిరణ్ కథానాయకుడిగా నటించిన 'మాణిక్యం'(1996) చిత్రం ద్వారా దర్శకుడిగా పరిచయమయ్యారాయన. ఆ తర్వాత శరత్‌కుమార్ హీరోగా 'మాయి, దివాన్', జీవన్ కథానాయకుడిగా 'అధిపర్' అనే తమిళ చిత్రాలు తీశారు. తెలుగులో రాజశేఖర్ హీరోగా 'భరత సింహారెడ్డి' సినిమా తెరకెక్కించారు సూర్యప్రకాశ్. ఆయన దర్శకత్వం వహించిన 'వరుసనాడు' చిత్రం విడుదల కావాల్సి ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో ఆయన హఠాన్మరణం సినీ పరిశ్రమను దిగ్భ్రాంతికి గురిచేసింది. సూర్య ప్రకాశ్ మృతికి నటుడు శరత్‌కుమార్‌తో పాటు పలువురు సినీరంగ ప్రముఖులు ప్రగాఢ సంతాపం తెలిపారు.

సాక్షి **బిజినెస్**
మంగళవారం
28-5-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	20	75,390
నిఫ్టీ ▽	25	22,932

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	16,921	△	185
డోజోన్స్	39,070	△	4
ఎఫ్‌టీఎస్‌ఈ 100 (శుక్రవారం ముగింపు)	8,318	▽	22
డాక్స్	18,775	△	81
షాంఘై	3,124	△	35
నికాయ్	38,900	△	254

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	72,191
బంగారం (99.5 స్వచ్ఛత)	71,902
వెండి (కిలో)	90,811

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.69	83.71
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	104.72	107.28
€	యూరో	ఎస్‌బీఐ	89.09	91.47
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	52.50	53.66
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	54.22	56.18
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	59.30	63.99
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.27	22.83
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.75	23.53
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.36	12.43

ఎస్‌ఎంఎస్ స్కామర్లపై డాట్ కొరడా

ఎనిమిది సంస్థల బ్లాక్‌లిస్ట్

న్యూఢిల్లీ: మోసపూరిత మెసేజీలు పంపిస్తున్న ఎస్ఎంఎస్ స్కామర్లపై టెలికం శాఖ (డాట్) కొరడా ఝుళిపించింది. గత మూడు నెలలుగా 10,000 పైచిలుకు మెసేజీలు పంపిన ఎనిమిది 'ప్రిన్సిపల్ ఎంటిటీ'లను (ఎస్ఎంఎస్ ద్వారా టెలికం యూజర్లకు వాణిజ్యపరమైన మెసేజీలు పంపే సంస్థలు) బ్లాక్‌లిస్ట్ చేసింది. అలాగే వాటిని పంపేందుకు ఉపయోగించిన 73 ఎస్ఎంఎస్ హెడర్స్, 1,522 కంటెంట్ టెంప్లేట్స్‌ను కూడా బ్లాక్‌లిస్ట్‌లో పెట్టింది. కేంద్ర హోం వ్యవహారాల శాఖ సమాచారం మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు డాట్ తెలిపింది. సందేహాస్పద కమ్యూనికేషన్స్ గురించి ప్రజలు సంచార్ సాథి పోర్టల్‌లోని చక్షు ద్వారా ఫిర్యాదు చేయొచ్చని పేర్కొంది. స్పామ్‌పై ఫిర్యాదు చేసేందుకు 1909కి డయల్ చేయొచ్చని లేదా డీఎన్‌డీ (డు నాట్ డిస్టర్బ్) సర్వీసును ఉపయోగించాలని సూచించింది.

అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ నిధుల సమీకరణ

న్యూఢిల్లీ: అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ రూ. 12,500 కోట్ల నిధులను సమీకరించే యత్నాల్లో ఉంది. క్వాలిఫైడ్ ఇనిస్టిట్యూషనల్ ప్లేస్‌మెంట్ విధానంలో ఈ మొత్తాన్ని సమీకరించే ప్రతిపాదనకు కంపెనీ బోర్డు ఆమోదముద్ర వేసింది. జూన్ 25న జరిగే వార్షిక సర్వసభ్య సమావేశంలో షేర్‌హోల్డర్ల అనుమతిని కోరనుంది. ఈ ప్రతిపాదన ప్రకారం ఒక్కోటి రూ. 10 ముఖ విలువ చేసే ఈక్విటీ షేర్లను అలాగే ఇతరత్రా సెక్యూరిటీలను జారీ చేయడం ద్వారా ఈ మొత్తాన్ని సమీకరించే అవకాశం ఉంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

28-5-2024 ఫామ్ ధర...

విశాఖ	500-00
చిత్తూరు	593-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	485-00
విజయవాడ	485-00
రిటైల్ ధర (డజను)	66.00
హైదరాబాద్	510-00
వరంగల్	512-00
రిటైల్ ధర	5.70

సంస్కరణలు కొనసాగుతాయ్

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్



న్యూఢిల్లీ: బడ్జెట్ అంటే ఏదో ఖర్చుల పద్దుగా పరిమితం కాకుండా అందరికీ ప్రయోజనాలను సమానంగా అందించేందుకు ఉపయోగపడే బ్లూప్రింట్‌గా గత పదేళ్లలో మోదీ ప్రభుత్వం మార్చేసిందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చెప్పారు. భారత్‌ను సంపన్న దేశంగా తీర్చిదిద్దే దిశగా సంస్కరణల అమలు ఇకపైనా వేగవంతంగా కొనసాగుతుందని ఆమె పేర్కొన్నారు. బడ్జెట్ విధానాల్లో మోదీ ప్రభుత్వం పారదర్శకతకు పెద్ద పీట వేసిందని మంత్రి వివరించారు. ఇలాంటి పారదర్శక బడ్జెట్‌లు ఉండే దేశాల విషయంలో అంతర్జాతీయ ద్రవ్య నిధి, ప్రపంచ బ్యాంక్ మొదలైనవి సానుకూలంగా ఉంటాయని పేర్కొన్నారు. తద్వారా దేశానికి అంతర్జాతీయంగా విశ్వసనీయత పెరుగుతుందని నిర్మలా సీతారామన్ మైక్రో బ్లాగింగ్ సైట్ ఎక్స్‌లో (గతంలో ట్విటర్) చెప్పారు. ట్యాక్స్‌పేయర్లు తమ కష్టార్జితం నుంచి కట్టే ప్రతి రూపాయిని సమర్థవంతంగా ఉపయోగించేందుకు, ప్రజా ధనం విషయంలో పారదర్శకతను పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

కొత్త రికార్డు స్థాయిని తాకి, వెనక్కి..

- తొలిసారి 76 వేల స్థాయిని అందుకున్న సెన్సెక్స్
- ఆఖర్లో అమ్మకాలతో స్వల్ప నష్టాల ముగింపు



ముంబై: ట్రేడింగ్‌లో జీవితకాల గరిష్ట స్థాయిలను నమోదు చేసిన సెన్సెక్స్, నిఫ్టీలు లాభాల స్వీకరణతో వెనక్కి వచ్చాయి. ఉదయం ఆసియా మార్కెట్ నుంచి సానుకూల సంకేతాలతో లాభాల్లో ప్రారంభమైన సూచీలు.. ఇంట్రాడేలో భారీ లాభాలు ఆర్జించాయి. బ్యాంకులు, ఫైనాన్స్, ఐటీ షేర్లు రాణించడంతో సెన్సెక్స్ 600 పాయింట్లు ఎగసి తొలిసారి 76 వేల స్థాయిపై 76,010 వద్ద కొత్త రికార్డును నమోదు చేసింది. నిఫ్టీ 154 పాయింట్లు బలపడి 23,111 వద్ద ఆల్‌టైం అందుకుంది. అయితే ఆఖరి గంటలో సరికొత్త రికార్డుల స్థాయిల వద్ద ఇంధన, మెటల్, ఎఫ్ఎంసీజీ, ఆటో షేర్లలో లాభాల స్వీకరణ చోటు చేసుకోవడంతో సూచీలు స్వల్ప నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 20 పాయింట్లు నష్టపోయి 75,390 వద్ద ముగిసింది. నిఫ్టీ 25 పాయింట్లు పతనమై 22,932 వద్ద స్థిరపడింది. చిన్న, మధ్య తరహా షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో బీఎస్ఈ మిడ్, స్మాల్ సూచీలు వరుసగా 0.63%, 0.10% చొప్పున రాణించాయి.

ఎల్ఐసీ లాభం ఫ్లాట్

- క్యూ4లో రూ. 13,763 కోట్లు
- షేరుకి రూ. 6 డివిడెండ్



ముంబై: ప్రభుత్వ రంగ బీమా దిగ్గజం లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్(ఎల్ఐసీ) గత ఆర్థిక సంవత్సరం (2023-24) చివరి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. జనవరి-మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 2% మెరుగుపడి రూ. 13,763 కోట్లను తాకింది. అంతక్రితం ఏడాది(2022-23) ఇదే కాలంలో రూ. 13,428 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం రూ. 2,00,185 కోట్ల నుంచి రూ. 2,50,923 కోట్లకు చేరింది. తొలి ఏడాది ప్రీమియం రూ. 12,811 కోట్ల నుంచి రూ. 13,810 కోట్లకు బలపడింది. రెన్యువల్ ప్రీమియం ఆదాయం రూ. 76,009 కోట్ల నుంచి రూ. 77,368 కోట్లకు ఎగసింది. కంపెనీ బోర్డు వాటాదారులకు షేరుకి రూ. 6 తుది డివిడెండ్ ప్రకటించింది. ఇక పూర్తి ఏడాదికి రూ. 40,676 కోట్ల నికర లాభం ఆర్జించింది. మొత్తం ప్రీమియం ఆదాయం రూ. 4,75,070 కోట్లకు పుంజుకుంది. వ్యక్తిగత విభాగంలో ఎల్ఐసీ గతేడాది 2,03,92,973 పాలసీలను విక్రయించింది.

వీఎన్‌బీ ఓకే: ఐఆర్‌డీఏఐ వివరాల ప్రకారం తొలి ఏడాది ప్రీమియం ఆదాయంలో ఎల్ఐసీ 58.87 శాతం వాటాతో మార్కెట్ లీడర్‌గా నిలుస్తున్నట్లు సంస్థ చైర్మన్ సిద్ధార్థ మొహంతి పేర్కొన్నారు. కొత్త బిజినెస్ విలువ(వీఎన్‌బీ) 5 శాతం పుంజుకుని రూ. 9,583 కోట్లకు చేరింది. నికర వీఎన్‌బీ మార్జిన్లు సైతం 0.6 శాతం బలపడి 16.8 శాతాన్ని తాకాయి. సాల్వెన్సీ నిష్పత్తి సైతం 1.87 శాతం నుంచి 1.98 శాతానికి మెరుగుపడింది. ఎల్ఐసీ నిర్వహణలోని ఆస్తులు(ఏయూఎం) 16.5 % బలపడి రూ. 51.21 లక్షల కోట్లను అధిగమించాయి. పాలసీదారులకు రూ. 52,956 కోట్లను బోనస్‌గా కేటాయించింది.

షేరు బీఎస్ఈలో 0.6% పెరిగి రూ.1,036 వద్ద ముగిసింది.

నాట్కో లాభం రూ.386 కోట్లు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఔషధ రంగ సంస్థ నాట్కో ఫార్మా మార్చి త్రైమాసికం గతేడాదితో పోలిస్తే నికరలాభం 40% ఎగసి రూ.386 కోట్లు సాధించింది. టర్నోవర్ రూ.927 కోట్ల నుంచి రూ.1,110 కోట్లకు చేరింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో నికరలాభం 94 శాతం అధికమై రూ.1,388 కోట్లు నమోదైంది. టర్నోవర్ 47 శాతం పెరిగి రూ.4,127 కోట్లకు ఎగసింది. షేరు ధర బీఎస్ఈలో 0.85% దూసుకెళ్లి రూ.1,029 వద్ద స్థిరపడింది.

డిష్ టీవీకి పెరిగిన నష్టాలు



న్యూఢిల్లీ: డీటీహెచ్ ప్రసారాల కంపెనీ డిష్ టీవీ గత ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జనవరి-మార్చి(క్యూ4)లో నికర నష్టం పెరిగి రూ. 1,990 కోట్లను తాకింది. అంతక్రితం ఏడాది(2022-23) ఇదే కాలంలో రూ. 1,711 కోట్ల నికర నష్టం నమోదైంది.

షేరు బీఎస్ఈలో 3.2% పతనమై రూ. 16 వద్ద ముగిసింది.

శామ్‌సంగ్ గెలాక్సీ ఎఫ్55



న్యూఢిల్లీ: ఎలక్ట్రానిక్స్ తయారీ దిగ్గజం శామ్‌సంగ్.. 5జీ స్మార్ట్‌ఫోన్స్ విభాగంలో మేడిన్ ఇండియా గెలాక్సీ ఎఫ్55 ప్రవేశపెట్టింది. ధర రూ.26,999 నుంచి ప్రారంభం. క్వాల్‌కామ్ స్నాప్‌డ్రాగన్ 7 జెన్ 1 ఎస్‌వోసీ, ఆన్‌డ్రాయిడ్ 14 ఓఎస్, 6.55 అంగుళాల ఫుల్ హెచ్‌డీ ప్లస్ సూపర్ అమోలెడ్ ప్లస్ డిస్‌ప్లే, 5000 ఎంఏహెచ్ బ్యాటరీ, 50 ఎంపీ ట్రిపుల్ కెమెరా, 50 ఎంపీ ఫ్రంట్ కెమెరా, ఇన్-డిస్‌ప్లే ఫింగర్‌ప్రింట్ సెన్సార్, 1 టీబీ వరకు ఎక్స్‌పాండబుల్ మెమరీ వంటి హంగులు ఉన్నాయి.

శ్రీటీఎంటీ స్టీల్ బ్రాండ్ అంబాసిడర్‌గా బుమ్రా



ముంబై: శ్రీటీఎంటీ స్టీల్ ఉత్పత్తుల తయారీ సంస్థ దేవశ్రీ ఇస్పాత్ తాజాగా భారతీయ క్రికెటర్, ఫాస్ట్ బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రాను తమ బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించుకుంది. గత 50 ఏళ్లుగా ఉక్కు రంగంలో కార్యకలాపాలు సాగిస్తున్నామని కంపెనీ ఎండీ ప్రకాశ్ గోయెంకా తెలిపారు. నాణ్యత, విశ్వసనీయతకు అత్యంత ప్రాధాన్యమిచ్చే తమ బ్రాండ్‌కి బుమ్రా సముచిత ప్రచారకర్త కాగలరని ఆయన పేర్కొన్నారు. శ్రీటీఎంటీతో జట్టు కట్టడంపై బుమ్రా సంతోషం వ్యక్తం చేశారు.

ఫోస్‌రాక్ ఇండియా కొత్త ప్లాంటు ప్రారంభం

హైదరాబాద్: ఫోస్‌రాక్ ఇండియా హైదరాబాద్‌లో కొత్త ఇంటిగ్రేటెడ్ కన్‌స్ట్రక్షన్ కెమికల్ ప్లాంటు ప్రారంభించింది. జేఎంహెచ్ గ్రూప్‌నకు చెందిన డాక్టర్ జేమ్స్ ఎం.హే, ఫిట్రియాని హే, జేఎంహెచ్ గ్రూప్ సీఈవో రాబ్ బోన్నిసిలు కొత్త ప్లాంటును లాంఛనంగా ప్రారంభించారు. నిర్మాణ రంగంలో నిర్మాణాత్మక పరిష్కార సేవలు అందించే ఈ సంస్థ ఇప్పటికే కర్ణాటక, గుజరాత్, పశ్చిమ బెంగాల్, రాజస్తాన్‌లలో వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తోంది. అంతర్జాతీయంగా 70 ఏళ్ల అనుభవం కలిగిన జేఎంహెచ్ గ్రూప్‌లో భాగమైన ఫోస్‌రాక్ ఇంటర్నేషనల్ యూకేకు పూర్తి అనుబంధ సంస్థ ఇది.

నాల్కో లాభం హైజంప్

క్యూ4లో రూ. 997 కోట్లు



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ మెటల్ దిగ్గజం నేషనల్ అల్యూమినియం కంపెనీ(నాల్కో) గత ఆర్థిక సంవత్సరం(2023-24) చివరి త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. జనవరి-మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం రెట్టింపై రూ. 997 కోట్లకు చేరింది. అంతక్రితం ఏడాది(2022-23) ఇదే కాలంలో కేవలం రూ. 495 కోట్లు ఆర్జించింది. అయితే నవరత్న కంపెనీ మొత్తం ఆదాయం రూ. 3,727 కోట్ల నుంచి రూ. 3,663 కోట్లకు క్షీణించింది. మొత్తం వ్యయాలు సైతం రూ. 3,161 కోట్ల నుంచి రూ. 2,720 కోట్లకు తగ్గాయి.

ఫలితాల నేపథ్యంలో నాల్కో షేరు బీఎస్ఈలో 0.6 శాతం బలపడి రూ. 194 వద్ద ముగిసింది.

భవిత

పీజీకి మార్గం..సీపీగేట్



తెలంగాణ రాష్ట్రంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్(పీజీ) కోర్సుల్లో ప్రవేశాలు కోరుకునే వారి కోసం కామన్ పోస్ట్ గ్రాడ్యుయేట్ ఎంట్రన్స్ టెస్ట్ (సీపీగేట్)-2024 ప్రకటన వెలువడింది. ఆన్‌లైన్ విధానంలో నిర్వహించే ఈ పరీక్షద్వారా.. తెలంగాణలోని ఎనిమిది విశ్వవిద్యాలయాలు, వాటి అనుబంధ కళాశాలల్లో పీజీ, పీజీ డిప్లొమా, ఇంటిగ్రేటెడ్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తారు.

యూనివర్సిటీలు ఇవే

ఉస్మానియా, కాకతీయ, తెలంగాణ, మహాత్మా గాంధీ, పాలమూరు, శాతవాహన, జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీలు, తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయాలు.

ప్రవేశాలు కల్పించే కోర్సులు

» **పీజీ కోర్సులు:** ఎంఏ, ఎంఎస్‌డబ్ల్యూ, ఎంహెచ్ఆర్ఎం, ఎంటీఎం, ఎంకాం, ఎంఈడీ, ఎంపీఈడీ, ఎంఎస్సీ, ఎంబీఏ, ఎంఎల్ఐబీఎస్సీ, బీఎల్ఐబీఎస్సీ.
» **అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సులు:** బయోటెక్నాలజీ, కెమిస్ట్రీ/ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ, ఎకనామిక్స్, ఎంబీఏ.
» **పీజీ డిప్లొమా కోర్సులు:** చైల్డ్ సైకాలజీ, ఫ్యామిలీ మ్యారేజ్ కౌన్సిలింగ్, ఫోరెన్సిక్ సైన్స్, ఫార్మాస్యూటికల్ సైన్సెస్.

అర్హతలు

పీజీ కోర్సుల్లో ప్రవేశాలు పొందాలనుకునే వారు సంబంధిత డిగ్రీలో కనీసం 40 శాతం మార్కులు, బీఎడ్/బీపీఎడ్ కోర్సులకు డిగ్రీలో 55 శాతం మార్కులు, ఇంటిగ్రేటెడ్ కోర్సులకు 10+2/ఇంటర్మీడియట్‌లో 50 శాతం మార్కులు తప్పనిసరి.

పరీక్ష విధానం

ఈ పరీక్షను ఆన్‌లైన్ విధానంలో నిర్వహిస్తారు. మొత్తం వంద ప్రశ్నలు-వంద మార్కులకు పరీక్ష ఉంటుంది. పరీక్షకు కేటాయించిన సమయం 90 నిమిషాలు. ప్రతి సబ్జెక్టుకూ సిలబస్‌ను నిర్దేశించారు. కోర్సులను అనుసరించి ప్రశ్నపత్రంలో మార్పు ఉంటుంది.

సీట్ల కేటాయింపు

విద్యార్థికి సీటు కేటాయింపు అనేది ఎంపిక చేసుకున్న సబ్జెక్టు, ఆ సబ్జెక్ట్‌లో పరీక్ష రాసిన వారి సంఖ్య, అభ్యర్థికి వచ్చిన ర్యాంకు, కేటగిరి, ఉన్న సీట్ల సంఖ్య తదితర అంశాలపై ఆధారపడి ఉంటుంది. ఎక్కువ మంది విద్యార్థులు యూనివర్సిటీ క్యాంపస్‌లో చదవాలని కోరుకుంటారు. కానీ సీట్ల సంఖ్య పరిమితం. పోటీ ఎక్కువగా ఉంటుంది. అర్హత పరీక్షలో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు క్యాంపస్ సీట్లు పొందడానికి అవకాశం ఉంటుంది.

ప్రిపరేషన్ ఇలా

» అభ్యర్థి ఎంపిక చేసుకునే సబ్జెక్ట్‌కు సంబంధించిన సిలబస్‌పై పూర్తి అవగాహన పెంచుకోవాలి.
» సిలబస్‌లో పేర్కొన్న టాపిక్స్ బాగా చదువుకుంటే సరిపోతుంది. మంచి ర్యాంకు రావాలంటే సమయాన్ని సద్వినియోగం చేసుకునేలా ప్రిపరేషన్ ప్లాన్ తయారు చేసుకోవాలి.
» డిగ్రీ సబ్జెక్ట్ కాకుండా వేరే సబ్జెక్ట్‌లో పీజీ చేయాలనుకునే వారు సన్నద్ధత విషయంలో ఎక్కువ సమయాన్ని కేటాయించాల్సి ఉంటుంది. డిగ్రీ అనుబంధ కోర్సు అయితే పాత నోట్సు అంశాలనే మళ్లీ చదవడం మంచిది. ప్రశ్నపత్రంపై అవగాహన రావడానికి, సన్నద్ధత స్థాయిలను అంచనా వేసుకోవడానికి పాత ప్రశ్న పత్రాలు, మాక్ టెస్టులు రాయడం మేలు చేస్తుంది.

ముఖ్యసమాచారం

» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: 17.06.2024
» రూ.500 ఆలస్య రుసుముతో: 2024 జూన్18-25 తేదీ వరకు;
» రూ.2 వేలు లేట్ ఫీజుతో: 2024 జూన్ 26-30 తేదీ వరకు;
» ఆన్‌లైన్ పరీక్షలు ప్రారంభ తేదీ: 05.07.2024
» వెబ్‌సైట్: https://cpget.tsche.ac.in

» ఐఐఎంలు, ఐఐటీల్లో పీహెచ్‌డీ ప్రోగ్రామ్స్
» క్యాట్, గేట్, నెట్, జేఆర్ఎఫ్ స్కోర్‌లతో ప్రవేశం
» ఎంపికైతే ఆకర్షణీయ ప్రోత్సాహకాలు

పీహెచ్‌డీ @ ఐఐఎం, ఐఐటీ

డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ.. సంక్షిప్తంగా పీహెచ్‌డీ! పరిశోధనలకు, నూతన ఆవిష్కరణలకు ఊతమిచ్చే కోర్సు! పరిశోధనలపై ఆసక్తి ఉన్న యువతకు దేశంలోని ప్రతిష్టాత్మక విద్యాసంస్థలైన ఐఐటీలు, ఐఐఎంలు చక్కటి వేదికలు. ఈ ఇన్‌స్టిట్యూట్స్ ప్రతిభావంతులకు పీహెచ్‌డీలో ప్రవేశం కల్పించడమేకాకుండా.. ప్రోత్సాహకాలు సైతం అందిస్తున్నాయి. ఐఐటీలు, ఐఐఎంల్లో పీహెచ్‌డీ పూర్తి చేసుకుంటే.. బోధన, పరిశోధన రంగాల్లో ఉజ్వల కెరీర్ ఖాయం!! ఈ నేపథ్యంలో.. ఐఐఎంలు, ఐఐటీల్లో పీహెచ్‌డీ, ప్రవేశ ప్రక్రియ, కెరీర్ అవకాశాలపై ప్రత్యేక కథనం..

ఐఐఎంలు.. దేశంలో మేనేజ్‌మెంట్ కోర్సులను అందించడంలో అంతర్జాతీయ గుర్తింపు ఉన్న విద్యాసంస్థలు! అదేవిధంగా ఇంజనీరింగ్ విద్యలో ప్రమాణాలకు పెట్టింది పేరు.. ఐఐటీలు!! ఈ ఇన్‌స్టిట్యూట్స్ యూజీ, పీజీలే కాకుండా.. పీహెచ్‌డీ కోర్సులను అందిస్తున్నాయి. ప్రవేశం పొందిన విద్యార్థులకు ఆర్థిక ప్రోత్సాహకాలు అందిస్తూ పరిశోధనలు, ఆవిష్కరణలకు ఊతమిస్తున్నాయి.

ఐఐఎంల్లో పీహెచ్‌డీకి మార్గం

ఐఐఎం క్యాంపస్‌లు మేనేజ్‌మెంట్ విభాగానికి సంబంధించిన పలు సబ్జెక్టుల్లో పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లో ప్రవేశం కల్పిస్తున్నాయి. క్యాట్, జీమ్యాట్, జీఆర్ఈ,యూజీసీ-జేఆర్ఎఫ్ వంటి పరీక్షల స్కోర్లను ప్రవేశాలకు ప్రామాణికంగా తీసుకుంటున్నాయి. పలు ఐఐఎంలు ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్, క్వాలిటేటివ్ మెథడ్స్ వంటి ఇంజనీరింగ్ సంబంధిత స్పెషలైజేషన్లలోనూ పీహెచ్‌డీలో ప్రవేశాలు కల్పిస్తున్నాయి. వీటిలో ప్రవేశానికి గేట్, జీఆర్ఈ వంటి పరీక్షల స్కోర్లను పరిగణనలోకి తీసుకుంటున్నారు. ఐఐఎం-బెంగళూరు ఈ స్కోర్లు లేకున్నా.. సొంతంగా ప్రవేశ పరీక్ష నిర్వహించి అడ్మిషన్ కల్పిస్తోంది.

అర్హతలు

ఐఐఎంల్లో పీహెచ్‌డీకి సమానమైన ఎఫ్‌పీఎం (ఫెలో ప్రోగ్రామ్ ఇన్ మేనేజ్‌మెంట్)కు దరఖాస్తు చేసుకునేందుకు నాలుగేళ్ల బ్యాచిలర్ డిగ్రీ ఉండాలి. బ్యాచిలర్ డిగ్రీలో కనీసం 60 శాతం మార్కులు సాధించాలి. దీంతోపాటు నిర్దేశిత ప్రామాణిక టెస్టుల (క్యాట్, జీమ్యాట్, జీఆర్ఈ తదితర) స్కోర్ తప్పనిసరి. అకడమిక్ ట్రాక్ రికార్డ్ బాగుండాలి. పీజీ ఉత్తీర్ణత ఆధారంగా దరఖాస్తు చేసుకోవాలనుకుంటే.. పీజీలో 55 శాతం మార్కులు, బ్యాచిలర్ డిగ్రీలో 50 శాతం మార్కులు ఉండాలి.

కోర్సు వ్యవధి నాలుగేళ్లు

ఐఐఎంల్లో పీహెచ్‌డీ కోర్సు వ్యవధి కనిష్టంగా నాలుగేళ్లు, గరిష్టంగా ఏడేళ్లుగా ఉంది. ఈ ప్రోగ్రామ్స్‌లో తొలి రెండేళ్లు క్లాస్‌రూం ఆధారిత కోర్స్ వర్క్ ఉంటుంది. ఆ తర్వాత కాంప్రెహెన్సివ్ క్వాలిఫయింగ్ ఎగ్జామ్, కాంప్రహెన్సివ్ ఎగ్జామినేషన్‌ల పేరుతో ప్రత్యేక పరీక్షలు నిర్వహిస్తారు. వాటిని థీసిస్ అడ్వయిజరీ కమిటీలు లేదా ఎఫ్‌పీఎం రివ్యూ కమిటీలు మూల్యాంకన చేసి.. అభ్యర్థికున్న అవగాహన మేరకు తదుపరి దశ పీహెచ్‌డీ కోర్స్ వర్క్‌కు అనుమతి మంజూరు చేస్తాయి.



ఆర్థిక చేయూత

- ఐఐఎంల్లో పీహెచ్‌డీలో చేరిన విద్యార్థులకు ఆర్థిక చేయూత లభిస్తుంది. ఐఐఎం-బెంగళూరు, అహ్మదాబాద్‌లలో ట్యూషన్ ఫీజు నుంచి మినహాయింపుతోపాటు నెలకు రూ.42 వేల ఫెలోషిప్ అందిస్తారు. అదే విధంగా స్టార్టప్ గ్రాంట్ కింద మొదటి ఏడాదిలోనే రూ.75 వేలు; కాంటింజెన్సీ గ్రాంట్ కింద రెండో ఏడాది నుంచి అయిదో ఏడాది వరకు ప్రతి ఏటా రూ.25 వేలు అందిస్తారు.
- ఐఐఎం-ఉదయ్‌పూర్ ఫీజు మినహాయింపుతో పాటు మొదటి రెండేళ్లు నెలకు రూ.37 వేలు; ఆ తర్వాత కాంప్రహెన్సివ్ ఎగ్జామ్ పూర్తి చేసుకుంటే.. నెలకు రూ.40 వేలు చొప్పున ఫెలోషిప్ అందిస్తోంది. ఇతర ఐఐఎంలు కూడా ట్యూషన్ ఫీజు నుంచి మినహాయింపు ఇవ్వడంతోపాటు స్టడీ టూర్ ఖర్చులు, కాంటింజెన్సీ గ్రాంట్, ఆన్-క్యాంపస్ వసతి సదుపాయం వంటివి కల్పిస్తున్నాయి.

ప్రవేశం క్లిష్టంగా

ఐఐఎంల్లో పీహెచ్‌డీలో ప్రవేశానికి పోటీ తీవ్రంగా ఉంటుంది. దీంతో అప్లికేషన్ దశ నుంచే రివ్యూ కమిటీ క్షుణ్నంగా పరిశీలిస్తుంది. అకడమిక్ ట్రాక్ రికార్డ్, స్టాండర్డ్ టెస్ట్ స్కోర్స్‌తోపాటు రిఫరెన్స్ లెటర్స్‌ను పరిశీలిస్తుంది. అప్లికేషన్ దశలో అన్ని అంచెల్లో విజయం సాధిస్తే.. తదుపరి దశలో ఇంటర్వ్యూ ఉంటుంది. ఇందులో అప్లికేషన్‌లో పేర్కొన్న స్పెషలైజేషన్‌లో అభ్యర్థికున్న వాస్తవ ఆసక్తిని పరిశీలిస్తారు.

ఐఐటీ, ఐఐఎంల్లో పీహెచ్‌డీ.. ముఖ్యాంశాలు

- దేశ వ్యాప్తంగా పలు ఐఐఎంలు, ఐఐటీల్లో పీహెచ్‌డీ ప్రోగ్రామ్స్.
- క్యాట్, గేట్, జీఆర్ఈ, జీమ్యాట్, యూజీసీ నెట్ స్కోర్లతో దరఖాస్తు అవకాశం.
- 2024-25 సంవత్సరానికి పలు క్యాంపస్‌లలో మొదలైన దరఖాస్తు ప్రక్రియ.
- ఎంపికైన వారికి ట్యూషన్ ఫీజు మినహాయింపు.
- నెలకు కనిష్టంగా రూ.30 వేలు.. గరిష్టంగా రూ.50 వేల వరకు ఫెలోషిప్.
- బోధన, పరిశోధన రంగాల్లో ఉజ్వల కెరీర్ అవకాశాలు.

ఐఐటీల్లో పీహెచ్‌డీ ఇలా

నాణ్యమైన ఇంజనీరింగ్ విద్యకు కేరాఫ్‌గా నిలుస్తున్న ఐఐటీలు.. కోర్ బ్రాంచ్‌లు మొదలు తాజా ట్రెండ్‌గా మారిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఐఓటీ.. ఇలా పలు విభిన్న విభాగాల్లో పీహెచ్‌డీలో ప్రవేశాలు కల్పిస్తున్నాయి.

అర్హతలు

ఐఐటీల్లో పీహెచ్‌డీకి దరఖాస్తు చేసుకునేందుకు బీటెక్, ఎంటెక్, నిర్దిష్ట స్పెషలైజేషన్లలో ఎమ్మెస్సీ తదితర అర్హతలుండాలి. అకడమిక్ రికార్డ్ 60 శాతం తగ్గకుండా ఉండాలి. వీటితోపాటు గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజనీరింగ్ (గేట్) స్కోరు, సీఎస్ఐఆర్-యూజీసీ, ఎన్‌బీహెచ్ఎం, డీబీటీ, డీఎస్‌టీ జేఆర్ఎఫ్‌ల్లో ఏదో ఒక పరీక్షలో ఉత్తీర్ణత సాధించాలి.

ఇంటిగ్రేటెడ్ పీహెచ్‌డీ

బీటెక్ విద్యార్థులకు పీహెచ్‌డీలో అవకాశం కల్పించేందుకు ఐఐటీలు ఇంటిగ్రేటెడ్ పీహెచ్‌డీ(ఎంటెక్+పీహెచ్‌డీ) విధానాన్ని అనుసరిస్తున్నాయి. ఈ విధానంలో ప్రవేశం పొందిన వారు రెండేళ్లు క్లాస్ రూం స్టడీ తర్వాత గైడ్/ప్రొఫెసర్ పర్యవేక్షణలో పరిశోధన చేయాల్సి ఉంటుంది. ఐఐటీలు పీహెచ్‌డీ విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు నిట్‌లు, ట్రిపుల్ ఐటీ, ఇతర కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో బీటెక్ ఉత్తీర్ణులకు గేట్ స్కోర్‌తో నిమిత్తం లేకుండా నేరుగా ప్రవేశాలు కల్పిస్తున్నాయి. వీరికి అకడమిక్ ట్రాక్ రికార్డ్ 7 సీజీపీఏ ఉండాలి. దీంతోపాటు మలిదశలో ఇంటర్వ్యూ, రాత పరీక్షల్లో విజయం సాధించాలి.

ఎంపిక

సంబంధిత అర్హతలున్న అభ్యర్థులు ఆయా ఇన్‌స్టిట్యూట్‌లకు నిర్దేశిత నమూనాలో దరఖాస్తు చేసుకోవాలి. ఈ దరఖాస్తుతోపాటు తమకు రీసెర్చ్ ఆసక్తి ఉన్న స్పెషలైజేషన్ అంశాలను పేర్కొనాలి. గరిష్టంగా మూడు స్పెషలైజేషన్ అంశాలను పేర్కొనొచ్చు. వీటితోపాటు తాము పేర్కొన్న స్పెషలైజేషన్‌లలో ప్రతి దానికి స్టేట్‌మెంట్ ఆఫ్ పర్పస్‌ను దరఖాస్తుతో పాటు జత చేయాలి. ఈ దరఖాస్తులను ఐఐటీల్లోని డిపార్ట్‌మెంట్‌లవారీగా ఉండే రీసెర్చ్ అడ్మిషన్స్ రివ్యూ కమిటీలు పరిశీలిస్తాయి. అందుబాటులో ఉన్న సీట్లు, అప్లికేషన్ల ఆధారంగా అభ్యర్థులను షార్ట్ లిస్ట్ చేస్తాయి.

రాత పరీక్ష.. ఇంటర్వ్యూ

షార్ట్ లిస్ట్‌లో నిలిచిన అభ్యర్థులకు మలిదశలో రాత పరీక్ష, ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. వీటి ద్వారా అభ్యర్థులకు పరిశోధనల పట్ల ఉన్న ఆసక్తిని పరిశీలిస్తారు. ఇందులోనూ విజయం సాధిస్తే.. పీహెచ్‌డీలో సీటుతోపాటు ఆర్థిక ప్రోత్సాహకాలకు మార్గం సుగమం అవుతుంది. ఐఐటీలు నిర్వహించే జాయింట్ అడ్మిషన్ టెస్ట్ ఫర్ ఎమ్మెస్సీ (జామ్) ర్యాంకు ద్వారా కూడా పీహెచ్‌డీలో చేరే వీలుంది.

ఆర్థిక ప్రోత్సాహకాలు

పీహెచ్‌డీ దిశగా యువతను ఆకర్షించేందుకు ఐఐటీలు ఆర్థిక ప్రోత్సాహకాలు అందిస్తున్నాయి. అయిదేళ్ల వ్యవధిలో ఉండే పీహెచ్‌డీ కోర్స్ వర్క్‌లో అసిస్టెన్స్‌షిప్ పేరుతో తొలి రెండేళ్లు నెలకు రూ.25 వేలు; తర్వాత నుంచి నెలకు రూ.28 వేలు చొప్పున అందిస్తారు. అదే విధంగా ఎంటెక్/ఎంఈ అర్హతతో పీహెచ్‌డీలో చేరిన అభ్యర్థులకు రీసెర్చ్ అసిస్టెన్స్ షిప్ సదుపాయాన్ని కల్పిస్తున్నాయి. వీరిని రీసెర్చ్ ప్రాజెక్టులలో రీసెర్చ్ అసిస్టెంట్స్‌గా నియమిస్తారు. ఇలా నియమితులైన అభ్యర్థులకు తొలి రెండేళ్లు రూ.28 వేలు; తర్వాత మూడేళ్లు రూ.31,500 అందిస్తారు. వీటితోపాటు పరిశోధనకు అవసరమైన బుక్స్, జర్నల్స్, ఇతర మౌలిక పరికరాలు (కంప్యూటర్, లేబొరేటరీ పరికరాలు తదితర) కొనుగోలుకు ఏటా రూ.20 వేల నుంచి రూ.25 వేల వరకు కాంటింజెన్సీ అలవెన్స్, ప్రతి ఏటా గరిష్టంగా రెండు నేషనల్, ఇంటర్నేషనల్ సెమినార్లకు హాజరయ్యేందుకు అవసరమైన ట్రావెల్ అలవెన్స్, హెచ్ఆర్ఏలు వంటివి కూడా ఉంటాయి.

ఉన్నత శిఖరాలు

ఐఐటీల్లో పీహెచ్‌డీ పూర్తి చేసిన వారికి సీఎస్ఐఆర్, ఇక్రిశాట్, ఐఐసీటీ, ఐసీఏఆర్, ఎన్‌జీఐఆర్ఐ, తదితర కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని సంస్థల్లో జూనియర్ సైంటిస్ట్‌లుగా అవకాశం లభిస్తుంది. ప్రైవేటు సంస్థల ఆర్ అండ్ డీ విభాగాల్లో సైంటిస్ట్‌లుగా చేరితే ప్రారంభంలోనే నెలకు రూ.2 లక్షల వరకూ వేతనం అందుతుంది.

మేడిగడ్డను పరిశీలించిన మరమ్మతుల కమిటీ



నీటి ఊటను పరిశీలిస్తున్న బృందం సభ్యులు

కాళేశ్వరం: కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ (లక్ష్మీ) బ్యారేజీని రక్షణ, పునరుద్ధరణ, పర్యవేక్షణ కమిటీ ఇంజనీరింగ్ చీఫ్ బృందం సోమవారం పరిశీలించింది. నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) ఆదేశాల మేరకు ఈఎన్సీ అనిల్‌కుమార్, ఓఅండ్‌ఎం సీసీ నాగేందర్‌రావు నేతృత్వంలో సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్‌కు చెందిన ఆరుగురు సభ్యుల బృందం మేడిగడ్డ బ్యారేజీని సందర్శించింది. గత ఏడాది అక్టోబర్ 21న బ్యారేజీలో కుంగిన పియర్‌లు, వంతెనతో పాటు ప్రస్తుతం చేపట్టిన మరమ్మతు పనులను ఈ బృందం పరిశీలించింది. మొదట బ్యారేజీ పైనుంచి.. కుంగిన 7వ బ్లాక్‌లోని పియర్‌లను, తర్వాత కాలినడకన వెళ్లి కుంగిన వంతెనను తనిఖీ చేశారు. దెబ్బతిన్న భాగాల ఫుటేజీలను సేకరించారు. ఇటీవల 20వ పియర్ ముందు ఏర్పడిన బొరియ (గొయ్యి), కుంగిన పియర్స్, గేట్ల స్థితిగతులకు సంబంధించి ఫొటోలు తీసుకున్నారు. మేడిగడ్డ బ్యారేజీ ఎగువ, దిగువ ప్రాంతంలో తాజా పరిస్థితులను పరిశీలించారు. కాగా, మరమ్మతుల్లో భాగంగా బ్యారేజీ 7వ బ్లాక్‌లోని 15 నుంచి 21వ పియర్‌ల గేట్ల వద్ద ఇసుక మేటలను తొలగించారు. ప్రత్యేక పరికరాలతో గేట్ల విడిభాగాలను తొలగిస్తున్నారు. 20వ పియర్ గేటును కూడా తొలగిస్తున్నారు. 20, 21 పియర్ల మధ్యలో యంత్రాల ద్వారా గ్రౌటింగ్ పనులు చేస్తున్నారు. ఇదిలా ఉండగా బ్యారేజీ బేస్‌మెంట్ కింద ఖాళీప్రదేశం ఎంత వరకు ఉందో అక్కడి వరకు సిమెంట్, కాంక్రీటు మిశ్రమాన్ని నింపుతామని ఇంజనీరింగ్ అధికారులు చెబుతున్నారు. బొరియ గుండా, బ్యారేజీ పియర్‌ల ద్వారా వచ్చే నీటి ఊటలను బృందం సభ్యులు పరిశీలించారు. బ్యారేజీ దిగువన నీటి ప్రవాహాన్ని తట్టుకునే విధంగా సీసీ బ్లాక్ పనులు జరుగుతున్నాయి. బొరియలు ఇతర కారణాలతో ఉబికి వస్తున్న నీటిని భారీ యంత్రాల సహాయంతో తోడేస్తున్నారు. ఈ వర్షాకాలం సీజన్ మొదలు కాకముందే పనులు పూర్తి చేయాలని ఎన్‌డీఎస్‌ఏ బృందం ఇచ్చిన మధ్యంతర నివేదికల ప్రకారం ఇంజనీరింగ్ అధికారులతోపాటు నిర్మాణ సంస్థ ఎల్‌అండ్‌టీ అధికారులను ఆదేశించారు. రామగుండం సీఈ సుధాకర్‌రెడ్డి, ఇతర ముఖ్య అధికారులు ఇంజనీరింగ్ చీఫ్ బృందం వెంట ఉన్నారు.



ఎయిర్‌బస్ ఎ340 విమానానికి వాటర్ కానన్ స్వాగతం పలుకుతున్న అగ్నిమాపక దళం

విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం (గన్నవరం) చరిత్రలోనే అతి పెద్ద విమానం సోమవారం రన్‌వేపై ల్యాండ్ అయ్యింది. హజ్ యాత్రికుల కోసం స్పైస్ జెట్ సంస్థ ప్రత్యేకంగా నడుపుతున్న లెజెండ్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన ఎయిర్‌బస్ ఎ340–300 విమానం ఇక్కడ దిగింది. 324 మంది ప్రయాణికుల సామర్థ్యం కలిగిన ఈ విమానం ఏకధాటిగా 14,400 కిలోమీటర్లు ప్రయాణం చేయగలదు.

బ్లాక్‌లిస్టులో మిల్లులు

▶ మొదటి పేజీ తరువాయి

వ్యవహరించాలని సీఎం రేవంత్‌రెడ్డి, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి నిర్ణయించినట్లు తెలిసింది.

2022–23 యాసంగి ధాన్యంపైనే రచ్చ

ప్రతి ఏటా ఖరీఫ్, రబీ సీజన్లలో రైతులు పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా కనీస మద్దతు ధరకు కొని..సీఎంఆర్ కోసం మిల్లులకు పంపడం జరుగుతుంది. ఖరీఫ్ ధాన్యాన్ని ముడి బియ్యంగా మిల్లింగ్ చేసి ఎఫ్‌సీఐకి సీఎంఆర్ కింద అప్పగించే మిల్లర్లు, రబీ ధాన్యాన్ని మాత్రం బాయిల్డ్ రైస్ (ఉప్పుడు బియ్యం)గా ఎఫ్‌సీఐకి ఇవ్వడం గత కొన్నేళ్లుగా జరుగుతోంది. రాష్ట్ర వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో రబీ ధాన్యాన్ని ముడిబియ్యంగా మిల్లింగ్ చేస్తే నూకలుగా విరిగిపోతాయి. ఈ నేపథ్యంలో 2021లో కేంద్ర ప్రభుత్వం ఇక నుంచి బాయిల్డ్ రైస్‌ను సీఎంఆర్‌గా తీసుకునేది లేదని స్పష్టం చేసింది. అయితే రాష్ట్ర ప్రభుత్వ సంప్రదింపుల తర్వాత ప్రతి ఏటా 10 నుంచి 15 ఎల్‌ఎంటీల బియ్యాన్ని మాత్రమే బాయిల్డ్ రైస్‌గా తీసుకునేందుకు ఒప్పుకుంది. ఈ నేపథ్యంలో 2020- 2021, 2021-2022లలో మిల్లర్లు రబీ ధాన్యాన్ని కూడా ముడిబియ్యంగా మిల్లింగ్ చేసి ఎఫ్‌సీఐకి అప్పగించారు. కాగా 2022-23 రబీ సీజన్‌లో 65 ఎల్‌ఎంటీల ధాన్యాన్ని సేకరించిన ప్రభుత్వం యధావిధిగా మిల్లులకు అప్పగించింది. అయితే మిల్లర్లు ప్రభుత్వం వెసులుబాటు ఇచ్చిన విధంగా సుమారు 20 ఎల్‌ఎంటీల ధాన్యాన్ని మాత్రమే బాయిల్డ్ రైస్‌గా మిల్లింగ్ చేసి, మిగతా ధాన్యాన్ని మిల్లులు, గోడౌన్‌లకు పరిమితం చేశారు. అప్పటి ప్రభుత్వం చర్చలు జరిపినప్పటికీ, తాము యాసంగి బియ్యాన్ని మిల్లింగ్ చేసి సీఎంఆర్ అప్పగించలేమని మిల్లర్లు తెగేసి చెప్పారు. దీంతో పౌరసరఫరాల శాఖ మిల్లుల్లోని ధాన్యాన్ని వేలం వేయాలని నిర్ణయించింది. ఈ మేరకు అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం 25 ఎల్‌ఎంటీల ధాన్యాన్ని విక్రయించేందుకు టెండర్లు ఆహ్వానించగా ఏడు సంస్థలు క్వింటాల్ ధాన్యాన్ని సగటున రూ.1,860 చొప్పున కొనుగోలు చేసేందుకు ముందుకొచ్చాయి. ధర తక్కువగా రావడంతో ఆ బిడ్లను రద్దు చేసిన అధికారులు మళ్లీ టెండర్లను పిలిచారు. ఈసారి 10 వేల టన్నుల కెపాసిటీ గల మిల్లర్లంతా టెండర్లలో పాల్గొనేలా నిబంధనలు మార్చారు. అంటే ఏ మిల్లులో ఉన్న ధాన్యం ఆ మిల్లరే కొనుగోలు చేసేలా వెసులుబాటు కల్పించారు. అయితే అప్పటికే ఎన్నికల కోడ్ రావడంతో ఈ టెండర్లు ఆగిపోయాయి.

కొత్త టెండర్లు.. స్కామ్ ఆరోపణలు

ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచి అధికారంలోకి రాగానే మిల్లుల్లో ఉన్న 2022-23 రబీ ధాన్యాన్ని విక్రయించడంపై దృష్టి పెట్టింది. కానీ ఈ ధాన్యాన్ని ఇంతవరకు ఎందుకు మిల్లింగ్ చేయలేకపోయారనే అంశంపై శ్రద్ధ పెట్టలేదు. ఎప్పటిలాగానే మిల్లర్లకు భారం కాకుండా నిబంధనలను మార్చి మిల్లుల్లో ఉన్నట్టు చెబుతున్న 35 ఎల్‌ఎంటీల ధాన్యాన్ని విక్రయించేందుకు కొత్తగా టెండర్లు పిలిచారు. ఆరు సంస్థలు ధాన్యం కొనుగోలుకు ముందుకు రాగా, మూడు నెలల క్రితం నాలుగు సంస్థలను ఎంపిక చేశారు. క్వింటాలు ధాన్యానికి సగటున రూ.2,007 రాష్ట్ర ప్రభుత్వానికి చెల్లించేలా ఆ సంస్థలతో ఒప్పందం కుదుర్చుకున్నారు. 90 రోజుల్లోగా అంటే ఈనెల 23వ తేదీ లోగా ధాన్యం సేకరణ ప్రక్రియ పూర్తి చేసి ప్రభుత్వానికి రూ.7 వేల కోట్ల వరకు చెల్లించాల్సి ఉంది. కానీ ఈ 4 సంస్థలు కలిపి ఇప్పటివరకు 2 ఎల్‌ఎంటీల ధాన్యాన్ని కూడా సేకరించలేదని ప్రభుత్వమే చెబుతోంది. ఈ లోపు విపక్షాలు ఈ తతంగాన్ని ఆధారంగా చేసుకుని ప్రభుత్వంపై ఆరోపణాస్త్రాలు సంధించడం మొదలు పెట్టాయి. మిల్లుల వద్ద ధాన్యానికి బదులు క్వింటాలుకు రూ.2,223 చొప్పున కాంట్రాక్టు సంస్థలు వసూలు చేస్తున్నాయని ఆరోపిస్తున్నాయి. మొత్తంగా రూ.1,000 కోట్ల అవినీతి జరిగిందని బీఆర్ఎస్ ఆరోపిస్తుండగా, ఈ ధాన్యం వేలం ప్రక్రియపై సీబీఐతో విచారణ జరిపించాలని బీజేపీ డిమాండ్ చేస్తోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఒకటి రెండు రోజుల్లోనే నిరుటి 35 ఎల్‌ఎంటీల రబీ ధాన్యం విషయంలో కీలక నిర్ణయం తీసుకునే ఆలోచనలో ఉంది. 4 సంస్థలకు మరో 3 నెలల గడువు ఇవ్వడంతో పాటు అప్పటికి ధాన్యం అప్పగించని మిల్లర్లను డిఫాల్టర్లుగా గుర్తించి బ్లాక్‌లిస్టులో పెట్టాలని నిర్ణయించినట్లు సమాచారం.

మిల్లర్లలో జవాబుదారీతనం పెంచేలా..

మిల్లర్లలో జవాబుదారీతనాన్ని పెంపొందించేందుకు ఇకపై వారివద్ద సెక్యూరిటీ డిపాజిట్ తీసుకోవాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలిసింది. ధాన్యం అప్పగించేటప్పుడే సెక్యూరిటీ డిపాజిట్ తీసుకుంటారు. ఈ విధానాన్ని అమలు చేస్తే మిల్లర్లలో జవాబుదారీతనం పెరగడంతో పాటు ధాన్యం కొనుగోళ్ల కోసం చేసే అప్పులు కూడా కొంతవరకు తగ్గుతాయని భావిస్తున్నట్టు సమాచారం. రాష్ట్రవ్యాప్తంగా 3,500 పైగా రైస్ మిల్లులు ఉండగా, ఒక్కో మిల్లర్ నుంచి రూ.కోటి చొప్పున సెక్యూరిటీ డిపాజిట్ తీసుకున్నా రూ.3,500 కోట్లకు పైగా జమయ్యే అవకాశం ఉంది.

ఏపీలో 100% సెక్యూరిటీ డిపాజిట్

ఏపీ, ఛత్తీస్‌గఢ్, ఒడిశా తదితర రాష్ట్రాలు సెక్యూరిటీ డిపాజిట్ విధానాన్ని పకడ్బందీగా అమలు చేస్తున్నాయి. దీనివల్ల మిల్లర్లు సకాలంలో సీఎంఆర్ అప్పగించకుంటే సెక్యూరిటీ డిపాజిట్‌ను జప్తు చేసుకునే అవకాశం ప్రభుత్వానికి ఉంటుంది. ఏపీలో వంద శాతం సెక్యూరిటీ డిపాజిట్ అమల్లో ఉంది. అంటే మిల్లర్లు రూ.కోటి కడితే అంతే విలువైన ధాన్యాన్ని సీఎంఆర్ కోసం ప్రభుత్వం అప్పగిస్తుందన్న మాట. ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల్లో 1:3 చొప్పున సెక్యూరిటీ డిపాజిట్ తీసుకుంటున్నారు. అంటే మిల్లర్లు రూ.కోటి చెల్లిస్తే రూ.3 కోట్ల విలువైన ధాన్యాన్ని వారికి ఇస్తారు.

సీఎంఆర్ పక్కదారి!

సూర్యాపేట జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఆయన సోదరుడు అరెస్టు

తిరుమలగిరి: సీఎంఆర్ ధాన్యాన్ని ప్రభుత్వానికి అప్పగించకుండా బియ్యాన్ని పక్కదారి పట్టించిన ఆరోపణలపై సూర్యాపేట జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఇమ్మడి సోమనర్సయ్య, ఆయన సోదరుడు ఇమ్మడి సోమయ్యను ఆదివారం రాత్రి పోలీసులు అరెస్టు చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. విశ్వసనీయ సమాచారం మేరకు.. సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండల కేంద్రంలోని సంతోష్ రైస్ మిల్లు, నాగారం మండలం ప్రగతినగర్‌లోని రఘురామ రైస్ ఇండస్ట్రీలకు 2021–22 వానాకాలం సీజన్ నుంచి వరుసగా మూడు సీజన్ల పాటు సీఎంఆర్ కోసం ప్రభుత్వం ధాన్యం ఇచ్చింది. కానీ మిల్లర్లు ప్రభుత్వానికి బియ్యం అందించక పోగా వాటిని పక్కదారి పట్టించినట్లు అధికారులు గుర్తించారు. ఈ ఏడాది ఏప్రిల్ 16, 17 తేదీలలో ఈ రెండు మిల్లుల్లో అధికారులు తనిఖీలు నిర్వహించారు. సంతోష్ రైస్ మిల్లులో రూ.91.31 కోట్ల విలువైన 41,465 టన్నుల ధాన్యం, రఘురామ రైస్ ఇండస్ట్రీలో రూ.7.71కోట్ల విలువైన 3,500 టన్నుల ధాన్యం పక్కదారి పట్టినట్లు గుర్తించారు. దీనిపై పౌరసరఫరాల శాఖ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణలో ధాన్యాన్ని ప్రైవేటుకు అమ్ముకున్నట్లు తేలడంతో ఇద్దరు మిల్లర్లను అరెస్టు చేశారు.

బాబు సేవలో బదిలీ బలగాలు!

ఏపీ హైకోర్టు సాక్షిగా దొరికి పోయిన డీజీపీ, పచ్చ పోలీసులు

- పిన్నెల్లిపై కేసుల విషయంలో రికార్డులు తారుమారు
- ఆయన్ను ఎప్పుడు నిందితుడిగా చేర్చారని ప్రశ్నించిన హైకోర్టు

ముందస్తు బెయిల్ ఇచ్చాకే నిందితుడిగా చేర్చినట్లు అంగీకారం

ఈమేరకు స్థానిక కోర్టులో మెమో దాఖలు చేసిన పోలీసులు

సంబంధిత డాక్యుమెంట్లను కోర్టు ముందుంచిన పిన్నెల్లి న్యాయవాదులు

పిన్నెల్లి మధ్యంతర ముందస్తు బెయిల్‌పై ముగిసిన వాదనలు.. నేడు హైకోర్టు నిర్ణయం

కౌంటింగ్‌లో పాల్గొనే హక్కు ప్రతీ అభ్యర్థికి ఉందన్న సీనియర్ న్యాయవాది టి.నిరంజన్‌రెడ్డి

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

మత్తు పదార్థాలు, దుష్ప్రభావాలపై లఘుచిత్రాల పోటీ

సాక్షి, హైదరాబాద్: అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా దినోత్సవాన్ని పురస్కరించుకుని లఘు చిత్రాల పోటీ నిర్వహించనున్నట్టు తెలంగాణ స్టేట్ యాంటీ–నార్కోటిక్స్ బ్యూరో (టీఎస్ న్యాబ్) డైరెక్టర్ సందీప్ శాండిల్య తెలిపారు. 'మత్తుపదార్థాలు, వాటి దుష్ప్రభావాలు' అంశంపై లఘుచిత్రాల పోటీలుంటాయని పేర్కొన్నారు. పోటీకి ఔత్సాహికులు ఎంట్రీలు పంపవచ్చని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజేతకు మొదటి బహుమతిగా రూ.50 వేలు, రెండో బహుమతిగా రూ.30 వేలు, రూ.20 వేలు ఇవ్వనున్నట్టు ప్రకటించారు. జూన్ 20లోపు ఎంట్రీలను https://forms.gle/2zsKcLppNfCXZGKz7కు పంపాలని కోరారు. సందేహాలుంటే టీఎస్‌న్యాబ్ డీఎస్పీ కె.సుబ్బరామిరెడ్డి (ఫోన్ నంబర్ 8712661710), ఇన్‌స్పెక్టర్ పి.శ్రీనివాస్ రావు (ఫోన్ నంబర్ 8712661735)ను సంప్రదించాలని సూచించారు.

చేప ప్రసాదంకోసం కొల్లేరు నుంచి చేప పిల్లలు

ఖమ్మం వ్యవసాయం: మృగశిర కార్తె రోజున హైదరాబాద్‌లో బత్తిని సోదరులు ఉబ్బసం నివారణ కోసం చేప ప్రసాదం పంపిణీ చేయనుండగా.. ఇందుకోసం 5 లక్షల నుంచి 7 లక్షల వరకు కొర్రమీను చేప పిల్లలను వినియోగిస్తారు. సేవాదృక్పథంతో ఈ ప్రసాదం పంపిణీ చేస్తున్న బత్తిని సోదరులకు కొన్నేళ్లుగా ప్రభుత్వమే చేపపిల్లలను సమకూరుస్తోంది. అయితే, తెలంగాణలో సరిపడా చేపపిల్లల లభ్యత లేకపోవడంతో టెండర్లు ఆహ్వానించగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏలూరు జిల్లా కొల్లేరు సరస్సు పరివాహక సంఘాలు ముందుకొచ్చాయి. ఈ మేరకు ఖమ్మం జిల్లా మత్స్యశాఖ అధికారి డి.ఆంజనేయస్వామి నేతృత్వంలో ఓ బృందం ఏలూరు జిల్లాకు వెళ్లి పరిస్థితులను పరిశీలించి మత్స్యశాఖకు నివేదిక సమర్పించింది. ఈ నివేదిక ఆధారంగా చేపపిల్లల పంపిణీకి టెండర్లు ఖరారు చేయనున్నారు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G., Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.